సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 322
గురువారం 12-2-2026
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

**మరో కూనతో పోరుకు రెడీ**
నేడు నమీబియాతో భారత్ మ్యాచ్.. అభిషేక్‌కు అస్వస్థత - 14లో

**ఎస్‌బీఐ ఓవర్‌టేక్**
నాలుగో పెద్ద కంపెనీగా అవతరించిన బ్యాంకింగ్ - 15లో



**విపక్షాల నోటీసులో లోపాలు**
ఓం బిర్లాను పదవి నుంచి తొలగించాలంటూ విపక్షాలు ఇచ్చిన 'అవిశ్వాస' నోటీసులో తప్పిదాలున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.
వివరాలు 6లో ▸



**'తృణధాన్యాలు' తొలగింపు**
అమెరికా నుంచి భారత్‌కు ఎగుమతి చేసే తృణధాన్యాలపై సుంకాలు రద్దు చేయడం ఉండబోదని ట్రంప్ ప్రభుత్వం తేల్చిచెప్పింది.
వివరాలు 6లో ▸

**నేడే బంగ్లాదేశ్ ఎన్నికలు**
బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు గురువారం జరగబోతున్నాయి. ఇందుకోసం ఆ దేశ ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది.
వివరాలు 6లో ▸

**'డబుల్ సూపర్' ధమాకా**
టి20 ప్రపంచకప్‌లో హోరాహోరీగా సాగిన పోరులో దక్షిణాఫ్రికా 'డబుల్ సూపర్ ఓవర్'లో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది.
వివరాలు 14లో ▸

## న్యూస్‌రీల్

### సచివాలయ ఉద్యోగులకు మరుగుదొడ్ల డ్యూటీ!

వేధింపులు తాళలేక సచివాలయ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నా చంద్రబాబు సర్కారులో వీసమెత్తు అపరాధభావం కనిపించడం లేదు. పైగా మరింత పాశవిక చర్యలకు పూనుకుంటోంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగులకు మరుగుదొడ్ల వద్ద విధులు కేటాయించింది.
వివరాలు 10లో ▸

### గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై 'సిట్'

గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 16 లోపు నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది.
వివరాలు 15లో ▸

### ఆర్టీసీపై చావుదెబ్బ!

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఆర్టీసీని చావుదెబ్బ కొట్టింది. దాదాపు రూ.6 వేల కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేసే కుట్రకు బరితెగించింది. 12 ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని నిర్ణయించింది. ఈనెల 25లోగా ఆ డిపోలు ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.
వివరాలు 5లో ▸



మనం శిక్షించడం దేనికి దేవీ!
ప్రజలే శిక్షిస్తారు!!

సూపర్ సిక్స్ మోసాల ఖరీదు
రూ.లక్షన్నర కోట్లు..!

# బాకీల బాబు..
# బడాయిల డాబు!

## గవర్నర్‌తోనూ అవే అబద్ధాలు చెప్పించిన సీఎం చంద్రబాబు

- సూపర్ సిక్స్ రూపంలో రెండేళ్లలో రూ.1,42,897.12 కోట్లు ఎగ్గొట్టి వాటిని అమలు చేశామంటూ నిస్సిగ్గుగా అసత్యాలు
- 20 నెలల్లోనే దేశంలో ఏ రాష్ట్రం చేయని రీతిలో రికార్డు స్థాయిలో ఏకంగా రూ.3,27,725 కోట్లు అప్పులు..
- అంతులేని రుణభారం.. ఏ ఒక్క పథకం అమలు చేయకుండా ఆర్థిక విధ్వంసం.. 22 ఏ కింద లక్షలాది ఎకరాలను 2016లో నిషేధిత జాబితాలో చేర్చింది చంద్రబాబే
- 2014-19 మధ్య రాజధానిలో ఒక్కటంటే ఒక్క శాశ్వత నిర్మాణాన్ని పూర్తి చేయకుండా ఇప్పుడు పునర్ నిర్మిస్తున్నట్లు చంద్రబాబు అవాస్తవాలు
- కమీషన్ల దాహంతో పోలవరంలో చారిత్రక తప్పిదాల పాపం బాబుదే
- గత ప్రభుత్వంలో వచ్చిన పారిశ్రామిక పెట్టుబడులనే ఇప్పుడు వచ్చినట్టుగా గొప్పలు చెప్పుకుంటూ క్రెడిట్ చోరీ
- రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాజకీయ కుట్రలు.. కక్ష సాధింపు.. విధ్వంస పాలన
- డీబీటీతో పేదల ఖాతాల్లోకి రూ.2.73 లక్షల కోట్లు జమ చేసిన వైఎస్ జగన్
- 22 ఏ భూములకూ వైఎస్సార్‌సీపీ హయాంలోనే విముక్తి
- పోలవరాన్ని గాడిలో పెట్టి ప్రణాళికాబద్ధంగా పనులు
- విత్తనం నుంచి విక్రయం దాకా రైతులకు జగన్ సర్కారు సంపూర్ణ భరోసా

2లో



### మెరుగైన పౌరసేవలకు 'పీపీపీ'

ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జస్టిస్ నజీర్ ప్రసంగం
సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం
భూముల రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా కొనసాగిస్తాం
మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేస్తున్నాం
2027 జూన్‌కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం
2లో

### మార్చి 7 వరకు అసెంబ్లీ

17 రోజులు సభా కార్యకలాపాలు
14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి
16లో

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ర్యాలీగా అసెంబ్లీకి వెళ్తున్న వైఎస్ జగన్

# శాంతి భద్రతలను కాపాడండి

## అసెంబ్లీలో గవర్నర్ ఎదుట నినదించిన వైఎస్సార్‌సీపీ

బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పోడియం వద్ద నిరసన
రాష్ట్రంలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం
అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు
సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ప్రజలను మోసం చేశారు
నిరుద్యోగ భృతి ఇస్తామంటూ యువతను దగా చేశారు
ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తున్నారు
ఇది దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం.. అంటూ నినాదాలు
సభ్యుల ఆందోళన మధ్యే కొనసాగిన గవర్నర్ ప్రసంగం
ప్రభుత్వ తీరును నిరసిస్తూ వాకౌట్ చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
3లో

### సర్కారు శాడిజానికి
# పరాకాష్ట

## అంబటిని జైలులోనే ఉంచేందుకు కుట్ర

ఒక కేసులో బెయిల్ వస్తుంటే మరో కేసు ముందుకు.. మెడికల్ ఉద్యమంలో పెట్టిన కేసులో అంబటికి బెయిల్
వెంటనే మరో కేసులో పీటీ వారెంట్



సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు లీగల్ : మాజీ మంత్రి, గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబుపై కూటమి ప్రభుత్వ కక్షసాధింపు కొత్త పుంతలు తొక్కుతోంది. ఒక కేసులో న్యాయస్థానం బెయిల్ మంజూరు చేస్తుంటే మరో కేసు ముందుకు తెస్తున్నారు. పీటీ వారెంట్లు జారీ చేస్తున్నారు. మెడికల్ ఉద్యమం సందర్భంగా అధికారులను బెదిరించారంటూ అంబటిపై పట్టాభిపురం పోలీసులు నమోదు చేసిన కేసులో
మిగతా 16వ పేజీలో ▸

### నేడు వైఎస్సార్‌సీపీ శాసనసభా పక్ష సమావేశం

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష సమావేశం గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారని పేర్కొంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో చర్చించనున్నట్లు పార్టీ తెలిపింది.




# ఉన్నత విద్యకు ఉరి!

## రాష్ట్రంలో భారీగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

### చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.6,300 కోట్లు పెండింగ్

- దాదాపు రూ.2,200 కోట్లు హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలు కూడా..
- మొత్తంగా రూ.8,500 కోట్లకు గాను ఇచ్చింది కేవలం రూ.700 కోట్లే
- ఇంకా రూ.7,800 కోట్ల బకాయిలు
- అసెంబ్లీ వేళ ప్రజలను మభ్యపెడుతూ రూ.1,200 కోట్లకు బీఆర్‌వో
- అంటే ఆ మేరకు బిల్లు పెట్టుకోవచ్చని చెప్పే అత్యంత సాధారణ అనుమతి.. దీనిపై లోకేశ్ డప్పు.. విద్యార్థులను తామే ఉద్ధరిస్తున్నట్లు ఓ స్థాయిలో ప్రచారం
- ఫలితంగా ఒక్క రూపాయి కూడా కాలేజీల ఖాతాలకు చేరని దుస్థితి
- ఫీజులు చెల్లించకుంటే విద్యార్థులను పరీక్షలకు అనుమతించని యాజమాన్యాలు

5లో

# మూగజీవాలపై 'పైసా'చికత్వం

## హోం మంత్రి పీఏ అండ.. అక్రమంగా పశువుల రవాణా

'రక్షణ చారిటబుల్ ట్రస్ట్', అనుబంధంగా గోశాల ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు
జాతీయ రహదారిపై పశువులను తరలిస్తున్న వాహనాలు అడ్డుకుని వసూళ్లు
డబ్బులిస్తే ఓకే.. డబ్బులివ్వకుంటే మాత్రం పోలీసులకు ఫిర్యాదు
అనంతరం పోలీసులు పట్టుకున్న గోవులన్నీ గోశాలకు తరలింపు
అదే సమయంలో ఏజెన్సీ, ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు పశువుల కొనుగోళ్లు
వాటన్నింటినీ కలిపి అర్ధరాత్రి వేళ హైదరాబాద్‌లోని పశువధ శాలలకు తరలింపు
తాజాగా హోం మంత్రి పీఏ గణేష్ వసూళ్ల దందాపై సోషల్ మీడియాలో వైరల్
తప్పనిసరి పరిస్థితుల్లో విచారణకు ఆదేశించిన మంత్రి అనిత
16లో

'జనగణమన'కు ముందే
### వందేమాతరం

- తొలగించిన 4 చరణాలతో కలిసి మొత్తం 6 చరణాలు ఆలపించాల్సిందే
- తర్వాతే జనగణమన పాడాలి.. జాతీయ గీతాన్ని కించపరిస్తే మూడేళ్ల దాకా జైలుశిక్ష
- కేంద్ర హోంశాఖ ఆదేశాలు

6లో

కెనడా పాఠశాలలో
### కాల్పుల మోత

■ కెనడాలో కాల్పుల మోత మోగింది. బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలోని టుంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో ఓ ఆగంతకురాలు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో పది మంది ప్రాణాలు కోల్పోయారు. 27 మంది గాయాలపాలయ్యారు.
6లో

# భరతమాతనే.. అమెరికాకు అమ్మేశారు

## కేంద్రంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శలు

అగ్ర రాజ్యానికి పూర్తిగా లొంగిపోయింది
మోదీ సర్కారుకు కాస్తయినా సిగ్గుగా లేదా?
ఒప్పందాన్ని ఎలా సమర్థించుకుంటుంది?
ప్రధానిని అమెరికా మెడలు పట్టి వంచేసింది
ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్లకు లొంగారు
బడ్జెట్‌పై చర్చలో తూర్పారబట్టిన రాహుల్

6లో

### అలాంటి వాడు ఇంకా పుట్టలేదు!

- రాహుల్ 'అమ్మేశారు' విమర్శలపై రిజిజు.. విపక్ష నేతవి పచ్చి అబద్ధాలంటూ ధ్వజం
- రికార్డుల నుంచి తొలగించాలని కోరతామని వెల్లడి

6లో

అసెంబ్లీ సమావేశాలు

## మీడియా పాయింట్

**సాక్షి, అమరావతి:** గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాసినట్లుందని.. రాష్ట్రంలో రాజ్యాంగం అపహాస్యమవుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆరోపించారు. రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ఎవరెవరు ఏమన్నారంటే..

### ఎల్లో మీడియా కథనాల కూర్పుగా గవర్నర్ ప్రసంగం

**ఈనాడు,** ఆంధ్రజ్యోతి, టీవీ5లో వచ్చే వార్తలనే గవర్నర్‌తో చదివించారు. అన్నీ అబద్ధాలు, కాకి లెక్కలు, నిరాధార ఆరోపణలు, భ్రమలు మాత్రమే అందులో ఉన్నాయి. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నిలదీస్తుందని ప్రభుత్వానికి భయం. సభలో ప్రభుత్వ వైఫల్యాలు చర్చకు రాకూడదనేది వారి ఆలోచన. 164 మంది సభ్యులు 11 మందికి సమాధానం చెప్పలేకపోతున్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి 20 నెలల్లోనే రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచేశారు. వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఒక హక్కు. రాజ్యాంగం ప్రకారం ప్రతిపక్షం ఉండాలి. ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవినే కొట్టేసిన ప్రభుత్వం ఇది. జగన్‌కు నిమిషం లేదా రెండు నిమిషాల సమయమిస్తామంటే ఒప్పుకోం.
– తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్యే

### ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించింది..

**రాష్ట్రంలో** అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగిస్తున్న ప్రభుత్వం ఇది. ఎన్నికల వాగ్దానాలను ఈ ప్రభుత్వం విస్మరించింది. వాటిని అమలుచేయాలి. గవర్నర్ ప్రసంగంలో ఎన్టీఆర్ భవన్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ మాత్రమే ఉంది. అధికారంలోకి వచ్చాక ఏం అభివృద్ధి చేశారనే దానిమీద శ్వేతపత్రాలు విడుదల చేయాలి. రాష్ట్రంలో దోపిడీ దొంగల రాజ్యం నడుస్తోంది. ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష హోదా అవసరం.
– మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ

### ఆ రూ.3.20 లక్షల కోట్లు ఎవరికిచ్చారో చెప్పాలి

**గవర్నర్** ప్రసంగాన్ని అబద్ధాల పుట్టగా తయారుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.3.20 లక్షల కోట్లు అప్పుచేసింది. అదంతా ఎవరికి ఇచ్చారో చెప్పాలి. మహిళలకు ఆడబిడ్డ నిధి ఇస్తామని మోసం చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను విస్మరించింది. గడిచిన 20 నెలల్లో ఒక్క కొత్త పింఛన్ అయినా ఇచ్చారా? సచివాలయాలను నిర్వీర్యం చేశారు. రైతులు వ్యవసాయాన్ని వదిలేలా చేస్తున్నారు. ప్రజా సమస్యలపై 'మండలి'లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం.
– తోమాటి మాధవరావు, ఎమ్మెల్సీ

### సమయం ఇవ్వడానికి భయమా?..

**మాజీ మంత్రులు,** వారి ఇళ్లపై జరుగుతున్న దాడులపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. తిరుమల లడ్డూ విషయంలో సుప్రీం కోర్టు నియమించిన సిట్ నివేదికలో జంతువుల కొవ్వు కలవలేదని తేలింది కాబట్టి దానిపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అసెంబ్లీలో సమయం ఇవ్వడానికి భయమా? వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలి. కూటమి అకృత్యాలకు ప్రజలు బుద్ధి చెబుతారు.
– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

### రైతుల గోడు వినిపించడం లేదా?..

**గవర్నర్** ప్రసంగం కూటమి ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్ట్. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. సూపర్ సిక్స్‌లో ఒక్కటైనా సక్రమంగా అమలుచేశారా? దేశంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ రెడ్ బుక్ రాజ్యాంగం ఉంది. దాడిచేసిన వారికి స్టేషన్ బెయిలిచ్చారు.. దాడికి గురైన వారిని జైలుకు పంపారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని అపహాస్యం చేస్తున్నారు. రెండు లక్షల ఎకరాల రైతుల గోడు వినిపించడం లేదా?
– ఇసాక్ బాషా, ఎమ్మెల్సీ

### సామాన్యులకు వైద్యం దొరకదు..

**పీపీపీ పేరుతో** ప్రజలను దగాచేస్తూ ప్రభుత్వ ధనాన్ని ప్రైవేటుకి దోచిపెడుతున్నారు. ఆ కళాశాలల్లో పేదవారి పిల్లలకు సీట్లు లభించవు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణవల్ల సామాన్యులకు వైద్యం దొరకదు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ని తెలంగాణకు అప్పగించిన సీఎం చంద్రబాబును ఏమనాలి?
– సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ

### రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానం

**రాష్ట్రంలో** రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. యూరియా దొరకడంలేదు. గిట్టుబాటు ధరలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంది పంట దెబ్బతింటే ఎకరాకు రూ.12 వేలను నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారు. ఇప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. మొక్కజొన్నకు కూడా గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధర ఉండేది. ఇప్పుడు రూ.1,700 కూడా ఎవరూ కొనడంలేదు. కూటమి నేతలు ప్రభుత్వ భూములు కబ్జా చేయడంపైనే దృష్టిసారించారు తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదు.
– సానిపల్లి మంగమ్మ, ఎమ్మెల్సీ

### గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు..

**గవర్నర్** ప్రసంగం రాష్ట్ర ప్రజలను అసంతృప్తికి గురిచేసింది. చంద్రబాబు చెబుతున్న అబద్ధాలనే అత్యున్నత స్థాయిలో ఉన్న గవర్నర్‌తో చెప్పించారు. రూ.3.2 లక్షల కోట్లకు పైగా అప్పుచేసి ఆల్‌టైం రికార్డును కూటమి ప్రభుత్వం నెలకొల్పింది. అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలమైంది. రైతులకు పెట్టుబడి సాయంలేదు. గిట్టుబాటు ధరల్లేవు. మహిళలకు రక్షణ ఇవ్వలేక, సాధికారత కోల్పోయేలా చేశారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంవల్లే సభ నుంచి బయటకొచ్చాం.
– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ

### అన్ని వర్గాలూ రోడ్లపైకి వస్తున్నారు..

**కూటమి పాలనలో** అన్ని వర్గాల వారు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకోవడంలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక రూ.3.2 లక్షల కోట్ల అప్పుచేసింది. రూ.31వేల కోట్ల బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం పాలన అత్యంత అధ్వానంగా ఉంది.
– కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ

### ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

**టీడీపీ** ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైంది. మాజీమంత్రుల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. – ఎం. రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

---

● సూపర్ సిక్స్ మోసాల ఖరీదు రూ.లక్షన్నర కోట్లు..!

# బాకీల బాబు.. బడాయిల డాబు!

## గవర్నర్‌తోనూ అవే అబద్ధాలు చెప్పించిన సీఎం చంద్రబాబు

### సూపర్ సిక్స్ రూపంలో రెండేళ్లలో రూ.1,42,897.12 కోట్లు ఎగ్గొట్టి వాటిని అమలు చేశామంటూ నిస్సిగ్గుగా అసత్యాలు..

సాక్షి, అమరావతి:

**నిరుద్యోగ భృతి కింద నిరుద్యోగులకు రూ.14,400 కోట్లు ఇవ్వకుండా మోసం..**

**50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ కింద రూ.19,200 కోట్లు ఎగనామం..**

**తల్లికి వందనం కింద రూ.19,848.64 కోట్లకు పైగా ఎగ్గొట్టి పిల్లలకు పంగనామాలు..**

**ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు రూ.64,800 కోట్లు ఎగవేత..**

**అన్నదాతా సుఖీభవ కింద రైతులకు రూ.16,747.52 కోట్లు బకాయిలు..**

**దీపం పథకంతో మహిళలకు రూ.4,700.96 కోట్లు ఎగవేత..**

**మహిళలు అందరికీ ఉచిత బస్సు కింద రూ.3,200 కోట్లు బాకీ..**

సూపర్ సిక్స్ కింద రెండేళ్లలో రూ.1,42,897.12 కోట్లకుపైగా ఎగ్గొట్టి ప్రజలను సీఎం చంద్రబాబు మోసగించారు! ఆ మోసాలన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నా.. సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేసినట్లు గవర్నర్‌తో సీఎం చంద్రబాబు అసత్యాలు చెప్పించారు. అలవోకగా, కళ్లార్పకుండా అసత్యాలను చెప్పే చంద్రబాబు.. ఉభయసభలనుఉద్దేశించి గవర్నర్ ప్రసంగంలోనూ అవే అవాస్తవాలను వల్లె వేయించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ సహా 143 హామీలను సీఎం చంద్రబాబు ఇచ్చారు. వాటి అమలుకు తనదీ పూచీ అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాడు వాగ్దానం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ ఒక్క పథకాన్నీ రద్దు చేయబోమని.. వాటిని కొనసాగిస్తూనే సూపర్ సిక్స్ సహా 143 హామీలనూ నెరవేరుస్తామని చంద్రబాబు నమ్మబలికారు. కానీ.. అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ రద్దు చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా మోసం చేశారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలంటే ఏడాదికి రూ.79,867 కోట్లు అవసరం కాగా 2025–26 బడ్జెట్‌లో కేవలం రూ.17,179 కోట్లు మాత్రమే విదల్చడం గమనార్హం. సూపర్ సిక్స్ హామీలన్నీ మోసాలుగా మిగలడంతో 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో ఇచ్చిన బాండ్లను పరిశీలించి 20 నెలల్లో తమ కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఎంత ఎగ్గొట్టిందో ప్రజలు లెక్కలు వేసుకుంటున్నారు.

### సంపద సృష్టి లేదు.. ఆర్థిక విధ్వంసం!

రుణ సేకరణ భారాన్ని తగ్గించడానికి.. రాష్ట్ర పునరుజ్జీవనానికి అవసరమైన మద్దతు పొందడానికి ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బడ్జెట్ సమావేశాల ప్రసంగంలో గవర్నర్‌తో చెప్పించారు. ఎన్నికలకు ముందు.. సంపద సృష్టించి, రుణ భారాన్ని తగ్గించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తానని సీఎం చంద్రబాబు నమ్మబలికారు. కానీ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని రీతిలో అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ఏకంగా రూ.3,27,725 కోట్లు అప్పులు చేశారు. రికార్డు స్థాయి అప్పులతో ఆర్థిక విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని అప్పులు చేస్తున్నా ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా ఏ ఒక్క పథకాన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో 2019–24 మధ్య.. రెండేళ్లపాటు కరోనా లాంటి ప్రతికూల పరిస్థితులతో ఆర్థిక ఇబ్బందులున్నా.. రూ.3,32,671 కోట్లు అప్పులలో ఏకంగా రూ.2.73 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేస్తున్నారు.

### తప్పు చేసి నిందలా..

2016లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు 6 లక్షల ఎకరాలను అకారణంగా 22 ఏ జాబితాలో పెట్టారు. చుక్కల భూములు, అనాధీనం భూములు, షరతులు గల పట్టా భూములు లాంటివి అందులో ఉన్నాయి. వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 22 ఏ జాబితాలో ఉన్న భూములను సుమోటో వెరిఫికేషన్ చేయించారు. 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములు, 60 వేల ఎకరాల అనాధీనం భూములు, 34 వేల ఎకరాల షరతుల గల పట్టా భూములు, సుమారు 18 వేల ఎకరాల ఇతర భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించి ఊరట కల్పించారు. దీంతో ఆ భూములపై రైతులకు మళ్లీ హక్కులు వచ్చాయి. కానీ.. 2024లో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడంతో ఆ భూముల్లో చాలా వరకూ మళ్లీ 22 ఏ జాబితాలోకి నెట్టేశారు. వీటితోపాటు 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములు 13.59 లక్షల ఎకరాలను జగన్ ఫ్రీ హోల్డ్ చేస్తే.. వాటిని కూడా చంద్రబాబు 22 ఏ జాబితాలో పెట్టించేశారు. వాస్తవాలు ఇలా ఉండగా గత ప్రభుత్వంపై గవర్నర్ ప్రసంగంలో చంద్రబాబు నిందలు వేయించారు. రాష్ట్రంలో 22 ఏ దుర్వినియోగం చేసింది చంద్రబాబు సర్కారేనని రైతులు స్పష్టం చేస్తున్నారు.

### పోలవరంలో బాబు చారిత్రక తప్పిదాలు

గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను పూర్తి చేయకుండానే.. 2016–18లో పోలవరం ప్రధాన డ్యాం గ్యాప్–2లో పునాది డయాఫ్రం వాల్‌ను చంద్రబాబు పూర్తి చేశారు. 2017లో గోదావరి వరద డయాఫ్రం వాల్ మీదుగా ప్రవహించడంతో కోతకు గురై దెబ్బతింది.. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో విధ్వంసం చోటుచేసుకుంది. ఈ చారిత్రక తప్పిదాన్ని విదేశీ నిపుణుల కమిటీ ఎండగట్టింది. చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాన్ని సరిదిద్ది.. పోలవరాన్ని గాడిలో పెట్టి.. 2027 నాటికి పూర్తిచేసేందుకు మార్గం సుగమం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై గవర్నర్‌తో చంద్రబాబు అభాండాలు వేయించారని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

### ఒక్క శాశ్వత భవనం కూడా కట్టకుండా..

2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు రాజధాని అమరావతిలో చంద్రబాబు ఒక్కటంటే ఒక్క శాశ్వత భవనాన్ని కూడా పూర్తి చేసిన దాఖలాలు లేవు. తాత్కాలిక నిర్మాణాల ముసుగులో కాంట్రాక్టు సంస్థలతో కలిసి భారీ ఎత్తున దోపిడీకి తెర తీశారు. ఈ కమీషన్ల బాగోతాన్ని కేంద్ర ఆదాయపు పన్నుల శాఖ ఎండగట్టింది. ఎలాంటి ఆర్థిక ప్రణాళిక లేకుండా రాజధాని నిర్మాణ పనులు చేపట్టారంటూ కాగ్ కడిగిపారేసింది. 2014–19 మధ్య తాను కట్టని రాజధానిని గత ప్రభుత్వం ధ్వంసం చేసినట్లు.. ఇప్పుడు దాన్ని పునర్ నిర్మిస్తున్నట్లు గవర్నర్‌తో సీఎం చంద్రబాబు అవాస్తవాలు వల్లె వేయించారు. రాజధాని పేరుతో జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రూ.47,387 కోట్లను అప్పుగా తెచ్చిన చంద్రబాబు.. నిర్మాణ పనుల అంచనా వ్యయాన్ని పెంచేసి.. సిండికేటు కాంట్రాక్టర్లకు అధిక ధరలకు అప్పగిస్తున్నారని కాంట్రాక్టర్లు ప్రస్తావిస్తున్నారు. భవనాలు చదరపు అడుగు నిర్మాణానికి రూ.10 వేలు.. రూ.12 వేలు.. రూ.13 వేలు చొప్పున ఖర్చు చేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లో ఫైవ్ స్టార్ సదుపాయాలతో చదరపు అడుగు రూ.4 వేలకే నిర్మించి ఇస్తుండగా చంద్రబాబు సర్కారు దానికి మూడు రెట్లకుపైగా అధికంగా చెల్లించడం గమనార్హం. వీటిని పరిశీలిస్తే రాజధాని నిర్మాణాల్లో ఏ స్థాయిలో అవినీతి జరుగుతోందన్నది బహిర్గతమవుతోందని ఇంజనీరింగ్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక విత్తనం నుంచి విక్రయాల దాకా అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలిచి వ్యవసాయాన్ని వైఎస్ జగన్ పండుగగా మార్చితే.. పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టి, ఉచిత పంటల బీమాను రద్దు చేసి, గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులను నట్టేట ముంచింది చంద్రబాబేనని రైతన్నలు మండిపడుతున్నారు.

### క్రెడిట్ చోరీలో చంద్రబాబుకు సాటెవ్వరు..?

వైఎస్ జగన్ ప్రభుత్వం తెచ్చిన ప్రాజెక్టులను నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకున్న చంద్రబాబు... ఇప్పుడు అవే అసత్యాలను గవర్నర్ నోటి వెంట చెప్పించారు. గూగుల్ డేటా సెంటర్ పేరుతో చంద్రబాబు సర్కారు క్రెడిట్ చోరీ బాగోతాన్ని విశాఖ సీఐఐ సదస్సు వేదికగా గౌతమ్ అదానీ బట్టబయలు చేసినా.. ఆ సదస్సు ద్వారా 16.13 లక్షల మందికి ఉపాధి కల్పించే విధంగా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయంటూ గవర్నర్‌తో చంద్రబాబు అవాస్తవాలను వల్లె వేయించారు. అదానీ గ్రూప్ పేరును దాచిపెట్టి గూగుల్ డేటా సెంటర్‌ను తామే తెచ్చామంటూ చంద్రబాబు సర్కారు చేసుకున్న ప్రచారానికి తెర దించుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద హైపర్ డేటా సెంటర్‌ను గూగుల్‌తో కలసి అదానీ గ్రూపు ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు సమక్షంలోనే సీఐఐ సమ్మిట్‌లో అదానీ పోర్ట్స్ అండ్ ఎస్‌ఈజెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ దక్కుతుందనే సంకుచిత బుద్ధితోనే సీఎం చంద్రబాబు గూగుల్‌తో ఒప్పందం సమయంలో అదానీ పేరెత్తలేదంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఎండగట్టిన సంగతి తెలిసిందే. ఇక వైఎస్ జగన్ హయాంలో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ లాంటి నూతన ఇంధన వనరులపై దృష్టిసారించడమే కాకుండా ఆ దిశగా పలు పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంటే.. ఇప్పుడు చంద్రబాబు వాటిని తన ఖాతాలో వేసుకుంటూ వైజాగ్ సమ్మిట్‌లో ఒప్పందాలు చేసుకున్న సంగతి విదితమే. గత ప్రభుత్వ హయాంలో 2023లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్టీపీసీ రూ.2.35 లక్షల కోట్ల పెట్టుబడుల తర్వాత అతిపెద్ద పెట్టుబడుల ఒప్పందంగా నిలిచిన ఏబీసీ లిమిటెడ్ రూ.1,20,000 కోట్ల ఒప్పందాన్ని తిరిగి ఇప్పుడు కుదుర్చుకొని కొత్త ఒప్పందంగా చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెన్యూ పవర్‌తో కుదిరిన రూ.97,500 కోట్ల పెట్టుబడుల ఒప్పందం, రూ.30,000 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్న హీరో ఫ్యూచర్ ఎనర్జీస్‌తో ఇప్పుడు కొత్త పెట్టుబడులంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలను అదుపు తప్పేలా చేసి విధ్వంస పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు.. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని పునర్ నిర్మించి ప్రగతి దిశగా నడిపిస్తున్నట్లు గవర్నర్‌తో అవాస్తవాలను చెప్పించారంటూ సర్వత్రా మండిపడుతున్నారు.

### బాబు మోసాల ఖరీదు రూ.1,42,897.12 కోట్లు!

→ రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు.. లేదంటే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని సూపర్ సిక్స్‌లో చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 20 లక్షల మందికిపైగా నిరుద్యోగులు ఉండగా రెండేళ్లుగా హామీని అమలు చేయలేదు. ఒక్కో ఏడాది రూ.7,200 కోట్లు ఎగ్గొట్టారు. భృతి కింద రెండేళ్లలో యువతకు చంద్రబాబు రూ.14,400 కోట్లు బకాయి పడ్డారు.

→ పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాతా సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.10,716.53 కోట్లు అవసరం. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. 2025–26లో 46,85,838 మంది రైతులకు రూ.పది వేల చొప్పున రూ.4,685.54 కోట్లు మాత్రమే విదిల్చారు. 6,72,428 మంది రైతులకు పూర్తిగా ఎగనామం పెట్టారు. రెండేళ్లలో రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా ఒక్కో రైతుకు రూ.30 వేలు బకాయి పడ్డారు. మొత్తమ్మీద అన్నదాత సుఖీభవ కింద రైతులకు సీఎం చంద్రబాబు ఇప్పటికే రూ.16,747.52 కోట్లు బకాయిపడ్డారు.

→ రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న వారు 1.80 కోట్ల మంది. వీరికి ఏడాదికి రూ.18 వేలు ఆడబిడ్డ నిధి కింద ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు చేయాలంటే ఏడాదికి రూ.32,400 కోట్లు అవసరం. రెండేళ్లుగా ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఆడబిడ్డ నిధి కింద మహిళలకు రూ.64,800 కోట్లు ఎగ్గొట్టారు.

→ దీపం పథకం కింద రాష్ట్రంలో 1,59,20,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సిలిండర్ ధర రూ.855. ఈ లెక్కన ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వాలంటే రూ.4,083.48 కోట్లు అవసరం. కానీ.. తొలి ఏడాది ఒక సిలిండర్‌కు మాత్రమే రూ.865 కోట్లు మాత్రమే ఇచ్చారు. అంటే.. రూ.3,218.48 కోట్లు ఎగ్గొట్టారు. ఇక 2025–26 బడ్జెట్‌లో ఆ పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించారు. అంటే.. రెండో ఏటా రూ.1,482.48 కోట్లు బకాయిపడ్డారు. మొత్తమ్మీద దీపం పథకం కింద ఇప్పటికే మహిళలకు రూ.4,700.96 కోట్లను సీఎం చంద్రబాబు ఎగ్గొట్టారు.

→ 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెన్షన్ ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వీరు 20 లక్షల మంది వరకు ఉన్నారు. వారికి నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.9,600 కోట్లు పెన్షన్ రూపంలో ఇవ్వాలి. రెండేళ్లుగా పైసా ఇవ్వకుండా పెన్షన్ రూపంలో రూ.19,200 కోట్లు బకాయిపడ్డారు.

→ మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీని అమలు చేయాలంటే ఏడాదికి రూ.3,200 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలి. 2024–25లో ఆ హామీని అమలు చేయలేదు. అంటే.. తొలి ఏడాది ఉచిత బస్సు హామీ కింద రూ.3,200 కోట్ల మేర సీఎం చంద్రబాబు మహిళలకు బకాయిపడ్డారు. 2025–26 ఆగస్టు 15 నుంచి పథకాన్ని అమలు చేసినట్లు ప్రకటించారు. ఆర్టీసీలో 16 రకాల సర్వీసులు ఉండగా ఐదు సర్వీసుల్లో మాత్రమే ఉచిత బస్సును అమలు చేస్తున్నారు. తొమ్మిది రకాల సర్వీసులకు ఉచిత బస్సు పథకాన్ని వర్తింపజేయడం లేదు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా ఉచిత బస్సు సౌకర్యం అమలై ఉండి ఉంటే అటు శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం వరకు మహిళలంతా అమరావతి వెళ్లి చూసొచ్చేవారు. కడప, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాల వాళ్లంతా విశాఖ వెళ్లొచ్చేవారు. వారి ఆశలు ఇప్పటి దాకా నెరవేరలేదు.

→ తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలను బడికి పంపిస్తే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 87,41,885 మంది పిల్లలు బడుల్లో చదువుతున్నారు. రూ.15 వేల వంతున ఏడాదికి రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. 2025–26లో 67,27,124 మందికి రూ.10,090 కోట్లు తల్లికి వందనం కింద పంపిణీ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. కానీ.. ఇప్పటికి 66 లక్షల మందికి రూ.6,377 కోట్లను మాత్రమే చెల్లించారు. అంటే... ఒక్కొక్కరికి రూ.8 వేలు, రూ.9 వేలు.. రూ.పది వేలు చొప్పున చెల్లించినట్లు స్పష్టమవుతోంది. ఆ అరకొర సొమ్మును కూడా 21 లక్షల మందికి ఎగ్గొట్టారు. మొత్తమ్మీద తల్లికి వందనం పథకం కింద ఇప్పటికే తల్లులకు రూ.19,848.64 కోట్లకుపైగా సీఎం చంద్రబాబు బకాయిపడ్డారు.

---

# మెరుగైన పౌరసేవలకు 'పీపీపీ'



- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగం
- సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం
- భూముల రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా కొనసాగిస్తాం
- నాటు సారా నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాం
- మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేస్తున్నాం..
- ట్రూడౌన్ ద్వారా యూనిట్‌పై 13 పైసలు విద్యుత్తు భారాన్ని తగ్గించాం
- 2027 జూన్‌కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం

**సాక్షి, అమరావతి:** పీపీపీ విధానం ద్వారా మెరుగైన పౌర సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా పీ–4 ద్వారా లక్ష మంది మార్గదర్శకులను గుర్తించి 10.30 లక్షల బంగారు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి రీ సర్వే ప్రక్రియను మరింత పటిష్టంగా కొనసాగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 2027 జూన్ నాటికి పోలవరాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీల ద్వారా అమరావతిని గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చట్టం రూపకల్పనపై విధివిధానాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

### సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్..

సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం సూపర్ హిట్ చేసింది. ఏడాదికి దాదాపు రూ.33 వేల కోట్ల వ్యయంతో డీబీటీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 63.12 లక్షల మందికి పెన్షన్లు ఇస్తోంది. 66 లక్షల మందికి పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అన్నదాతా సుఖీభవ ద్వారా 46.86 లక్షల మంది రైతులకు ఏటా రూ.20 వేల చొప్పున ఆర్థిక లబ్ధి చేకూరుస్తోంది. 1.2 లక్షల మంది మత్స్యకారులకు ఏటా రూ.20 వేల చొప్పున వేట నిషేధ భృతి ఇస్తోంది. 1.08 కోట్ల పేద కుటుంబాలకు ఏటా 3 గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తోంది. 15,941 ఉపాధ్యాయ పోస్టులతో పాటు 5,757 కానిస్టేబల్ పోస్టులను భర్తీ చేసింది. లక్ష మంది చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి కుటుంబానికి త్వరలో ఫ్యామిలీ కార్డులను అందించబోతోంది. 113 నియోజకవర్గాల్లో 205 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. సంజీవని ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తోంది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తోంది. ప్రతి వ్యక్తికి కనీసం రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా అందించడమే కాదు, 1.43 కోట్ల కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదు రహిత వైద్యాన్ని అందుబాటులోకి తెస్తోంది. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా వైద్యం అందిస్తోంది. జనాభా నిర్వహణ విధానాన్ని తీసుకొచ్చి సంతానోత్పత్తిని ప్రోత్సహిస్తోంది.

### నాటు సారా నుంచి విముక్తి..

2025లో నాటుసారా తయారీ నుంచి ఏపీకి విముక్తి కల్పించింది. గంజాయిని నిర్మూలించి మాదక ద్రవ్యరహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. ఏడాదికి లక్ష మంది చొప్పున ఐదేళ్లలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా కరువు ప్రాంతాలకు నీరందిస్తోంది. నదుల అనుసంధానం ద్వారా పోలవరం నుంచి గోదావరి వరద జలాలను తరలించాలని సంకల్పించింది. రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. అమరావతి శాశ్వత రాజధానిగా ఉండేలా చట్టబద్ధత కల్పించే ప్రక్రియ జరుగుతోంది. విజయవాడ, గుంటూరు, అమరావతి మధ్య రాజధాని నిర్మాణంతో లాజిస్టిక్స్, ప్రముఖ సంస్థల ఏర్పాటు, ఇతర ఆర్థిక లావాదేవీలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు 26 జిల్లాలను 28కి ప్రభుత్వం పెంచింది. విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేస్తోంది. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైల్ వ్యవస్థలకు ఆమోదముద్ర లభించింది. 25కు పైగా కొత్త పాలసీలను ప్రకటించి పారిశ్రామిక ప్రగతి కోసం 175 ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఏపీని క్లీన్ ఎనర్జీ, ఎకనావిక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది.

### యూనిట్‌కు 13 పైసల భారం తగ్గించాం

ట్రూ డౌన్ విధానం ద్వారా ప్రజలపై యూనిట్‌కు 13 పైసల చొప్పున విద్యుత్ భారాన్ని ప్రభుత్వం తగ్గించింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖగా పునర్వ్యవస్థీకరించింది. సీఐఐ సదస్సు ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేలా 610 ఎంఓయూలు కుదిరాయి. వీటి ద్వారా 16.13 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ఎస్ఐపీబీల ద్వారా 8.35 లక్షల ఉద్యోగాల కల్పన, రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చింది. అనంతపురం లాంటి ప్రాంతాలను హార్టీ కల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తునాం. 2025–26 అంచనాల ప్రకారం రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు చేరింది వ్యవసాయంలో వృద్ధి 7.83 శాతం నమోదైంది. పరిశ్రమల రంగం 9.73 శాతం, సేవల రంగం 12.94 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. ఆరోగ్యం, సంపద, సంతోషాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది.

# శాంతి భద్రతలను కాపాడండి

**అసెంబ్లీలో గవర్నర్ ఎదుట నినదించిన వైఎస్సార్‌సీపీ**

**బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పోడియం వద్ద నిరసన**



ప్లకార్డును ప్రదర్శిస్తూ అసెంబ్లీ లోపలికి ప్రవేశిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతి భద్రతలను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఎదుట నినదించింది. రాష్ట్రంలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని రంగాల్లో చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి మోసం చేశారని మండిపడింది. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలూ సంతోషంగా లేరని నిప్పులు చెరిగింది. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మూకుమ్మడిగా ప్లకార్డులు పట్టుకుని పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఉదయం ర్యాలీగా అసెంబ్లీకి చేరుకున్నారు. 'ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వరు.. ప్రజల గొంతు వినిపించనివ్వరు.. ప్రతిపక్ష హోదా ఇవ్వరు.. రైతు సమస్యలు వినిపించనివ్వరు.. కుప్పకూలిన శాంతి భద్రతలపై నిలదీయనివ్వరు' అనే నినాదంతో కూడిన బ్యానర్లతో పాటు ప్ల కార్డులను ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ నాలుగో నంబర్ గేటు ద్వారా సభ్యులు సభలోకి వచ్చారు. 'ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వరు.. కుప్పకూలిన శాంతి భద్రతలపై నిలదీయనివ్వరు' అనే ప్లకార్డును వైఎస్ జగన్ స్వయంగా పట్టుకుని లోపలకు ప్రవేశించారు. వైఎస్ జగన్ తన స్థానంలో ఆశీనులవ్వగానే సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. 'రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలి.. హామీలిచ్చారు.. అమలు మరిచారు.. అర్హులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి.. దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం..' అని నినదిస్తూ ప్లకార్డులు పట్టుకుని పోడియం వద్దకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు నినాదాలు చేస్తున్నప్పటికీ, గవర్నర్ ప్రసంగం కొనసాగింది. ఈ నేపథ్యంలో మార్షల్స్ పోడియం వద్దకు చేరుకుని వైఎస్సార్‌సీపీ సభ్యులు ముందుకు వెళ్లకుండా వలయంగా నిలబడ్డారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వ పనితీరును ఎండగడుతూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

## టీడీపీ గూండాల దాడులను

# దీటుగా ఎదుర్కొందాం

**వ్యవస్థలను దిగజార్చేలా పోలీసుల తీరు**

**వైఎస్సార్‌సీపీ కేడర్ ఎవరూ భయపడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది..**

**బాపట్ల జిల్లా కేఎన్ పల్లి గ్రామస్తులకు వైఎస్ జగన్ భరోసా**

వైఎస్ జగన్‌కు పచ్చమూకల దాడి గురించి వివరిస్తున్న కేఎన్‌పల్లి నాయకులు

**సాక్షి, అమరావతి:** టీడీపీ గూండాల దాడులను దీటుగా ఎదుర్కొందామని.. వైఎస్సార్‌సీపీ కేడర్ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొత్త నారికేళ్లపల్లి(కేఎన్ పల్లి) నాయకులు, వేమూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. టీడీపీ మూకలు చేస్తున్న దాడులు, దౌర్జన్యాల గురించి వివరించారు. బీసీ నాయకుడు, సర్పంచ్ అంగిరేకుల నాగేశ్వరరావు ఇంటిపై టీడీపీ రౌడీషీటర్ బాలకోటిరెడ్డి పచ్చమూకలతో కలిసి దాడి చేశాడని చెప్పారు. అర్ధరాత్రి సమయాల్లో తమ ఇళ్లపై దాడులు చేసి, తలుపులు బద్దలు కొట్టి బంగారం, నగదు దోచుకున్నారని వాపోయారు. బాలకోటిరెడ్డి తరచూ మారణాయుధాలతో దాడులు చేస్తున్నాడని.. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఉన్నా ఎలాంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంపై నమ్మకం లేక.. ఆత్మహత్యలకు అనుమతివ్వాలని కలెక్టర్ కార్యాలయంలో కోరామన్నారు. తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ప్రాణభయంతో కంటిమీద కునుకు లేకుండా జీవిస్తున్నామని చెప్పారు. వైఎస్ జగన్ స్పందిస్తూ.. వైఎస్సార్‌సీపీ కేడర్ ఎవరూ భయపడవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ గూండాల దాడులు, దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొందామని ధైర్యం చెప్పారు. పార్టీ లీగల్ సెల్ అవసరమైన న్యాయ సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవస్థలను దిగజార్చేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరును వైఎస్ జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ గాదె శివరామిరెడ్డి, చుండూరు మండల అధ్యక్షుడు రఘురామిరెడ్డి, అంగిరేకుల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# ఏదిపడితే అది మాట్లాడొద్దు..

**ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో సభ్యులకు చంద్రబాబు హెచ్చరిక**

**సాక్షి, అమరావతి:** గత శాసనసభ సమావేశాల్లో మాదిరిగా ఏదిపడితే అది మాట్లాడితే సహించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేసినట్లు తెలిసింది. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. అసెంబ్లీ కమిటీ హాలులో బుధవారం జరిగిన ఎన్డీయే పార్టీల శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో ఏ పనులు జరగడంలేదని విరుచుకుపడడంతో చంద్రబాబు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ సమావేశాలు ప్రారంభమైన రోజే ఆయన ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఎలా మాట్లాడాలి, ఏ అంశాలు మాట్లాడాలి అనే అంశాలపై వారికి సూచనలు చేశారు. గతంలో ప్రభుత్వంపై విమర్శలు చేసిన కొందరు ఎమ్మెల్యేలను ఆయన ఈ సమావేశంలో పరోక్షంగా హెచ్చరించారు. జనం అన్ని విషయాలు చూస్తారన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, బాధ్యతగా ప్రవర్తించాలన్నారు. కచ్చితంగా తొమ్మిది గంటలకు సభకు హాజరుకావాలని ఆదేశించారు. కొందరు ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు. 40 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని.. వారితో ఈ సమావేశాల్లోనే తాను వ్యక్తిగతంగా మాట్లాడతానన్నారు. అలాగే, జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎస్పీ, కలెక్టర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇక నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తిస్తే ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని, వాటిని తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులకు చంద్రబాబు చెప్పారు. 20 నెలల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. మరో 15 ఏళ్లు కూటమి కలిసే ఉంటుందని చెప్పారు. గత ఎన్నికల్లో పనిచేసినట్లుగానే భవిష్యత్తులోనూ పనిచేయాలన్నారు. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలని.. కూటమి ధర్మానికి ప్రతిఒక్కరూ కట్టుబడి పనిచేయాలని సూచించారు.

## జనాభా లెక్కల్లో 33 అంశాల సేకరణ

**సాక్షి, అమరావతి:** వచ్చే ఏడాది (2027)లో మొదలయ్యే జనాభా లెక్కలో ఎన్యూమరేటర్స్ ప్రతీ వ్యక్తి నుంచి విధిగా సేకరించాల్సిన 33 ప్రశ్నలతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల గెజిట్ జారీ చేసింది. ఆ గెజిట్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం ఇంటి నంబర్, సెల్‌ఫోన్ నంబర్, ఇంటి నిర్మాణం, వాహనాల వివరాలు సేకరించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇంటి గోడ దేనితో నిర్మించారు, పైకప్పు ఏమిటి... ఫ్లోరింగ్ ఏ విధంగా ఉంది, ఎన్ని ల్యాప్‌టాప్‌లున్నాయి... ఎన్ని స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి.. ఇంటర్నెట్ కనెక్షన్ ఉందా, ఎటువంటి మరుగుదొడ్లు వినియోగిస్తున్నారు.. అంటూ విభిన్న సమాచారాన్ని ప్రశ్నల ద్వారా సేకరించనున్నారు. 2011లో చివరి సారిగా దేశ జనాభా లెక్కలు సేకరించగా, 2021లో ప్రారంభం కావాల్సిన జనాభా లెక్కలు కరోనాతో 2027కి వాయిదా వేశారు. భారీ సమాచారం సేకరించాల్సి ఉండటంతో ఈ సారి ప్రతీ ఇంటికి ఇరవై నిమిషాల నుంచి అరగంట పైనే సమయం వెచ్చించాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఎమ్మెల్యేలకు ఏఐ ఆధారిత హాజరు: స్పీకర్

**సాక్షి, అమరావతి:** అసెంబ్లీలో గురువారం నుంచి ఏఐ ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. బుధవారం ఆయన అసెంబ్లీలోని తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు వారికి కేటాయించిన స్థానాల్లో కూర్చుంటే ఆటోమేటిక్‌గా హాజరు నమోదవుతుందని తెలిపారు. పార్లమెంటులోనూ ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు పరిశీలన జరుగుతోందన్నారు. అమరావతిలో నిర్మిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస సముదాయాలకు ఏప్రిల్ నెలాఖరులో గృహప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సభ్యుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 300 మందికిపైగా సభ్యులు కూర్చునేలా కొత్త అసెంబ్లీ భవనంలో సీటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2028 డిసెంబర్ నాటికి కొత్త అసెంబ్లీ భవనం అందుబాటులోకి వస్తుందని, అమరావతిలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈసారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



నేను ఎక్కువ చదివినకొద్దీ,
ఎక్కువ గ్రహించినకొద్దీ, నాకు ఏమీ తెలియదనేది
మరింత ఎక్కువ నిశ్చయమవుతోంది.
- వోల్టేర్



సాక్షి
గురువారం, 12 ఫిబ్రవరి 2026

# ‘స్టార్ట్’కి చెదలు!

అడిగేవారు లేకపోతే, జవాబుదారీతనం కొరవడితే... ఎక్కడైనా ఇష్టారాజ్యం తప్పదు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలు అలాగే వ్యవహరిస్తున్నాయి. ఎవరేమనుకుంటే ఏమిటన్నట్టు రెచ్చిపోతున్నాయి. అణ్వాయుధాల వల్ల భూగోళానికి పెను ముప్పు ఏర్పడుతుందని ప్రపంచ ప్రజానీకం దశాబ్దాల పాటు ఒత్తిళ్లు తెచ్చిన పర్యవసానంగా ఆ రెండింటి మధ్యా 1991లో మొదటిసారి వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు(స్టార్ట్)-1 ఒప్పందం కుదిరింది. దాని స్థానంలో 2010లో ‘న్యూ స్టార్ట్’ ఒప్పందం సాకారం కాగా, దానికి ఈనెల 5తో నూకలు చెల్లాయి. ఆ విషయంలో మళ్లీ చర్చలు మొదలెట్టాలని, సాధ్యమైనంత త్వరగా ఒప్పందానికి రావాలని రెండేళ్లుగా పలువురు నిపుణులు, ప్రపంచ శాంతిని కాంక్షించేవారు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. కానీ అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయారు. ఆయన స్థానంలో నిరుడు జనవరిలో వచ్చిన డోనాల్డ్ ట్రంప్‌కు సైతం ఈ సంగతి తెలుసు. దాన్ని గురించి మీడియా ప్రశ్నిస్తే ‘ముగిసిపోతుందా...పోనీయండి. దాని స్థానంలో మరొకటి కుదుర్చుకుంటాం’ అన్నారే తప్ప ఇంతవరకూ ఆ దిశగా చర్చల కోసం చేసిందేమీ లేదు. కొత్త ఒప్పందానికి సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ అడపా దడపా చెప్పకపోలేదు. కానీ ఉక్రెయిన్‌లో ఆయన సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం ఆ మాటల్లోని చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేసింది. అమెరికా పోకడలూ దానికి భిన్నంగా ఏమీలేవు. ‘న్యూ స్టార్ట్’ ముగియటంతో ఇరుపక్షాలనూ కట్టిపడేసే అంతర్జాతీయ ఒప్పందమేదీ ఉనికిలో లేకుండా పోయింది. ఇకపై రెండు అగ్రరాజ్యాలూ ఆయుధాలు పోగేసుకున్నా, పరస్పరం కయ్యానికి కాలు దువ్వుకున్నా, అణ్వాయుధాల్ని ప్రయోగించే సాహసం చేసినా... ప్రపంచమంతా నిస్సహాయంగా చూస్తూ ఉండక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు దేశాలకూ, వాటిని సమర్థిస్తున్నవాటికీ జవాబుదారీతనం, భయభక్తులు, వెరపు వంటివి మాయ మయ్యాయి.

ఒకప్పుడు ప్రపంచం ఇంతకన్నా కాస్తయినా మెరుగ్గా ఉండేదనటానికి వ్యూహాత్మక ఆయుధాల పరిమితి ఒప్పందం(సాల్ట్) గురించిన చర్చలే ఉదాహరణ. ఆ ఒప్పందం సాకారం కాలేదు. ఒకవేళ అలా అయినా దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. ఎందుకంటే అప్పటికే ఇరు దేశాలూ పోగేసుకున్న ఆయుధాలు ఇక పెరగకుండా చూడటం తప్ప ఆ చర్చలు సాధించేది పెద్దగా ఏమీ ఉండేదికాదు. కానీ అంతకన్నా మెరుగైన ‘స్టార్ట్-1’ కుదిరింది. అణ్వాయుధం, లేదా వేరే బాంబును మోసుకెళ్లే సామర్థ్యమున్న క్షిపణులను (వార్‌హెడ్‌లను) 6,000కు తగ్గించటం, వాటి లాంచర్ల (వాహనాల) సంఖ్యను 1,600కు కుదించటం అది సాధించిన ఘనవిజయం. 2010లో కుదిరిన ‘న్యూ స్టార్ట్’ కూడా చెప్పుకోదగ్గ ముందడుగు. దానివల్ల వార్‌హెడ్‌ల సంఖ్య 1,550కి, లాంచర్ల సంఖ్య 700కు తగ్గాయి. పరస్పరం డేటా మార్పిడి, నోటిఫికేషన్ల విడుదల, క్షిపణుల్ని మోహరించిన ప్రాంతాల తనిఖీలకు అనుమతించటం అందులో ఉన్నాయి. నిజానికి ఈ రెండింటికీ మధ్య 1993లో ‘స్టార్ట్-2’ గురించి చర్చలు సాగాయి. బహుళ సంఖ్యలో వార్‌హెడ్‌లను ప్రయోగించగల క్షిపణులను నిషేధించాలన్నది ఈ చర్చల ఆంతర్యం. కానీ ఎలాంటి ఫలితమూ లేకుండా ముగిసిపోయాయి.

ఇప్పటికే అమెరికా, రష్యాల మధ్య చడీచప్పుడూ లేకుండా ఆయుధ పోటీ సాగుతోంది. తమదగ్గరున్న అణ్వాయుధాలకు కృత్రిమ మేధ(ఏఐ)ను జతచేసి, వాటి శక్తిని అనేక రెట్లు పెంచుకుంటున్నాయి. గంటకు 6,437 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగల రకరకాల క్షిపణులు వచ్చేశాయి. వాటిని విడివిడిగా గురిచూసి కొట్టడం అసాధ్యమని తేలాకే ట్రంప్ ‘గోల్డెన్ డోమ్’ పేరుతో కొత్త పాట అందుకున్నారు. ఆ ‘బంగారు గుమ్మటం’ అమెరికాను ఎంతవరకూ రక్షిస్తుందో నిజంగా ఏమైనా జరిగితే తప్ప ఎవరికీ తెలియదు. మొత్తానికి ఇద్దరి వద్దా అటూ ఇటూగా చెరో 5,000 అణ్వాయుధాలున్నాయి. మిగతా దేశాలన్నిటి వద్దా అందులో సగం కూడా ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రపంచ ప్రజానీకం, ముఖ్యంగా ఆ రెండు దేశాల్లోని ప్రజలూ తీవ్రంగా ఒత్తిళ్లు తీసుకురావాలి. లేనట్టయితే ప్రపంచం క్షణక్షణ గండంగా బతుకీడ్చక తప్పదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.దశమి ప.11.48 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.1.29 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.10.17 నుండి 12.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.21 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** లేవు.

**సూర్యోదయం :** 6.33
**సూర్యాస్తమయం:** 5.56
**రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు

## సోషల్ టాక్

### ఒక శాతం

ప్రతి రోజూ మిమ్మల్ని మీరు ఒక శాతం మెరుగుపరుచుకుంటే చాలు ; మీరు ఎవరికన్నా, దేనిలో మెరుగ్గా ఉన్నారో గుర్తించి, దాని చుట్టూ మీ వ్యాపారాన్ని నిర్మించుకుంటే చాలు... మీరు విజయం సాధిస్తారు.

– వివేక్ బింద్రా, మోటివేషనల్ స్పీకర్

### రెక్కలు

విద్యాబోధన లక్ష్యం విద్యార్థులను పట్టభద్రులను చెయ్యటం మాత్రమే కాకూడదు. నైతికంగా దారి తప్పకుండా ఉంటూ, జీవితంలోని తుపానులను తట్టుకోగల వ్యక్తిత్వం గలవారిగా వారిని తీర్చిదిద్ది ప్రపంచంలోకి వదిలి పెట్టటం కూడా బోధకుల బాధ్యతే!

– చందర్ మోహన్, సీనియర్ జర్నలిస్ట్

### ఒకటే దారి!

అనుకున్నది సాధించాలంటే కష్టపడి పని చేయటం తప్ప వేరే మార్గం లేదు. కనీసం రెండో మార్గం కూడా ఉండదు. కనుక ఎవరు ఎన్ని చెప్పినా, నువ్వు నీ కష్టం మీద మాత్రమే నమ్మకం ఉంచుకో! నీ కష్టం నీకెప్పటికీ ద్రోహం చెయ్యదు. ఫలితం ఇవ్వకుండానూ ఉండదు.

– ఎస్. శ్రీశాంత్, మాజీ క్రికెటర్

### నియమం

ఒకరి ప్రతిభను ఎవరూ అంచనా వేయలేరు. అందుకే మేము, “ఎవర్నీ తిరస్కరించ కూడదు” అనే నియమాన్ని ఏర్పరచుకున్నాం. అవకాశం దొరికిన వారెవరైనా ప్రతిభావంతులే! దర్శకుడి పని ఏమిటంటే, తన వద్దకు వచ్చిన వాళ్లలోని ప్రతిభను గుర్తించటం!

– అరవింద్ గౌర్, రంగస్థల దర్శకుడు

### చేయొద్దు!

స్టార్టప్‌లకు నేను చెప్పేదొక్కటే... మీరు చేయగలిగినంత మాత్రాన ప్రతిదాన్నీ చేసేయకండి. మీరు చేసే పనికి ఏదైనా ప్రాధాన్యం ఉండి, జనాన్ని ప్రభావితం చేస్తుందని పిస్తేనే చేయండి. లేకుంటే, దానిని కొనండి. ప్రతి చక్రాన్నీ తిరిగి కనిపెట్టవద్దు.

– స్పర్శ్ గుప్తా, ‘వింగిఫై’ సీఈవో

### తీసుకోండి!



జీవితం అంటే మీరు కోరుకున్న దానిని పొందటం కోసం రిస్క్ తీసుకోవటం! రిస్క్ తీసుకోండి. ధైర్యంగా ఉండండి. భిన్నంగా ఉండాలనిపిస్తే, అందుకు సంశయించకండి. మీ జీవితాన్ని మీ చేతుల్లోనే ఉంచుకోవటాన్ని మించిన స్వేచ్ఛ వేరే ఏదీ లేదు.

– ఆడమ్ లాంబర్ట్, నట-గాయకుడు

# నిందలతో సవాళ్లు సమసిపోవు!

విశ్లేషణ

నిరుపమా సుబ్రమణియన్

పాకిస్తాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్న బలూచిస్తాన్ యోధులు జనవరి 31న బలూచిస్తాన్‌లోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో 37 మంది పౌరులతో పాటు, భద్రతా దళాలకు చెందిన 17 మంది హతులయ్యారు. తామే ఈ దాడులకు పాల్పడినట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ప్రకటించింది. బలూచ్ యోధులు కనీసం 12 చోట్ల ఒకే సమయంలో దాడులు చేశారు. పోలీసు స్టేషన్లు, సైనిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకున్నారు. యోధుల్లో ఆత్మాహుతి దళానికి చెందిన ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వారిలో ఒకరిని ఆసిఫా మెంగల్ (24)గా బీఎల్‌ఏ ప్రకటించింది. ప్రతి దాడుల్లో ఇంతవరకు 200 మందికి పైగానే మిలిటెంట్లు చనిపోయారని సైన్యం వెల్లడించింది.

‘‘వీరు మామూలు టెర్రరిస్టులు కారు’’ అని పాక్ దేశీయాంగ మంత్రి మొహిసిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్య దాడుల తీవ్రతకు అద్దం పట్టింది. వీటిలో ‘ఇండియా హస్తం’ ఉందని ఆయన ఆరోపించారు. ఆధారాలు చూపకుండా, గత రెండు దశాబ్దాలుగా పాక్ ఈ రకమైన ఆరోపణలు చేస్తూనే ఉంది.

### బుగతీ హత్యతో మరో తిరుగుబాటు

నఖ్వీ చెప్పినదాంట్లో ఒకటి మాత్రం వాస్తవం. వారు ‘మామూలు టెర్రరిస్టులు’ కారు. దేశ విభజన సమయంలో కలాత్ ప్రాంతం పాక్‌లో విలీనమైన అంశం వివాదాస్పదంగానే ఉంది. అప్పటి నుంచి అంటే 1948 నుంచి 2000 ప్రారంభం వరకు బలూచ్ తిరుగుబాటు గెరిల్లా పోరాట పంథానే అనుసరిస్తూ వచ్చింది. గ్యాస్ పైపులైన్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి వాటిని ధ్వంసం చేసిన మిలిటెంట్లు పర్వత ప్రాంతాల్లోకి పరారయ్యేవారు. సాధారణంగా వారు బుగతీ లేదా మర్రీ అనే రెండు పెద్ద బలూచ్ తెగలలో ఒక వర్గానికి చెందినవారై ఉండేవారు. పాక్ పాలనా వ్యవస్థలో భాగంగా ఉన్న గిరిజన సర్దార్లు వాటికి నేతృత్వం వహించేవారు.

రాజకీయ నాయకుని నుంచి తిరుగుబాటుదారుగా మారిన బలూచిస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అక్బర్ ఖాన్ బుగతీని అప్పటి పాక్ సైనిక పాలకుడు జనరల్ పర్వేజ్ ముషారఫ్ ఆదేశాల మేరకు 2006లో వేటాడి చంపారు. పాక్ రాజ్య వ్యవస్థకు వ్యతిరేకంగా 1970లలో వామపక్ష విప్లవంలో మర్రీ తెగ సర్దార్ ఖేర్ బక్ష్ మర్రీ నాయకత్వ పాత్ర వహించారు. పాక్ ప్రభుత్వం ముందు బుగతీ 14 డిమాండ్లు పెట్టారు. బలూచిస్తాన్‌కు స్వయం ప్రతిపత్తి ఇస్తూ, ఆ

◆ బలూచిస్తాన్‌లో సహజ వనరులు పుష్కలం. కానీ, ఆ ప్రాంతంలో లభ్యమయ్యేవాటిని పాకిస్తాన్ ప్రభుత్వం తవ్వి తీసుకుపోవడమే గానీ, బలూచీ ప్రజానీకానికి వాటి ప్రయోజనాలు అందినది చాలా స్వల్పం.

ప్రాంతంలోని వనరులపై అక్కడి ప్రభుత్వానికే నియంత్రణ ఉండాలన్నది వాటిలో ఒకటి. వాటిపై కనీసం చర్చలు జరిపేందుకు కూడా ముషారఫ్ తిరస్కరించడం పెద్ద తప్పిదం. బుగతీ హత్యతో ఐదవ తిరుగుబాటు మొదలై ఈనాటికీ కొనసాగుతోంది.

### వనరులు బలూచిస్తాన్‌వి అయినా...

అక్బర్ ఖాన్ బుగతీ లేవనెత్తిన డిమాండ్లు కొత్తవేమీ కావు. వాటిని కోరినవారిలో ఇతరులూ ఉన్నారు. బలూచిస్తాన్‌లో వనరులు పుష్కలం. అది చమురు, ఇంధన వాయువు, ఖనిజాలు, రాగి, బంగారంతోపాటు ఇతర లోహాల నిక్షేపాలకు పేరెన్నికగన్న ప్రాంతం. ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ వాటి నమూనాలనే అమెరికాలో అధ్యక్షుడు ట్రంప్‌కు చూపించారు. ఆ ప్రాంతంలో లభ్యమయ్యేవాటిని తవ్వి తీసుకుపోవడమేగానీ, బలూచీ ప్రజానీకానికి అవి అందినది స్వల్పం. సుయి చమురు క్షేత్రాల నుంచి గ్యాస్ ఇతర రాష్ట్రాలకు పైపుల ద్వారా వెళ్ళేది. కానీ, బలూచిస్తాన్‌లోని చాలా ప్రాంతాలకు అది అందని మానిపండుగానే ఉండేది. పాక్ 1993 నుంచి గనుల లీజులను విదేశీ కంపెనీలకు కట్టబెడుతూ వస్తోంది. చగాయి జిల్లాలో రేకో డిగ్ వద్ద స్వర్ణ, తామ్ర గనుల తవ్వకాలు సాగుతున్నాయి. గ్వాదర్ పోర్టును నిర్మించే కాంట్రాక్టును ప్రభుత్వం చైనాకు అప్పగించింది. చగాయిలోనే సైండక్ ప్రాంతం వద్ద తామ్ర, స్వర్ణ గనుల తవ్వకాలను కూడా చైనాకు మంజూరు చేశారు. మునీర్ ఇపుడు ట్రంప్‌కు వాటినే ఆశ చూపుతున్నారు. ఇటీవలి దాడులు అక్కడ కార్యకలాపాలు నిర్వహించడానికి వచ్చే అంతర్జాతీయ సంస్థలను పునరాలోచనలో పడేస్తాయనడంలో సందేహం లేదు.

### మారిన పోరాట పంథా

బలూచ్ తిరుగుబాటు తీరుతెన్నులు కూడా మారాయి. ఇప్పటి నేతలకు గిరిజన సర్దార్‌లకు రాజకీయంగా, లేదా సామాజికంగా ఎక్కడా పోలిక లేదు. గిరిజన నాయకులు కంటకప్రాయమైన పర్వత ప్రాంత శిబిరాల్లో రోజులు గడిపి ఉండవచ్చు. కానీ, వారి రాజకీయాలు పాక్‌కు వ్యతిరేకమైనవి కావు. సమాఖ్య వ్యవస్థ లోపలే తమకు సముచిత స్థానం కల్పించాలనీ, తమను ప్రధాన లబ్ధిదారులు కానివ్వాలనీ వారు కోరుకున్నారు.

బీఎల్‌ఏకు 2018 నుంచి బషీర్ జెబ్ నేతృత్వం వహిస్తున్నారు. బలూచ్ లిబరేషన్ ఫ్రంట్‌కు అల్లా నాజర్ నాయకత్వం వహిస్తున్నారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో జెబ్ డిప్లొమా చేయగా, నాజర్ వృత్తి రీత్యా డాక్టర్. వీరి నేతృత్వంలో బలూచ్ తిరుగుబాటు మరింత హింసాయుతంగా మారింది. ఆత్మాహుతి దాడులకు శ్రీకారం చుట్టింది. చైనా వర్కర్లను, వారి ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుని 2018 నుంచి వివిధ దాడులు చేసింది. సంచలనం సృష్టించిన 2025 నాటి రైలు హైజాక్ ఉదంతం కూడా తమ పనేనని బీఎల్‌ఏ చెప్పుకొంది.

నేటి సోషల్ మీడియా యుగంలో జెబ్, నాజర్ ప్రసంగాలు విస్తృతంగా పరివ్యాప్తి చెందుతున్నాయి. తమ తల్లితండ్రుల కన్నా ఎక్కువ విద్యావంతులైన నవతరం తాము చిన్నచూపునకు గురికావడం పట్ల ఆగ్రహంతో ఉంది. మితిమీరిన సైన్యం ఆగడాలను వ్యతిరేకిస్తోంది. భద్రతా దళాల ప్రమేయంతో తమ తండ్రులు, సోదరులు, భర్తలు, కుమారులు అదృశ్యమవుతున్న ఘటనలకు వ్యతిరేకంగా గతంలోనూ బలూచ్ మహిళలు నిరసన ప్రదర్శనలకు దిగేవారు. కానీ, తిరుగుబాటులో మహిళలు స్వయంగా పాలుపంచుకోవడం కొత్త ధోరణి.

దాడులతో భంగపడిన సైన్యం బలూచ్ ప్రజానీకంపై మరింతగా విరుచుకుపడుతుంది. గత చరిత్ర దానినే సూచిస్తోంది. హింస చక్రభ్రమణంలా కొనసాగుతుంది. ఈ రక్తసిక్త ఘటనలు శ్రీలంక నుంచి భారతదేశపు కశ్మీర్, ఈశాన్య ప్రాంతం, బలూచిస్తాన్ వరకు మొత్తం ప్రాంతానికి ఒక పాఠం నేర్పుతున్నాయి. తమ దేశంలోని ఘటనలకు పొరుగు దేశాలను నిందించడం వల్ల దేశంలో కొందరిని రంజింపజేసినట్లు అవుతుందేమో; కానీ, సమస్యకు మూల కారణాలు ఆ యా దేశాలలోనే ఉన్నందు వల్ల వాటికి పరిష్కారాలు అవే కనుగొనాలి. ఇతరులను నిందించడం వల్ల సవాళ్లు సమసిపోవు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

# భూభాగం చిన్నదే... ప్రభావం అనన్యం!

టైమ్ మిషన్

వాటికన్ సిటీ; చిన్న ఫొటోలు: 1. ముస్సోలినీ, 2. పోప్ పయస్

అది 1929 ఫిబ్రవరి 2వ వారం. రోమ్ నగరంలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చి సమీపాన ఒక ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యకు ఆ రోజు అత్యంత నిశ్శబ్దంగా తెరపడింది. ఎటువంటి ఆర్భాటాలు, వేడుకలు లేకుండానే ప్రపంచ చిత్రపటంపై ఒక కొత్త దేశం ఆవిర్భవించింది. కేవలం ఒక గోల్ఫ్ కోర్స్ కంటే తక్కువ వైశాల్యం కలిగిన ఆ చిన్న నేల ముక్కే ‘వాటికన్ సిటీ’. భౌతికంగా చిన్నదైనా, దీని నైతిక అధికారం ఖండాంతరాలను దాటి విస్తరించింది. రోమన్ కేథలిక్ చర్చి అధిపతి అయిన పోప్ ఈ దేశ పాలకుడు!

ఒకప్పుడు పోప్ అంటే ఆధ్యాత్మిక నాయకుడు మాత్రమే కాదు. ఆయన రాజు. మధ్య ఇటలీ అంతటా విస్తరించిన ‘పాపల్ స్టేట్స్’ను శతాబ్దాల పాటు ఆయన పాలించారు. పన్నులు వసూలు చేశారు, సైన్యాలను నడిపించారు, రాజకీయ ఒప్పందాలు కుదిర్చారు. అపార భూమి కలిగి చర్చి బలంగా ఉండేది. అయితే 19వ శతాబ్దంలో జరిగిన ‘ఇటలీ ఏకీకరణ’ ఉద్యమం ఈ బలాన్ని బద్దలు కొట్టింది.

జాతీయవాదులు అనేక చిన్న, పెద్ద రాజ్యాలుగా ఉన్న ఇటలీ భూభాగాలను ఏకం చేసి అఖండ ఇటలీని ఏర్పాటు చేసే క్రమంలో... 1870లో ఇటలీ సైన్యం రోమ్‌లోకి ప్రవేశించింది. దీంతో పాపల్ స్టేట్స్ చరిత్రలో కలిసిపోయాయి. పోపు తన రాజ్యాన్ని కోల్పోయారు. కానీ ఆయన ఓడిపోయానని అంగీకరించలేదు. అలాగే ఇటలీ ప్రభుత్వాన్ని గుర్తించడానికి నిరాకరించారు. తనను తాను ‘వాటికన్‌లో ఖైదీ’గా ప్రకటించుకున్నారు. దాదాపు అరవై సంవత్సరాలు ఆయన వాటికన్ గోడలకే పరిమితమయ్యారు. ఈ పరిస్థితిని ‘రోమన్ ప్రశ్న’ (రోమన్ క్వశ్చన్) అని చరిత్ర నమోదు చేసింది.

ఈ స్థితి చర్చికి ప్రమాదకరంగా మారింది. పోప్ ఆధ్యాత్మికంగా శక్తిమంతుడే కానీ, చట్టపరంగా స్వతంత్రుడు కాదు. ఆయన మాటలను ఒక దేశపు మతపెద్ద అభిప్రాయంగా మాత్రమే పరిగణించే ప్రమాదం ఏర్పడింది. విశ్వవ్యాప్త చర్చి ఒక జాతీయ సమస్య స్థాయికి చేరడం ఆందోళనకు కారణమయ్యింది. పోయిన రాజ్య భూభాగాలు ఎటూ రావు; చిన్నదైనా, స్పష్టమైన చట్టబద్ధమైన, ఎవరి అధీనంలో లేని భూమి తనకు ఉండవలసిన అవసరాన్ని చర్చి గుర్తించింది.

ఆ అవసరం 1929లో ఒక రాజకీయ రాజీగా రూపుదిద్దుకుంది. ఫిబ్రవరి 11న రోమ్‌లోని ‘లాటరన్ ప్యాలెస్’లో కుదిరిన ఒప్పందం ద్వారా ‘వాటికన్ సిటీ’ అనే కొత్త రాజ్యం పుట్టింది. ఇటలీ నియంత బెనిటో ముస్సోలినీకి, 11వ పోప్ పయస్‌కు మధ్య ఒప్పందం ప్రకారం... వాటికన్ సిటీని స్వతంత్ర దేశంగా ఇటలీ గుర్తించింది. ప్రతిఫలంగా రోమ్‌ను ఇటలీకి రాజధానిగా చర్చి అంగీకరించింది. చర్చి తన పాత భూభాగాలపై హక్కులను వదులుకుంది. ఇటలీ అందుకు నష్టపరిహారం చెల్లించింది. ఈ ఒప్పందంతో ముస్సోలినీకి చర్చి నుంచి నైతిక గుర్తింపు లభించింది. చర్చికి భద్రత, స్వాతంత్ర్యం లభించాయి.

అలా పుట్టిన వాటికన్ సిటీ మిగతా దేశాల్లాంటిది కాదు. అక్కడ పౌరులు పుట్టరు, నియమితులవుతారు. అక్కడ సైన్యం ఉంది కానీ యుద్ధం కోసం కాదు– ఆచారాల కోసం. ఆర్థిక వ్యవస్థ పరిశ్రమలపై కాక... విశ్వాసం, విరాళాలు, మ్యూజియాల మీద ఆధారపడి మనగలుగుతోంది. ఈ చిన్న రాజ్యం ప్రపంచంలోని 180కి పైగా దేశాలతో దౌత్య సంబంధాలు కొనసాగిస్తోంది.

వాటికన్ సార్వభౌమత్వం ప్రపంచ రాజకీయాల్లో ఒక కొత్త నమూనాను తీసుకొచ్చింది. భూమి, సైన్యం లేకుండానే ప్రభావం చూపవచ్చని అది నిరూపించింది. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో కమ్యూనిజాన్నీ, నియంత్రణలేని పెట్టుబడిదారి విధానాన్నీ– రెండింటినీ ఒకేసారి విమర్శించిన అరుదైన సార్వభౌమ శక్తి వాటికన్. అణ్వాయుధాల నుంచి వలసల సమస్యల వరకు అనేక అంశాలపై నైతిక కోణాన్ని ప్రపంచ చర్చల్లోకి తెచ్చిన ఘనత దీనిదే! భూమిని కోల్పోయిన చర్చి, ప్రపంచవ్యాప్త ప్రభావాన్ని సంపాదించింది. రాజ్యాన్ని వదిలిన పోప్, అంతర్జాతీయ నైతిక స్వరంగా మారారు. ◆

# దాగున్న చిక్కులు ఎన్నో!

ఏకధ్రువ ప్రపంచం ఆవిష్కృతం అవుతున్న క్రమంలో ప్రపంచ యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాల తరువాయి దశ అయిన వాణిజ్య యుద్ధంలోకి దేశాలు ఏదో రూపంలో ప్రవేశించాయి. 2047 నాటికి ‘వికసిత్ భారత్’ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆశిస్తున్న భారత్, తన వాణిజ్య విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక భారత్‌ను ‘ట్యారిఫ్ కింగ్’ అని విమర్శించడమే కాకుండా, రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను సాకుగా చూపుతూ భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించి వాణిజ్య చర్చలకు ఆటంకం కలిగించారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గని భారత్, చాకచక్యంగా వ్యవహరించి కొత్త మార్కెట్లను అన్వేషించింది. యూరోపియన్ యూనియన్‌తో భారీ వాణిజ్య ఒప్పందంతో పాటు బ్రిటన్, ఒమన్, న్యూజిలాండ్, యుఏఈ వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) చేసుకుంది. భారత మార్కెట్ ప్రాముఖ్యాన్ని గుర్తించిన ట్రంప్, చివరకు మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో భారత ఎగుమ తులపై సుంకాలను 50 నుండి 18 శాతానికి తగ్గించారు. ముఖ్యంగా చైనా, పాక్ వంటి దేశాల కంటే భారత ఉత్పత్తులపై తక్కువ సుంకాలు ఉండటం మనకు కలిసొచ్చే అంశం. టీ, కాఫీ, జనరిక్ మందులు, విమాన విడిభాగాలపై సున్నా శాతం సుంకం ఉండగా; వస్త్రాలు, లెదర్, రసాయనాలు, ఆభరణాలు, యంత్రాలపై 18 శాతం సుంకం అమలవుతుంది.





అయితే ఈ ఒప్పందంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒప్పంద నిబంధనలు భారత్ కంటే అమెరికా ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. రష్యా చమురు దిగుమతులను నిలిపివేసి, వెనిజులా, లేదా అమెరికా నుండి ఇంధనం కొనాలన్న షరతు భారత్‌కు ఆర్థికంగా భారమయ్యే ప్రమాదం ఉంది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులైన ఎర్ర జొన్నలు, సోయాబీన్ నూనె, డ్రై ఫ్రూట్స్ వంటి వాటికి భారత మార్కెట్‌లో అనుమతిస్తే దేశీయ రైతులు, పౌల్ట్రీ, డైరీ రంగాలు నష్టపోయే ప్రమాదం ఉంది.

గతంలో 5 శాతంగా ఉన్న సగటు సుంకం ఇప్పుడు 18 శాతానికి చేరడం వల్ల, అమెరికాతో ఉన్న 41 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులును భారత్ కాపా డుకోగలదా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల అమెరికా వస్తువులకు భారత్ ఒక డంపింగ్ గ్రౌండ్‌గా మారే ప్రమాదాన్ని విస్మరించలేము. అమెరికా షరతులు భవిష్యత్తులో మన ప్రయోజనాలను దెబ్బతీయకుండా, తుది ఒప్పందంలో భారత్ తన స్వప్రయోజనాలకు పెద్దపీట వేయాలి.

– డా॥ తిరుణహరి శేషు । అర్థ శాస్త్ర బోధకులు, కాకతీయ యూనివర్సిటీ

డేటా పాయింట్

## ‘మ్యాగ్జిమమ్’ వసూళ్లు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో (2023-25) మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయనందుకుగానూ జరిమానాగా వినియోగదారుల నుంచి 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 8,000 కోట్లకు పైగా వసూలు చేశాయని పార్లమెంట్ డేటా తెలియజేస్తోంది. ఇందులో 20 శాతంతో పంజాబ్ నేషనల్ బ్యాంకు అగ్రస్థానంలో ఉంది.

జరిమానాల్లో టాప్ 5 బ్యాంకులు

బ్యాంకుల వారీగా వసూలు చేసిన సొమ్ము (కోట్ల రూపాయల్లో)

| బ్యాంకు | సొమ్ము |
|---|---|
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 1577.97 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 1272.17 |
| ఇండియన్ బ్యాంక్ | 1166.27 |
| కెనరా బ్యాంక్ | 1027.23 |
| ఎస్బీఐ | 932.82 |

# ఏకాగ్ర భక్తి

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

‘పరదోషవిదో న భక్తి రేఖా’ అన్న సూక్తికి అర్థం... ఇతరుల దోషాలను ఎంచేవాడికి భక్తి లేశ మాత్రం కూడా ఉండదని. ఇతరుల్లోని గుణాలను గుర్తించడం మాని, కేవలం దోషాలనే ఎంచేవారు చేసే జప తపాలు, పూజా పురస్కారాలు కేవలం ఆడంబరాలే తప్ప నిజమైన భక్తి కావని గ్రహించాలి. భక్తి ఉన్నట్లు వేషం వేస్తే ప్రయోజనం లేదు. మనస్సు పరిశుద్ధంగా ఉండాలి. గంటల తరబడి దేవుని ముందు కూర్చోవడం, మంటపాన్ని రకరకాల పూలతో అలంకరించడం, సుదీర్ఘ స్తోత్రాలు పఠించడం అభినందనీయమైన కర్తవ్యాలే. ఈ విధానం మనసు నిలిపి చేసినప్పుడే అద్భుత ఫలితాలను ఇస్తుంది.

ఏకాగ్రత విలువను చాటిచెప్పే ఒక ఉదంతం ఇది: ఒక ఇల్లాలు తన భర్తను కలుసుకోవాలనే ఆత్రంతో వేగంగా వెళ్తూ, దారిలో ఒక వస్త్రంపై కూర్చొని ధ్యానం చేసుకుంటున్న వ్యక్తిని గమనించకుండా వస్త్రాన్ని తొక్కుతూ ముందుకు సాగిపోయింది. ఆమె తిరిగి వచ్చేటప్పుడు ఆ భక్తుడు తాను కూర్చున్న వస్త్రాన్ని తొక్కినందుకు కోపగించాడు. దీంతో ఆమె వినమ్రంగా, ‘అయ్యా భర్తను కలవాలనే ధ్యాసలో నేను మీ వస్త్రాన్ని చూడలేదు. కానీ, సర్వశక్తిమంతుడైన భగవంతుని ధ్యానించే మీరు, నేను వస్త్రం తొక్కడాన్ని ఎలా గమనించగలిగారు?’ అని ప్రశ్నించింది. ఆమె సూటి ప్రశ్నతో ఆ భక్తుడు మౌనం వహించాడు. తన ప్రార్థనలో ఏకాగ్రత లోపించిందనీ, అది కేవలం లోకానికి చూపించుకోవడానికేననీ గ్రహించి సిగ్గుపడ్డాడు.

భక్తికి ఏకాగ్రతే అసలైన పునాది. పూజలో ఉన్నప్పుడు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవాలి. ఇంద్రియాలను నియంత్రించి, మనస్సును కేవలం ధ్యానంలోనే లగ్నం చేయాలి. దేవాలయంలో గంటలు మోగించడం ఏకాగ్రతను చెడగొట్టడానికి కాదు; ఆ ఓంకార నాదంతో మనస్సు తాదాత్మ్యం చెంది ఏకాగ్రత సాధించడానికే. అభ్యాసం చేస్తే చేతకానిది ఉండదు. కర్ణ సమాధి, నేత్ర సమాధి, మొదలయినవన్నీ సిద్ధిస్తాయి. అది భక్తికి పునాది. అప్పుడు చూపు బయటకు కాదు లోనికి తిప్పుకోవాలి. అదే లోచూపంటే!

## క్లుప్తంగా...

### రీయింబర్స్‌మెంట్ మిగిలిన బకాయిలు ఎప్పుడిస్తారు?

- చంద్రబాబు ప్రభుత్వానికి పేరెంట్స్ అసోసియేషన్ సూటి ప్రశ్న

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని దాదాపు 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని 'ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' డిమాండ్ చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏ మూలకూ సరిపోవని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడు విద్యా సంవత్సరాలకు సంబంధించి ఇంకా రూ.6,000 నుంచి రూ.7,000 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఇందులో విద్యాదీవెన కింద రూ.4,000 కోట్లు, వసతి దీవెన కింద రూ.2,000 కోట్లకు పైగా నిధులు రావాల్సి ఉందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా వేధిస్తున్నాయని, ఫీజుల పేరిట హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తూ విద్యార్థులను మానసిక వేదనకు గురి చేస్తున్నాయని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు శిఖరం నరహరి, ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆరోపించారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.7 వేల కోట్ల బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టమైన కాలపరిమితితో షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### పెన్షన్ రూల్స్-2026పై అభిప్రాయాలు తీసుకోవాలి

ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్ విధానంలో కీలక మార్పులు తీసుకొస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నూతన పెన్షన్ రూల్స్–2026' ముసాయిదాపై రిజిస్టర్డ్ సంఘాల అభిప్రాయం కూడా తీసుకోవాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి నాగమునెయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ రూల్స్ ముసాయిదాలో కొన్ని అంశాలు ఉద్యోగులు, ఉపాధ్యాయులలో ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. 33 సంవత్సరాల గరిష్ట అర్హత సేవ అనే పరిమితి విధించడం ఉద్యోగి 33 ఏళ్లకు మించి ఎంతకాలం పనిచేసినా అదనపు సేవకు పెన్షన్‌లో ఎలాంటి అదనపు లాభం ఉండదన్నారు. 33 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వెంటనే తప్పనిసరిగా ఉద్యోగ విరమణ చేయాల్సిన అవసరం లేదని ఒకవైపు చెబుతూనే ప్రజా ప్రయోజనం పేరిట ఉద్యోగితో విరమణ చేయించేలా నియామక అధికారికి విశేష అధికారాలు కట్టబెట్టడం వివాదాస్పదంగా ఉందన్నారు.

# ఉన్నత విద్యకు ఉరి!

## రాష్ట్రంలో భారీగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

## పుస్తెలు తాకట్టు పెట్టి కళాశాలలకు ఫీజులు కడుతున్న పేదింటి తల్లులు

**భారతదేశ చరిత్రలో ఇచ్చిన మాట నిలుపుకుని, హామీలు నెరవేర్చామని చెప్పకునే వారు కొందరు.. ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండానే అన్నీ చేసేశామని చెప్పకునే వారు ఇంకొందరు.. ఇందులో మొదటి వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే, రెండో వ్యక్తి చంద్రబాబునాయుడు.. అయితే తండ్రిని మించిన తనయుడిగా మంత్రి లోకేశ్ మరో నాలుగడుగులు ముందుకేసి ఉత్తుత్తి ఆదేశాలతో ప్రజలను మభ్యపెడుతుండటం విస్తుగొలుపుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో) ఇచ్చి.. అంటే బిల్లు పెట్టుకోవచ్చని ఇచ్చే అత్యంత సాధారణ ఉత్తర్వు. దీనిపై పండుగ చేసుకోండంటూ ప్రచారం చేసుకోవడం విస్తుగొలుపుతోంది. రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులందరినీ తామే ఉద్ధరిస్తున్నట్లు గొప్పలు చెప్పకోవడం లోకేశ్‌కే చెల్లింది. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా సకాలంలో ఫీజు డబ్బులు చెల్లించడం తమ బాధ్యత అంటూ 'ఎక్స్' వేదికగా చాటుకోవడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి.**

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ ఉన్నత విద్యకు ఉరితాడు బిగిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో నక్కజిత్తులు ప్రదర్శిస్తూ విద్యార్థులను నిలువునా మోసం చేస్తోంది. కొండలా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తీర్చలేక కాగితాలపై కుయుక్తులు పన్నుతోంది. ఏ ప్రభుత్వంలోనైనా సంక్షేమ పథకాలకు నిధులు ఇచ్చాకే ప్రచారం చేసుకుంటారు. కానీ, దేశ చరిత్రలో తొలిసారిగా కేవలం బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో) ఇచ్చి, పండగ చేసుకోమని చెప్పిన ఏకైక సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు విద్యా శాఖ మంత్రి లోకేశ్ మాత్రమేనని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. స్వేచ్ఛగా కళాశాలలకు వెళ్లలేని దుస్థితిలో చదువు దిన దిన గండంగా మారిపోయింది. ఒకవైపు ప్రభుత్వం ఫీజులు చెల్లించట్లేదు. మరోవైపు ఫీజులు కట్టకుంటే కళాశాలలు పరీక్షలు రాయనివ్వట్లేదు. ఒకవేళ ఎలాగోలా పరీక్షలు రాసినా, సర్టిఫికెట్లు విడుదల చేయట్లేదు. గత రెండేళ్లుగా ఉన్నత విద్యా రంగంలో ఇదే తంతు నడుస్తోంది. తమ బిడ్డల చదువుల కోసం ఎందరో పేదింటి తల్లులు పుస్తెలు తాకట్టుపెట్టి, ఫీజులు కట్టిన ఉదంతాలు కోకొల్లలు. ఇలాంటి తరుణంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై విద్యార్థులను, కళాశాలలను మభ్య పెడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మరికొన్ని నెలల్లో ఈ విద్యా సంవత్సరం కూడా ముగుస్తుండగా.. చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.6,300 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో ఇచ్చింది కేవలం రూ.700 కోట్లే. ఇంకా రూ.5,600 కోట్లు బకాయిలున్నాయి. పైగా పేదింటి విద్యార్థులకు హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీల కింద చెల్లించాల్సిన రూ.2,200 కోట్ల ఊసే ఎత్తట్లేదు. మొత్తంగా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉన్నత విద్యలో రూ.7,800 కోట్లు బకాయిలు ఉంటే.. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం రాత్రి రూ.1,200 కోట్లు విడుదల చేయొచ్చంటూ బీఆర్‌వో ఇచ్చి విద్యా వ్యవస్థను ఉద్ధరించినట్టు ప్రచారం చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### చెప్పిందొకటి.. చేస్తున్నది మరొకటి

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడం మొదలు పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కరోనా విలయ తాండవం చేసినప్పటికీ, సమర్థవంతంగా ఐదేళ్లు ఈ పథకాన్ని కొనసాగిస్తే.. చంద్రబాబు మాత్రం పాతరేసేశారు. అంత్యంత పారదర్శకంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేసే విధానానికి స్వస్తి పలికి, కళాశాలల ఖాతాల్లో నేరుగా వేస్తామని నమ్మబలికారు. తీరా చూస్తే 20 నెలల పాలనలో ఉన్నత విద్యా కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద అరకొర నిధులు విదిల్చి మమ అనిపించారు. పైగా షెడ్యూల్ ప్రకారం ప్రతి త్రైమాసికానికి ఇవ్వాల్సిన నిధులను ఆపేసి, ఏడాదికి రెండుసార్లు చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారు. ఫలితంగా రూ.7,800 కోట్ల బకాయిల కొండ దర్శనమిస్తోంది.

### వసతి దీవెన ఎగ్గొట్టి తీరని అన్యాయం

చంద్రబాబు కర్కశ పాలన పేదింటి విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దూర ప్రాంతాల నుంచి చదువుల కోసం వచ్చే విద్యార్థులు హాస్టళ్లలో జీవనం సాగిస్తుంటారు. అలాంటి విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా గత వైఎస్ జగన్ ప్రభుత్వం వసతి దీవెన పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో హాస్టల్ మెయింటెనెన్స్ కింద ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని క్రమం తప్పకుండా జమ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకం ఊసే ఎత్తడం లేదు. ఇప్పటిదాకా మూడు విడతలకుగాను రూ.2,200 కోట్లు బకాయిపెట్టి, విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తోంది. కాగా, అధికారమే పరమావధిగా ఎన్నికలప్పుడు చంద్రబాబు.. ప్రైవేటు కళాశాలల్లో పీజీ చేసే విద్యార్థులకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వరుసగా రెండు దఫాల్లోనూ ముఖం చాటేశారు. ఇప్పుడు మూడోసారి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ వచ్చినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై మాత్రం నోరు మెదపట్లేదు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, సుస్థిరత దిశగా పాలన సాగించాల్సిన చంద్రబాబు ప్రభుత్వం అప్పులు, వడ్డీల లెక్కలతో కాలం గడిపేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ వర్సిటీలనే కాదు ప్రైవేటు విద్యా సంస్థలను సైతం నట్టేట ముంచేసే కార్యక్రమాలకు ఒడిగట్టింది. ఇప్పటికే కొండలా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆర్థికంగా కుదేలయ్యాయి. అతికష్టంపై నెట్టుకొస్తున్న దుస్థితి. ఈ క్రమంలో తప్పించుకునేందుకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొచ్చి ప్రైవేటు యాజమాన్యాలకు ఈ విద్యా సంవత్సరం చివరి వరకు మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని, అయితే అందుకయ్యే వడ్డీని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు భరించాలని ప్రతిపాదించింది. తీరా, బ్యాంకుల దగ్గరకు వెళ్లేసరికి అప్పు పుట్టక పోవడంతో ప్రభుత్వం ముఖం చాటేసింది.

### విశ్వవిద్యాలయాల నిధులు దారి మళ్లింపు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో పాటు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను తీవ్రంగా దెబ్బ తీసింది. ప్రభుత్వ వర్సిటీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోగా, వర్సిటీ నిధులను దారిమళ్లించి వాటి మనుగడపై కోలుకోలేని దెబ్బకొట్టింది. ఉన్నత విద్యా మండలితో పాటు విశ్వవిద్యాలయాల నుంచి ఏకంగా రూ.1,200 కోట్ల వరకు నిధులు పక్కదారి పట్టించింది. వాటిని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బదిలీ చేయించి, తద్వారా ఇతర అవసరాలకు వినియోగిస్తోంది.
- ఉన్నత విద్యా మండలి ఖజానా నుంచి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం వాడేసుకోవడం గమనార్హం. ఇందులో ముఖ్యంగా చినబాబు ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా ఏకంగా రూ.3.60 కోట్లు ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు దారి మళ్లించేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవిడ్‌ను అధిగమించి వర్సిటీలకు నూతన జవసత్వాలు అందించే ప్రయత్నం విస్తృతంగా జరిగింది. మళ్లీ చంద్రబాబు సర్కార్ రాకతో ప్రభుత్వ వర్సిటీలకు గడ్డుకాలం దాపురించింది.

### నేడు అరకొర.. నాడు ఫుల్ బడ్జెట్

- చంద్రబాబు ఉన్నత విద్యకు అరకొర బడ్జెట్ కేటాయించడం తప్ప ఒరగబెట్టిందేమీ లేదు. ప్రతి విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,800 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ ఖర్చుల కింద రూ.1,100 కోట్లు కలిపి రూ.3,900 కోట్లు వెచ్చించాలి. కానీ, 2025–26 బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయింపులు చూపించింది. ఆ మేరకు నిధులు విడుదల చేసిందా అంటే అదీ లేదు. ఈ ఏడాది భారీగా పేరుకుపోయిన బకాయిలను తీర్చడానికి బడ్జెట్ కేటాయింపులను పెంచడంతో పాటు ఆ మేరకు విడుదల చేయాల్సి ఉంది.
- వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో జగనన్న విద్యా దీవెన కింద ప్రతి త్రైమాసికానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల చేసింది. పైగా గత చంద్రబాబు ప్రభుత్వంలోని రూ.1,778 కోట్ల బకాయిలు సైతం చెల్లించింది. మొత్తంగా ఐదేళ్లలో రూ.12,609.68 కోట్లు క్రమం తప్పకుండా ఇచ్చింది. జగనన్న వసతి దీవెన కింద రూ.4,275.76 కోట్లు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో వేసింది. ఇలా మొత్తం ఐదేళ్లలో గత ప్రభుత్వం ఉన్నత విద్యపై ఏకంగా రూ.18,663.44 కోట్లు ఖర్చు చేసింది. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి త్రైమాసికానికి సంబంధించి ఏప్రిల్‌లో పరిగణనలోకి తీసుకుని మే నెలలో నిధులు విడుదల చేయాల్సి ఉండగా, మార్చిలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

లేని గొప్పలు చెప్పకుంటూ లోకేష్ ఎక్స్‌లో పెట్టిన పోస్ట్

### రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదా?

మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపాటు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లు రెడ్ బుక్ రాజ్యాంగంపై పెడుతున్న శ్రద్ధ విద్యార్థులపై చూపించట్లేదని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.7,800 కోట్లున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇతర శాఖల్లో వేలు పెట్టే లోకేశ్.. తన శాఖలో విద్యార్థుల కష్టాలను తీర్చలేని అసమర్థ మంత్రిగా నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతి త్రైమాసికానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేసి, తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసేవారన్నారు. ఫలితంగా విద్యార్థులు హాయిగా చదువుకునే వారని గుర్తు చేశారు. చంద్రబాబు సర్కార్ ఫీజులు చెల్లించక పోవడంతో కళాశాలలు విద్యార్థులను పరీక్షలకు కూడా అనుమతించట్లేదని దుయ్యబట్టారు. విజయవాడ సమీపంలోని ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో ఫార్మసీ చదువుతున్న విద్యార్థినులను ఫీజు పెండింగ్ ఉందనే కారణంతో రీసెర్చ్ రివ్యూ మీటింగ్‌కు అనుమతించక పోవడం దారుణం అన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

# ఆర్టీసీపై చావుదెబ్బ!

## రాష్ట్రంలో 12 కీలక బస్ డిపోలు ప్రైవేటుపరం

- ఆ డిపోల ద్వారా నిర్వహిస్తున్న బస్సులు ఇతర డిపోల్లో సర్దుబాటు
- ఈ నెల 25లోగా ఆ డిపోలు ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ
- రూ.6 వేల కోట్ల ఆర్టీసీ ఆస్తులు ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం
- ఈ-బస్‌ల నిర్వహణ పేరుతో సరికొత్త కుతంత్రం
- చంద్రబాబు సర్కారు తీరుపై భగ్గుమంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఆర్టీసీని చావుదెబ్బ కొట్టింది. దాదాపు 50 వేల మంది ఉద్యోగులు ఉన్న అతి పెద్ద రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీని నిర్వీర్యం చేయడానికి దొంగదెబ్బ తీసింది. దాదాపు రూ.6 వేల కోట్ల ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేసే కుట్రకు బరితెగించింది. ఇప్పటికే విజయవాడ ఆర్టీసీ డిపో–1కు చెందిన రూ.600 కోట్ల విలువైన 4.15 ఎకరాలను చంద్రబాబు తన అస్మదీయ సంస్థ లూలూ గ్రూప్‌నకు కట్టబెట్టింది. తాజాగా ఆర్టీసీ వెన్నెముకను విరిచేస్తూ విభ్రాంతికర నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 12 ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని నిర్ణయించింది. ఈ–బస్సుల నిర్వహణ సంస్థల ముసుగులో ఏకంగా రూ.6 వేల కోట్ల విలువైన భూములను అస్మదీయ సంస్థలకు ధారాదత్తం చేయడానికి రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపుతోంది. రాష్ట్రంలో రూ.వేల కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం పక్కా పన్నాగంతో పావులు కదుపుతోంది. 'ప్రధాన మంత్రి ఈ–బస్ సేవా' పథకం కింద ప్రవేశ పెట్టే విద్యుత్ బస్సు (ఈ–బస్సు)లను ఈ ఆర్టీసీనే నిర్వహించాలన్న ఉద్యోగ సంఘాల డిమాండ్‌ను అందుకే తిరస్కరించింది. ప్రైవేటు కార్పొరేట్ సంస్థల ద్వారానే ప్రవేశ పెడతామని తేల్చి చెప్పింది.

### ఇక్కడే తిర'కాసు'

ఈ–బస్సులను ప్రవేశపెట్టే ప్రైవేటు సంస్థలే తమకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలి. అంటే బస్సుల చార్జింగ్ కేంద్రాలు, గ్యారేజీలు, బస్సులు నిలుపుదల చేసే ప్రదేశాలను ఆ సంస్థలే ఏర్పాటు చేసుకోవాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఆ విషయాన్ని ఉద్దేశ పూర్వకంగా ఒప్పందంలో విస్మరించింది. ప్రైవేటు సంస్థలు నిర్వహించే ఈ–బస్సులకు చార్జింగ్ కేంద్రాలు, గ్యారేజీలు, ఇతర వసతులను ఆర్టీసీ డిపోల్లోనే ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. పోనీ ఆ డిపోలను ఆర్టీసీ ఆధ్వర్యంలోనే కొనసాగిస్తూ ప్రైవేటు సంస్థలకు యూజర్ చార్జీలు వసూలు చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించవచ్చు. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కూడా పట్టించుకోలేదు. ఆర్టీసీ డిపోలను పూర్తిగా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబర్ 29న నిర్వహించిన సమావేశంలోనే ఆమోద ముద్ర వేసింది. మొదటి దశలో రాష్ట్రంలోని 12 డిపోలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని నిర్ణయించింది. ఆ మేరకు ఈ నెల 4న అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు వీలుగా ఆ 12 డిపోలను ఈ నెల 25లోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆ డిపోల ద్వారా నిర్వహిస్తున్న బస్సులను ఇతర డిపోలలో సర్దుబాటు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ డిపోల్లో ఆర్టీసీ చేపట్టిన సివిల్ పనులను వెంటనే నిలుపుదల చేయాలని కూడా స్పష్టం చేసింది. అంటే ఆ డిపోలను పూర్తిగా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసినట్టేనని తేల్చి చెప్పింది.



Andhra Pradesh State Road Transport Corporation

O/o the CCE,
RTC House, PNBS,
Vijayawada
Dt.04.02.2026

No. CCE/PM-e Bus(1)/2025-26

To

The Chief Mechanical Engineer (C&B),
APSRTC, RTC House,
VIJAYAWADA

Sub : Electric Buses : Induction of 750 Electric Buses in 12 places in APSRTC under the "PM-eBus Sewa" scheme - Sanction of Civil & Electrical Infrastructure works by CSSC – Commencing of Related Civil & Electrical Works- Handing over of Proposed Depot Sites - Information -Reg

Ref : 1) Dy CME ( C&B) letter No TL5/338(3)/2023-MED , Dt 20.12.2024
2) Minutes of the 11th Meeting of The Central Sanctioning and Steering Committee (CSSC) held on 06.02.2025
3) CME(C&B) Lr No. TL5/338(3)/2023- MED dt 11.02.2025 addressed to CCE
4) Letter of award issued to M/s Pinnacle Mobility Solutions Pvt Ltd. Pune, dated 19.03.2025
5) Minutes of SLSC meeting held on 09.07.2025
6) Office Memorandum of Director (UT-1) Dt 16.12.2025 communicating the Minutes of 13th meeting of CSSC held on 29.12.2025 to consider the proposals of States / Cities under the PM-e Bus Sewa Scheme.

12 డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం కోసం ఖాళీ చేయాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు

### అన్యాక్రాంతం కానున్న 12 డిపోలు

| | |
|---|---|
| 1. సింహాచలం - విశాఖపట్నం | |
| 2. గాజువాక - విశాఖపట్నం | |
| 3. రాజమహేంద్రవరం | 4. కాకినాడ |
| 5. విద్యాధరపురం - విజయవాడ | |
| 6. మంగళగిరి - అమరావతి | |
| 7. గుంటూరు -2 | 8. నెల్లూరు |
| 9. మంగళం - తిరుపతి | 10. కడప |
| 11. అనంతపురం | 12. కర్నూలు |

### రూ.6 వేల కోట్ల భూములు అన్యాక్రాంతం

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్ స్టేషన్లు, డిపోల రూపంలో ఉన్న విలువైన భూములే ఆర్టీసీకి వెన్నెముక. ఆ వెన్నుముకకు చంద్రబాబు ప్రభుత్వం తూట్లు పొడిచింది. విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురంలలో అత్యంత విలువైన ప్రదేశాల్లో ఉన్న డిపోలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని నిర్ణయించింది. ఒక్కో డిపో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అంటే 12 డిపోల విస్తీర్ణం దాదాపు 120 ఎకరాలు. ఆ ప్రాంతాల్లో ఎకరా భూమి మార్కెట్ విలువ రూ.25 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు ఉంది. సగటున ఎకరా భూమి విలువ రూ.50 కోట్లు లెక్క వేసుకున్నా.. ఆ 12 డిపోల మార్కెట్ విలువ ఏకంగా రూ.6వేల కోట్లు. అంటే చంద్రబాబు ప్రభుత్వం ఒక్క కలం పోటుతో ఆర్టీసికి చెందిన రూ.6 వేల కోట్ల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తోంది.

### ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్ర

ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే ఆలోచనను వెంటనే వెనక్కు తీసుకోవాలి. అత్యంత విలువైన ఆర్టీసీ ఆస్తులను ప్రభుత్వం పరిరక్షించాలి. 12 ఆర్టీసీ డిపోలను ఖాళీ చేయాలన్న ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలను ఉధృతం చేస్తాం. ఐక్య కార్యాచరణ కమిటీ పోరుబాట పడుతుంది. ఆర్టీసీని పరిరక్షించుకునేందుకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నాం. ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆగ్రహంగా ఉన్నారు.

– సీహెచ్.సుబ్బారావు, కట్టా సుబ్రమణ్యం,
ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



# భరతమాతనే... అమెరికాకు అమ్మేశారు

## కేంద్రంపై విరుచుకుపడ్డ రాహుల్

- అగ్ర రాజ్యానికి పూర్తిగా లొంగిపోయింది
- వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో నిప్పులు
- మోదీ సర్కారుకు కాస్తయినా సిగ్గుగా లేదా?
- ఒప్పందాన్ని ఎలా సమర్థించుకుంటుంది?
- ప్రధానిని అమెరికా మెడలు పట్టి వంచేసింది
- ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్లకు లొంగారు
- బీజేపీ ఆర్థిక ప్రయోజనాలకే పెద్దపీట వేశారు
- అందుకే అన్ని రంగాలనూ అప్పగించేశారు
- మన రైతు ప్రయోజనాలూ పణంగా పెట్టారు
- బడ్జెట్‌పై చర్చలో తూర్పారబట్టిన రాహుల్

**న్యూఢిల్లీ:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కారును విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఒప్పందం పేరిట మన తల్లి భరతమాతనే అమెరికాకు అమ్మేశారంటూ నిప్పులు చెరిగారు. ''వ్యవసాయం, ఇంధనంతో సహా అన్ని రంగాలనూ అమెరికా చేతికి అప్పగించేశారు. ఆ దేశానికి పూర్తిస్థాయి లొంగిపోయారు. దేశాన్ని ఇలా అడ్డంగా అమ్మేసినందుకు మీకు కనీసం సిగ్గుగా అనిపించడం లేదా?''అంటూ కేంద్రంపై విరుచుకుపడ్డారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ ప్రసంగించారు. అమెరికాతో ఏకపక్ష ఒప్పందాన్ని మోదీ సర్కారు ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. ''పలు విషయాలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా నేరుగా విపరీతమైన ఒత్తిడి పెట్టింది. పూర్తిగా ఆయన మెడలు వంచి నొక్కిపట్టింది. అందుకే దేశాన్ని మోదీ అమెరికాకు అమ్మేశారు. కేవలం అధికారం కాపాడుకోవడానికి జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టారు. లేదంటే ఇలాంటి ఏకపక్ష ఒప్పందానికి ఆయనే కాదు, ఏ భారత ప్రధానీ అంగీకరించబోడు''అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ''మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యర్థి మెడను దొరకబుచ్చుకున్నాక దాన్ని గట్టిగా నొక్కిపడతారు. దాంతో అతను అల్లాడిపోతాడు. లొంగిపోయానంటూ చేతులెత్తేస్తాడు. మోదీ చేసింది సరిగ్గా అదే''అంటూ ఎద్దేవా చేశారు.

''వాణిజ్య ఒప్పందం ద్వారా మన రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం పూర్తిగా రాజీ పడింది. జౌళి రంగాన్ని నేలమట్టం చేశారు. మన డేటాను, రైతులను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను, మన శక్తియుక్తులను, చిన్న, మధ్యతరహా వ్యాపారాలనూ అమ్మేశారు. ఇంధన భద్రతను గాలికొదిలేశారు. ఇకపై మనం ఎవరి నుంచి చమురు కొనుగోలు చేయాలో నిర్ణయించేది అమెరికాయే తప్ప మన ప్రధాని కాదు! పైగా ఆ కొనుగోళ్లను అగ్ర రాజ్యమే నిత్యం పర్యవేక్షిస్తుంటుంది. వారు చెప్పిన వాళ్ల దగ్గర కొనకపోతే మనపై మళ్లీ 50 శాతం టారిఫ్‌లు బాదుతారు. మన ఆర్థిక, ఇంధన రంగాలను మనపైకే ఆయుధాలుగా గురి పెట్టేందుకు అమెరికాను కేంద్రం అనుమతించింది''అంటూ నిప్పులు చెరిగారు.

### బీజేపీ ప్రయోజనాల కోసమే...

వాణిజ్య ఒప్పందం పేరుతో మోదీ సర్కారు అమెరికాకు దాసోహమన్న తీరు చాలా విషాదకరమని రాహుల్ అన్నారు. ''మోదీ కేవలం తాను మాత్రమే లొంగిపోలేదు. 150 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తునే అమెరికాకు అప్పగించేశారు. అధికార బీజేపీ ఆర్థిక ఆయువుపట్లలో ఒకరిపై అమెరికాలో కేసు నడుస్తుండటమే ఇందుకు కారణం. సొంత పార్టీ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికే దేశాన్ని అగ్ర రాజ్యానికి మోదీ అమ్మకం పెట్టారు''అంటూ రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ''డిజిటల్ వాణిజ్య నిబంధనలపై నియంత్రణను కేంద్రం పూర్తిగా అమెరికాకు వదిలేసుకుంది. డేటా లోకలైజేషన్‌ను తొలగించేసింది. అమెరికా నుంచి డేటా వరదకు గేట్లెత్తేందుకు ఒప్పుకుంది. బడా టెక్ కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేలు ప్రకటించేసింది. మొదట్లో మనపై కేవలం 3 శాతంగా ఉండే అమెరికా టారిఫ్‌లు ఇప్పుడు 18 శాతానికి పెరిగాయి. అమెరికా వస్తూత్పత్తులపై భారత టారిఫ్‌లు మాత్రం 16 శాతం నుంచి ఏకాయెకి సున్నాకు పడిపోయాయి. అమెరికా దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 146 బిలియన్ డాలర్లకు పెరగనున్నాయి''అంటూ రాహుల్ మండిపడ్డారు. ''కేంద్రం మన వ్యవసాయ రంగాన్ని అమెరికాకు బార్లా తెరిచేసింది. దాంతో అక్కడి వ్యవసాయోత్పత్తులు మన మార్కెట్లను ముంచెత్తనున్నాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా మన రైతులు భారీ సంక్షోభాన్ని ఎదుర్కోనున్నారు. మోదీకి ముందు ఏ ప్రధానీ ఇలాంటి సిగ్గుచేటైన పని చేయలేదు. ఇకముందు మరే ప్రధానీ చేయబోడు''అన్నారు. అధికార పక్ష సభ్యులు పదేపదే లేచి రాహుల్ ప్రసంగానికి అడ్డుతగిలారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. చేతనైతే వాటికి రుజువులు చూపాలని సవాలు చేయగా అందుకు తాను సిద్ధమేనని రాహుల్ బదులిచ్చారు.

బుధవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్

### మేమైతే ఇలా చేసేవాళ్లం

''యుద్ధాల శకం ముగిసిందని మోదీ అంటున్నారు. కానీ నిజానికి మనమున్నదే యుద్ధాల శకంలో! ఇలాంటప్పుడు మన బలాలేమిటో అవగాహన ఉండాలి. ప్రజలే మన నిజమైన బలం''అని రాహుల్ అన్నారు. ''ఇండియా కూటమే గనుక అధికారంలో ఉంటే వాణిజ్య ఒప్పందం విషయంలో పూర్తిగా భిన్నంగా వ్యవహరించేది. డేటా మన అతి పెద్ద ఆస్తి. అది అమెరికాకు అందుబాటు ఉండాలంటే భారత్‌ను అమెరికా సేవకునిలా గాక సమాన భాగస్వామిగా పరిగణించాలని ట్రంప్‌కు కుండబద్దలు కొట్టేవాళ్లం. ఆ హోదాలోనే చర్చలు జరిపేవాళ్లం. దేశ ఇంధన భద్రతపై, మన రైతుల ప్రయోజనాలపై రాజీ పడే ప్రసక్తే లేదని, వాటిపై చర్చలకు తావు లేదని ఆయన ముఖం మీదే చెప్పేవాళ్లం. పాక్ ఆర్మీ చీఫ్‌తో ట్రంప్ అల్పాహార భేటీ వంటి ఉదంతాలపై కచ్చితంగా అభ్యంతరం వ్యక్తం చేసేవాళ్లం''అని చెప్పుకొచ్చారు.

### ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అంబానీ, పురీ

అమెరికాతో పాటు పలు దేశాల్లో సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం టేపుల్లో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ, వ్యాపారవేత్త అనిల్ అంబానీ పేర్లు కూడా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

# ‘జనగణమన’కు ముందే వందేమాతరం

- తొలగించిన 4 చరణాలతో కలిసి మొత్తం 6 చరణాలు ఆలపించాల్సిందే
- జాతీయ గీతాన్ని కించపరిస్తే మూడేళ్ల దాకా జైలుశిక్ష : కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ:** బంకించంద్ర చటర్జీ రచించిన దేశభక్తిని ఉప్పొంగించే జాతీయగేయం వందేమాతరాన్ని ఇకపై మొత్తం ఆరు చరణాలను ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించాలని కేంద్ర హోం శాఖ దేశ పౌరులకు బుధవారం సూచించింది. దశాబ్దాల క్రితం తొలగించిన 4 చరణాలతో కలిపి పూర్తిగా ఆరు చరణాలనూ పాడాల్సిందేనని స్పష్టం చేసింది. జాతీయగీతం జనగణమన కంటే ముందుగా జాతీయగేయమైన వందేమాతరంను ఆలపించాలని స్పష్టంచేసింది. ఈ మేరకు జాతీయగేయంను ఆలపించడంలో అనుసరించాల్సిన ప్రామాణిక నియమనిబంధనలను జనవరి 28వ తేదీతో రూపొందించిన ఒక ఉత్తర్వును కేంద్రం బుధవారం విడుదలచేసింది. అందులో అనుసరించాల్సిన పూర్తి ప్రొటోకాల్స్‌ను పొందుపరిచింది. ''రాష్ట్రపతి పాల్గొనే కార్యక్రమాలు, త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించే సందర్భాలు, గవర్నర్ ప్రసంగాల వంటి పలు కీలక ప్రభుత్వ కార్యక్రమాల్లో కచ్చితంగా జాతీయగేయం వందేమాతరంను మూడు నిమిషాల 10 సెకన్లలో పూర్తిగా ఆరు చరణాలను ఆలపించాలి. మృదంగనాదం మొదలైన తర్వాత వందేమాతర ఆలాపన ఆరంభంకావాలి. కొన్ని కార్యక్రమాల్లో జాతీయ గేయం, జాతీయగీతం రెండూ పాడాల్సి వస్తే తొలుత జాతీయగేయమైన వందేమాతరం ఆలపించాలి. వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ కచ్చితంగా నిలబడాలి. ఎక్కడ జాతీయగేయాన్ని ఆలపిస్తున్నా, రికార్డింగ్‌ను ప్లే చేస్తున్నా అక్కడి ప్రేక్షకులంతా నిలబడాలి. అయితే సినిమా వంటి న్యూస్‌రీల్ లేదా డాక్యుమెంటరీని ప్లే చేసేటప్పుడు జనం పెద్ద సంఖ్యలో ఉంటారు కాబట్టి హఠాత్తుగా అందరూ నిల్చుని పాడాలంటే ఎగ్జిబిషన్/సినిమా హాల్‌లో కొంత గందరగోళం తలెత్తే ఆస్కారముంది. అందుకే ఈ చోట్లలో మాత్రం నిలబడటం తప్పనిసరేం కాదు. పాఠశాలల్లో మాత్రం రోజూ దినచర్యను తప్పకుండా జాతీయగేయంతోనే ఆరంభించాలి''అని కేంద్ర హోంశాఖ తన ఉత్తర్వులో పేర్కొంది. మోదీ సర్కార్ 150వ వందేమాతర వార్షికోత్సవాలను జరుపుతున్న వేళ ఈ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

### ముద్రిత చరణాలను పంచండి

''ఆడిటోరియం వంటి ఎన్‌క్లోజర్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో జనం ఒకేసారి జాతీయగేయం పాడే సందర్భాల్లో ఒకే గొంతుకగా వందేమాతరం వినిపించేందుకు వీలుగా పబ్లిక్ అడిషన్ సిస్టమ్‌లో ప్లే చేయాలి. లేదంటే ఒక శ్రుతిలో అందరూ పాడేందుకు వీలుగా ప్రింట్ చేసిన చరణాలను అందరికీ అందజేయాలి. మంత్రులు పాల్గొనే అధికార కార్యక్రమాల్లో కుదిరితే వందేమాతరం ఆలపించొచ్చు. అన్ని పాఠశాలల్లో మాత్రం పనిదినాలను విద్యార్థులంతా కలిసి జాతీయగేయం పాడి మొదలెడితే సముచితంగా ఉంటుంది. జాతీయ గేయం, జాతీయగీతం, భరతమాత, జాతీయపతాకాలపై విద్యార్థుల్లో గౌరవం పెరిగేలా పాఠశాల యాజమాన్యాలు తగు నిర్ణయాలు తీసుకోవచ్చు''అని కేంద్రం పేర్కొంది. అయితే జాతీయ చిహ్నం, జాతీయ గేయం, జాతీయ గీతం, రాజ్యాంగాలను బహిరంగంగా కించపరిచే వాళ్లను శిక్షించేందుకు అమలుచేసే 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్స్ యాక్ట్'ను జాతీయగేయంకు ఆపాదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ఎవరైనా జాతీయగేయాన్ని కించపరిచినా, అవమానకరంగా మాట్లాడినా గరిష్టంగా మూడేళ్ల కారాగారశిక్ష పడే ఆస్కారముంది.

# అలాంటి వాడింకా పుట్టలేదు!

- రాహుల్ ‘అమ్మేశారు’విమర్శలపై రిజిజు
- విపక్ష నేతవి పచ్చి అబద్ధాలంటూ ధ్వజం
- రికార్డుల నుంచి తొలగించాలని కోరతామని వెల్లడి

కిరెణ్ రిజిజు

**న్యూఢిల్లీ:** అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి బుధవారం లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తీవ్రంగా ఖండించారు. ''భరతమాతను ఎవరూ విక్రయించలేరు. ఆ ఆలోచన కూడా ఎవరూ చేయలేరు. అలా మన దేశాన్ని అమ్మేయగల, కొనగల వాడెవడూ ఇంకా పుట్టలేదు'' అంటూ రాహుల్ వ్యాఖ్యలను సభలోనే తిప్పికొట్టారు. దేశం ఇప్పటిదాకా చూసిన అత్యంత బలమైన ప్రధాని మోదీయేనని మంత్రి పేర్కొన్నారు. నిండు సభలో అబద్ధాలు చెప్పడం, వాటిపై సంబంధిత మంత్రి సమాధానం కూడా వినకుండా నిష్క్రమించడం రాహుల్‌కు అలవాటేనని మంత్రి ఎద్దేవా చేశారు. ''రాహుల్ ఏ ప్రపంచంలో విహరిస్తుంటారో తెలియదు! విపక్ష నేతకు ఉండాల్సిన సీరియస్‌నెస్ ఆయనలో ఇసుమంతైనా లేదు. బడ్జెట్‌పై చర్చకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బదులిస్తున్నప్పుడు సభలో ఉండాల్సిందిగా సూచించినా ఆగకుండా వెళ్లిపోయారు. ఒక సభ్యుడు తన ప్రసంగం పూర్తవగానే సభ నుంచి నిష్క్రమించడం నిబంధనలకు విరుద్ధం''అని దుయ్యబట్టారు. అనంతరం పార్లమెంటు ప్రాంగణంలో రిజిజు మీడియాతో కూడా మాట్లాడారు. విపక్ష నేత ప్రసంగం పూర్తిగా అబద్ధాలమయమంటూ దుయ్యబట్టారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిందిగా స్పీకర్‌ను కోరతామని పేర్కొన్నారు. అంతేగాక సభలో చేసిన వ్యాఖ్యలను రాహుల్ ధ్రువీకరించాలంటూ నోటీసిస్తామని కూడా చెప్పారు. ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకంలోని అంశాలను సభలో ప్రస్తావిస్తానని రాహుల్ పట్టుబట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. ''ప్రధాని, రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్ నడుమ జరిగే సంభాషణలను బహిరంగంగా చర్చించడం నిషిద్ధం. అలా చేస్తే దేశ భద్రత పరిస్థితేమిటి? ఇలాంటి సున్నితమైన అంశంపై రాహుల్ చిన్నపిల్లాడిలా ప్రవర్తించారు. దాన్ని రాజకీయ మైలేజీ కోసం వాడుకోజూశారు. దీన్ని తేలికగా తీసుకోవడానికి వీల్లేదు. తాను ఎంపీనని, దేశ ప్రజల పట్ల తనకు నిర్దిష్ట బాధ్యతలున్నాయని ఆయన గుర్తుంచుకుంటే మంచిది''అన్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకుందని రిజిజు మండిపడ్డారు.

### స్పీకర్‌తో దుర్భాషలు

20 నుంచి 25 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాను ఆయన చాంబర్లోనే తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారని రిజిజు ఆరోపించారు. కె.సి.వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ వాద్రా వంటి సీనియర్ నేతలు వాళ్లను వారించకపోగా మరింతగా ప్రోత్సహించారని ఆక్షేపించారు. ''ఆ సమయంలో నేనూ అక్కడే ఉన్నా. బిర్లాపై కాంగ్రెస్ ఎంపీలు ఎలాంటి దారుణమైన పదాలు వాడారో చెప్పలేను! దాంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సహృదయుడు కాబట్టి ఊరుకున్నారు గానీ లేదంటే వారిపై కఠిన చర్య తీసుకునేవారే''అని చెప్పారు.

# దేశాన్ని అమ్మింది కాంగ్రెసే

రాహుల్ వ్యాఖ్యలపై నిర్మల ధ్వజం • బడ్జెట్‌పై చర్చకు మంత్రి సమాధానం

నిర్మల

**న్యూఢిల్లీ:** వాణిజ్య ఒప్పందం పేరిట దేశాన్ని మోదీ సర్కారు అమెరికాకు అమ్మేసిందన్న విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. ''దేశ ప్రయోజనాలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వంటి అంతర్జాతీయ సంస్థలకు తాకట్టు పెట్టింది కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వమే. పేదలు, రైతుల ప్రయోజనాలను వాటికి అమ్మేసింది. ఏకంగా దేశాన్నే అమ్మేసింది''అంటూ దుయ్యబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉండగా షెర్మెల్ షేక్ చర్చల సందర్భంగా దేశాన్ని దాయాది పాకిస్తాన్‌కు తనఖా పెట్టిన, ఏకంగా మన సార్వభౌమత్వం విషయంలో రాజీ పడ్డ చరిత్ర కూడా కాంగ్రెస్‌దేనని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ 2026–27పై లోక్‌సభలో జరిగిన చర్చకు నిర్మల బుధవారం సాయంత్రం బదులిచ్చారు. మన దేశాన్ని అమ్మగల, కొనగల వాడెవరూ పుట్టలేదంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను ఆమె పునరుద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ అలాంటి పని ఎప్పటికీ చేయబోరని స్పష్టం చేశారు. ఇంధన, ఆర్థిక, ఆహార, డేటా భద్రత తదితరాలపై రాహుల్ లేవనెత్తిన ఆందోళనలను కొట్టిపారేశారు. ఆ విషయాల్లో అవసరమైన అన్ని చర్యలూ కేంద్రం తీసుకుందని, బడ్జెట్‌లో వాటికి చాలినన్ని నిధులు కేటాయించిందని చెప్పారు. సంబంధిత గణాంకాలను సభకు చదివి వినిపించారు. రాహుల్ అసలు బడ్జెట్‌నే చదవకుండా నిరాధార ఆరోపణలకు దిగారని మండిపడ్డారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేసినట్టు నిర్మల సభకు తెలిపారు. ''మా ప్రభుత్వం కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 4.3 శాతానికి పరిమితం కావచ్చు''అని అంచనా వేశారు. దేశంలో ఎరువుల కొరత ఉందన్న వార్తలను కొట్టిపారేశారు. వాటి దిగుమతికి బడ్జెట్లో ఏకంగా రూ.1.71 లక్షల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు.

### బెంగాల్లో బాంబుల రాజ్యం!

కేంద్ర బడ్జెట్లో పశ్చిమబెంగాల్‌కు కేటాయింపులే లేవన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను నిర్మల తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ ఏలుబడిలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా మంటగలిశాయంటూ మమతా బెనర్జీ సర్కారు పనితీరును దుయ్యబట్టారు. బెంగాల్లో ఎక్కడ చూసినా బాంబుల సంస్కృతే రాజ్యమేలుతోందని ఆరోపించారు. 'బెంగాల్లో బాంబులే మాట్లాడతాయి, చట్టాలు కాదు'అంటూ పలు ఉదంతాలను ఉటంకించారు. దాంతో విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పాలు, స్టేషనరీ, విద్యపై జీఎస్టీ వసూలు చేస్తున్నారన్న తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలను నిర్మల తీవ్రంగా ఖండించారు. ''వాస్తవాలను ఆయన ఉద్దేశపూర్వకంగా పూర్తిగా వక్రీకరించారు. పెన్సిళ్లు, షార్పనర్లపైనా జీఎస్టీ వేశామట! మరీ ఈ స్థాయిలో అబద్ధాలా? 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన నాటి నుంచీ పాలపై ఎన్నడూ జీఎస్టీ విధించలేదు. చావుపైనా జీఎస్టీ వేశారని పచ్చి అబద్ధాలు చెప్పారు. అంతిమక్రియలపై కూడా ఎప్పుడూ జీఎస్టీ లేదు. వింటున్న సభ్యులకు తెలివి లేదని అభిషేక్ భావిస్తున్నారా?''అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. బహుశా పశ్చిమబెంగాల్లో నడుస్తున్న సిండికేట్ మరణాలపైనా పన్నులు వసూలు చేస్తోందేమో అంటూ అధికార తృణమూల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. అన్యాయానికి గురయ్యామంటూ సానుభూతి కార్డు వాడటం, ప్రతిదానికీ సుప్రీంకోర్టు దగ్గరికి పరుగెత్తడం, చివరికి కోర్టుతో చీవాట్లు తినడం తృణమూల్‌కు అలవాటుగా మారిందన్నారు.

# విపక్షాల నోటీసులో లోపాలు

- సరిచేసి సభ ముందుంచండి
- లోక్‌సభ సెక్రటేరియట్‌కు స్పీకర్ ఓం బిర్లా ఆదేశం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించాలంటూ విపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులో పలు తప్పిదాలున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ''గత వారం రోజులుగా సభలో జరిగిన ఉదంతాలను నోటీసులో నాలుగుసార్లు పేర్కొన్నారు. ఈ కారణంగా నిజానికి అది తిరస్కరణకు గురయ్యేదే. కానీ అలా చేయొద్దని, నోటీసులోని లోపాలను వెంటనే సరిచేయాలని లోక్‌సభ సెక్రటేరియట్‌ను బిర్లా ఆదేశించారు. తద్వారా అది వీలైనంత త్వరగా సభ ముందుకొచ్చేలా చూడాలని సూచించారు''అని వెల్లడించాయి. నోటీసు సవరణ అనంతరం నిబంధనలకు అనుగుణంగా దాని పరిశీలన వేగంగా జరుగుతుందని తెలిపాయి. బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి విపక్షాలు మంగళవారం నోటీసివ్వడం తెలిసిందే. కాంగ్రెస్‌తో పాటు డీఎంకే, సమాజ్‌వాదీ, వామపక్షాలు తదితర పార్టీలకు చెందిన 118 మంది ఎంపీలు దానిపై సంతకం చేశారు.

# ‘తృణధాన్యాలు’ తొలగింపు

- మధ్యంతర ఒప్పందంపై సవరించిన జాబితా విడుదల చేసిన అమెరికా
- వాటిపై భారత్‌లో టారిఫ్‌ల రద్దు లేదా తగ్గింపు ఉండబోదని వెల్లడి

**న్యూయార్క్:** అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని, అదే సమయంలో మన రైతుల ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. భారత రైతాంగానికి నష్టం కలిగించే నిర్ణయాలు ఉండబోవని హామీ ఇస్తోంది. ఉభయతారకంగా ఉండే ఒప్పందానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొంటోంది. ఇటీవల ఇరుదేశాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీనిపై అమెరికా ప్రభుత్వం సోమవారం ఫ్యాక్ట్‌షీట్ విడుదల చేసింది. అమెరికాకు సంబంధించిన ఏయే వస్తువులు, ఉత్పత్తులపై భారత్‌లో టారిఫ్‌లు రద్దు కావడం లేదా తగ్గించడం జరుగుతుందో వెల్లడించింది. అయితే, మరుసటి రోజే ఈ ఫ్యాక్ట్‌షీట్‌లో సవరణ చేసి, మంగళవారం మరోసారి విడుదల చేయడం గమనార్హం. సవరించిన జాబితాలో 'కొన్ని రకాల తృణధాన్యాలు'అనే పదాన్ని ట్రంప్ సర్కార్ తొలగించింది. అంటే అమెరికా నుంచి భారత్‌కు ఎగుమతి చేసే తృణధాన్యాలపై సుంకాలు రద్దు చేయడం లేదా తగ్గించడం ఉండబోదని తేల్చిచెప్పింది. ఇలా ఫ్యాక్ట్‌షీట్‌ను సవరించడం వెనుక ఏం జరిగిందన్నది తెలియరాలేదు. తొలుత విడుదల చేసిన జాబితాలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన నిబంధనలు ప్రస్తావించారు. అమెరికా పారిశ్రామిక వస్తువులు, సరుకులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తొలగించడానికి లేదా తగ్గించడానికి భారత్ అంగీకరించిందని పేర్కొన్నారు. ఇందులో మద్యం తయారీకి ఉపయోగించే ధాన్యాలు, ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా లేదా శుద్ధి చేసిన పండ్లు, కొన్ని రకాల తృణధాన్యాలు, సోయాబీన్ ఆయిల్, వైన్, స్పిరిట్స్‌తో పాటు అదనపు ఉత్పత్తులు ఉన్నట్లు జాబితాలో పొందుపర్చారు. 500 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఇంధన, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ, వ్యవసాయ, బొగ్గుతోపాటు ఇతర ఉత్పత్తులను అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయబోతోందని తెలియజేశారు. సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను గమనిస్తే.. ఇందులో కొన్ని రకాల తృణధాన్యాలు అనే పదాన్ని తొలగించారు. అలాగే 'అమెరికా వస్తువులు, ఉత్పత్తులు కొనడానికి భారత్ కట్టుబడి ఉంది'అనే వ్యాక్యంలో కట్టుబడి అనే పదాన్ని తొలగించారు. 'కొనాలని భావిస్తోంది'అని చేర్చారు. నిజానికి గతవారం మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన తర్వాత భారత్, అమెరికాలు విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో 'తృణధాన్యాలు'అనే ప్రస్తావన లేదు. అమెరికా ప్రభుత్వం తమ ఫ్యాక్ట్‌షీట్‌లో ఈ పదాన్ని చేర్చి, ఒక్కరోజులోనే తొలగించడం గమనార్హం. అమెరికా నుంచి తృణధాన్యాలను దిగుమతి చేసుకొంటే భారత రైతులు నష్టపోతారన్న వాదన వినిపిస్తోంది.

# కెనడా పాఠశాలలో కాల్పుల మోత

కాల్పులు జరిగిన పాఠశాల

- ఆగంతకురాలి కాల్పుల్లో 10 మంది దుర్మరణం
- 27 మందికి గాయాలు
- తర్వాత ఆత్మహత్యకు పాల్పడిన ఆగంతకురాలు
- బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలో ఘటన

**వాంకోవర్:** ప్రశాంత కెనడాలో కాల్పుల మోత మోగింది. బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలోని టుంబ్లర్ రిడ్జ్ కొండ ప్రాంత పట్టణంలోని టుంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో ఓ ఆగంతకురాలు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో పది మంది ప్రాణాలు కోల్పోయారు. 27 మంది గాయాలపాలయ్యారు. రక్తమోడుతున్న ఇద్దరిని అధికారులు హుటాహుటిన హెలికాప్టర్‌లో సమీప ఆస్పత్రికి తరలించారు. సమీప ఇంట్లో రెండు మృతదేహాలను అధికారులు గుర్తించారు.

### వినబడగానే వణికిపోయాం..

''కాల్పుల శబ్దాలు రాగానే అంతా వణికిపోయాం. స్కూల్‌లో లాక్‌డౌన్ ప్రకటిస్తున్నాం. పిల్లలంతా వెంటనే మీ క్లాస్‌రూమ్‌ను లోపలి నుంచి గడియపెట్టండి అని లౌడ్‌స్పీకర్లలో అనౌన్స్‌మెంట్ వినపడింది. వెంటనే మా తరగతి గది తలుపులు మూసేశాం. వాటిని బద్దలుకొట్టకుండా అడ్డుగా టేబుళ్లను పేర్చాం. వాటిని అలాగే రెండు గంటలపాటు అదిమిపట్టాం. పోలీసులు వచ్చాకే మా ప్రాణం లేచొచ్చింది''అని పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న డేరియన్ క్విస్ట్ చెప్పాడు. ''మా స్కూల్ ప్రిన్సిపల్ లాక్‌డౌన్ అని అరుస్తూ కన్పించారు. వెంటనే విద్యార్థులతోపాటు తరగతి గదిలోకి పరుగెత్తి లోపలి నుంచి గడియ బిగించాం. అడ్డుగా బెంచీలను అడ్డుపెట్టాం. అలా రెండు గంటలు ఉండిపోయాం. కాల్పుల శబ్దాలు మా చెవుల్లో మార్మోగుతున్నాయి. ఈ దెబ్బకు చిన్నారులు మళ్లీ పాఠశాలకు అడుగుపెట్టడం కష్టమే''అని మెకానికల్ సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు జార్బాస్ నోరోన్హా చెప్పారు. పాతాల ప్రతిధ్వనులు మినహా కాల్పుల మోతలు అస్సలు వినబడని కెనడా పాఠశాలల్లో ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.20 గంటలకు ఈ ఘటన జరిగింది. కాల్పులు మొదలుకాగానే పోలీసులకు సమాచారం వెళ్లింది. వాళ్లు కేవలం రెండు నిమిషాల్లోనే స్కూల్‌కు వచ్చారు''అని బ్రిటిష్ కొలంబియా ప్రజా భద్రతా మంత్రి, సొలిసిటర్ జనరల్ నైనా క్రీగర్ వెల్లడించారు. పోలీసులు వచ్చేలోపే ఆగంతకురాలు తనను తాను తీవ్రంగా గాయపర్చుకుని చనిపోయింది. ఆమె మృతదేహాన్ని పాఠశాలలో పోలీసులు గుర్తించారు. ఆగంతకురాలి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. దాడికి కారణాలను త్వరలోనే వెల్లడిస్తామని ది రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ సూపరింటెండెంట్ కెన్ ఫ్లాయిడ్ చెప్పారు. 'బ్రౌన్ రంగు జుట్టు ఉన్న సాయుధురాలు''అని మాత్రమే పేర్కొన్నారు. స్కూల్‌కు ఆమెకు ఉన్న సంబంధం ఏంటనేది తెలియరాలేదు. ఘటన జరిగిన పాఠశాలలో ఏడో తరగతి నుంచి 12వ తరగతి వరకు మొత్తం 175 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుస్తోంది. టుంబ్లర్ రిడ్జ్ జనాభా 2,700 మాత్రమే. సమీప బొగ్గు పరిశ్రమకు సహాయకంగా 1981లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పట్టణాన్ని నిర్మించింది.

# నేడే బంగ్లాదేశ్ ఎన్నికలు

- పది లక్షల మందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు
- ఎన్నికలతోపాటు సంస్కరణలపై ప్రజాభిప్రాయ సేకరణ
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 12.77 కోట్ల మంది ఓటర్లు

**ఢాకా:** కల్లోల బంగ్లాదేశ్‌లో అత్యంత కీలకమైన పార్లమెంట్ ఎన్నికలు గురువారం జరగబోతున్నాయి. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. దేశ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి దాదాపు పది లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరిస్తున్నారు. దేశంలో ఇటీవలి కాలంలో హిందువులపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. పలువురు హత్యకు గురయ్యారు. అందుకే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత 18 నెలలుగా మొహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం కొనసాగుతోంది. దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు కావాలని బంగ్లాదేశ్ ప్రజలతోపాటు ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికలను ఆసక్తిగా గమనిస్తున్నాయి. గురువారం 13వ పార్లమెంటరీ ఎన్నికలతోపాటు 84 సూత్రాల సంస్కరణ ప్యాకేజీపై ప్రజాభిప్రాయ సేకరణ(రిఫరెండం) కూడా జరుగబోతోంది.

### విదేశీ పరిశీలకులు, మీడియా ప్రతినిధులు

ఈ ఎన్నికల్లో ప్రధానంగా బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ), ఒకప్పటి దాని మిత్రపక్షం జమాత్–ఇ–ఇస్లామీ మధ్య పోటీ నెలకొంది. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా మొహమ్మద్ యూనస్ మధ్యంతర ప్రభుత్వం గత ఏడాది నిషేధం విధించింది. దాంతో ఈ ఎన్నికల్లో అవామీ లీగ్ పోటీలో లేకుండాపోయింది. మొత్తం 300 పార్లమెంటరీ నియోజకవర్గాలకు గాను 299 నియోజకవర్గాల్లో ఉదయం 7.30 గంటలకు బ్యాలెట్ విధానంలో పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4.30 గంటల దాకా కొనసాగుతుంది. ఒక నియోజకవర్గంలో అభ్యర్థి మృతిచెందడంలో అక్కడ ఎన్నికలు రద్దుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 రాజకీయ పార్టీల నుంచి 1,755 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. అలాగే 273 మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటీ చేస్తున్నారు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ 291 మందిని బరిలోకి దించింది. వీరిలో 83 మంది మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 42,659 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 12.77 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3.58 శాతం మంది తొలిసారి ఓటర్లుగా నమోదైనవారే కావడం విశేషం. విదేశాల్లో ఉన్న 8 లక్షల మంది ప్రవాస బంగ్లాదేశీయులు కూడా ఓటు హక్కు వినియోగించుకోబోతోన్నారు. వారికోసం ఐటీ ఆధారిత పోస్టల్ బ్యాలెట్ విధానం తీసుకొచ్చారు.

ఢాకాలో మెట్రో పిల్లర్లపై 2024 నాటి ఆందోళనల తాలూకు ప్రచార పోస్టర్లు

### బీఎన్‌పీకి విజయావకాశాలు!

బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో మొత్తం 350 స్థానాలున్నాయి. ఇందులో 300 స్థానాలకు ప్రత్యక్షంగా ఎన్నికలు జరుగుతాయి. మిగతా 50 స్థానాలను మహిళలకు రిజర్వ్ చేశారు. పార్లమెంట్ పదవీ కాలం ఐదేళ్లు. ఈ ఎన్నికలను రాజకీయ సంస్కరణలకు రిఫరెండంగా భావిస్తున్నారు. అవామీ లీగ్ పోటీలో లేకపోవడం బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీకి అనుకూలంగా మారింది. పోటీలో ఉన్న అతిపెద్ద పార్టీ అదొక్కటే కావడం గమనార్హం. దివంగత ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. ఎన్నికల్లో ఆ పార్టీ గెలిస్తే ఆయన ప్రభుత్వ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది. బీఎన్‌పీకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## సూరేపల్లి తిరుణాళ్ల ప్రభ

భట్టిప్రోలు: సూరేపల్లిలోని కేదారేశ్వర వాయులింగ ఆలయం తరపున మహాశివ రాత్రి రోజు శివపార్వతుల కల్యాణం తిరుణాళ్ల ప్రభ ఊరేగింపు నిర్వహిస్తారు.



## నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5,000, గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.6,000 వరకు పలికింది.

## సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ మట్టం బుధవారం 537.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 29,019 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

# అన్నదాతపై అశనిపాతం

- ఆల్మట్టి ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం సన్నాహాలు
- కృష్ణానది చివరి ఆయకట్టు కృష్ణా డెల్టా రైతులలో ఆందోళన

ఆల్మట్టి డ్యాం

**తెనాలి:** ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుపై కర్ణాటక ప్రభుత్వం దూకుడు, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా కృష్ణానదికి చివరనున్న కృష్ణాడెల్టా రైతులకు పిడుగుపాటుగా మారనుంది. గతంలోనే ఆ డ్యామ్ ఎత్తు పెంచటం, తెలంగాణ విభజనతో డెల్టాలో సాగునీటికి ఏటా సమస్య అనివార్యమైంది. మళ్లీ ఇప్పుడు మరింత ఎత్తు పెంచేందుకు కర్ణాటక చర్యలకు ఉపక్రమించటం రైతులను తీవ్ర ఆందోళన పరుస్తోంది. అదే జరిగితే డెల్టా రైతులు వరుణుడి కరుణ మీదనో, పొరుగు రాష్ట్రాల దయాదాక్షిణ్యాలపైనో ఆధారపడాల్సి వస్తుంది.

- కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుదలకు రూ.87,818 కోట్లతో భూసేకరణ, పునరావాస కల్పనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకప్పుడు 506.87 మీటర్ల ఎత్తుతో ఆనకట్టగా ఉండే ఆల్మట్టిని 1996 తర్వాత 519.6 మీటర్లకు పెంపుదలతో రిజర్వాయరుగా మార్చిందా ప్రభుత్వం.
- ఆ మేరకు నీటి నిల్వ సామర్థ్యం 17.82 టీఎంసీల నుంచి 129.72 టీఎంసీలకు పెరిగింది. మళ్లీ ఇప్పుడు ఆల్మట్టి ఎత్తును 524.256 మీటర్లకు పెంచి, 279.72 టీఎంసీల నిల్వకు సన్నాహాల్లో ఉంది. ఇదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ నష్టం కృష్ణా డెల్టాకేనన్నది సుస్పష్టం.
- కృష్ణా నదికి చివరి ఆయకట్టు డెల్టా ప్రాంతమే. గుంటూరు, విజయవాడ, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లోని దాదాపు 13 లక్షల ఎకరాలు కృష్ణాజలాలపై ఆధారపడి సాగవుతున్నాయి. గతంలో ఖరీఫ్ సీజనులో జూన్ ఒకటో తేదీకి వరినారు పెంచటానికి సాగునీరు ఇచ్చేవారు. జూన్ నెలాఖరుకల్లా వరినాట్లు పూర్తయి, అక్టోబరు చివరినాటికి పంట రైతు ఇంటికి వచ్చేది. దీంతో డెల్టాలో ప్రధానమైన వరి పంట నవంబరు/డిసెంబరులో వచ్చే తుపాన్ల బారిన పడకుండా ఉండేది.

### వైఎస్సార్ హయాంలో...

- రైతు బాంధవుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 2004లో అధికారంలోకి రాగానే పులిచింతల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. శ్రీశైలంకు వరద నీరు చేరటంలో జాప్యం నెలకొన్నప్పటికీ జూలై–ఆగస్టులో వస్తున్న కృష్ణాజలాల్లో 45 టీఎంసీలను పులిచింతల రిజర్వాయరులో నిల్వకు అవకాశం ఏర్పడింది. అక్టోబరు–నవంబరు నెలల్లో వరి పైరుకు సాగునీరు, దిగువ ప్రాంతాలకు తాగునీటి అవసరాలకు ఆ నీటిని వినియోగిస్తున్నారు.
- మళ్లీ ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తును 524.256 మీటర్లకు పెంపుదలకు సన్నాహాల్లో ఉండటం డెల్టా రైతులకు కలవరం కలిగించే అంశం. అదే జరిగితే ఆల్మట్టి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీల నుంచి 279.72 టీఎంసీలకు పెరుగుతుంది. అప్పుడు కృష్ణాడెల్టాలో పంటల సాగు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొంటుంది. అంతర్జాతీయ సాగునీటి, నదీజలాల హక్కుల ప్రకారం 180 టీఎంసీల నీటిని కృష్ణాడెల్టా వినియోగించుకున్న తర్వాతనే ఎగువ ప్రాంతాలు వినియోగించుకోవాలి. దీని విషయంలో ఇప్పటికే డెల్టాకు అన్యాయం జరిగింది. ఆల్మట్టి పేరుతో దెబ్బమీద దెబ్బ పడుతోంది.

- వర్షాభావ పరిస్థితులు, ఆల్మట్టి ఎత్తు పెంపుతో సహా ఎగువ రాష్ట్రాల్లో ప్రాజెక్టుల నిర్మాణంతో జూన్ నాటికి శ్రీశైలానికి చేరాల్సిన కృష్ణా వరద, ఇప్పుడు జూలై ఆఖరుకు గాని చేరడంలేదు. దీంతో డెల్టాకు నీటి సరఫరాలో ఏటా జాప్యం అనివార్యమవుతూ వస్తోంది.
- సాగునీటి సమస్యతో వరినారు పెంచి, నాట్లు వేసే పద్ధతిని డెల్టాలో చాలావరకు తగ్గించేశారు. హెచ్చు విస్తీర్ణంలో నేరుగా వరి విత్తనాలను వెదజల్లటం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. దీనివల్ల ఏటా ఖరీఫ్ సీజను ఆలస్యం కావటం, పంట చేతికొచ్చే తరుణంలో తుపాన్లకు వణికిపోవటం ఆనవాయితీగా మారింది.

### సంక్షోభంలోకి సాగు...

- ఇలాంటి నేపథ్యంలో ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.256 మీటర్ల పెంపుదల జరిగితే పంటల సాగు తీవ్ర సంక్షోభంలో పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
- 129.72 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఆల్మట్టిలో, ఎత్తును పెంచి, 279.72 టీఎంసీలను ఆల్మట్టిలో నిల్వ చేసుకుంటే దిగువకు నీరు ఎలా వస్తుందనేది అభ్యుదయ రైతుల ప్రశ్న. దీనివల్ల ఖరీఫ్ సీజనుకు మరింత జాప్యం నెలకొంటుంది. సీజను ఆలస్యమైతే దిగుబడి తగ్గటమే కాకుండా తుపాన్ల కారణంగా పంటకు గ్యారెంటీ ఉండదు. అదును దాటిపోయి రెండో పంటకు దిగుబడులు తగ్గుతాయనేది రైతుల వాదన. ఆవిధంగా డెల్టాలో ఏటా సాగుచేసే రెండు పంటలకు గండిపడి, దిగుబడులు తగ్గితే రైతుల మనుగడతోపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది.
- చాలాకాలంగా రుతుపవనాల్లో (సౌత్–వెస్ట్) నిలకడలేమి కారణంగా నాగార్జునసాగర్‌లోకి తగినంత నీరు సకాలంలో చేరటం లేదనేది తెలిసిందే. సాగర్–ప్రకాశం బ్యారేజి మధ్యగల అరగాణిలో వచ్చే నీటిలోనూ నిలకడ లేదు. బ్యారేజి వద్ద సర్‌ప్లస్, డెపిసిట్‌ల స్టేట్‌మెంట్లను 1967–68 నుంచి 1991–92 వరకు పరిశీలిస్తే సక్సెస్ అనేది 30 శాతంగానే ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం పూనుకున్నపుడు డెల్టా రైతులు ఉలిక్కిపడ్డారు.
- ఆల్మట్టి ఎత్తు 508 మీటర్లకు మించితే ప్రమాదకరమని భావించి, తమ నిరసనను తెలియజేశారు. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో 519.6 మీటర్లకు పెంచి కర్ణాటక ప్రభుత్వం సరిపెట్టింది. అంటే అప్పటికున్న నిల్వ సామర్థ్యాన్ని 17.82 టీఎంసీల నుంచి 129.72 టీఎంసీలకు పెంచుకుంది. దీంతో సాగర్‌కు, ప్రకాశం బ్యారేజికి మధ్య పులిచింతల రిజర్వాయరు ఒక్కటే తరుణోపాయంగా రైతులంతా భావించారు.

## శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా**

**గుంటూరు వెస్ట్:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాల్లో భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామిని దర్శించుకునేలా దేవదాయ అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆమె వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో చేబ్రోలులోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం, పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంతోపాటు అన్ని శివాలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చేయాలన్నారు. గత ఏడాది కంటే రెట్టింపు సంఖ్యలో భక్తులు వస్తారని భావించి ఏర్పాట్లు ఉండాలన్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్వదినం రోజు తహసీల్దార్లు, పోలీస్ అధికారులు దేవాలయాలు వద్ద అందుబాటులో ఉంటూ అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వివరించారు. తనిఖీ తర్వాతే ప్రసాదాలను పంపిణీ చేయాలని ఆదేశించారు.

## క్వారీ తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

**చేబ్రోలు:** మహాశివరాత్రి పండుగ సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వస్వామి తిరునాళ్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి అన్నారు. దేవస్థానం ప్రాంగణంలో బుధవారం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. పెద్ద పెద్ద జెయింట్ వీల్స్‌ను ఏర్పాటు చేయవద్దని సబ్ కలెక్టర్ తెలిపారు. మినరల్ వాటర్ బాటిళ్లను భక్తులకు అందజేయాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భారీ విద్యుత్ ప్రభల రాకపోకల గురించి తెలుసుకున్నారు. తెనాలి డీఎల్‌పీవో, పొన్నూరు రూరల్ సీఐ, తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### జీజీహెచ్‌లో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్‌లో ఈ సంవత్సరం హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు మెడికల్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం తెలిపారు. కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబులు పర్యవేక్షించారు. 145 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేయడం జరిగిందన్నారు. గురువారం కూడా వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్, హాజీ హసన్ బాషా పాల్గొన్నారు.

### శ్రీవారాహి దేవాలయంలో కోటి కుంకుమార్చన

**తెనాలి:** నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో వేంచేసి ఉన్న శ్రీవారాహి అమ్మవారి దేవస్థానంలో ఉచిత కోటి కుంకుమార్చన కార్యక్రమం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్, పెనుగొండ పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ పాల్గొన్నారు. ముందుగా వారాహి అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉచిత కోటి కుంకుమార్చనను మహిళలతో చేయించారు. ఈ సందర్భంగా శ్రీవారాహి అమ్మవారి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. నిర్వాహకులు చివరిగా అతిథులను సత్కరించారు.

### ఘనంగా తిరుపతమ్మ కల్యాణం

**దాచేపల్లి :** మండలంలోని సారంగపల్లి అగ్రహారంలో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కనుల పండువలా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు జానపాటి సీతారామశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం జరిపించారు. పుణ్యదంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### భృంగి వాహనంపై దర్శనమిచ్చిన మల్లేశ్వరుడు

**మంగళగిరి టౌన్:** మంగళగిరి పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు భక్తులకు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఉత్సవ కైంకర్య పరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన మాజేటి సూర్యవేణుగోపాల కృష్ణ శ్రేష్టి, కృష్ణకుమారి దంపతులు, ఎల్ కే శర్మ ఇందిరాదేవి దంపతులు వ్యవహరించారు. ఈవో గోపీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# దూర విద్యలో పరీక్షలే మిథ్య!

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్య కేంద్రం ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణ అధ్వానంగా మారింది. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి గత 20 రోజులుగా పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఘటనలే నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు గత నెల ఆఖరులో ప్రారంభమయ్యాయి. వివాదాలు కూడా మొదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షల నిర్వహణ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పరీక్షల నిర్వహణలో లోపాలు సరిదిద్దుతున్నామంటూ అధికారులు చేస్తున్న హడావుడి చూసి అందరూ విస్తుపోతున్నారు.**

- అక్రమాలకు నెలవుగా పరీక్షల నిర్వహణ తీరు
- ఆధిపత్య పోరు కారణంగా పలు వివాదాలు
- పరస్పరం కక్ష సాధించుకుంటున్న అధికారులు
- చోద్యం చూస్తున్న చంద్రబాబు సర్కారు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**ఏఎన్‌యూ(పెదకాకాని):** రాష్ట్ర వ్యాప్తంగా 114 కేంద్రాల్లో దూర విద్య పరీక్షలు జరుగుతున్నాయి. పర్యవేక్షకులను కో ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్ నియమించారు. స్క్వాడ్‌లను కూడా నియమించాల్సి ఉంది. కానీ ఉన్నతాధికారులు నియమించడం గమనార్హం. సంస్కరణల పేరుతో జరుగుతున్న పరిణామాలు ఆధిపత్య పోరును చాటుతున్నాయి. రెండవ సెమిస్టర్‌లో ఉన్నతాధికారులు ముగ్గురు సభ్యులతో ఒక స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. ఆ ఎంపిక చేసిన టీం.. పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నాయని, విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని గుర్తించింది. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఏ ఒక్క సెంటర్ నిర్వాహకుడిని కూడా బాధ్యుడిని చేసిన సంఘటనలు లేవు. ఈ వివాదాలను సాకుగా చూపిస్తూ వర్సిటీని చక్కదిద్దేందుకు ఎఫ్‌ఏసీ ఇవ్వాలని ఓ అధికారి ప్రభుత్వ పెద్దలను కలిసినట్లు సమాచారం. పరీక్ష కేంద్రాలకు వారికి పరోక్షంగా సహకారం అందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే వ్యవస్థను చక్కదిద్దవచ్చని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. తాజాగా పరీక్షల కో ఆర్డినేటర్ బుధవారం నుంచి 14 మంది మందితో 7 స్క్వాడ్‌లను ఎంపిక చేయడం అధికారుల మధ్య భేదాభిప్రాయాలను స్పష్టం చేస్తోంది. పరీక్షల పేరుతో ఆర్థికంగా లబ్ధి పొందడం కోసమే ఈ ఆరాటమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారదర్శకత పేరుతో రహస్యంగా తనిఖీ బృందాలను రాష్ట్రమంతా తిప్పుతుండగా... కొందరు అధికారులు కూడా కొన్ని సెంటర్ల నిర్వాహకులతో తెరవెనుక సంబంధాలు కలిగి ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాల నిర్వాహకులు మాత్రం వర్సిటీ అధికారుల పోరులో తమను బలి పశువులను చేస్తున్నారని వాపోతున్నారు. ఈ పరిణామాలపై విసిగిపోయిన కొందరు పరీక్ష కేంద్రాల నిర్వాహకులు... పరీక్షలకు ముందుగానే ఏ అధికారిని ఏ విధంగా కలిశామో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

**ఆ సెంటర్‌ను రద్దు చేశాం..**

పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలపై దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లును వివరణ కోరగా... 'గత నెలలో పొదిలి సెంటర్‌ను రద్దు చేశాం. ప్రస్తుతం జరుగుతున్న అవకతవకలపై ఏ సెంటర్‌పైనా చర్యలు తీసుకోలేదు. వివరాలు సేకరిస్తున్నారు. స్క్వాడ్ ఎంపిక సహజంగా కోఆర్డినేటర్ ద్వారానే జరుగుతుంది. ఉన్నతాధికారుల నిర్ణయాన్ని అనుసరించాల్సిందే' అని తెలిపారు.

**చర్యలు తీసుకుంటాం..**

దూర విద్య పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్‌ను వివరణ కోరగా... 'రెండో దశలో ముగ్గురు సభ్యులతో ఉన్నతాధికారులు ఒక స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. సమాచారం కూడా కొంతమేర గోప్యంగా ఉంచారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఆ నిర్ణయం తీసుకుని ఉంటారు. ప్రస్తుతం 14 మందితో 7 స్క్వాడ్‌లను ఎంపిక చేశా. రాష్ట్రంలోని 114 సెంటర్లను షెడ్యూల్ ప్రకారం తనిఖీలు చేయాలని కోరాం. అక్రమాలకు పాల్పడితే పరీక్ష కేంద్రాల నిర్వాహకులను బాధ్యులను చేయడంతోపాటు చూసి రాతలకు పాల్పడే విద్యార్థులపైనా చర్యలు తీసుకుంటామని' తెలిపారు.

### పట్టించుకోని పాలకులు

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలలో కొన్ని రోజులుగా ఎన్నో అక్రమాలు చోటు చేసుకుంటున్నా, ఫిర్యాదులు వచ్చినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏ అధికారి ఏ పరీక్ష కేంద్రాల్లో అక్రమాలకు సహకారం అందించారనేది గుర్తించి చర్యలు తీసుకోవడం, సంబంధిత నిర్వాహకులకు చెందిన కేంద్రాలను రద్దు చేయడం అధికారులకు పెద్ద సమస్యేమీ కాదు. కొందరు అధికారులే వర్సిటీని భ్రష్టు పట్టిస్తున్నారు. ఆధిపత్యపు పోరుపై చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మౌనంగా ఉంటున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- పెట్రోల్ సీసాతో మహిళ హల్‌చల్
- ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరిక
- వెనుదిరిగిన మున్సిపల్ అధికారులు

అధికారులతో వాగ్వివాదం చేస్తున్న క్యాంటీన్ నిర్వాహకులు

**తెనాలి అర్బన్:** తెనాలి శివాజీ చౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తృప్తి క్యాంటీన్ వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన పరదాను తొలగించేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులు, పోలీసులకు నిర్వాహకురాలు చుక్కలు చూపించింది. దానిని తొలగిస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. ఆమె కుటుంబ సభ్యులు కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ అండదండలు ఉండటంతో ఏమీ చేయలేక అధికారులు వెనుదిరిగారు. ఈ ఘటన తెనాలిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. మున్సిపల్ అధికారులు కథనం ప్రకారం... స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తృప్తి క్యాంటీన్‌లను నూతనంగా ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. దీనిలో భాగంగా తెనాలి నందులపేటకు చెందిన జాగృతి సంఘ నిర్వాహకురాలు నాగలక్ష్మి బుర్రిపాలెం రోడ్డులోని పాత రత్నటాకీసు వద్ద క్యాంటీన్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారుల అనుమతి కోరింది. ఆమెకు టీడీపీ పెద్దల అండ ఉండటంతో అక్కడ స్థలం కేటాయించారు. ఆమె ఐడీబీ బ్యాంక్‌లో రూ.13.70 లక్షల రుణాన్ని తీసుకుని కంటైనర్‌ను ఏర్పాటు చేసి, ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. తర్వాత కంటైనర్ వద్ద శాశ్వత ప్రాతిపదికన షెడ్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేసింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు కంటైనర్ వద్ద షెడ్ నిర్మించవద్దని సూచించారు. కానీ ఆమె మంగళవారం రాత్రి ఇనుప పైపులు ఏర్పాటు చేసి దానిపై పరదాలు కప్పించింది.

పెట్రోల్ సీసాతో హెచ్చరిస్తున్న నాగలక్ష్మి

### అధికారులు వెళ్లినా ప్రయోజనం శూన్యం

విషయం తెలుసుకున్న కమిషనర్ వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. వన్‌టౌన్ పోలీసుల సహకారంతో వారు అక్కడికి వెళ్లారు. దానిని తొలగించాలని, లేని పక్షంలో తాము తొలగించి నూతన రోడ్డును పగులకొట్టి ఇనుప పైప్‌లు ఏర్పాటు చేసినందుకు రూ.50 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. ఆగ్రహంతో ఆమె పెట్రోల్ సీసా తీసుకొచ్చి అధికారులను బెదిరించింది. వాటిని తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. ఆమె కుటుంబ సభ్యులు కూడా అధికారులపై దుర్భాషలాడుతూ 'మీరు ఇష్టం వచ్చింది చేసుకోండి. మా పార్టీ అధికారంలో ఉంది. మీ అంతు తేలుస్తామని' హెచ్చరించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం మిన్నకున్నారు. కమిషనర్‌తో మాట్లాడతామని క్యాంటీన్ నిర్వాహకులు చెప్పటంతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు. శాశ్వత ప్రాతిపదికన నిర్మించిన పరదాలు, పైపులు తొలగించాలని నోటీసులు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు. లేదంటే తాము తొలగిస్తామన్నారు. వ్యాపార నిమిత్తం తాత్కాలికంగా ఏదైనా ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. అక్కడికి వెళ్ళిన వారిలో ఎంఈ శ్రీకాంత్, ఏసీపీ వాణి, మెప్మా సీఎంఎం విజయ, ఏఈ సునీల్, టౌన్ ప్లానింగ్, మెప్మా, ఇంజనీరింగ్ సిబ్బందితో పాటు వన్‌టౌన్ పోలీసులు ఉన్నారు.

# ఇంజినీరింగ్ విద్యార్థిపై దాడి

### ఏడుగురు నిందితుల అరెస్ట్

భరత్‌పై దాడి చేస్తున్న విద్యార్థులు

**చేబ్రోలు:** ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటనపై బుధవారం చేబ్రోలు పోలీసులు ఏడుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన భరత్ నాగార్జున యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్నాడు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన యువజనోత్సవాలకు హాజరై తిరిగి వస్తుండగా వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీరామ్, ఆదర్శ్‌తోపాటు మరో ఏడుగురు కలిసి భరత్‌పై విచక్షణరహితంగా దాడి చేసి గాయపరిచారు. విద్యార్థి తండ్రి అరుణ్‌కుమార్ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.వీరనారాయణ కేసు నమోదు చేశారు. సంఘటనకు కారణమైన తొమ్మిదిమంది నిందితులతో ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

**సోషల్ మీడియాలో వైరల్**

గంజాయి, మద్యం మత్తులో యువకులు విచక్షణరహితంగా దాడి చేస్తున్న సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోని తోటలోకి తీసుకొని వెళ్లి విద్యార్థిపై తొమ్మిదిమంది కలిసి కొడుతున్నట్లు వీడియోలో ఉంది. పొన్నూరు, శేకూరు, తెనాలి, వినుకొండ, కొలకలూరు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కర్రలు, బెల్టుతో అతడిని తీవ్రంగా గాయపరిచారు. ముఖంపై, నడుము, కాళ్లు, చేతులు, వీపుపై దాడి చేస్తున్న సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. అపస్మారక స్థితికి చేరుకొన్న ఆ విద్యార్థి.. ప్రాణాలు కోల్పోయాడని నిందితులు భావించారు.

## మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 109,852 |
| అమ్మకాలు | 1,05,937 |
| నిల్వ | 25,636 |

**నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 13,500–23,000 |
| నంబరు–5 | 13,500–22,500 |
| 273 | 14000–23,000 |
| 341 | 14,000–26,000 |

**ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 14,000–21,000 |
| నంబరు–5 | 13,000–21,000 |
| 341 | 14,000–23,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | 13,000 – 20,000 |
| బాడిగ–355 | 14,000 – 25500 |
| దేవనూరు డీలక్స్ | 15,500 – 27,000 |
| ఆర్మూర్ | 13,000 – 18,000 |
| తాలుకాయలు | 8,000 – 12,500 |

**ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | 13,000–19,000 |
| బాడిగ – 355 | 14,000–24,00 |
| తాలు | 8,500 – 12,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

## పసుపు ధరలు

(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1304

కొమ్ములు : 870 బస్తాలు

(ధర రూ॥ల్లో)

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 11,500 | 12,791 | 12,325 |

కాయలు : 434బస్తాలు

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 11,500 | 12,791 | 12,791 |

మొత్తం అమ్మకాలు : 978 క్వింటాళ్లు

–దుగ్గిరాల

# టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది

- 2029 ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు డిపాజిట్లు కూడా రావు
- మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)/గుంటూరు ఎడ్యుకేషన్:** రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం గుంటూరు సిద్ధార్థ నగర్‌లోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పెద్దిరెడ్డి పరామర్శించారు. అంబటి సతీమణి విజయలక్ష్మి, ఆయన కుమార్తెలు మౌనిక, మనోజ్ఞతో వారి ఇంటిపై జరిగిన దాడి ఘటన గురించి ఆరా తీశారు. ఇంకా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, ఉభయగోదావరి జిల్లాల కాపు సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నిమిల్లి వెంకటరాయుడు, మాజీ డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ జ్యూడిషియల్ జడ్జి జడ శ్రావణ్‌కుమార్‌లు కూడా అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు.

■ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిపక్షంపై జరుగుతున్న దాడులన్నిటికీ లోకేశ్ కారకుడన్నారు. 2029 ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు డిపాజిట్లు రావని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కన్నెత్తి చూసేందుకు కూటమి నేతలు భయపడ్డారని చెప్పారు. అంబటి ఇంటిపై దాడికి తెగబడిన వారిపై ఎటువంటి కేసులు లేవని, ఆయనపై అక్రమంగా మోపిన 35 కేసుల్లోనూ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని వివరించారు. బీసీ నేత జోగి రమేష్ ఇంటిపై కూడా దాడి చేశారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే సమర్థత లేక ఈ విధంగా భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు.

■ మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల తిరుపతి లడ్డూలో ఏ కల్తీ లేదని, కూటమి నేతల మాటల్లో మాత్రమే కల్తీ ఉందని విమర్శించారు. అంబటి కుటుంబంపై దాడి అమానుషమన్నారు. మహిళలు ఉన్నారన్న ఆలోచన లేకుండా దాడికి దిగటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త దగ్గరుండి దాడులు చేయటం శోచనీయమన్నారు. హెరిటేజ్ పెరుగులో కల్తీ జరిగిందని నివేదిక వచ్చిందని, ఏడుకొండల వెంకన్నతో పెట్టుకుంటే కర్మ రిటర్న్ అవ్వటం తథ్యమని హెచ్చరించారు. శ్రీశైలం లడ్డూలో కూడా కల్తీ జరిగిందని అంటూ కొత్త ఆరోపణలకు తెరదీస్తున్నారన్నారు.

■ ఉభయ గోదావరి జిల్లాల కాపు సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నిమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ కాపులంటే తొలి నుంచి తెలుగుదేశం పార్టీకి గిట్టదన్నారు. మహిళలు ఉన్నారని కూడా చూడకుండా అంబటి ఇంటిపై దాడి చేయడం అమానుషమన్నారు. దివంగత వంగవీటి మోహనరంగాను హత్య చేయించిన నీచుడు చంద్రబాబు అని ఆరోపించారు. సీనియర్ కాపు నేత ముద్రగడ పద్మనాభంను తెలుగుదేశం పార్టీ తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని దుయ్యబట్టారు. ఇటీవలే కాపు యువకులను టీడీపీ నేతలు కార్లతో తొక్కించి హత్యాప్రయత్నం చేసిన పరిస్థితులు చూశామన్నారు.

■ మాజీ డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ టీడీపీ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను నొక్కే కార్యక్రమంలో భాగంగానే అంబటి రాంబాబుపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని మండిపడ్డారు. ఆ ఏడుకొండల స్వామి శాపం టీడీపీ ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుందని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు.

■ కడప జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పక్కా ప్లాన్ ప్రకారం అంబటి నివాసం, కార్యాలయంపై దాడికి తెగబడ్డారన్నారు. ఆయనపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గుంటూరు వెస్ట్ టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి దగ్గరుండి దాడి చేయించారన్నారు. అంబటి కుటుంబానికి అన్ని విధాలుగా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని చెప్పారు.

■ మాజీ జ్యూడిషియల్ జడ్జి జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రశ్నించేవారి ఇళ్లపై దాడులకు చేసేందుకు రాష్ట్రంలోని ప్రజలు టీడీపీ ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది అని ప్రశ్నించారు. ప్రజాస్వామికంగా ఎమ్మెల్యేగా గెలిచిన గల్లా మాధవి టీడీపీ మేనిఫెస్టోకు, రాజ్యాంగానికి తేడా తెలియకుండా ఆమె మాట్లాడారని అన్నారు.

■ మాజీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అంబటి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిలో మనోధైర్యం నింపారు.

వీరి వెంట పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ ఉన్నారు.

## కూరగాయలు విక్రయిస్తూ పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

రేపు సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి

**కొరిటెపాడు(గుంటూరు):** దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్యామలానగర్‌లోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కూరగాయలు విక్రయిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి తమ ఆకలి తీర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన పీఏసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

– ఈ సందర్భంగా ఏపీయూసీ రాష్ట్ర నాయకుడు వెలుగూరి రాధాకృష్ణ మాట్లాడుతూ గత రెండు నెలలుగా పీఏసీఎస్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వివిధ రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.

■ శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులతో కలిసి సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయాల ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు ముమ్మా వెంకటేశ్వరరావు, టి.వెంకట రామయ్య, కె.గోవర్ధనరావు, ఆర్.రామానాయుడు, కె.సత్యనారాయణ, బి.రఘురామ్, పి.సత్యనారాయణ, ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి, ఆర్.గురవారెడ్డి, ఏ.రాధయ్య, నెల్లూరు జిల్లా పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లీడ్ బ్యాంకు మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి

**పొన్నూరు:** స్థానిక యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో పొన్నూరులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఆర్థిక సాక్షరత వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి పాల్గొని యూనియన్ బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. పొదుపు సంఘాల మహిళల కోసం అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిపాజిట్లతో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ దేవరపల్లి మణిభూషణ్, ఆర్బీఓ ప్రియదర్శిని, కమ్యూనిటీ ఆర్గనైజర్లు విశ్వనాథ్, లక్ష్మి, సుగుణ, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి

## కారులో చెలరేగిన మంటలు

**మంగళగిరి టౌన్:** కారులో మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన మంగళగిరి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు అనంతపూర్‌కు చెందిన ఆదిత్య జగ్గయ్యపేటలోని కెనరా బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నారు. గుంటూరులో ఉన్న కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో బ్యాంకుకు సంబంధించిన ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు బుధవారం తన కారులో బయలుదేరారు. తిరిగి వెళ్లే క్రమంలో తాడేపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతుండగా మంగళగిరి రత్నాల చెరువు జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి రాత్రి 7.30 గంటలు అయ్యింది. ఈ క్రమంలో కారు బానెట్‌లో నుంచి పొగలు రావడం ఆదిత్య గమనించారు. వెంటనే కారు పక్కన ఆపి కారులో నుంచి దిగారు. క్షణాల్లో కారులో మంటలు భారీగా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అప్పటికే కారు దాదాపుగా దగ్ధమైపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన చోటుచేసుకుని ఉండవచ్చని, సుమారు 4 లక్షల వరకు నష్టం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. పట్టణ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## శైవక్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** ఈనెల 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శివాలయాలు, శైవక్షేత్రాలు, తిరునాళ్ల, రథోత్సవాలు నిర్వహించే ప్రాంతాలు, పుష్కర ఘాట్లు, నదీ తీర ప్రాంతాల వద్ద భారీగా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయాలకు దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట భద్రతా ప్రణాళికను రూపొందించామని అన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగుతుందని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టామని అన్నారు. పెదకాకాని శివాలయం, వడ్లమూడి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లలో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. శివాలయాలకు వచ్చే భక్తులు పోలీస్ శాఖ సూచనలు విధిగా పాటించాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే సమీప పోలీస్ అధికారులు, సిబ్బందికి లేదా డయల్ 112 / డయల్ 100 నంబర్లకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై వడ్డీ మాఫీ

**నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్):** ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2015–16 నుంచి 2018–19 వరకు ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ పథకాల కింద స్వయం ఉపాధి పథకాల కోసం రుణాలు(లోన్లు) తీసుకున్న వారు ఈ సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీలోపు మొత్తం చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేయబడుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలియజేశారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తీసుకున్న లోన్ తాలుకా బకాయిలను ఏప్రిల్ 30వ తేది లోపు చెల్లించి వడ్డీ మాఫీ చేసుకోవాలని సూచించారు.

## క్లుప్తంగా

### హెచ్‌డీపీటీ కో ఆర్డినేటర్‌గా కృష్ణంరాజు

**నగరంపాలెం (గుంటూరువెస్ట్):** దేవదాయ ధర్మదాయ శాఖ– హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) రాష్ట్ర కో–ఆర్డినేటర్ (సాంస్కృతిక విభాగం)గా కాసుల కృష్ణంరాజు నియమితులయ్యారు. హెచ్‌డీపీటీ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు నియమాక పత్రం అందించారని కాసుల కృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ ధర్మ వ్యాప్తి కోసం హెచ్‌డీపీటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధార్మిక కార్యక్రమాలు, సమావేశాలు విజయవంతమయ్యేందుకు సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

### హాస్టల్ విద్యార్థుల కూరలో బల్లి

**నెహ్రూనగర్:** గుంటూరు నగరంలోని సాంఘిక సంక్షేమ బాలుర (ఎస్సీ) హాస్టల్‌లో విద్యార్థులకు పెట్టే చికెన్ కూరలో నల్లగా మాడిపోయి చనిపోయిన బల్లి కనిపించడంతో విద్యార్థులు హడలెత్తిపోయారు. ఎస్‌వీఎన్ కాలనీలోని ఈ హాస్టల్‌లో సుమారు 130 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. రాత్రి వేళ భోజనం వడ్డిస్తుండగా బల్లి కనిపించడంతో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. విషయాన్ని ఉన్నతాధికారులకు సిబ్బంది తెలియజేశారు. వెంటనే వైద్య సిబ్బందిని తీసుకొచ్చి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఈ పరీక్షలు కొనసాగించారు. ఎవరికీ సమస్య లేదని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులపై ఒత్తిడి పెంచవద్దు

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

**గుంటూరు వెస్ట్:** జిల్లాలో స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులపై స్థాయికి మించిన పని ఒత్తిడి వేయవద్దని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి అక్షర ఆంధ్ర, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పై ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి లేకుండా, పని వేళల్లోనే సర్వేలు నిర్వహించేలా పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే మినహా సెలవు దినాల్లోను, హార్డ్ అవర్స్‌లో పనుల నిర్వహణ పట్ల ఒత్తిడి చేయవద్దు అని సూచించారు. ఒత్తిడి లేకపోతే ప్రశాంత వాతావరణంలో నాణ్యమైన పనులు చేయగలరని చెప్పారు. స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులు అందరూ ఉన్నత విద్యావంతులని, వారికి సరైన మార్గ నిర్దేశనం చేయడంతో మంచి ఫలితాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో షేఖ్ ఖాజావలి పాల్గొన్నారు.

## మార్చి 1న ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికలు

**నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్):** గుంటూరు నగర పాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలను మార్చి 1వ తేదీన నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణ అధికారి సీహెచ్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 12న అర్హులైన ఓటర్ల జాబితాను స్టేడియంలో ఏర్పాటు చేస్తామని, 13న ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేయుట జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 10వ తేదీన నగర మేయర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో చైర్మన్, కమిషనర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి, మార్చి1 వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఎన్నికలలో 8 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని వారిలో 1 వైస్ ప్రెసిడెంట్, 1 సెక్రటరీ, 1 జాయింట్ సెక్రటరీ, 1 ట్రెజరర్, నలుగురు (2 పురుషులు+2 స్త్రీలు) ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎన్నికకు ఎలక్షన్ నిర్వహించుట జరుగుతుందన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి అవయవదానం

విజయ్‌కుమార్ (ఫైల్)

**తాడేపల్లిరూరల్:** ఖమ్మం జిల్లా మధిరకు చెందిన విజయ్‌కుమార్ (20) తాడేపల్లిలోని ఓ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య పరీక్షల అనంతరం విజయ్‌కుమార్‌కు బ్రెయిన్ డెడ్‌గా బుధవారం వైద్యులు నిర్ధారించారు. విజయ్‌కుమార్ తండ్రి సైదేశ్వరరావు, కుటుంబ సభ్యులు విజయ్‌కుమార్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ చైర్మన్ డా. కె. రాంబాబు, హాస్పిటల్ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవయవ దానం చేశారు. గుండె, కాలేయం మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, ఊపిరితిత్తులను హైదరాబాద్ కిమ్స్‌కు, కిడ్నీలకు విధాత హాస్పిటల్‌కు, కంటి కార్నియాను విజయవాడ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. విజయ్‌కుమార్ అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు మణిపాల్ హాస్పిటల్ వర్గాలు కృతజ్ఞతలు తెలిపారు.

## డాక్టర్ మేరీ గ్లోరీ సేవలు మరువలేనివి

గుంటూరు మేత్రాసనం పీఠాధిపతి చిన్నబత్తిని భాగ్యయ్య

దివ్య పూజ బలి నిర్వహణలో గుంటూరు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ చిన్నబత్తిని భాగ్యయ్య తదితరులు

**నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్):** సేవకు ప్రతిరూపంగా నిలిచే గుంటూరు సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో 36 ఏళ్లు సుదీర్ఘంగా వేలాది మంది రోగులకు చికిత్సలు చేసి, తన చేతి స్పర్శతో వారిని ఆరోగ్యవంతులుగా చేసిన దివంగత డాక్టర్ మేరీ గ్లోరీకి అత్యంత అరుదైన గౌరవం దక్కింది. ఆమెను సెయింట్‌గా గుర్తించే క్రమంలో రెండవ దశ అయిన పూజ్యనీయ (వెనరబుల్‌గా) స్థానాన్ని పొందడం గుంటూరుకే గర్వకారణమని గుంటూరు మేత్రాసనం పీఠాధిపతి చిన్నబత్తిని భాగ్యయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్ జోసెఫ్స్ పాఠశాల ఆవరణలో డాక్టర్ మేరీ గ్లోరీకి దక్కిన గౌరవ పురస్కారం సందర్భంగా జె.యం.జె. సభ ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవం నిర్వహించారు.

■ ఈ ఉత్సవ సభకు గుంటూరు విభాగం ప్రొవిన్షియల్ సుపీరియర్ రెవరెండ్ సిస్టర్ ఉడుముల విజయమేరి అధ్యక్షత వహించారు.

■ భాగ్యయ్య మాట్లాడుతూ మేరీ గ్లోరి స్వదేశమైన ఆస్ట్రేలియాను విడిచిపెట్టి, భారతదేశ ప్రజల కోసం శ్రమించిన తీరు, వినయం, నిరంతర సేవా దృక్పథం ఎందరికో ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆమె అసాధారణ సేవా జీవితాన్ని గుర్తించి రోమన్ క్యాథలిక్ శ్రీసభ, మేరీ గ్లోరీని ఒక పునీతురాలుగా ప్రకటించే నాలుగు దశలలో మొదటి దశ అయిన 'దైవ సేవకురాలు' (సర్వెంట్ ఆఫ్ గాడ్) అనే పురస్కారానికి అర్హురాలుగా 2013, మార్చి 13న గత పోప్ ఫ్రాన్సిస్ ప్రకటించారన్నారు. 2025 నవంబర్ 21న రెండో దశ పూజ్యనీయులు(వెనరబుల్) అనే గౌరవ బిరుదుకు అర్హురాలని, ప్రస్తుత 14 వ లియో పోప్ ప్రకటించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ గౌరవ పురస్కారంతో, డాక్టర్ మేరీ గ్లోరీ సెయింట్ (పునీతపట్టం)కి చాలా చేరువలో ఉన్నారని తెలుస్తోందన్నారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వెనరబుల్ మేరి గ్లోరి కుటుంబ సభ్యులు, విశాఖపట్నం ఆర్చ్ బిషప్ ఉడుమల బాల, విజయవాడ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, గుంటూరు విశ్రాంత బిషప్ గాలి బాలి, జె.ఎం.జె. సభ సుపీరియర్ జనరల్ మేరి కారి కాకున్నెల్, క్యాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మాథ్యూ అబ్రహాం, జె.ఎం.జె సభ భారతదేశ నాలుగు విభాగాల ప్రొవిన్షియల్ సుపీరియర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అమరావతిని సందర్శించిన జర్మనీ కౌన్సిల్ జనరల్ మైకేల్ హస్సర్

**అమరావతి:** ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిని జర్మనీ కౌన్సిల్ జనరల్ మైకేల్ హస్సర్ బుధవారం సందర్శించారు. తొలుత పురావస్తు మ్యూజియం, అమరావతి బౌద్ధ స్తూపాన్ని, ధ్యానబుద్ధ విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుని దర్శించుకున్నారు. తొలుత జర్మనీ కౌన్సిల్ జనరల్ మైకేల్ హస్సర్‌ను ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందించగా ఆలయ ఈవో రేఖ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంలో ఆయన వెంట జర్మన్ కౌన్సిల్ ఇండియా ప్రతినిధి సందీప్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లిఖార్జునరావు, శ్రీహర్ష, రామకృష్ణ, ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసరావు సత్తెనపల్లి అర్డీవో రమణకాంతరెడ్డి, తహసీల్దార్ డానియేలు తదితరులు ఉన్నారు.

## ఈ నెల 17, 22 తేదీల్లో శాప్ లీగ్స్ క్రీడా పోటీలు

**గుంటూరు వెస్ట్(క్రీడలు):** శాప్ ఆదేశాల మేరకు 31 క్రీడాంశాల్లో శాప్ లీగ్స్ పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా 17వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్–13, 15, 17, 19 బాల బాలికలు, యువతీ యువకుల చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేసి ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు పంపిస్తామన్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్–18 యువతీ యువకుల జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు పంపిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు శాప్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు స్కేటింగ్ కోచ్ షేక్ అబ్దుల్ సలామ్ 94934 47566, సైక్లింగ్ కోచ్ కనకరావు సెల్ నెంబర్ 63011 77119ను సంప్రదించాలని కోరారు.

భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల శాఖ
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
# 31–31–21, నారాయణ భవనం, సాయిబాబా స్ట్రీట్, దాబా గార్డెన్స్, విశాఖపట్నం–530 020.
ఫోన్ నం. 0891–2957044, ఇ–మెయిల్: ro1.drt_vskp@outlook.com

O.A No. 607/2022 లో RP No. 471/2024

వాదనదారి మధ్య: పంజాబ్ నేషనల్ బ్యాంక్, సర్కిల్ శాస్త్ర సెంటర్, గవర్నర్‌పేట బ్రాంచ్, విజయవాడ, కృష్ణా జిల్లా. ...CHR/అప్లికెంట్

మరియు

M/s శ్రీ సూర్య కాటన్ ట్రేడర్స్ మరియు ఇతరులు ...CDRలు/ప్రతివాదులు

విషయం: వేలం అమ్మకం యొక్క వాయిదా

పై రికవరీ ప్రొసీడింగ్స్‌లో జారీ చేయబడిన అమ్మకం ప్రకటన/ఇ–వేలం అమ్మకం ప్రకటన, తేది: 22–12–2025 (వెబ్‌సైట్ https://www.bankeauctions.comపై పోస్ట్ చేయబడినది) ద్వారా కవర్ చేయబడిన ఆస్తులకు సంబంధించి 13–02–2026న నిర్వహించుటకు షెడ్యూల్ చేయబడిన ఆన్‌లైన్ ఇ–వేలం అమ్మకం CH బ్యాంక్ యొక్క అభ్యర్థన మేరకు 06–03–2026కు ఇందుమూలంగా వాయిదా వేయబడినదని సంబంధితులు అందరికీ తెలియజేయడమైనది. వారు బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ https://www.bankeauctions.comలో తమ పార్టిసిపేషన్‌ను నమోదు చేసుకోవాలి మరియు 22–12–2025 తేదీ గల ఇ–వేలం అమ్మకం ప్రకటనలో తెలిపిన విధంగా అకౌంట్ నం./ బ్రాంచ్ మొ॥ వాటికి RTGS ద్వారా EMD ను 04–03–2026 (సా.4.00 గం.)న లేదా అలోగా డిపాజిట్ చేసి ఆన్‌లైన్‌లో తమ బిడ్ ఫారాలను దాఖలు చేయవలెను మరియు వాటి హార్డ్ కాపీని 05–03–2026, సా.4.00 గం.లోగా పైన విధంగా కింది సంతకందారుకు పంపవలెను. 22–12–2025 తేదీ గల ఇ–వేలం అమ్మకం ప్రకటనలో తెలిపిన అన్ని ఇతర నియమ నిబంధనలలో ఎటువంటి మార్పులు లేవు.
(నాచే స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ సీల్‌తో విశాఖపట్నం వద్ద 11 ఫిబ్రవరి, 2026న ఇవ్వబడింది)

రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

**BABY CARE CENTER**

■ సంతోష్ బేబీకేర్ సెంటర్ 4 నెలల నుండి 4 సం॥ వరకు మీ పాప/ బాబులను జాగ్రత్తగా చూడబడును. 2వ లైను అంకమ్మనగర్, గుంటూరు. 8686209090, 8686309090

**BUSINESS OFFER**

■ ITR/ Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి. 7406393937.

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం ✆ 83338 33368

**WANTED**

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ ప్రముఖ విద్యాసంస్థ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్, కం లేడీ టెలికాలర్ కావలెను. మంచిజీతం, బ్రాడీపేట, 2/11 గుంటూరు. ఫోన్: 8008145999

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/– నుండి 15000/– వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 40 సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33371

■ గుంటూరులో డయాగ్నొస్టిక్ డిస్ట్రిబ్యూటర్ నందు పనిచేయుటకు డెలివరీ బాయ్ కావలెను. లోకల్‌వారు. సంప్రదించండి. ఫోన్ ✆ 8019941166

■ ఓల్డ్ క్లబ్ రోడ్‌లో ఆపిల్ డెంటల్‌లో పని చేయుటకు Chair Side Assistant కావలెను. వయస్సు: 18–30సం॥, గుంటూరు లోకల్ వారికి మాత్రమే. సంప్ర॥ 6302243437

■ నరసరావుపేట దగ్గర ప్రముఖ ఆక్వా కంపెనీలో పనిచేయుటకు బాయిలర్ ఆపరేటర్ కావలెను. ITI / డిప్లొమా ఎలక్ట్రికల్ క్వాలిఫికేషన్ కలిగిన యువకులు కావలెను బయోడేటా పంపవలసిన mail.id admin@valvin.in సంప్రదించండి: ✆ 9618157339 /96639 09856 / 9441484802

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665

■ ప్రముఖ స్కూల్స్ లో డేటా ఎంట్రీ & అటెండర్స్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను Contact ✆ 8143807128/ 9030928103

■ గుంటూరు వాసవి కాంప్లెక్స్ ఎదురు ఆఫీసు నందు పనిచేయుటకు లేడీ వర్కర్స్ మరియు బాయ్స్ కావలెను. వ. 25 సం॥ ఆకర్షణీయమైన జీతం. Ph: 99899 29196

■ MNC కంపెనీల్లో రిసెప్షనిస్ట్, టెలికాలర్స్ కం ఆపరేటర్స్, సూపర్వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ బాయ్స్, హెల్పర్స్ Q: 10th-PG, జీ: 10-25 వేలు. ✆ 79939 76590

■ Technical Skills Nerchukoni Job Lo Set Avvali Anukone Vallaku Sadavakasam. Training Period 1 Month if you are Ready to Join Job After Course. No Iterview. More details Contact: 8712625322, in between 8 AM to 9 AM Limited Seats Only.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాకేజీ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

సాక్షి

## క్లుప్తంగా

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

**తాడేపల్లి రూరల్:** వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ.. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ వారితో తయారు చేసిన మెటీరియల్‌ను పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 108 మంది విద్యార్థులకు సుమారు రూ.7,500 విలువైన ఈ పుస్తకాలను తన సొంత నిధులతో ఉచితంగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సస్యరక్షణతో చీడపీడల నివారణ

**ఫిరంగిపురం:** సమగ్ర సస్యరక్షణతోనే చీడపీడల నివారణ సాధ్యమవుతుందని ఏవో వాసంతి అన్నారు. మండలంలోని శిరంగిపాలెంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు రెగ్యులర్ సహాయ వ్యవసాయ సంచాలకులు మోహనరావు మాట్లాడుతూ పొలంబడిలో ఎంపిక చేసిన 30 మంది రైతులకు విత్తన శుద్ధి, చీడపీడల నివారణ వంటి నూతన విధానాలు వరిలో అవలంబించి వాటిలో 14 రోజులుగా రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకూ వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే విశిష్ట నంబర్ వ్యవసాయ సేవలకు ముఖ్యమని పేర్కొన్నారు. రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను కలిసి విశిష్ట నంబర్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్ సుబాని, షేక్.గౌస్ ఎస్‌కే హకీం, రైతులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో వైద్యుడు మృతి

డాక్టర్ అన్నే సూర్యాజీరావు

**మంగళగిరి టౌన్:** పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ అన్నే సూర్యాజీరావు బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఆకస్మిక మరణం మంగళగిరి పట్టణాన్ని విషాదంలో ముంచింది. వైద్యసేవల ద్వారా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న ఆయన నిరుపేదలకు సేవ చేయడంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. డాక్టర్ సూర్యాజీరావు మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యవర్గ ప్రముఖులు, సామాజిక నాయకులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. పట్టణంతో పాటు మంగళగిరి పరిసర ప్రాంతాల ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మృతి వైద్యరంగానికి తీరని లోటుగా పలువురు అభిప్రాయపడ్డారు. సూర్యాజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

### మాజీ ఎంపీటీసీకి పరామర్శ

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్‌లో నివాసం ఉంటున్న మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ రెబ్బవరపు ఆదాం సోదరుడు యోహాన్ బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదాం నివాసానికి చేరుకుని యోహాన్ మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మాజీ ఎంపీటీసీ ఆదాంకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, మంగళగిరి నియోజకవర్గ మున్సిపల్ విభాగ అధ్యక్షులు చిట్టిమళ్ల సుబ్బారావు, తాడేపల్లి పట్టణ కార్యవర్గ సభ్యులు నాజర్, 9వ వార్డు అధ్యక్షులు ఆనంద్, నాయకులు నాని తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**తెనాలి:** పట్టణ అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ మున్సిపల్ హైస్కూల్‌లో త్వరలో పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పరీక్షా సామగ్రికి కావలసిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులు ఇతర సామగ్రిని అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ సమకూర్చారు.

స్కూలు ప్రధానోపాధ్యాయిని శాఖమూరి రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం హైస్కూలులో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, ఫాస్ట్ ప్రెసిడెంట్ ఈదర శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ గుమ్మడి సరోజ్‌బాబు ప్రసాద్, సెక్రటరీ ఎలెక్ట్ మల్లాది అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తుళ్లూరులో మాట్లాడుతున్న సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు రవి

చిర్రావూరులో రైతులతో మాట్లాడుతున్న శివశంకరరావు

**తాడికొండ:** గురువారం జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి పిలుపునిచ్చారు. బుధవారం తుళ్లూరు మండలం మల్కాపురంలో అసెంబ్లీ, సచివాలయ హౌస్ కీపింగ్ కార్మికులు, రాయపూడి, అనంతవరం, నెక్కల్లు, దొండపాడులలో జరిగిన పారిశుద్ధ్య కార్మికుల సమావేశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ఎన్డీఏ ప్రభుత్వం తొలగించి వాటి స్థానంలో కార్పొరేట్లకు అనుకూలంగా ఉండే లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. లేబర్ కోడ్‌లు కార్మికులకు ఉరితాళ్లుగా మారుతాయని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో తుళ్లూరులో జరిగే కార్మిక ర్యాలీలో గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, హౌస్ కీపింగ్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశాలు వీఆర్‌ఏలు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, ఆటో యూనియన్ డ్రైవర్లు, భవన కార్మికులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గ్రేస్, చిన్ని, లూర్దుమేరీ, శ్రీదేవి, బుల్లెమ్మాయి, వీర్లంకమ్మ, సుందరమ్మ, జొన్నకూటి తిరుపతమ్మ, కోటేశ్వరి, ఎం.శేషయ్య, శివకుమారి, వెంకటరమణ, దుర్గా, జోజి, హేమ తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి**

**తాడేపల్లి రూరల్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ.. కేంద్రం అధికారం చేపట్టాక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగానికి నష్టం వాటిల్లేలా చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక రంగాన్ని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడంతో కార్మికులు కుదేలయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గురువారం సార్వత్రిక సమ్మె తలపెట్టామని.. రైతులు, కౌలు రైతులు, కార్మికులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బొప్పన గోపాలరావు, మేకల సత్యనారాయణ, వీరనారాయణ, రమేష్, ఆళ్ల నాగిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పాలకులు పరిష్కరించాలి

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న నాయకులు

**తాడేపల్లి రూరల్:** ఏపీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని తాడేపల్లి సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. మండలం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని నాయకులు కూరపాటి స్టీవెన్, సాంబశివరావు, దామవరపు నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావులతో కలిసి ప్రారంభించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎం.గురవయ్య, నరసింహారావు, ఎం.ఆశీర్వాదం, సుబ్బారావు, హనుమంతరావు, ఖాసిం, బాషా, శారమ్మ, డి.నాగమల్లేశ్వరి, సూర్యప్రకాష్, లక్ష్మమ్మ, శారద, రిబ్కా, సువర్ణకుమారి, కాస్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన డయింగ్ అద్దకం శిక్షణ శిబిరం

శిక్షణకు సంబంధించిన కిట్‌ను అందజేస్తున్న అనిల్ సాహు

**మంగళగిరి టౌన్:** మంగళగిరి పట్టణ పరిధిలోని రాజీవ్ గృహకల్ప రోడ్‌లో గల రజక కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య డయింగ్ అద్దకం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ సాహు మాట్లాడుతూ.. విజయవాడ చేనేత సేవా సంఘం ద్వారా చేనేత కుటుంబంలోని చదువుకునే విద్యార్థులకు రూ.2 లక్షల వరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన డయింగ్ అద్దకం శిక్షణ శిబిరం 15 రోజులపాటు కొనసాగుతుందని.. 20 మంది చేనేత కార్మికులు శిక్షణ పొందనున్నారని అన్నారు. శిక్షణ పొందే చేనేత కార్మికులకు రోజుకు రూ.300 స్టయిఫండ్‌గా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయిప్రసాద్, వీవర్స్ సర్వీస్ సెంటర్ సూపరింటెండెంట్ ఢిల్లీబాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ గద్దె గంగాధరరావు మృతి

నివాళులర్పిస్తున్న సీపీఎం ముఖ్య నాయకులు

**దుగ్గిరాల:** వృత్తిలో నిజాయితీ, ప్రజాసేవలో చిత్తశుద్ధితో గద్దె గంగాధరరావు(96) పనిచేశారని సీపీఎం రాష్ట్ర నాయకులు పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలో గంగాధరరావు మృతిచెందగా ఆయన స్వగృహంలో ఉన్న పార్థివదేహంపై పార్టీ జెండాను ఉంచి సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. ఆయనకు సంతాపం తెలుపుతూ పలువురు నాయకులు గంగాధరరావు సేవలను కొనియాడారు. ఆయన పార్థివదేహాన్ని ఎన్నారై వైద్య కళాశాలకు అప్పగించారు. గంగాధరరావుకు భార్య లీలావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.నేతాజీ, అప్పారావు, జెట్టి బాలరాజు తదితరుల పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ క్రికెట్ జట్టుకు సత్కారం

క్రికెట్ జట్టులోని ఉపాధ్యాయులకు సత్కారం

**తెనాలి:** రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించిన గుంటూరు టైగర్స్ క్రికెట్ టీములోని ఉపాధ్యాయ సభ్యులను బుధవారం స్థానిక గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. గుంటూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన గుంటూరు టైగర్స్ జట్టు మొదటి మ్యాచ్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో కృష్ణాజిల్లా జట్టుపై విజయం సాధించి, మరుసటిరోజు ఉదయం పార్వతీపురం జట్టుపై జట్టు అనివార్య పరిస్థితుల్లో ఓటమి చవిచూసినట్టు తెలిపారు. అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయిని ఆర్ మల్లేశ్వరి మాట్లాడుతూ, వచ్చే సంవత్సరం కప్పు గెలవాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు చక్కని క్రీడాస్ఫూర్తి ప్రదర్శించిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రికెట్ జట్టులోని వైస్ కెప్టెన్ మన్నెం శ్రీనివాసరావు, సోమరౌతు శ్రీనివాసరావు,రాయన్న, నవీన్, తురిమెళ్ళ సత్యనారాయణ, కరిముల్లా, మిథున్ చక్రవర్తి, జయప్రకాష్, రామరాజు ఆంజనేయశర్మ లను సత్కరించారు.

## దీనదయాళ్ ఉపాధ్యాయ చిరస్మరణీయులు

నివాళి అర్పిస్తున్న నందకిషోర్

**తెనాలిటౌన్:** సమర్పణ దివస్ సందర్భంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 58వ పుణ్యతిది కార్యక్రమాన్ని తెనాలి రూరల్ మండలం అంగలకుదురులో బుధవారం నిర్వహించారు. బీజేపీ రూరల్ మండలం అధ్యక్షులు కడియాల నందకిషోర్ మాట్లాడుతూ, కొందరు మరణించేవరకు జీవిస్తారు, కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారని చెబుత పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందులో రెండవ కోవకు చెందినవారని చెప్పారు. వీరు ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం ద్వారా దేశంలో అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానంగా ఎంచుకుంటారని తెలిపారు.

ప్రతి మానవుడి శరీరం, మనస్సు, తెలివితేటలు, ఆత్మ ఏకకాల సమగ్ర కార్యక్రమాన్ని సూచించే సమగ్ర మానవతావాదం అనే రాజకీయ తత్వాన్ని దీన దయాళ్ ఉపాధ్యాయ రూపొందించినట్టు చెప్పారు. అదే విధంగా ఎందరో పేద మధ్య తరగతి జీవితాలు బాగుపటడమే కాకుండా ప్రతి భారతీయుని జీవితంలో వెలుగు నింపిన మహోన్నతమైన వ్యక్తి అని తెలియ చేశారు. తొలుత దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

### ఉరి వేసుకుని యువతి బలవన్మరణం

**మేడికొండూరు:** ఉరి వేసుకుని యువతి మృతిచెందిన సంఘటన మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల జంక్షన్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన కాశీ మాల మెర్సీ(18) గత కొన్ని రోజులుగా పేరేచర్ల జంక్షన్ సాయిబాబా మందిరం పక్కన ఉన్న ఒక కిరాణా దుకాణంలో పనిచేస్తోంది. ఎప్పటిలానే బుధవారం ఉదయం పనికి వచ్చిన మెర్సీ మధ్యాహ్న సమయంలో కాలకృత్యాలకు అని మరుగుదొడ్డికి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో దుకాణ యజమాని ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపులు పగులగొట్టారు. కాగా మెర్సీ తన చున్నీతో లోపల ఉరివేసుకొని ఉండటాన్ని గమనించి కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు గమనించిన యజమాని విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

**మంగళగిరి టౌన్:** పట్టణ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు బుధవారం తెలిపారు. నగర పరిధిలోని కేకే టవర్స్, ఎస్‌ఎల్‌వీ అపార్ట్‌మెంట్ ప్రాంతం, ఎన్ఎస్ఆర్ విల్లాస్ రోడ్, కొండపనేని టౌన్‌షిప్, బైపాస్ పెద్ద పెట్రోల్ బంక్ రోడ్, రత్నాలచెరువు, బైపాస్‌రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

### రేషన్ డీలర్‌పై కేసు నమోదు

**దుగ్గిరాల:** రేషన్ బియ్యం అధికంగా నిల్వ ఉన్నట్లు గుర్తించి షాపు డీలర్‌పై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పేరుకలపూడి గ్రామంలో నిర్వహించిన తనిఖీలలో పేరుకలపూడి రేషన్ షాపు నంబరు 17లో పీడీఎస్ బియ్యం 444 కిలోలు అధికంగా ఉన్నట్లు సీఎస్‌డీటీ శ్రీనివాసరావు గుర్తించారు. దీంతో డీలర్ ఆళ్ల శ్రీలతపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో వీఆర్ఓ ప్రభాకర్‌రావు, ఎంఆర్ఐ మల్లేశ్వరి పాల్గొన్నారు.

### వీనులవిందుగా యశస్వి గానం

**తెనాలి:** పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత సంస్థ శ్రీ సీతారామ గానసభ ఆధ్వర్యంలో ఇక్క డ జరుగుతున్న శాస్త్రీయ సంగీత ఉత్సవాలు రెండవ రోజైన బుధవారం కొనసాగాయి. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలోని కళావేదికపై రెండో రోజు కార్యక్రమంలో విజయవాడకు చెందిన మాస్టర్ మల్లాది శివానంద యశస్వి గాత్ర సంగీత కచేరీ వీనులవిందుగా సాగి, సంగీతాభిమానులను పరవశులను చేసింది. వీరికి వయొలిన్‌పై మల్లాది సింధు రాగేశ్వరి (విజయవాడ), మృదంగంపై మాస్టర్ కార్తిక ఆదినారాయణ శర్మ (విజయవాడ) ఎంతో దివ్యంగా సహకరించారు.

### ఘనంగా గంగానమ్మ తల్లి వార్షికోత్సవం

**తూములూరు(కొల్లిపర):** మండల పరిధిలోని తూములూరు గ్రామంలో బుధవారం గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు ఆలయ కమిటీ వారు భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున ఆలయం వద్ద కు చేరుకుని గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, మహిళలు అమ్మవారికి పసుపు,కుంకుమ,గాజులు, రవిక సమర్పించి , గ్రామాన్ని చల్లగా చూడాలని, పాడి పశువులు అభివృద్ధి చెందాలని, పంటలు బాగా పండాలి మొక్కుకుని, పూజలు నిర్వహించి తీర్ధ ప్రసా దాలు అందుకున్నారు.ఆలయ కమిటీ ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

## పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేత

పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బాలల పార్లమెంట్ చిన్నారులు

**తాడేపల్లి రూరల్:** కొలనుకొండలో గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ చిన్నారులు బుధవారం పంచాయతీ కార్యదర్శి షేక్ షబ్బీర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. బాలల పార్లమెంట్ సమావేశంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, చిన్నారులు కుక్కకాటుకు గురయ్యే ప్రమాదం ఉందని, గ్రామంలో దోమలు అధికంగా ఉన్నందున కనీసం వారానికి ఒకసారి ఫాగింగ్ చేయాలని, మురుగు కాలువల్లో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్న సమస్యలను పరిష్కరించాలని చిన్నారులు పంచాయతీ కార్యదర్శి షేక్ షబ్బీర్‌కు వినతిపత్రం అందజేశారని తెలిపారు. స్పందించిన ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడ్‌షెపర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు, మహిళా పోలీస్ జి.రాధిక, బాలల పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న నాయకులు

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్, పట్టణ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీడీపీ నాయకులు లబ్ధిదారులకు వారివారి నివాసాలకు వెళ్లి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తాడేపల్లి రూరల్ పెనుమాక గ్రామానికి చెందిన కొమ్మినేని లక్ష్మి తేజకు రూ.80 వేల ఎల్ఓసీ చెక్కు, కళ్లం, రామ్మోహనరెడ్డికి రూ.3,24,667 విలువైన చెక్కు, కొత్తూరు సెంటర్‌కు చెందిన తరిగోపుల లక్ష్మి ప్రసన్నకు రూ.2,08,488లు, మేకా సీతా మహాలక్ష్మికి రూ.1,65,000లు, మేకా వెంకట రెడ్డికి రూ.1,13,43లు, షేక్ మీరాబికి రూ.41,870లు, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గల పూజారి వెంకట నరసమ్మకు రూ.32,586లు, ఆర్‌సీఎం చర్చి వద్ద గల బచ్చులకూరి బాబూరావుకు రూ.31,365లు, కొత్తూరు సెంటర్‌కు చెందిన కేసనబోయిన కృపకు రూ.18,000ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. చెక్కుల మంజూరుకు సహకరించిన మంత్రి నారా లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెనుమాక గ్రామ పంచాయతీ మాజీ వైస్ ప్రెసిడెంట్ పఠాన్ జానీ ఖాన్, నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, కళ్లం శివగోవిందరెడ్డి, ఉయ్యూరు శ్రీనుబాబు, తెనాలి మాణిక్యం, డోలా కల్యాణ్, షేక్ అయూబ్, నాగుల్ మీరాఖాన్, వెంకటేశ్వరరావు, ఖాదర్, నరసింహారావు, శ్రీనునాయక్, రాములు నాయక్, సలాం, మునాఫ్, కొల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీనదయాల్ సేవలు ఎనలేనివి

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**ఫిరంగిపురం:** పండిట్ దీనదయాల్ సేవలు ఎనలేనివని బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ విశ్వనాథుని హరిబాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పండట్ దీనదయాల్ ఉపాధ్యాయ బలిదాన దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీనదయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేరువ లక్ష్మారెడ్డి, నేరెళ్ల శ్రీనివాసరావు, పి.శివ, మీసాల బాబు, బి.చిన్నప్ప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 'పొలం పిలుస్తోంది'లో రైతులకు అవగాహన

రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీ విజయబాబు

**దుగ్గిరాల:** మొక్కజొన్న, పెసర పంట పొలాలకు నీటి యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఇన్‌చార్జి ఏడీ ఆర్.వి జయబాబు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల కేంద్రంలోని మొక్కజొన్న, పెసర పంట పొలాలను ఆయన పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన ప్రశ్నలకు పలు సమాధానాలు తెలిపారు. రైతు సోదరులు ముఖ్యంగా యంత్ర పరికరాలను ఊబరైజేషన్ ప్రక్రియ ద్వారా మధ్యవర్తులు లేకుండా నేరుగా మొబైల్ యాప్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్స్ నుంచి డ్రోన్‌లు, ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు మొదలగు సేవలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఉద్యాన వనశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాంజలి కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

**ఎంఈవో–2 వి.జయంతిబాబు**

మాట్లాడుతున్న జయంతిబాబు

**తెనాలిఅర్బన్:** పాఠశాలల భవిష్యత్‌ను తీర్చిదిద్దటంలో సమాజం భాగస్వామ్యం కీలకమని మండల విద్యాశాఖ అధికారి–2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి హైస్కూలులో బుధవారం విద్యాంజలి 2.0 మండలస్థాయి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల అభ్యసన ఫలితాలపై కోవిడ్–19 విపరీతమైన ప్రభావం చూపిందని గుర్తుచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, అలాగే సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమనే ఉద్దేశంతో విద్యాంజలి 2.0 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విద్యాంజలి 2.0 ద్వారా పాఠశాల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పదవీ విరమణ చేసిన గొప్పగొప్ప వ్యక్తులు వారి నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యాంజలి పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే విరాళాలు డబ్బు రూపంలో ఇవ్వకుండా పాఠశాలకు సంబంధించి సామగ్రి రూపంలో కంప్యూటర్లు, పుస్తకాలు, క్రీడా పరికరాలుగా ఇవ్వవచ్చని తెలిపారు. విద్యార్థులకు అభ్యసనాన్ని మెరుగుపరచడం, విద్యార్థులకు వ్యక్తిగత ట్యూటరింగ్, కెరీర్ గైడెన్స్, మెంటరింగ్ గా సహాయ సహకారాలు అందించవచ్చున్నారు. మండల విద్యాశాఖ అధికారి–1 మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, విలువల బోధన, సృజనాత్మకత పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజం భాగస్వామ్యం అవసరమని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో విద్యాంజలి అమలు విధానం, వాలంటీర్ నమోదు ప్రక్రియ, పాఠశాలల అవసరాల గుర్తింపు వంటి అంశాలపై వివరాలు అందించారు. రిసోర్స్ పర్సన్లుగా పఠాన్ కరిముల్లా, షేక్ షరీఫ్ వ్యవహరించారు. శిక్షణలో మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### భారత జట్టు క్రీడాకారిణికి అభినందన

**తెనాలి:** షూటింగ్‌బాల్ వరల్డ్ కప్ పోటీల్లో భారత జట్టు విజేతగా నిలిచేందుకు కృషిచేసిన ఆ జట్టు సభ్యురాలు పిట్టు అనూరాధరెడ్డిని బుధవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కాలేజీలో ఘనంగా సత్కరించారు. కర్లపాలెంకు చెందిన అనూరాధరెడ్డి ఈ కాలేజీలో ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల 1,2,3 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన షూటింగ్‌బాల్ వరల్డ్ కప్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. ఈ పోటీల్లో భారత జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఇందులో భాగస్వామురాలైన అనూరాధ రెడ్డిని కాలేజీలో సత్కరించారు.

# 'దొడ్డి'దారిన సర్కారు కక్ష సాధింపు

సచివాలయ ఉద్యోగులకు మరుగుదొడ్ల డ్యూటీ!

శివరాత్రి పేరుతో పిండ ప్రదానాలు, టాయిలెట్ల వద్ద విధులు

తెల్లవారు 4 నుంచి రాత్రి 11 గంటల వరకు కాపలా

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. అమానవీయ రీతిలో నిత్యం అవమానాలు, మానసిక క్షోభ, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో వారు నలిగిపోతున్నారు. ముఖ్యంగా గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులైతే సర్కారు వేధింపులకు తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అయినా సర్కారులో మీసమెత్తు అపరాధభావం కనిపించడం లేదు. పైగా మరింత పాశవిక చర్యలకు పూనుకుంటోంది. తాజాగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగులకు మరుగుదొడ్ల వద్ద విధులు కేటాయించడం, పిండ ప్రదానాల వద్ద డ్యూటీలు వేయడం సర్కారు నిరంకుశత్వానికి ప్రబల నిదర్శనం.

**రోజుకు మూడు షిఫ్టుల్లో..**

డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలతోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్న ఎందరో యువత గత ప్రభుత్వ హయాంలో తమ సొంత గ్రామాల్లోనే పేదలకు సేవలందించే అవకాశం దక్కడంతో గ్రామ/వార్డు సచివాలయాల కొలువుల్లో చేరారు. లక్షలాది మందికి పోటీ పడి పరీక్ష రాసి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించారు. సమాజంలో హోదా, గౌరవాన్ని పెంచుకున్నారు. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చాక రాజకీయ కారణాలతో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను పదేపదే వేధిస్తోంది. పనిభారం విపరీతంగా పెంచి కక్ష సాధింపులకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా 14 నుంచి 16వ తేదీ వరకు జగ్గయ్యపేట మండల పరిధిలోని ముక్త్యేశ్వరం గ్రామంలో వాహనాల పార్కింగ్‌తోపాటు, మెయిన్ రోడ్డు, ఘాట్లు, మహిళా స్నానాల గదులు, టాయిలెట్ల దగ్గర సచివాలయ ఉద్యోగులకు డ్యూటీలు వేయడం అందరినీ విస్మయానికి గురిచేసింది. రోజుకు మూడు షిఫ్టుల్లో ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విధులు కేటాయించింది. పురుషులు, మహిళల టాయిలెట్ల దగ్గర ప్రత్యేకంగా ఇద్దరేసి సిబ్బందిని విధులు చేయాలని ఆదేశించింది. పిండ ప్రదానాల జరిగే ఘాట్ల ఒక్కొక్కరు చొప్పున విధుల్లో ఉండాలని హుకుం జారీ చేసింది. ఎవరైనా ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే, బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం గమనార్హం. ఈ మేరకు బుధవారం జగ్గయ్యపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి పేరిట ఆదేశాలు వెలువడ్డాయి.



సచివాలయ ఉద్యోగులకు టాయిలెట్ల దగ్గర డ్యూటీలు వేసిన ఆర్డర్ కాపీ

**మా రక్తం 'మరుగు'తోంది**

సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన డ్యూటీ ఆర్డర్లు చూస్తే రక్తం మరుగుతోంది. టాయిలెట్ల దగ్గర కాపలా ఉండమని సచివాలయ ఉద్యోగులకు డ్యూటీలు వేస్తారా? సచివాలయ ఉద్యోగులను మనుషులు అనుకుంటున్నారా? లేక ప్రభుత్వానికి పెట్టి చాకిరీ చేసే బానిసలు అనుకుంటున్నారా? ఒక పక్క సర్వేల టార్చర్, మరోపక్క రెగ్యులర్‌గా చేయాల్సిన పనుల ఒత్తిడి తట్టుకోలేక గుండెపగిలి చనిపోతున్నారు. ఇంకొందరు జీవితం మీద విరక్తితో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రెండు రోజుల్లో ఏకంగా ఐదుగురు సచివాలయ ఉద్యోగులు చనిపోయారు. సచివాలయ ఉద్యోగుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం ఏ మాత్రం కనికరం చూపకుండా ఇంకా అడ్డమైన పనులు చెబుతోంది. ఏటా ఉత్సవాలు జరిగే చోట ఎప్పుడూ లేని విధంగా సచివాలయ ఉద్యోగులకు ఇలాంటి దారుణమైన పనులు అప్పగించడం ఏమిటి? శని, ఆదివారాలు సెలవు రోజులు. పైగా పండుగ రోజు పనులు చెప్పడం ఒక తప్పయితే అందులో షిఫ్టుల పద్ధతిలో రేయింబవళ్లు మరుగుదొడ్ల దగ్గర నిలబెడతారా? డిగ్రీలు, బీటెక్ చేసి ఉద్యోగాల్లోకి వచ్చింది ఇందుకేనా? ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను గుర్తించాలి. ఈ ఉత్తర్వులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– కాకర్ల వెంకటరామి రెడ్డి, చైర్మన్, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

## మయూర వాహనంపై దేవదేవుడు

శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపానికి తోడ్కొనివచ్చి మయూర వాహనంపై ఆసీనులను చేసి ఉభయదేవాలయాల ప్రధాన అర్చకులు, వేదపండితులు అర్చకులు, ప్రత్యేక హారతులిచ్చి కళాకారుల నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. మయూర వాహనంపై వేంచేసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను భక్తులు కనులారా దర్శించుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరఫున, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున శ్రీస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి రావణవాహన సేవ నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

## సింహాచలంలో కొండవీటి శాసనాలు

యడ్లపాడు: విశాఖలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచల వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొండవీటి రెడ్డిరాజుల శాసనాలను గుర్తించినట్లు కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ ల్లి శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆలయాన్ని ఆయన సందర్శించి శాసనాలను పరిశీలించామని, రెడ్డిరాజుల్లో సుప్రసిద్ధుడైన అన వేమారెడ్డి మహేంద్రగిరి దాకా సాగించిన దిగ్విజయ యాత్రకు సూచికలైన శాసనాలు సింహాచలంలో లభించాయని వెల్లడించారు.

## జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- పొగలు వ్యాపించడంతో నాయుడుపేట వద్ద రైలు నిలిపివేత..
- భయాందోళనకు గురైన ప్రయాణికులు

నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉన్న జోధ్‌పూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

నాయుడుపేట టౌన్: జోధ్‌పూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఓ బోగీ నుంచి పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో రైలును నాయుడుపేట వద్ద నిలిపివేశారు. వివరాలు.. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి చెన్నై తాంబరం వెళ్తున్న సూపర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–3 బోగీ వద్ద బ్రేక్ బైండింగ్ వల్ల ఒక్కసారిగా పొగలు వచ్చాయి. దీనిని గుర్తించిన లోకో పైలట్ బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో నాయుడుపేట రైల్వేస్టేషన్ వద్ద రైలును నిలిపివేశారు. భయాందోళనకు గురైన ప్రయాణికులు వెంటనే రైలు నుంచి దిగేశారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు ఘటనాస్థలికి చేరుకొని మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు. దాదాపు 30 నిమిషాల తర్వాత నాయుడుపేట నుంచి రైలు బయలుదేరింది. మంటలు చెలరేగి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని.. లోకో పైలట్ అప్రమత్తత వల్ల ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి రావడానికి సిద్ధం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి,అమరావతి: ప్రజా సమస్యలు, పాలకుల అవినీతి, తప్పిదాలపై వైఎస్సార్‌సీపీ నిలదీస్తుందనే భయంతోనే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. ప్రతిపక్ష హోదా విషయంలో గవర్నర్ గౌరవసభాపతి విజ్ఞప్తి చేశారు. 164 మంది సభ్యులున్న కూటమికి 11 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులకు సమాధానం చెప్పే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ఇస్తే సభకు రావడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని బలంగా నిలదీయాలని ఉంది. కానీ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి భయపడిపోతోంది. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై ఇప్పటికే గవర్నర్‌కి వినతిపత్రం ఇచ్చినా చర్యలు లేవు.'' అని తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. పక్క రాష్ట్రాలు అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తే మనకు రావాల్సిన నీటి వాటాను దోచుకుంటుంటే చంద్రబాబు సర్కారు చోద్యం చూస్తోందని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తన శిష్యుడి కోసం సీఎం చంద్రబాబు తాకట్టు పెట్టేశారని విమర్శించారు. కూటమి నేతల దారుణాలను ప్రశ్నిస్తే వివక్ష నేతల ఇళ్లపై దాడులకు తెగబడుతున్నారని తాటిపర్తి మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగంలో శాంతిభద్రతల ఊసే లేకపోవడం దారుణమని, కూటమి నేతల అరాచకం వచ్చాక రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరు అట్టడుగు స్థాయికి పడిపోయిందని విమర్శించారు.

## ముగిసిన గుణదల మేరీమాత ఉత్సవాలు

గుణదల (విజయవాడ తూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న 102వ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. తిరునాళ్ల ఆఖరి రోజు కావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి యాత్రికులు లక్షలాదిగా తరలి వచ్చారు. మేరీమాతను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కొండ దిగువన ఉన్న బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై గురువులు సమిష్టి దివ్యబలి పూజ సమర్పించారు. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. స్నేహభావం పెంపొందాలని కాంక్షించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులందరికీ మేరీమాత దీవెనలు లభిస్తాయని పేర్కొన్నారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ సుందర్ బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. – తిరుమల

## స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం పెంపొందించడమే బాధ్యత



సమావేశంలో న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ ఏవీ శేషసాయి తదితరులు

న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తాడికొండ: బంధిత శ్రమ (బాండెడ్ లేబర్) వ్యవస్థను నిర్మూలించి స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం పెంపొందించడం మన రాజ్యాంగ బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు)–1976 చట్టం అమలులోకి వచ్చి 50 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో 'స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం–బాండెడ్ లేబర్ వ్యవస్థ నిర్మూలనలో మన బాధ్యత' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ.. సమాజంలో లేబర్ పూర్వాపరాలు, 1976 నాటి బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు) చట్టం, కీలక నిబంధనలను వివరించారు. జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సమ్మె నేడు

ఉక్కునగరం: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త కార్మిక సమస్యలతోపాటు స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గురువారం సమ్మెకు ఉక్కు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కార్మికుల లేఆఫ్‌లు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను, డిమాండ్ల పత్రంలో పొందుపరిచారు. ప్రస్తుతం ప్లాంట్‌లో తొమ్మిది వేల మంది కార్మికులు, 10 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. ఉక్కు యాజమాన్యం కార్మిక సంఘాలతో సమావేశమై ఈ పరిస్థితుల్లో సమ్మె మంచిది కాదని, విరమించాలని కోరింది. అయితే జాతీయ కార్మిక సంఘాల పిలుపుతోపాటు తమ డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మె ఆపడం కుదరదని స్థానిక కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అయితే ప్రస్తుతం ప్లాంట్ ఉత్పత్తి గాడిలో పడుతున్నందున సమ్మె పట్ల కార్మికులు అంతగా మొగ్గు చూపడం లేదని తెలిసింది. అదేవిధంగా గత సమ్మెలో పాల్గొనడంతో సుమారు 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఒకేసారి తొలగించారు. ఈ నేపథ్యంలో సమ్మెలో పాల్గొంటే తమకు ఉన్న ఉపాధి పోతుందేమో అనే ఆందోళనలో కాంట్రాక్ట్ కార్మికులున్నారు. మరోవైపు ఈ సమ్మెలో బీఎంఎస్ పాల్గొనడం లేదని ప్రకటించింది. సమ్మె నేపథ్యంలో యాజమాన్యం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. అధికారులందరూ 12 గంటలపాటు విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించి రోస్టర్ కూడా వేశారు. అదేవిధంగా గురువారం జనరల్ షిఫ్టులో ఉన్నవారందరినీ ఉదయం షిఫ్టుకు రావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## స్కూల్ బస్సు బోల్తా

22 మందికి గాయాలు

బొబ్బిలిరూరల్: విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోని అలజంగి కూడలి వద్ద బుధవారం ఓ ప్రైవేటు స్కూల్‌బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 22 మంది విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకాశలక్కవరం కారాడ గ్రామం వద్ద ఉన్న షన్‌షైన్‌హోం (స్వచ్ఛంద సేవా సంస్థ) నిర్వాహకులు ఆదరువుల బొబ్బిలిలోని సెయింట్ డే ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. పాఠశాల పూర్తయిన అనంతరం 34 మంది విద్యార్థులు బస్సులో తిరిగి కారాడ షన్‌షైన్ హోంకు వెళుతున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించే యత్నంలో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న పంటపొలాల్లో బోల్తా కొట్టింది. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన విద్యార్థులను ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ఏడో తరగతి చదువుతున్న పిట్ల నానికి తీవ్ర గాయాలయ్యాయి. నడుము, గుండె భాగాల్లో గాయాలు కావడంతో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. ఆర, ఏడు తరగతులకు చెందిన ఆర్.బాలకరుణ, దుర్గారావు, జయశంకర్, ప్రవీణ్ ప్రదీప్‌కు కాళ్లు, చేతులు, తలకు గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. షన్‌షైన్ హోం మేనేజర్ రాజవర్మ ఆస్పత్రికి చేరుకుని చిన్నారులను పరామర్శించారు. బొబ్బిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థికి గాయాలు

రోహిత్ తలకు గాయమైన దృశ్యం

నల్లచెరువు: శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైకప్పు పెచ్చులూడి తలపై పడటంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. బోయపల్లికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి రోహిత్ బుధవారం తరగతి గదిలో పరీక్ష రాస్తున్న సమయంలో ఒక్కసారిగా పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. దీంతో రోహిత్ తలకు తీవ్ర గాయమైంది. ఉపాధ్యాయులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వీఆర్ఎస్ ప్రకటించిన ఐపీఎస్ అధికారి కిల్లాడ

కోటవురట్ల (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం పాములవాకకు చెందిన ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) ప్రకటించారు. మూడు నెలల క్రితమే వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయగా.. ఈ నెల 15వ తేదీన ఆదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బాధ్యతల నుంచి పూర్తిగా వైదొలగనున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే తన మాధ్యమంలో విద్యాభ్యాసం చేసిన ఆయన ఉపాధ్యాయుడిగా నక్కపల్లి మండలం దేవవరంలో పనిచేశారు.

## నా కూతురిని కాపాడండి

రెండేళ్లుగా వ్యభిచార కూపంలోకి దించారు | పవన్ కళ్యాణ్‌ను కలవనివ్వడం లేదు

హోం మంత్రి అనితను మూడు సార్లు కలిశా | తిరుపతికి చెందిన మహిళ ఆవేదన

సాక్షి, అమరావతి: రెండేళ్లుగా తన కుమార్తెను వ్యభిచార కూపంలోకి దించారని తిరుపతికి చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో బుధవారం హోం మంత్రి అనితను కలిసి సమస్యలను వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ఉన్నతాధికారులను ఎంత వేడుకున్నా స్పందన లేదని బాధిత మహిళ వాపోయారు. గురువారం మరోసారి తనను కలవాలని, దర్యాప్తు చేయిస్తామని హోం మంత్రి అనిత చెప్పి పంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాధిత మహిళ బోరున విలపిస్తూ తన కూతురిని నరకకూపం నుంచి ఎవరూ కాపాడటం లేదంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికే హోం మంత్రిని మూడుసార్లు కలిశానని, ఎప్పుడు కలిసినా చూస్తాం.. చేస్తాం అనడమేగాని ఇంత వరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి తన కూతుర్ని ఇంటికి తీసుకురావాల్సిందిగా వేడుకోవాలని ప్రయత్నిస్తున్నా ఫలితం లేదన్నారు. ఎంతో కష్టపడి కూతుర్ని చదివించుకుంటే, కానీ వ్యభిచార కూపంలోకి తోసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కూతురిని అప్పగించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

## మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు

మరో ముగ్గురు మంత్రులకు లేఖ వచ్చిందంటున్న మంత్రి కందుల దుర్గేష్

సాక్షి, అమరావతి/తాడికొండ: తనతో పాటు మరో ముగ్గురు మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌కు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు వచ్చినట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. అసెంబ్లీ లాబీలో మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ విషయం తెలిసి తమ కుటుంబ సభ్యులు ఆందోళనకు లోనయ్యారు. మావోయిస్టులు టార్గెట్ మారడానికి వ్యక్తిగతంగా, శాఖాపరంగానూ ఎలాంటి తప్పులు చేయలేదని పేర్కొన్నారు. లేఖలో సారాంశం చూస్తే ఎవరో ఉద్దేశపూర్వకంగా రాసి ఉంటారన్న అనుమానం ఉన్నాయని, మావోయిస్టులు రాసే లేఖ అలా ఉండదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారమిచ్చామని, లేఖల విషయంపై విచారణ జరుగుతున్నట్లు చెప్పారు.

## మద్యం అక్రమ కేసులో ఇద్దరికి బెయిల్

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న జీవన్, శిబులకు బెయిల్ మంజూరు చేస్తూ ఎక్సైజ్ న్యాయస్థానం న్యాయమూర్తి లెనిన్‌బాబు బుధవారం తీర్పునిచ్చారు. ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తులు సమర్పించాలని, విచారణాధికారికి అందుబాటులో ఉండాలని, పాస్‌పోర్టును న్యాయస్థానంలో అప్పగించాలని ఆదేశించారు. న్యాయస్థానం అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా.. ముఖ్యంచెరువు కేసులో బెయిల్ రాకపోవడంతో ఆ ఇద్దరూ ఇంకా జైలులోనే ఉండనున్నారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్యాయత్నం

మణికంఠరెడ్డి (ఫైల్)

వేంపల్లె: వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లె మండలం తాళ్లపల్లె గ్రామానికి చెందిన రైతు సి.మణికంఠరెడ్డి (25) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బంధువు నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాళ్లపల్లె గ్రామానికి చెందిన వెంకట లక్ష్మయ్య కుమారుడు సి.మణికంఠరెడ్డి 5 ఎకరాల పొలంలో అరటితోపాటు వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఆదాయం రాలేదు. బోర్లు వేయడానికి మణికంఠరెడ్డి రూ.15లక్షలు అప్పు చేశాడు. అవి తీర్చలేక జనవరి 17న తాళ్లపల్లె గ్రామంలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి తల్లితోపాటు 9 నెలల చిన్నారి ఉంది.

## ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్

గోదావరిఖని: ఆన్‌లైన్ గేమ్‌కు మరో యువకుడు బలయ్యాడు. ఆదేవిధంగా ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ అప్పులపాలైన తూండ్ల రోహిత్ (25) వాటిని తీర్చలేననే మనస్తాపంతో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని విఠలనగర్‌కు చెందిన తూండ్ల బాలయ్య–జరీనాబేగం దంపతులకు రోహిత్ ఒక్కడే కుమారుడు. తండ్రి చిన్నతనంలోనే అనారోగ్యంతో చనిపోగా.. సింగరేణిలో కాంట్రాక్టు పద్ధతిలో స్వీపర్‌గా పనిచేసే తల్లి అన్నీ తానై కొడుకును పెంచింది. డిగ్రీ పూర్తిచేసిన రోహిత్.. బతుకుదెరువు కోసం రామగుండం నగరంలోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డ రోహిత్ రూ.5 లక్షల వరకు పోగొట్టుకుని అప్పులపాలయ్యాడు. తనకు అప్పులు బాగా అయ్యాయని, వాటిని తీర్చేదారిలేక చనిపోతానని తల్లిని బెదిరించాడు. అప్పులు ఎలా అయ్యాయని తల్లి నిలదీసినా కారణం చెప్పలేదు. అయితే మంగళవారం రాత్రి తిరుమలేశ్వరం నగరంలో ఉంటున్న తనతల్లి వద్దకు వెళ్లాడు. తెల్లవారేసరికి ఇంటికి చేరిన వచ్చిన రోహిత్ మనస్తాపంతో ఉరేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై సంజీవయ్య కేసు నమోదు చేసుకున్నారు.

## తెలుగు వాదనలపై తెలంగాణ హైకోర్టు అభ్యంతరం

న్యాయవాది ఏర్పాటుకు సూచన

సాక్షి, హైదరాబాద్: న్యాయ విచారణ ప్రక్రియ ఆంగ్లంలో సాగాల్సి ఉన్నందున.. తెలుగులో వాదనలు కొనసాగించేమని.. న్యాయవాదిని నియమించుకోవాలని ఒక పిటిషనర్‌కు తెలంగాణ హైకోర్టు సూచించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఎన్‌సీఆర్ కంపెనీకి 22 కాంట్రాక్టులు అప్పగించడంలో అవినీతి జరిగిందంటూ 2020లో సీతారాంపల్లికి చెందిన రాంబాబు తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పార్టీ ఇన్ పర్సన్ (తన వాదనలు తానే వినిపించుకోవడం)గా రాంబాబు వాదనలు వినిపిస్తూ.. సమాచార హక్కు చట్ట ప్రకారం సమాచారం కోసం పిటిషన్ పెట్టినట్లు చెప్పారు. కొత్తగూడెం జిల్లాలోని అటవీ గిరిజన ప్రాంతంలో వంతెనల నిర్మాణం, రోడ్ల పనుల్లో, మిగిలిన పనులకు అటవీ, పర్యావరణ శాఖల అనుమతి తీసుకోలేదన్నారు. తెలుగులో వాదనలు వినిపించడంపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. న్యాయవాదిని నియమించుకోవాలని లేదా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని సూచించింది. తెలుగులో వాదనలు వినాలని పిటిషనర్ అభ్యర్థించారు.

**MUNICIPAL CORPORATION: NELLORE**
**TENDER NOTICE**

ROC. No.236/NMC/DBI/GenICRP/2025-26 Dt: 11.02.2026.

Nellore Municipal Corporation hereby invites tenders for Supply and delivery installation of CC cameras in city Constituency and Expression of interest for third party quality control in Nellore Municipal Corporation.

No. of Works - 3 & EOI : Amount of Rs. 599.60 Lakhs
Bid Submission Closing Date & Time : 20.02.2026, 23.02.2026 & 24.02.2026 at 3.00 PM

Further details can be seen at e-procurement market place in www.apeprocurement.gov.in officer inviting bids Commissioner, Municipal Corporation of Nellore, A.P. Contract Nos.9908974848, 9848335204, 8897507428.

COMMISSIONER
Municipal Corporation : Nellore

**Dr. Y.S.R. HORTICULTURAL UNIVERSITY**
VENKATARAMANNAGUDEM-534101, W.G. Dt.
**TENDER NOTICE**

Tender Notice No.05/HU/EO/TN/2025-26, Dt.09.02.2026

Online tenders is invited through e-procurement platform for the work i) Providing False Ceiling & Air Conditioners in the Ground Floor of the University Library at University Campus, Dr.YSRHU, Venkataramannagudem, West Godavari District (Est.Cost: Rs.21.00 Lakhs), ii) Providing 50 LPH RO Treatment Units in the University Library at University Campus, Dr.YSRHU, Venkataramannagudem, West Godavari District (Est.Cost: Rs.0.95 Lakhs), iii) Providing Aluminum Partitions for digital Library & Seminar Hall in the Ground Floor of the University Library at University Campus, Dr.YSRHU, Venkataramannagudem, West Godavari District (Est.Cost: Rs.10.50 Lakhs), iv) Providing Special Repairs to the leakages in the toilets of the UG Girls Hostel at COH, Venkataramannagudem, West Godavari District (Est.Cost: Rs.4.10 Lakhs), v) Providing Special Repairs to the leakages in the toilets of the PG Girls Hostel at COH, Venkataramannagudem, West Godavari District (Est.Cost: Rs.1.20 Lakhs). For online submission of bids Visit: www.apeprocurement.gov.in. Bid document download start date: 18.02.2026 at 12.00 PM.

Sd/- ESTATE OFFICER

DIPR RO No.4816PP/CL/Advt/1/2021-22, Dt: 11-02-2026

# AB, CD are the heights of two poles

## INTRODUCTION TO TRIGONOMETRY

**1.** Evaluate
$$\frac{5\text{Cos}^2 60^0 + 4\text{Sec}^2 30^0 - \tan^2 45}{\text{Sin}^2 30 + \text{Cos}^2 30}$$

**Sol:** $5\text{Cos}^2 60 + 4\text{Sec}^2 30 - \tan^2 45$

$$= 5\left(\frac{1}{2}\right)^2 + 4\left(\frac{2}{\sqrt{3}}\right)^2 - (1)^2$$

$(\because \text{Cos}60^\circ = \frac{1}{2}, \text{Sec}30 = \frac{2}{\sqrt{3}}, \tan 45 = 1)$

$$= 5\left(\frac{1}{4}\right) + 4\left(\frac{4}{3}\right) - 1 = \frac{5}{4} + \frac{16}{3} - 1$$

$$= \frac{15 + 64 - 12}{12} = \frac{67}{12}$$

$\text{Sin}^2 30^\circ + \text{Cos}^2 30^\circ$

$$= \left(\frac{1}{2}\right)^2 + \left(\frac{\sqrt{3}}{2}\right)^2 = \frac{1}{4} + \frac{3}{4} = \frac{1+3}{4} = 1$$

$$= \frac{5\cos^2 60 + 4\sec^2 30 - \tan^2 45}{\sin^2 30 + \cos^2 30}$$

$$= \frac{67/12}{1} = \frac{67}{12}$$

**2.** If $\tan(A + B) = \sqrt{3}$ and $\tan(A - B) = \frac{1}{\sqrt{3}}$

$0^\circ < A + B \le 90^\circ$; $A > B$, find A and B

**Sol:** Given $\tan(A+B) = \sqrt{3} = \tan 60^\circ$

$A + B = 60^\circ \to (1)$

$\text{Tan}(A\text{-}B) = \frac{1}{\sqrt{3}} = \text{Tan}\,30^\circ$

$A - B = 30^\circ \to (2)$

Adding (1), (2) we get

$2A = 90^\circ$, $A = 45^\circ$

Subtracting (1), (2) we get

$2B = 30^\circ$, $B = 15^\circ$

**3.** Prove that $\sec A(1 - \sin A)(\sec A + \tan A) = 1$

**Sol:** LHS = $\sec A(1 - \sin A)(\sec A + \tan A)$

$$= \frac{1}{\cos A}(1 - \sin A)\left(\frac{1}{\cos A} + \frac{\sin A}{\cos A}\right)$$

$$= \frac{(1 - \sin A)}{\cos A} \cdot \frac{(1 + \sin A)}{\cos A}$$

$$= \frac{1 - \sin^2 A}{\cos^2 A} = \frac{\cos^2 A}{\cos^2 A} = 1$$

$(\because 1 - \sin^2\theta = \cos^2\theta)$ = RHS

LHS = RHS proved

**4.** Find the value of $(\sec A + \tan A)(1 - \sin A)$

**Sol:** $(\text{se}A + \tan A)(1 - \text{Sin}A)$

$$= \left(\frac{1}{\cos A} + \frac{\sin A}{\cos A}\right)(1 - \sin A)$$

$$= \frac{1 - \sin^2 A}{\cos A} = \frac{\cos^2 A}{\cos A} = \cos A$$

$(\ldots\ 1 - \sin^2 A = \cos^2 A)$

**5.** Prove that
$$\sqrt{\frac{1 + \sin A}{1 - \sin A}} = \sec A + \tan A$$

**Sol:** LHS

$$\sqrt{\frac{1 + \sin A}{1 - \sin A}} = \sqrt{\frac{1 + \sin A}{1 - \sin A} \cdot \frac{1 + \sin A}{1 + \sin A}}$$

$$= \sqrt{\frac{(1 + \sin A)^2}{1^2 - \sin^2 A}} = \sqrt{\frac{(1 + \sin A)^2}{\cos^2 A}}$$

$(\because 1 - \sin^2 A = \cos^2 A)$

$$= \frac{1 + \sin A}{\cos A} = \frac{1}{\cos A} + \frac{\sin A}{\cos A} = \sec A + \tan A$$

$$\left(\because \sec A = \frac{1}{\cos A}\quad \textit{Tan}A = \frac{\sin A}{\cos A}\right)$$

**6.** Write all the other trigonometric ratios of $\angle A$ in terms of secA

**Sol:** We know that $\text{Cos}A = \frac{1}{\text{Sec}A}$

We know that $1 + \tan^2 A = \text{Sec}^2 A$

$\tan A = \sqrt{\text{Sec}^2 A - 1}$,

$$\text{Cot}A = \frac{1}{\tan A} = \frac{1}{\sqrt{\text{Sec}^2 A - 1}}$$

$$\tan A = \frac{\text{Sin}A}{\text{Cos}A}$$

$$\Rightarrow \text{Sin}A = \tan A.\text{Cos}A = \sqrt{\text{Sec}^2 A - 1}.\frac{1}{\text{Sec}A}$$

$$\therefore \text{Sin}A = \frac{\sqrt{\text{Sec}^2 A - 1}}{\text{Sec}A}$$

$$\text{Cosec}A = \frac{1}{\text{Sin}A} = \frac{1}{\frac{\sqrt{\text{Sec}^2 A - 1}}{\text{Sec}A}}$$

$$= \frac{\text{Sec}A}{\sqrt{\text{Sec}^2 A - 1}}$$

**7.** Prove that $= \frac{\sin\theta - 2\sin^3\theta}{2\cos^3\theta - \cos\theta} = \tan\theta$

**Sol.** $$\text{LHS} = \frac{\sin\theta - 2\sin^3\theta}{2\cos^3\theta - \cos\theta} = \frac{\sin\theta(1 - 2\sin^2\theta)}{\cos\theta(2\cos^2\theta - 1)}$$

$$= \frac{\sin\theta(1 - 2\sin^2\theta)}{\cos\theta(2(1 - \sin^2\theta) - 1)}$$

$(\because 1 - \sin^2\theta = \cos^2\theta)$

$$= \frac{\sin\theta(1 - 2\sin^2\theta)}{\cos\theta(2 - 2\sin^2\theta - 1)}$$

$$= \frac{\sin\theta(1 - 2\sin^2\theta)}{\cos\theta(1 - 2\sin^2\theta)} = \frac{\sin\theta}{\cos\theta} = \tan\theta = \text{RHS}$$

LHS = RHS 1 Hence proved

**8.** Prove that $(\text{cosec}A - \sin A)(\sec A - \cos A) = \frac{1}{\tan A + \cot A}$

**Sol:** LHS = $(\text{cosec}A - \sin A)(\sec A - \cos A)$

$$= \left(\frac{1}{\sin A} - \sin A\right)\left(\frac{1}{\cos A} - \cos A\right)$$

$$\left(\because \text{cosec}A = \frac{1}{\sin A}, \sec A = \frac{1}{\cos A}\right)$$

$$= \left(\frac{1 - \sin^2 A}{\sin A}\right)\left(\frac{1 - \cos^2 A}{\cos A}\right)$$

$$= \left(\frac{\cos^2 A}{\sin A}\right)\left(\frac{\sin^2 A}{\cos A}\right)$$

$(\ldots$ from $\sin^2 A + \cos^2 A = 1)$ = SinA cosA

$$\text{RHS} = \frac{1}{\tan A + \cot A} = \frac{1}{\frac{\sin A}{\cos A} + \frac{\cos A}{\sin A}}$$

$$= \frac{1}{\frac{\sin^2 A + \cos^2 A}{\cos A.\sin A}} = \frac{1}{\frac{1}{\cos A.\sin A}}$$

= cosA . sinA

LHS = RHS proved

**9.** Show that $(\text{Cosec}\theta - \text{Cot}\theta)^2 = \frac{1 - \cos\theta}{1 + \cos\theta}$

**Sol:** LHS = $(\text{Cosec}\theta - \text{Cot}\theta)^2$

$$= \left(\frac{1}{\text{Sin}\theta} - \frac{\text{Cos}\theta}{\text{Sin}\theta}\right)^2$$

$$\left(\because \text{Cosec}\theta = \frac{1}{\text{Sin}\theta}, \text{Cot}\theta = \frac{\text{Cos}\theta}{\text{Sin}\theta}\right)$$

$$= \left(\frac{1 - \cos\theta}{\text{Sin}\theta}\right)^2 = \frac{(1 - \text{Cos}\theta)^2}{\text{Sin}^2\theta} = \frac{(1 - \cos\theta)^2}{1 - \cos^2\theta}$$

$(\because \text{Sin}^2\theta + \text{Cos}^2\theta = 1)$

$$= \frac{(1 - \cos\theta)((1 - \cos\theta)}{(1 - \cos\theta)(1 + \cos\theta)}$$

$(\because a^2 - b^2 = (a + b)(a - b))$

$$= \frac{1 - \cos\theta}{1 + \cos\theta} = \text{RHS}$$ Proved

**10.** $(\text{Sin}A + \text{Cosec}A)^2 + (\text{Cos}A + \text{Sec}A)^2 = 7 + \tan^2 A + \text{Cot}^2 A$

**Sol:** LHS = $(\text{Sin}A + \text{Cosec}A)^2 + (\text{Cos}A + \text{Sec}A)^2$

$= \text{Sin}^2 A + \text{cosec}^2 A + 2.\text{Sin}A.\text{Cosec}\,A + \text{Cos}^2 A + \text{Sec}^2 A + 2\text{Cos}A\,\text{Sec}A$

$= (\text{Sin}^2 A + \text{Cos}^2 A) + \text{Sec}^2 A + \text{Cosec}^2 A + 2\,\text{Sin}A\,\text{Cosec}\,A + 2\,\text{Cos}A.\,\text{Sec}A$

$= 1 + 1 + \tan^2 A + 1 + \text{Cot}^2 A + 2(1) + 2(1)$

$(\because \text{Sin}^2 A + \text{Cos}^2 A = 1$

$1 + \tan^2 A = \text{Sec}^2 A$, $1 + \text{Cot}^2 A = \text{Cosec}^2 A$

$\text{Sin}A.\text{Cosec}A = 1$, $\text{Cos}A.\text{Sec}A = 1)$

$= 7 + \tan^2 A + \text{Cot}^2 A$

## SOME APPLICATIONS OF TRIGONOMETRY

The height or length of an object or the distance between two distant objects can be determined with the help of trigonometric ratios.

- The Line of Sight is the line drawn from the eye of an observer to the point in the object viewed by the observer.
- The angle of elevation of an object viewed, is the angle formed by the line of sight with the horizontal when it is above the horizontal level, i.e., the case when we raise our head to look at the object.
- The angle of depression of an object viewed is the angle formed by the line of sight with the horizontal when it is below the horizontal level i.e., the case when we lower our head to look at the object.







- Trigonometry has been used by surveyors for centuries. They use theodolites to measure angles of elevation or depression in the process of survey.

Continued on next page..

## 1 MARK QUESTIONS

1. In heights and distance problems, angles are always taken with respect to horizontal line (True/ False)
**Ans:** true

2. Which of the following situations involves an angle of depression? **Ans:** C
A) A bird looking up at the sky.
B) A man looking at the top of tower in front of him
C) A girl looking down at a car from the balcony
D) A person looking at the top of tree in front of him.

3. Identify the angle of depression from the figure.(B)




A) $\theta_1$ B) $\theta_2$ C) 90° D) None

## 2 MARKS QUESTIONS

1. Define angle of elevation with a simple rough diagram.

**Sol:** Angle of elevation
The angle of elevation of an object viewed is the angle formed by the line of sight with the horizontal when it is above the horizontal level




2. Draw the rough diagram of the following situation "Two poles of heights 6 m and 11m stand on a plane ground. If the distance between the feet of the poles is 12 m"

**Sol:**




3. The height of a tower is 10 m. What is the length of its shadow when sun's altitude is 45°?




**Sol:** AB = height of the tower = 10 m
BC = Length of shadow = x
From the figure tan 45° $= \frac{AB}{BC}$
$1 = \frac{10}{x} \Rightarrow x = 10$
∴ The length of shadow = 10 m.

4. A circus artist is climbing a 20m long rope, which is the tightly stretched and tied from the top a vertical pole to the ground. Find the height of the pole if the angle made by the rope with the ground level is 30°.

**Sol:** Length of the rope = AC = 20m.
Let the height of the Pole = x
From the figure
sin30° $= \frac{x}{20}$
$\Rightarrow \frac{1}{2} = \frac{x}{20} \Rightarrow x = 10$ m.




Hence, the height of the pole is 10m.

5. Length of the shadow of a 15 meter height pole is $5\sqrt{3}$ meters at 7 'O Clock in the morning. Then, what is the angle of elevation of the sun rays with the ground at the time?

**Sol:** The angle of elevation of the sun rays.. at 7 'O Clock with the ground is θ From ΔABC




Tanθ $= \frac{15}{5\sqrt{3}} = \frac{3}{\sqrt{3}} = \sqrt{3}$
= Tan 60° ⇒ θ = 60°
∴ Angle of elevation of Sun rays = 60°

## 8 MARKS QUESTIONS

1. AB, CD are the heights of two poles, distance between two poles is 20m. From the figure find the height of AB.




**Sol:** From the figure
BC = ED = 20m,
CD = EB = 10m
From ΔAED
tan 45° $= \frac{\text{opposite to } 45°}{\text{Adjacent to } 45°} = \frac{AE}{ED} = \frac{AE}{20}$
$1 = \frac{AE}{20}$, AE = 20 m
height of AB = AE + EB = 20 + 10 = 30m



2. A Statue stand on the top of a 2m tall pedestal. From a point on the ground. the angle of elevation of the top of the statue is 60° and from the same point, the angle of elevation of the top of the pedestal is 45°. Find the height of the statue.

**Sol:** AB = height of the pedestal = 2m
Let BC = height of the statue = h m
Let distance between the observer and foot of the pedestal = x m




From ΔABD
tan 45° $= \frac{AB}{AD} = \frac{2}{x}$, $1 = \frac{2}{x}$, x = 2 → (1)
From ΔACD
tan 60° $= \frac{AC}{AD} = \frac{AB+BC}{AD} = \frac{2+h}{x}$
√3 = (2 + h)/2 ⇒ 2√3 = 2 + h
h = 2√3– 2 = 2 (√3 – 1) m

3. The angle of elevation of the top of a building from the foot of the tower is 30° and the angle of elevation of the top of the tower from the foot of the building is 60°. If the tower is 50m high. Find the height of the building.

**Sol:** Let height of building = AB = h m
height of the tower = CD = 50 m
Let distance between the building and tower = x m




From ΔBCD
tan 60° $= \frac{50}{x}, \sqrt{3} = \frac{50}{x}$
$\sqrt{3}x = 50, x = \frac{50}{\sqrt{3}}$ →(1)
From ΔABD
tan 30° $= \frac{h}{x}, \frac{1}{\sqrt{3}} = \frac{h}{x}, x = \sqrt{3}h,$
$\frac{50}{\sqrt{3}} = \sqrt{3}h \Rightarrow 3h = 50$
$h = \frac{50}{3} = 16\frac{2}{3}$m

4. From the top of 7m high building, the angle of elevation of the top of a cable tower is 60° and the angle of depression of its foot is 45°. Determine the height of the tower.

**Sol:** Height of the building AB = 7m
Let the height of the cable tower CD = h m
Let the distance between the building and the tower = x m
CE = CD – ED = h – 7




From ΔABD tan 45° $= \frac{7}{x}$
$1 = \frac{7}{x}, x = 7\text{m} \rightarrow (1)$
From ΔACE tan 60° $= \frac{h-7}{x}$
$\sqrt{3} = \frac{h-7}{x} \Rightarrow h - 7 = \sqrt{3}x$
$h = \sqrt{3}x + 7 = \sqrt{3}(7) + 7$ (∵ From eq (1))
$h = 7(\sqrt{3}+1)$m
∴ Height of the tower $h = 7(\sqrt{3}+1)$m

Y. Vanamraj
Subject Expert
Kurnool

## Daily Quiz

1) **"I am going to the movie," she said.**
A) She says that she is going to the movie.
B) she said that she is going to the movie.
C) She said that she was going to the movie.
D) She said that she will go to the movie.

2) **She is a doctor, ___?**
A) is she? B) isn't she?
C) she isn't? D) she is?

3) **The teacher is teaching the students.**
A) The students are being taught by the teacher.
B) The students are taught by the teacher.
C) The teacher has taught the students.
D) The students have been taught by the teacher.

4) **This is the____ book I've ever read.**
A) interesting
B) more interesting
C) most interesting
D) interestingly

5) **The new policy will be implemented next month.**
A) The company implements the new policy next month.
B) The new policy is implemented next month.
C) They are implementing the new policy next month.
D) They will implement the new policy next month.

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

టీచర్లు టెక్స్ట్‌బుక్స్ చదువుతారు. సిలబస్ మారితే కొత్త పాఠ్యపుస్తకాలు చదువుతారు. సబ్జెక్ట్ మీద ఆసక్తి ఉన్నవారు ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతుంటారు. కాని పుస్తకాలు చదువుతున్నారా?

# ప్రతి స్కూల్‌లో ఉండాలి టీచర్స్ బుక్ క్లబ్

పుస్తకాలంటే...
సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు, జీవిత చరిత్రలు, సినిమా, సంగీతం, సైకాలజీ, యాత్రాకథనాలు... ఈ పుస్తకాలు చదువుతున్నారా? హెచ్‌ఆర్‌ఏ అందుకునే టీచర్లు తమ నివాసంలో కనీసం ఒక బుక్‌షెల్ఫ్ అయినా మెయిన్‌టెయిన్ చేస్తున్నారా? ఎందుకంటే పుస్తక పఠనం ఉపాధ్యాయులకు చాలా మేలు చేస్తుందని విద్యావేత్తలు అంటున్నారు. బెంగళూరు నగరంలో టీచర్ల బుక్ క్లబ్స్ ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి.

## రెండు విధాలా మేలు..

పుస్తకాలు చదవడం వ్యక్తిగతంగా, వృత్తిగతంగా మేలు కలిగిస్తున్నాయి. బెంగళూరులోని క్రెయన్ ప్రీస్కూల్ అకాడమిక్ కోఆర్డినేటర్ మధు ప్రకాశ్ కొన్నిరోజుల నుంచి ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. ఏ అనారోగ్య సమస్యా లేదు. అయినా జీవితంలో ఏదో వెలితి. ఆ వెలితిని పుస్తక పఠనం ద్వారా అధిగమించారు. రోజూ కనీసం అరగంట సేపు పుస్తకాలు చదవడం ద్వారా ఒత్తిడి దూరమవడంతోపాటు మనసుకు ప్రశాంతంగా అనిపిస్తోందని, దాని వల్ల ఉద్యోగం మీద ఏకాగ్రత పెరిగిందని వివరిస్తున్నారామె. ఆమె అనుభవం తెలుసుకున్న మరికొందరు టీచర్లు పుస్తకాలు అందుకున్నారు. విద్యావేత్త నీలమ్ దీక్షిత్ పరిశీలనలో రోజుకో అరగంటపాటు పుస్తకాలు, దినపత్రికలు చదివే టీచర్లు ఉద్యోగంలో మెరుగైన ఫలితాలు నమోదు చేస్తున్నారని వివరిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని పాఠశాల యాజమాన్యాలు బుక్ క్లబ్‌లు ఏర్పాటు చేసి టీచర్లను అందులో భాగస్వాములను చేస్తున్నారు. వారానికో పుస్తకం చొప్పున చదివేలా ప్రోత్సహిస్తున్నారు. తమతోపాటు టీచర్లు కూడా కూర్చొని పుస్తకాలు చదువుతుండటంతో పిల్లలకు అది ఉత్సాహం కలిగిస్తోందని పాఠశాల యాజమాన్యాలు అంటున్నాయి.

## అభిప్రాయాలను మారుస్తూ..

'అకాడమిక్ పుస్తకాలతో కుస్తీ పట్టడానికే సమయం చాలడం లేదు. ఇక బయట దొరికే పుస్తకాలు చదివే వీలెక్కడిది?' అని కొందరు ఉపాధ్యాయులు పెదవి విరిస్తే ఈ అభిప్రాయాన్ని మార్చేందుకు మధు ప్రకాశ్ ఓ పని చేశారు. జొనాథన్ హైడ్ రాసిన 'ది ఆంక్షియస్ జనరేషన్' అనే పుస్తకం గురించి ఓ ప్రజెంటేషన్ ఇచ్చారు. అది ఇతర టీచర్లకు ఆసక్తి కలిగించడంతో వారు ఆ పుస్తకం చదివేందుకు ముందుకొచ్చారు. స్టాన్లీ గ్రీన్ స్పాన్ రాసిన 'ప్లేగ్రౌండ్ పాలిటిక్స్' పుస్తకం చదవడం ద్వారా తాను బోధించే విధానం మారిందని వాణి అనే ఉపాధ్యాయిని చెప్పడంతో ఇతర టీచర్లకూ ఆ పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగింది. వర్జీనియా ఆక్స్‌లైన్ రాసిన 'డిబ్స్ ఇన్ సెర్చ్ ఆఫ్ సెల్ఫ్', ఇ.ఆర్.బ్రెత్‌వెయిట్ రాసిన 'టు సర్, విత్ లవ్' పుస్తకాలు చదవడం వల్ల పిల్లలతో తాను ప్రవర్తించే విధానంగా సమూలంగా మారిందని ప్రతిమా అనే ఉపాధ్యాయిని వివరిస్తున్నారు.

## ఎలాంటి పుస్తకాలు మేలు?

టీచర్ బుక్‌క్లబ్‌లో ఎలాంటి పుస్తకాలు చదవాలనేదానిపైనా కొందరు టీచర్లు సూచనలు చేస్తున్నారు. హెలెన్ కెల్లర్, ఐన్‌స్టీన్, మేరీ క్యూరీ, అన్నా ఫ్రాంక్, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ వంటి మహనీయుల జీవితచరిత్రలతో పాటు సైన్స్, చరిత్ర, సాంస్కృతిక అంశాలపై పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు. పాఠాల్లో ఉన్న అంశాలపై మరింత లోతైన సమాచారం అందించే పుస్తకాలనూ టీచర్లు చదువుతూ విద్యార్థుల చేత చదివిస్తున్నారు. బెంగళూరులో కొన్ని స్కూళ్లలో పాటిస్తున్న ఈ విధానం చూసి ఇతర స్కూళ్లలోనూ టీచర్స్ బుక్‌క్లబ్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### టీచర్లు పాఠకులేనా?

టెట్సుకో కురొయానాగి రాసిన 'టొటొ చాన్' చదివితే పిల్లల సామర్థ్యాలేమిటో అర్థమయ్యాయి అంది ఒక ఉపాధ్యాయిని. స్టాన్లీ గ్రీన్‌స్పాన్ రాసిన 'ప్లే గ్రౌండ్ పాలిటిక్స్' చదివితే పిల్లల మధ్య అనుబంధాలు తెలిసొచ్చాయి అంది మరో ఉపాధ్యాయిని.
ప్రభుత్వాలు పిల్లల చేత న్యూస్‌పేపర్లు చదివించే నిబంధనలను తెస్తున్నాయి. కాని టీచర్లు పాఠకులుగా ఉంటున్నారా? టీచర్లు పుస్తకాలు చదివితే వృత్తి నైపుణ్యంతోపాటు పిల్లల వికాసం మరింత బాగుంటుందని బెంగళూరు టీచర్లు నిర్వహిస్తున్న వాట్సప్ టీచర్స్ బుక్ క్లబ్స్ నిరూపిస్తున్నాయి. టీచర్లూ... ఏం చదువుతున్నారు?

---

# ఆశారేఖ

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం గతంతో పోలిస్తే మన దేశంలో బాల్య వివాహాలు తగ్గాయి. అయితే గ్రామీణ, తక్కువ ఆదాయ కుటుంబాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ప్రాంతాల వారీగా తేడాలు ఉన్నప్పటికీ నివేదిక స్థూలంగా ఆశాజనకమైన చిత్రాన్ని అందించింది. నివేదికలోని ముఖ్యమైన అంశాలు...

**20-24**
జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం 20-24 సంవత్సరాల వయస్సుగల మహిళలల్లో 23 శాతం మంది, 2005-06లో 38 శాతం మంది 18 ఏళ్లలోపు వివాహం చేసుకున్నారు.

**భారత్‌లో బాల్య వివాహాలు**
మన దేశంలో ప్రతి 50 మందిలో ఒకరు (యుక్త వయసు బాలికలు) 18 ఏళ్ల లోపు వివాహం చేసుకుంటున్నారు.

**18-21** ప్రస్తుతం మహిళలకు చట్టపరమైన వివాహ వయసు 18 సంవత్సరాలు. పురుషులతో సమానంగా 21 సంవత్సరాలకు పెంచడానికి చర్చలు జరుగుతున్నాయి.

21% 25% 72.9%

- 18 సంవత్సరాల కంటే ముందు వివాహం చేసుకుంటున్నవారు 2.1%
- 18-20 సంవత్సరాల మధ్య చేసుకుంటున్న వారు 25%
- 21 ప్లస్ 72.9%

**ఎక్కువగా...**
పశ్చిమబెంగాల్ 6.3
ఝార్ఖండ్ 4.6
ఒడిషా 2.6
రాజస్థాన్ 2.3
ఉత్తర్‌ప్రదేశ్ 1.7
ఉత్తరాఖండ్ 1.7



**తక్కువగా...**
కేరళ 0.1%
హిమాచల్‌ప్రదేశ్ 0.4%
హరియాణ 0.6%
తమిళనాడు 0.8%
పంజాబ్ 1.0%

కేరళ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడువంటి రాష్ట్రాలలో బాల్య వివాహల రేటు తక్కువగా ఉంది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

---

● మన(సు)లో మాట

# ఒళ్లు తెలీని కోపాన్ని తగ్గించగలరా?

నా వయసు 34 సంవత్సరాలు. చిన్నప్పటి నుంచి నాకు కోపం ఎక్కువ. చిన్న విషయాలకే ఒళ్లు తెలియని కోపంతో చేతిలో ఏది ఉంటే దానితో కొట్టడం, ఖరీదైన ఫోన్లు, టీవీలు పగలగొట్టడం జరుగుతోంది. కోపావేశంలో నా ముందున్న వ్యక్తి ఎవరు అనే ఆలోచన లేకుండా దాడి చేసే పరిస్థితి వస్తోంది. దీనివల్ల నా భార్య, పిల్లలు చాలా భయపడుతున్నారు. కోపం తగ్గిన తరువాత చాలా బాధ, పశ్చాత్తాపం ఉంటాయి. కానీ ఆ సమయంలో మాత్రం నన్ను నేను నియంత్రించుకోలేకపోతున్నాను. నాకు ఇతర మానసిక, శారీరక సమస్యలు ఏవీ లేవు. ఒకసారి మానసిక వైద్యుడిని కలవాలని అనుకుంటున్నాను. నాకు ఉన్న ఈ సమస్యకు సరైన చికిత్స లేదా పరిష్కారం ఉందా?

– రవికుమార్, హిందూపూర్

మీ సమస్యను ఇతరుల మీద నెట్టకుండా, మీరే బాధ్యత తీసుకుని మారాలనుకోవడం నిజంగా అభినందనీయం. మీరు వివరించిన లక్షణాలను వైద్య పరిభాషలో ఇగో డిస్‌కంట్రోల్ సిండ్రోమ్ లేదా ఇంటర్మిటెంట్ ఎక్స్‌ప్లోసివ్ డిసార్డర్ అని అంటారు. ఈ సమస్య ఉన్నవారు చాలా చిన్న విషయాలకే అసాధారణమైన కోపం, ఆవేశానికి గురవుతారు. ఆ సమయంలో తనపై పూర్తిగా నియంత్రణ కోల్పోయి విలువైన వస్తువులను పగలగొట్టడం, ఆస్తులు ధ్వంసం చేయడం, మాటలతో లేదా చర్యలతో ఇతరులపై దాడి చేయడం వంటి ప్రవర్తనలు చేస్తాడు. కోపం తగ్గిన తరువాత మాత్రం పశ్చాత్తాపం, తప్పు చేశాననే భావన ఎక్కువగా ఉంటుంది. పరిశోధనల ప్రకారం, ఇలాంటి వ్యక్తుల మెదడులో సెరటోనిన్ అనే రసాయనం తక్కువ స్థాయిలో ఉండటం గమనించవచ్చు. ఇది చాలా సందర్భాల్లో జన్యుపరంగా వచ్చే సమస్యగా కూడా ఉండవచ్చు. అంటే, సెరటోనిన్ తయారు చేసే వ్యవస్థలోనే లోపం ఉండే అవకాశం ఉంది.

అలాగే వారు పెరిగిన వాతావరణం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి, కొన్ని అలవాట్లు కూడా ఈ సమస్యను మరింత తీవ్రతరం చేయవచ్చు. మెదడులో భావోద్వేగాలను నియంత్రించే అమీగ్దాలా, ఫ్రాంటల్ కార్టెక్స్ వంటి భాగాలు సరిగా పనిచేయకపోయినా కూడా ఈ సమస్య రావడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ సమస్యకు పూర్తిగా చికిత్స ఉంది. సైకోథెరపీ, కోప నియంత్రణ చికిత్స లతోపాటు, మెదడులో సెరటోనిన్ స్థాయిని పెంచేందుకు తగిన మందులను, మనసుని స్థిమితపరిచే మూడ్ స్టెబిలైజర్స్ వంటి మందుల్ని వైద్యుల పర్యవేక్షణలో వాడడం వలన మంచి మెరుగుదల కనిపిస్తుంది. సమయానికి చికిత్స తీసుకుంటే, కోపాన్ని నియంత్రించుకోవడం సాధ్యం అవుతుంది. దీనిద్వారా కుటుంబ జీవితం, వ్యక్తిగత సంబంధాలు మళ్లీ సాధారణ స్థితికి రావచ్చు. ఈ సందర్భంగా మనసుకవి ఆత్రేయ చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. 'తనువుకెన్ని గాయాలైనా మాసిపోవునేలాగైనా మనసుకొక్క గాయమైనా మాసిపోదు చితిలోనైనా'. విరిగిన వస్తువుల్ని అతికించవచ్చు, లేదా మళ్ళీ సంపాదించొచ్చు. కానీ విరిగిన మనసులని, దూరం అయిన బంధాలని మళ్ళీ దగ్గరగా చేసుకోవాలంటే దానికి చాలా శ్రమ అవసరం. కోపాన్ని జయించినవాడే తన జీవితాన్ని జయిస్తాడు అనే విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి. ఆల్ ది బెస్ట్!

డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

**బులియన్**
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
ఫిబ్రవరి 11న ముగింపు రూ.లలో

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,59,920 | 1,61,000 | 1,58,510 | 1,61,000 | 1,59,200 | 1,59,270 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,47,128 | 1,45,300 | 1,45,300 | 1,49,660 | 1,46,460 | 1,46,000 |
| వెండి | 2,70,000 | 2,75,000 | 3,00,000 | 2,75,000 | 2,70,500 | 3,00,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

---

# సాక్షి సినిమా

# త్రీడీలో చూసి షాక్ అయ్యాను

● నభా నటేష్, నిఖిల్, సంయుక్త

– నిఖిల్

''కార్తికేయ 2' వంటి పాన్ ఇండియా విజయం తర్వాత అంతకంటే అద్భుతమైన ప్రాజెక్ట్‌తో రావాలని ఇన్ని రోజులు ఆగాను. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన సినిమా 'స్వయంభు'. ఈ చిత్రం చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి మీరంతా చాలా సంతోషపడతారు'' అని నిఖిల్ చెప్పారు. నిఖిల్ హీరోగా, సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో త్వరలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిఖిల్ మాట్లాడుతూ– ''వెయ్యేళ్ల క్రితం రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో కృష్ణ అనే యోధుడు ఉండేవారు. అల్లరిగా తిరిగే అండర్ డాగ్ రాజ్యాలను శాసించే స్థాయికి ఆయన ఎలా ఎదిగారు? అనేది మా సినిమాలో చూపించాం. ఈ మూవీని త్రీడీలో చూసినప్పుడు షాక్ అయ్యాను. ప్రేక్షకులు కూడా చాలా ఎంజాయ్ చేస్తారు'' అని చెప్పారు. భరత్ కృష్ణమాచారి మాట్లాడుతూ– ''ఈ సినిమా అందరికీ గొప్ప అనుభూతినిస్తుంది'' అని పేర్కొన్నారు. ''ఈ సినిమాలో భాగం కావడం చాలా గర్వంగా ఉంది'' అన్నారు కెమెరామేన్ సెంథిల్ కుమార్.

# ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను

● 'పునాది రాళ్లు'లో చిరంజీవి

''ఆ రోజు నాలో కలిగిన ఆత్రుత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది'' అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. చిరంజీవి. ఇలా ఎమోషనల్ పోస్ట్ పెట్టడానికి కారణం 'పునాది రాళ్లు' సినిమా కోసం ఫిబ్రవరి 11న నటుడిగా చిరంజీవి కెమెరా ముందు నిలబడిన రోజు. ''ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి. ఈ ప్రత్యేక సందర్భంలో నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక–నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాది రాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు'' అని పేర్కొని, 'పునాది రాళ్లు'కి సంబంధించిన కొన్ని ఫొటోలు షేర్ చేశారు చిరంజీవి. 1978 ఫిబ్రవరి 11న ఆయన తొలిసారి కెమెరా ముందు నిలబడ్డారు. మరో రెండేళ్లకు నటుడిగా చిరంజీవి '50 ఇయర్స్' మైల్ స్టోన్ టచ్ చేస్తారు.

# డాక్టర్ శ్రీలీల

డాక్టర్ కావాలన్న తన కలను నెరవేర్చుకున్నారు శ్రీలీల. ఎంబీబీఎస్ పూర్తి చేసి, వైద్య పట్టా అందుకున్నారు. ఆ ఫొటోలు వైరల్‌గా మారాయి. శ్రీలీల వైద్యురాలు కావడానికి కారణం ఉంది. శ్రీలీల తల్లి స్వర్ణలత వైద్యురాలు. కూతురు డాక్టర్ కావడానికి ఇదో కారణం అయితే, ఓసారి తన అమ్మమ్మకి ఒంట్లో బాగాలేకపోతే సోదరుడు వైద్యుడు కావడంతో వెంటనే చేసిన వైద్యంతో ఆమె మామూలు మనిషి అయ్యారట. శ్రీలీల వైద్యురాలు కావాలనుకోవడానికి ఇది ప్రధాన కారణం. ఇక తెలుగు, కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ, ఇటీవల తమిళ, హిందీ భాషల్లోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు శ్రీలీల. అయినప్పటికీ ఎంబీబీఎస్ పూర్తి చేసినందుకు సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ ప్రశంసలు కురిపించారు.

# పాటలు లేని థ్రిల్లర్ మృత్యుంజయ్

– శ్రీ విష్ణు

● హుస్సేన్ షా కిరణ్, శ్రీవిష్ణు, రాజమౌళి, సందీప్ గుణ్ణం

''మృత్యుంజయ్' మూవీ థ్రిల్లర్ నేపథ్యంలో నడుస్తుంది. సాంగ్స్, కామెడీ లేకుండా హానెస్ట్ థ్రిల్లర్ సినిమాలు మన తెలుగులో అరుదుగా వస్తుంటాయి. హుస్సేన్ నిజాయితీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. మంచి కంటెంట్ అందించాలని సందీప్ ఈ మూవీని నిర్మించారు. ఈ చిత్రం కొత్తగా ఉంటుంది. నా నటన కూడా సరికొత్తగా ఉంటుంది'' అని హీరో శ్రీవిష్ణు పేర్కొన్నారు. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు, రెబ్బా మోనికా జాన్ జంటగా నటించిన చిత్రం 'మృత్యుంజయ్'. రమ్య గుణ్ణం సమర్పణలో సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ రాజమౌళి సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సందీప్ గుణ్ణం మాట్లాడుతూ– ''అద్భుతమైన కథతో రూపొందిన చిత్రమిది. అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని తెలిపారు. ''ఈ సినిమాకి కథే హీరో'' అన్నారు హుస్సేన్ షా కిరణ్.

# ఈ కథ తన కోసమే రాశాను

– గోపీ అచ్చర

''స్కూల్ డేస్‌లో సుహాస్ నా జూనియర్. 'కలర్ ఫోటో' మూవీ నుంచి తనతో ప్రయాణం చేస్తున్నాను. 'హే భగవాన్' కథను సుహాస్ కోసమే రాశాను. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉంటూనే మంచి భావోద్వేగాలతో రూపొందిన మా సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని దర్శకుడు గోపీ అచ్చర చెప్పారు. సుహాస్, శివానీ నగరం జోడీగా నటించిన చిత్రం 'హే భగవాన్'. బి. నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 20న విడుదల కానుంది. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గోపీ అచ్చర మాట్లాడుతూ– ''అంబాజీపేట మ్యారేజి బ్యాండు'తో సుహాస్, శివానీ హిట్ పెయిర్‌గా నిలిచారు. అందుకే ఈ మూవీలో రిపీట్ చేశాం. మన జీవితంలో 'హే భగవాన్' అనుకునే సందర్భాలెన్నో ఎదురవుతాయి. ఈ చిత్రంలోని పాత్రలకి కూడా అలాంటి ఘటనలెన్నో ఎదురవుతాయి'' అని చెప్పారు.

# చక్కని ప్రేమకథా చిత్రం ఇది

– ధీరజ్ మొగిలినేని

''కపుల్ ఫ్రెండ్లీ' సినిమాలో శివ పాత్రలో సంతోష్ శోభన్ సెటిల్డ్‌గా నటించారు. తన నటన అందరికీ నచ్చుతుంది. సంతోష్ లాంటి యువ హీరోలకు సక్సెస్ వస్తే వాళ్లు మరిన్ని సినిమాలు చేస్తారు. అప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది'' అని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తెలిపారు. సంతోష్ శోభన్, మానసా వారణాసి జోడీగా నటించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. అజయ్ కుమార్ రాజు .పి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళంలో విడుదలవుతోంది. ఈ మూవీని ఏపీ, తెలంగాణలో విడుదల చేస్తున్న ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ– ''చెన్నై నేపథ్యంలో సాగే చక్కని ప్రేమకథా చిత్రమిది. నెల్లూరు నుంచి చెన్నై వెళ్లి ఇంటీరియర్ డిజైనర్‌గా స్థిరపడాలనుకునే శివ (సంతోష్), చిత్తూరు నుంచి జాబ్ కోసం చెన్నై వెళ్లే మిత్ర (మానస) ఒకరికొకరు పరిచయం అయ్యాక వారి జీవితాలు ఎలా మారాయి? అనేది కథ. మా 'కపుల్ ఫ్రెండ్లీ', 'ఫంకీ' మూవీ మధ్య ఫ్రెండ్లీ పోటీ మాత్రమే ఉంది. రెండింటికీ థియేటర్ల సమస్య లేదు. ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ' అనే సినిమా నిర్మిస్తున్నాను. అలాగే సంగీత్ శోభన్ హీరోగా ఓ చిత్రం చేస్తున్నాం. ఓ చిన్నపిల్లల సినిమా నిర్మిస్తున్నాం. ఈ ఏడాదిలో ఒక స్టార్ హీరోతో మా సంస్థలో మూవీ ఆరంభిస్తాం'' అని తెలిపారు.

● సాయి సింహాద్రి, కోన వెంకట్, మీరా రాజ్, శోభా రాణి

# స్నేహితులతో కలిసి చూడండి

– సాయి సింహాద్రి

సాయి సింహాద్రి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. మీరా రాజ్ హీరోయిన్‌గా నటించారు. బత్తుల సతీష్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి రైటర్, నిర్మాత కోన వెంకట్, దర్శకులు సముద్ర, వీఎన్ ఆదిత్య, నిర్మాత రామ సత్యనారాయణ రాజు, నటుడు రఘు కుంచె అతిథులుగా పాల్గొని, 'సన్ ఆఫ్' హిట్టవ్వాలన్నారు. సాయి సింహాద్రి మాట్లాడుతూ– ''ఫ్యామిలీ మెంబర్స్, ఫ్రెండ్స్‌తో కలిసి ఈ మూవీని చూడండి.. కచ్చితంగా నచ్చుతుంది. కన్నీళ్లు పెట్టుకోకుండా థియేటర్ నుంచి బయటకు వెళ్లలేరు. అంత ఎమోషనల్‌గా ఉంటుంది'' అన్నారు. డిస్ట్రిబ్యూటర్, నిర్మాత శోభారాణి మాట్లాడుతూ– ''కొత్త కాన్సెప్ట్‌తో వచ్చిన 'సన్ ఆఫ్' మూవీని అందరూ చూసి, సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. రచయితలు భాస్కరభట్ల, లక్ష్మీ భూపాల, కెమెరామేన్ కిట్టు, మ్యూజిక్ డైరెక్టర్ రిషి, ముంబై డిస్ట్రిబ్యూటర్ కమలేష్ తదితరులు మాట్లాడారు.

# సఖిలా నిలవే

● సాయి కె. వెన్నం, సౌమిత్, శ్రేయాసి, మాధురి, అనురాధ

సౌమిత్ పోలాడి హీరోగా నటించి, సాయి కె. వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం 'నిలవే'. శ్రేయాసి సేన్ హీరోయిన్‌గా నటించారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కె. వెన్నం నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకలో అతిథిగా పాల్గొన్న గాయని సునీత మాట్లాడుతూ– ''సఖి, ఏ మాయ చేశావె'లా 'నిలవే' ఫీల్ గుడ్ సినిమా అవుతుందని భావిస్తున్నాను'' అన్నారు. ''యాక్షన్ మూవీస్‌లో 'కేజీఎఫ్' ఎలా ఉందో.. లవ్ స్టోరీస్‌లో కేజీఎఫ్ అంటే మా 'నిలవే'' అన్నారు సౌమిత్. ''ఇందులో అందరూ కొత్తవారు కావచ్చు. కానీ, అందరి కృషితో సినిమాను రిలీజ్ చేస్తున్నాం'' అని సాయి కె. వెన్నం చెప్పారు. ''చక్కటి మ్యూజికల్ లవ్ స్టోరీ ఇది'' అని రాజ్ అల్లాడ పేర్కొన్నారు.

# రియల్ హీరోలను సత్కరించడం ఆనందం

– బ్రహ్మానందం

● అర్జున్, సత్యరాజ్, బ్రహ్మానందం, ఐశ్వర్య, నిరంజన్

''సమాజంలోని రియల్ హీరోలను సత్కరించే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. అర్జున్ దర్శకత్వం వహించిన 'జై హింద్ 2' చిత్రంలో నటించాను. అచంచలమైన భక్తి గల అర్జున్‌కి, తన కుమార్తె ఐశ్వర్యకి 'సీతా పయనం' సినిమాతో మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను'' అని నటుడు బ్రహ్మానందం తెలిపారు. అర్జున్ సర్జా కుమార్తె ఐశ్వర్య, నిరంజన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీతా పయనం'. ఈ మూవీకి దర్శకత్వం వహించడంతో పాటు అతిథి పాత్రలో నటించారు అర్జున్. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బ్రహ్మానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమాజంలోని రియల్ హీరోలైన పర్యావరణ, సామాజికవేత్తలు డా. ప్రకాశ్ ఆమ్టే, డా. మందాకిని ఆమ్టే, ట్యాంక్ బండ్ శివ, పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ తదితరులను 'సీతా పయనం' టీమ్ సత్కరించి, ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా అర్జున్ సర్జా మాట్లాడుతూ– ''నా కూతురికి ఓ బహుమతిలా ఈ సినిమాని ఇవ్వాలని, ప్రేక్షకులకు ఓ మంచి చిత్రాన్ని ఇవ్వాలనే బాధ్యతతో ఈ సినిమా తీశాను'' అని చెప్పారు. ''ప్రేమ, కుటుంబం, విలువల గురించి చెప్పే చిత్రమిది'' అని ఐశ్వర్యా అర్జున్ పేర్కొన్నారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా తదితరులు మాట్లాడారు.

## ముకేశ్‌కు స్వర్ణం, కాంస్యం

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి రెండు పతకాలతో మెరిశాడు. బుధవారం జరిగిన జూనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ముకేశ్ కాంస్య పతకం సాధించాడు. ఏడుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ముకేశ్ 19 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన సూరజ్ శర్మ 23 పాయింట్లతో రజతం నెగ్గగా... ఇండోనేసియా షూటర్ ఫవాజ్ 29 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. ఇదే ఈవెంట్ టీమ్ విభాగంలో ముకేశ్, సూరజ్, సాహిల్‌లతో కూడిన భారత జట్టు పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ముకేశ్ బృందం 1729 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. సీనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. అనీశ్ 23 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. టీమ్ విభాగంలో అనీశ్, ఆదర్శ్ సింగ్, నీరజ్ కుమార్‌లతో కూడిన భారత బృందం 1708 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజతం దక్కించుకుంది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత షూటర్లు 35 స్వర్ణాలు, 15 రజతాలు, 14 కాంస్యాలతో కలిపి 64 పతకాలు గెలిచారు.

# ‘డబుల్ సూపర్’ ధమాకా

**అఫ్గానిస్తాన్‌తో పోరులో గట్టెక్కిన దక్షిణాఫ్రికా • రెండు సూపర్ ఓవర్ల తర్వాత నెగ్గిన సఫారీలు • అఫ్గాన్ టీమ్‌కు తీవ్ర నిరాశ**

రికెల్టన్, డికాక్

ప్రపంచకప్‌లో డజను మ్యాచ్‌లు ముగిసినా అభిమానులకు ఇంకా ఏదో వెలితి... కొన్ని చక్కటి ఇన్నింగ్స్‌లు, మరికొన్ని మంచి బౌలింగ్ ప్రదర్శనలు వచ్చినా అసలైన టి20 మజా మాత్రం ఇంకా కనిపించలేదు... ఇలాంటి సమయంలో బుధవారం జరిగిన పోరు ఫుల్ మీల్స్‌ను అందించింది... దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ కలిసి ఉత్కంఠతో నిండిన అద్భుత మ్యాచ్‌ను చూపించాయి... 20 ఓవర్ల సమరంలో ఇరు జట్లూ 187 పరుగులతో సమఉజ్జీలుగా నిలవగా, సూపర్ ఓవర్ తప్పలేదు. అక్కడా ఎవరూ తగ్గకుండా సమం–సమం అనడంతో మరో సూపర్ ఓవర్ ముందుకు వచ్చింది. ఈసారి మాత్రం ఆధిపత్యం ప్రదర్శించిన సఫారీ టీమ్ ఎట్టకేలకు గట్టెక్కింది. ప్రధాన పోరుతో పాటు రెండు సూపర్ ఓవర్లతో సాగిన డ్రామా టోర్నీకే హైలైట్‌గా నిలిచింది. దక్షిణాఫ్రికా ప్రదర్శనకంటే కీలక సమయాల్లో వరుస తప్పులు చేసిన అఫ్గానిస్తాన్ స్వయంకృతమే ఫలితాన్ని నిర్దేశించింది. అఫ్గాన్ బెస్ట్ బౌలర్ రషీద్ ఖాన్ రెండు సూపర్ ఓవర్లలో ఒక్కటి కూడా బౌలింగ్ చేయకపోగా... రెండో సూపర్ ఓవర్లో ఫామ్‌లో ఉన్న గుర్బాజ్‌ను కాకుండా నబీకి స్ట్రయిక్ అవకాశం ఇవ్వడం కూడా జట్టును ఓడించాయి.

అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్‌లో డజను మ్యాచ్‌ల తర్వాత అద్భుతమైన వినోదాన్ని చూసే అవకాశం అభిమానులకు దక్కింది. బుధవారం హోరాహోరీగా సాగిన పోరులో దక్షిణాఫ్రికా ‘డబుల్ సూపర్ ఓవర్’లో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. రికెల్టన్ (28 బంతుల్లో 61; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), డికాక్ (41 బంతుల్లో 59; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 61 బంతుల్లో 114 పరుగులు జోడించారు. అనంతరం అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో సరిగ్గా 187 పరుగులకే ఆలౌటైంది. రహ్మానుల్లా గుర్బాజ్ (42 బంతుల్లో 84; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ఎన్‌గిడి (3/26) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. స్కోర్లు సమం కావడంతో నిర్వహించిన తొలి ‘సూపర్ ఓవర్’లో ఇరు జట్లు సరిగ్గా 17 పరుగులే చేశాయి. దాంతో రెండో ‘సూపర్ ఓవర్’ను ఆడించాల్సి వచ్చింది. ఇందులో దక్షిణాఫ్రికా 23 పరుగులు చేయగా, 19 పరుగులు చేసిన అఫ్గానిస్తాన్ 4 పరుగులతో ఓడింది. దక్షిణాఫ్రికా వరుసగా రెండో విజయం అందుకొని గ్రూప్ ‘డి’ నుంచి ‘సూపర్ ఎయిట్స్’కు చేరువ కాగా... వరుసగా రెండో ఓటమితో అఫ్గానిస్తాన్ ముందంజ వేసే అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి.

### స్కోరు వివరాలు

**దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) నబీ (బి) ఫారుఖీ 5; డికాక్ (సి) జద్రాన్ (బి) రషీద్ 59; రికెల్టన్ (ఎల్బీ) (బి) రషీద్ 61; బ్రెవిస్ (సి) నబీ (బి) ఒమర్జాయ్ 23; మిల్లర్ (నాటౌట్) 20; స్టబ్స్ (సి) ముజీబ్ (బి) ఒమర్జాయ్ 1; యాన్సెన్ (సి) అటల్ (బి) ఒమర్జాయ్ 16; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1–12, 2–126, 3–127, 4–155, 5–159, 6–187. **బౌలింగ్:** ఫరూఖీ 4–0–32–1, ముజీబ్ 3–0–30–0, ఒమర్జాయ్ 4–0–41–3, నబీ 2–0–20–0, రషీద్ 4–0–28–2, నూర్ 3–0–35–0. **అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్:** గుర్బాజ్ (సి) లిండే (బి) మహరాజ్ 84; జద్రాన్ (బి) ఎన్‌గిడి 12; నైబ్ (సి అండ్ బి) ఎన్‌గిడి 0; అటల్ (సి) యాన్సెన్ (బి) రబడ 0; రసూలీ (రనౌట్) 15; ఒమర్జాన్ (సి) స్టబ్స్ (బి) ఎన్‌గిడి 22; నబీ (సి) మార్క్‌రమ్ (బి) లిండే 5; రషీద్ (సి) మిల్లర్ (బి) యాన్సెన్ 20; ముజీబ్ (రనౌట్) 0; నూర్ (నాటౌట్) 15; ఫారుఖీ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 187. వికెట్ల పతనం:** 1–51, 2–51, 3–52, 4–121, 5–121, 6–139, 7–164, 8–169, 9–175, 10–187. **బౌలింగ్:** ఎన్‌గిడి 4–0–26–3, యాన్సెన్ 4–0–42–1, రబడ 3.4–0–38–1, లిండే 3–0–39–1, మహరాజ్ 4–0–27–1, మార్క్‌రమ్ 1–0–14–0.

నిరాశలో అఫ్గాన్ బ్యాటర్ గుర్బాజ్

**38** ఇప్పటి వరకు అంతర్జాతీయ టి20ల్లో ‘సూపర్ ఓవర్’ ద్వారా ఫలితాలు వచ్చిన మ్యాచ్‌లు.

**2** అంతర్జాతీయ టి20ల్లో ‘డబుల్ సూపర్ ఓవర్’ ద్వారా ఫలితం తేలిన మ్యాచ్‌లు. ఈ రెండింటిలోనూ అఫ్గానిస్తాన్ ప్రత్యర్థిగా ఉండటం గమనార్హం. 2024లో అఫ్గానిస్తాన్‌పై భారత్ ‘డబుల్ సూపర్’లో గెలిచింది. 2025లో నేపాల్‌పై నెదర్లాండ్స్ ‘ట్రిపుల్ సూపర్ ఓవర్’లో నెగ్గింది.

**మొదటి సూపర్ ఓవర్:** ఎన్‌గిడి బౌలింగ్‌లో అజ్మతుల్లా 2 ఫోర్లు, సిక్స్ బాదడంతో 17 పరుగులు వచ్చాయి. అనంతరం ఫారుఖీ బౌలింగ్‌లో 5 బంతుల్లో 11 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయిన దక్షిణాఫ్రికా తప్పనిసరిగా సిక్స్ కొట్టాల్సిన స్థితిలో నిలిచింది. లో ఫుల్‌టాస్‌ను లాంగాఫ్ మీదుగా స్టబ్స్ సిక్స్ బాదడంతో దక్షిణాఫ్రికా కూడా 17 పరుగులే చేయగలిగింది.

**అఫ్గానిస్తాన్:** 4 6 1 1 4 1

**దక్షిణాఫ్రికా:** 1 6 W 4 0 6

**రెండో సూపర్ ఓవర్:** అజ్మతుల్లా బౌలింగ్‌లో స్టబ్స్ వరుసగా 6, 1 రాబట్టగా, మిల్లర్ వరుసగా 2, 6, 6, 2 బాదడంతో 23 పరుగులు లభించాయి. ఆ తర్వాత కేశవ్ మహరాజ్ ఓవర్లో అఫ్గానిస్తాన్ తొలి 2 బంతుల్లో పరుగులేమీ చేయకుండా వికెట్ కోల్పోయింది. అయితే గుర్బాజ్ చెలరేగి వరుసగా 6, 6, 6 కొట్టడంతో పాటు తర్వాతి బంతి వైడ్‌గా పడింది. ఈసారి కూడా సిక్స్ కొడితే అఫ్గాన్ గెలిచే అవకాశాలు ఉండగా, చివరి బంతికి గుర్బాజ్ క్యాచ్ ఇచ్చాడు.

**దక్షిణాఫ్రికా:** 6 1 2 6 6 2

**అఫ్గానిస్తాన్:** 0 W 6 6 6 WD W

**చివరి ఓవర్ డ్రామా సాగిందిలా...**

ఆఖరి ఓవర్లో అఫ్గానిస్తాన్‌కు 13 పరుగులు అవసరం కాగా, ఒకటే వికెట్ ఉంది. తొలి బంతికి నూర్‌ను రబడ బౌల్డ్ చేసినా అది నోబాల్ అయింది. తర్వాతి బంతి వైడ్ కాగా, ఆ తర్వాత వేసిన బంతికి నూర్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను యాన్సెన్ వదిలేశాడు. ఆ వెంటనే నూర్ సిక్స్ బాదడంతో తొలి రెండు బంతుల్లోనే 8 పరుగులు వచ్చినట్లయింది. ఇక చేయాల్సింది 4 బంతుల్లో 5 పరుగులే. తర్వాతి బంతికి షాట్ ఆడి నూర్ సగం దూరం వచ్చినా... ఫరూఖీ వెనక్కి పంపడంతో పరుగు రాలేదు. ఓవర్ నాలుగో బంతి మళ్లీ నోబాల్ కావడంతో పాటు 2 పరుగులు తీయడంతో సమీకరణం మరింత సులువుగా మారింది. 2 బంతుల్లో 3 పరుగులు కావాలి, పైగా ఫ్రీ హిట్...బహుశా బ్యాటర్లకు ఇదే సూచన ఇచ్చేందుకు ‘వాటర్ బాయ్స్’ను పంపించగా, అంపైర్లు అనుమతించలేదు! నూర్ లాంగాఫ్ దిశగా కొట్టిన షాట్‌కు తొలి పరుగు సులువుగా రాగా, రెండో పరుగు తీసే ప్రయత్నంలో ఫారుఖీ నెమ్మదించడంతో రనౌటయ్యాడు. దాంతో స్కోర్లు సమమయ్యాయి. ఫీల్డర్ వైపు చూడకుండా వేగంగా పరుగెత్తి బ్యాట్‌తో డైవ్ చేసే ప్రయత్నం చేస్తే ఫారుఖీ పరుగు సునాయాసంగా పూర్తయ్యేది. అంతకుముందు మూడో బంతికి సింగిల్ నిరాకరించిన ఫారుఖీ అసలు సమయంలో సరిగా పరుగెత్తక తన జట్టుకు గెలుపును దూరం చేశాడు. దీని తర్వాత మరో రెండు బంతులు కూడా ఉన్నాయి కాబట్టి అఫ్గానిస్తాన్ ఈ రిస్క్ చేయకుండా ఉండాల్సింది.

ఎలీస్

## రాణించిన ఎలీస్, జంపా

• ఆస్ట్రేలియా గెలుపు బోణీ
• ఐర్లాండ్‌కు రెండో ఓటమి

కొలంబో: బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయినా... బౌలర్లు సత్తా చాటడంతో టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా బోణీ కొట్టింది. గ్రూప్ ‘బి’లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 67 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. స్టొయినిస్ (45; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. ఇన్‌గ్లిస్ (37; 6 ఫోర్లు, 1 సిక్స్), రెన్‌షా (37; 2 ఫోర్లు) కూడా ఆకట్టుకున్నారు. రెగ్యులర్ కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోగా... ట్రవిస్ హెడ్ జట్టుకు సారథ్యం వహించాడు. 183 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటై ఈ టోర్నీలో రెండో పరాజయం చవిచూసింది. డాక్‌రెల్ (29 బంతుల్లో 41; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), టకర్ (24) కాస్త పోరాడారు. ఆసీస్ బౌలర్లలో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ నాథన్ ఎలీస్ 12 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టగా... ఆడమ్ జంపా 23 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు.

సూర్యకుమార్

# మరో కూనతో పోరు

**నేడు నమీబియాతో భారత్ ఢీ • అభిషేక్ శర్మకు అస్వస్థత • సామ్సన్‌కు అవకాశం**

**రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**

న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న టి20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ టీమిండియా రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. తొలి పోరులో అమెరికాపై విజయం సాధించిన సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టు గురువారం నమీబియాతో తలపడనుంది. గ్రూప్ ‘ఎ’లో భాగంగా తదుపరి మ్యాచ్‌లో దాయాది పాకిస్తాన్‌తో ఆడనున్న టీమిండియా దానికి ముందు నమీబియాతో మ్యాచ్‌ను ప్రాక్టీస్‌గా వాడుకోవాలని భావిస్తోంది. బలాబలాలు, అనుభవం దృష్ట్యా ఇరు జట్లలో చాలా అంతరం ఉంది. తొలి మ్యాచ్‌లో అమెరికాపై స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన టీమిండియా... నమీబియాపై కలిసికట్టుగా కదంతొక్కాల్సిన అవసరముంది. భారత జట్టును గాయాల బెడద వెంటాడుతోంది. అస్వస్థత కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ కడుపు నొప్పితో రెండు రోజులపాటు ఆసుపత్రిలో ఉన్నాడు. బుధవారం డిశ్చార్జి అయి జట్టుతో కలిశాడు. అయితే నేటి పోరులో అతను ఆడే విషయంపై స్పష్టత లేదు. ఒకవేళ అభిషేక్ దూరమైతే సంజూ సామ్సన్‌కు అవకాశం లభించవచ్చు. మరోవైపు వాషింగ్టన్ సుందర్ గాయం నుంచి కోలుకోగా... ప్రాక్టీస్ సందర్భంగా ఇషాన్ కిషన్ కాలికి గాయమైంది. ఇక తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ చేతిలో ఓడిన నమీబియా... ‘పోరాడితే పోయేదేమీ లేదు’ అన్న చందంగా రాణించాలని చూస్తోంది. ఢిల్లీ పిచ్ అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు సమానంగా సహకరించనుంది. మైదానం చిన్నది కావడంతో కుదురుకుంటే భారీ స్కోర్లు ఖాయమే!

**అభిషేక్‌పైనే అందరి దృష్టి**

గత రెండేళ్లుగా భారత జట్టు టి20 ఫార్మాట్‌లో నిలకడగా విజయాలు సాధించడంలో స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ కృషి ఎంతో ఉంది. ఆరంభంలోనే ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగి చూస్తుండగానే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల ఈ ‘బిగ్ హిట్టర్’ వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌లో ‘డకౌట్’ అయ్యాడు. ‘పవర్ ప్లే’ లోపే మ్యాచ్‌ను లాగేసుకునే సత్తా గల అభిషేక్... రెండో మ్యాచ్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది కీలకం. తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, శివమ్ దూబే రూపంలో బ్యాటర్లకు కొదవలేదు. గత మ్యాచ్‌లో సూర్య కెప్టెన్ ఇన్నింగ్స్ కారణంగా భారత జట్టు మంచి స్కోరు చేయగలిగింది. వరల్డ్ కప్‌నకు ఒక్క రోజు ముందు పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా గాయపడటంతో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలి మ్యాచ్‌లో మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అమెరికాతో పోరులో ఆడని బుమ్రా తుది జట్టులోకి వస్తే ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరం. వాషింగ్టన్ సుందర్ కోలుకున్నా... ఇప్పుడు అతడిని తుది జట్టులోకి ఎంపిక చేయడం కష్టమే. వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ స్పిన్ భారం మోయనున్నారు.

**పోటీనిచ్చేనా!**

అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా అనుభవం లేని నమీబియా... టీమిండియాపై సంచలన ప్రదర్శన చేయాలని భావిస్తోంది. 2021 ప్రపంచకప్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఏకైక మ్యాచ్ జరగ్గా... టీమిండియా అలవోక విజయం సాధించింది. అదే జోరు కొనసాగిస్తూ ఈ మ్యాచ్‌తో ప్లేయర్లంతా ఫామ్‌లోకి రావాలని భారత మేనేజ్‌మెంట్ భావిస్తోంది. నెదర్లాండ్స్‌తో పోరులో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన నమీబియాపై అంచనాలు లేకపోయినా... ‘చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి’ అని టీమిండియా యోచిస్తోంది. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో నమీబియాపై ఫుల్ ప్రాక్టీస్ చేయాలని మనవాళ్లు చూస్తున్నారు. వరల్డ్‌కప్‌నకు ముందు జరిగిన వార్మప్ మ్యాచ్‌లో భారత ‘ఎ’ జట్టు చేతిలోనూ నమీబియా పరాజయం పాలైంది. అలాంటిది బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్, హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ బౌలింగ్‌ను ఎదుర్కొని నమీబియా బ్యాటర్లు నిలవగలరా చూడాలి.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్/సామ్సన్, ఇషాన్, తిలక్, హార్దిక్, రింకూ, శివమ్ దూబే, అక్షర్, అర్ష్‌దీప్, బుమ్రా/సిరాజ్, వరుణ్.
**నమీబియా:** ఎరాస్మస్ (కెప్టెన్), స్టీవ్ కాంప్, ఫ్రైలింక్, జాన్ నికోల్, జేజే స్మిత్, జెన్ గ్రీన్, లైచెర్, విలియమ్ మైబర్గ్, రూబెన్, బెర్నార్డ్ స్కాల్జ్, బెన్ షికొంగో.

**టి20 ప్రపంచకప్‌లో నేడు**

శ్రీలంక X ఒమన్
వేదిక: పల్లెకెలె; ఉ.గం. 11 నుంచి

నేపాల్ X ఇటలీ
వేదిక: ముంబై; మ.గం. 3 నుంచి

భారత్ X నమీబియా
వేదిక: న్యూఢిల్లీ; రాత్రి గం. 7 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హోల్డర్, రూథర్‌ఫర్డ్

## ఇంగ్లండ్‌పై స్పిన్ దెబ్బ

• 30 పరుగులతో వెస్టిండీస్ విజయం
• రూథర్‌ఫర్డ్ మెరుపు అర్ధ సెంచరీ

ముంబై: టి20 ప్రపంచకప్‌ను రెండేసి సార్లు గెలుచుకున్న మాజీ చాంపియన్ల మధ్య జరిగిన పోరులో వెస్టిండీస్‌దే పైచేయి అయింది. వాంఖెడే మైదానంలో విండీస్ స్పిన్‌ను ఎదుర్కోలేక ఇంగ్లండ్ తలవంచింది. బుధవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో విండీస్ 30 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై నెగ్గింది. ముందుగా వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోరు సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (42 బంతుల్లో 76 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ సాధించగా... రోస్టన్ ఛేజ్ (29 బంతుల్లో 34; 6 ఫోర్లు), హోల్డర్ (17 బంతుల్లో 33; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆదిల్ రషీద్, జేమీ ఓవర్టన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటైంది. జేకబ్ బెతెల్ (23 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్), ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 30; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా... జోస్ బట్లర్ (21), కెప్టెన్ హారీ బ్రూక్ (17) ప్రభావం చూపలేకపోయారు. చివర్లో స్యామ్ కరన్ (30 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా ఇంగ్లండ్‌కు ఓటమి తప్పలేదు. విండీస్ స్పిన్నర్లు గుడకేశ్ మోతీ 3, రోస్టన్ ఛేజ్ 2, అకీల్ హొసీన్ ఒక వికెట్‌తో ప్రత్యర్థిని దెబ్బ తీశారు.

## బెల్జియం చేతిలో భారత్ పరాజయం

రూర్కెలా: ప్రొ హాకీ లీగ్ కొత్త సీజన్‌ను భారత పురుషుల హాకీ జట్టు ఓటమితో ప్రారంభించింది. ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియం జట్టుతో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టును బెల్జియం జట్టు కట్టడి చేసింది. కేవలం రెండు పెనాల్టీ కార్నర్‌లు పొందిన భారత జట్టు అందులో ఒకదానిని సద్వినియోగం చేసుకుంది. ఆట 29వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను శిలానంద్ లాక్రా గోల్‌గా మలిచాడు. బెల్జియం తరఫున నెల్సన్ ఒనానా (23వ నిమిషంలో), థామస్ క్రాల్స్ (53వ నిమిషంలో), అర్నో వాన్ డెసెల్ (57వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. తమకు లభించిన ఏడు పెనాల్టీ కార్నర్‌లను బెల్జియం వృథా చేసుకోవడం గమనార్హం. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో అర్జెంటీనాతో భారత్ ఆడుతుంది. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రొ లీగ్‌లో తాజా గెలుపుతో బెల్జియం 16 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది.

## స్వర్ణాలు గెలిచిన తపస్య, దిజా

న్యూఢిల్లీ: జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ఆరు స్వర్ణ పతకాలు లభించాయి. సబ్ జూనియర్ 44 కేజీల విభాగంలో సూరినేని తపస్య రావు, 20 కేజీల విభాగంలో సూరినేని దిజా మూడు స్వర్ణ పతకాల చొప్పున గెలిచారు. తపస్య స్క్వాట్‌లో 80 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 32.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 105 కేజీలు బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. దిజా స్క్వాట్‌లో 32.5 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 17.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 40 కేజీలు బరువెత్తి టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది.

## క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

చెన్నై: భారత డేవిస్‌కప్ జట్టు మాజీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని... చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సాకేత్-సిద్ధాంత్ (భారత్) ద్వయం 2–6, 6–1, 10–2తో ‘సూపర్ టైబ్రేక్’లో ఎరిక్ వాన్‌షెల్‌బోయిమ్ (ఉక్రెయిన్)–డెనిస్ యెవ్‌సెయెవ్ (కజకిస్తాన్) జంటను ఓడించింది. మరో మ్యాచ్‌లో గంటా సాయికార్తీక్ రెడ్డి-దిగ్విజయ్ సింగ్ (భారత్) జోడీ 4–6, 2–6తో నిక్కీ పునాచా (భారత్)–ప్రుచాయో ఇసారో (థాయ్‌లాండ్) జంట చేతిలో ఓడిపోయింది.

## సహజ, రష్మిక ఓటమి

పుణే: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. భారత నంబర్ వన్ సహజ యామలపల్లి, రెండో ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణ అమ్మాయి సహజ 3–6, 2–6తో టాప్ సీడ్ లియోలియా జీన్‌జీన్ (ఫ్రాన్స్) చేతిలో, హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 2–6, 1–6తో మనన్‌చాయ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. డబుల్స్ విభాగం తొలి రౌండ్‌లో రష్మిక-అంకిత రైనా (భారత్) ద్వయం 6–1, 6–4తో జీల్ దేశాయ్–మాయా రాజేశ్వరన్ (భారత్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

**స్టాక్ మార్కెట్లు** (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ △ |
|---|---|
| 40 | 19 |
| 84,234 | 25,954 |

**విదేశీ సూచీలు**

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 23,084 | ▽ | 18 |
| డోజోన్స్ | 50,198 | ▽ | 10 |
| ఎఫ్‌టీఎస్‌ఈ100 | 10,479 | ▽ | 125 |
| డాక్స్ | 24,936 | ▽ | 52 |
| షాంఘై | 4,132 | △ | 4 |
| నిక్కీ | 57,651 | △ | 1287 |

**ఫారెక్స్ రేట్లు**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| $ యూఎస్ డాలర్ | 88.87 | 91.88 |
| £ బ్రిటిష్ పౌండ్ | 122.65 | 126.09 |
| € యూరో | 105.76 | 109.75 |
| ¥ జపాన్ యెన్ (100) | 48.00 | 61.00 |
| AU$ ఆస్ట్రేలియా డాలర్ | 62.10 | 66.05 |
| S$ సింగపూర్ డాలర్ | 69.50 | 73.26 |
| SAR సౌదీ రియాల్ | 23.29 | 24.80 |
| UAE D యూఏఈ దిర్హామ్ | 23.80 | 25.07 |
| ¥ చైనా యువాన్ | 12.25 | 14.07 |

# క్రేజీ క్రేజీ.. మేడిన్ ఇండియా లగేజీ

- దేశీ బ్రాండ్లకు పెరుగుతున్న డిమాండ్
- ప్రీమియం ఉత్పత్తులపై ఆసక్తి
- 2028 నాటికి రూ. 26,700 కోట్లకు చేరనున్న పరిశ్రమ
- ఏటా 12 శాతం వృద్ధి

సాక్షి, బిజినెస్‌డెస్క్

ఇప్పుడు ట్రావెల్ అనేది అప్పుడప్పుడు మాత్రమే వేసే ట్రిప్పులకే పరిమితం కాకుండా, రెగ్యులర్ జీవన విధానంగా మారిపోయింది. దీంతో అత్యంత నాణ్యమైన, దీర్ఘకాలం మన్నే లగేజీకి డిమాండ్ పెరుగుతోంది. డిజైన్, పనితీరు, నాణ్యతలో అంతర్జాతీయ బ్రాండ్లకు దీటుగా ఉండే దేశీ బ్రాండ్ల ఉత్పత్తులను కొనేందుకు వినియోగదారులు మొగ్గుచూపుతున్నారు. వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించడం, స్టయిల్‌కి పెద్దపీట వేయడం, ఉపయోగించడానికి సులభతరంగా ఉండటం తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా గ్లోబల్ లగేజీ, బ్యాగ్ తయారీ పరిశ్రమలో చైనా ఆధిపత్యం కొనసాగినప్పటికీ ప్రస్తుతం క్రమంగా భారత్‌లో తయారీవైపు మొగ్గు చూపే ధోరణి పెరుగుతోంది. మేడిన్ ఇండియా నినాదం, ఇన్వెస్టర్లలో ఆసక్తి, విస్తరణ ప్రణాళికలు మొదలైనవి ఇందుకు సానుకూలాంశాలుగా ఉంటున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ నివేదిక ప్రకారం 2028 నాటికి భారత లగేజీ పరిశ్రమ రూ. 26,700 కోట్లకు చేరనుంది. 2023 నుంచి 2028 మధ్య ఏటా 12 శాతం వృద్ధి చెందనుంది. 60 శాతం మంది వినియోగదారులు లేదా చిన్న బ్రాండ్లను కొనడానికి ఇష్టపడుతుండగా, 14 % మంది మరికాస్త ఎక్కువ చెల్లించి ప్రీమియం ఉత్పత్తులను కొనేందుకు సిద్ధంగా ఉంటున్నారు.

**ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటున్న సంస్థలు ..**

సూట్‌కేసులు, ట్రాలీలు, బ్యాక్‌ప్యాక్‌లు, బిజినెస్ బ్యాగ్‌లు మొదలైనవి విక్రయించే అప్పర్‌కేస్ ఇందులో సింహభాగం ఉత్పత్తులను ప్రధానంగా నాసిక్ (మహారాష్ట్ర), రుద్రపూర్ (ఉత్తరాఖండ్)లోని తమ ప్లాంట్లలోనే ఉత్పత్తి చేస్తోంది. ప్రముఖ క్రికెటర్ జస్‌ప్రీత్ బుమ్రా దన్ను గల అప్పర్‌కేస్ ఉత్పత్తి సామర్థ్యం వచ్చే మార్చి వృద్ధికి సరిపడేంతగా నెలకు 1,00,000 యూనిట్ల స్థాయిలో ఉంది. భారత్‌లోనే తయారీ వైపు మళ్లుతున్న ప్రీమియం బ్రాండ్లలో యూమ్ అంకుర సంస్థ కూడా ఒకటి. మేడిన్ ఇండియాను తమ ప్రధాన బ్రాండ్ ఐడియాలజీగా పరిగణిస్తామని సంస్థ కో–ఫౌండర్ నైనా పరేఖ్ తెలిపారు. అందుకే తమ ఉత్పత్తుల తయారీని, ముఖ్యంగా అల్యూమినియం, హార్డ్ లగేజీ సోర్సింగ్, అసెంబ్లీని చైనా నుంచి భారత్‌కి మార్చుకుంటున్నామని వివరించారు. కఠినతరమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ఆవిష్కరణ ప్రక్రియలను వేగవంతం చేస్తూ, విదేశీ సరఫరా వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలనే లక్ష్యంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని పరేఖ్ వివరించారు. వివిధ భాగస్వామ్యాల ద్వారా యూమీకి ఏటా 4,00,000 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. వచ్చే రెండేళ్లలో దీన్ని 7,00,000 యూనిట్లకు పెంచుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇక మరో కంపెనీ మిరాజియో ప్రస్తుతం తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, భారత్‌లో తయారు చేసేందుకు భాగస్వాములను కుదుర్చుకునే ప్రయత్నాల్లో ఉంది. ఇందుకోసం పెద్ద సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు వివరించింది.

**మార్కెట్ వాటాపై కన్ను..**

యూమీ ఇప్పటివరకు రూ. 35 కోట్ల వరకు పెట్టుబడులు సమీకరించింది. 2029 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 250 కోట్లకు పైగా వార్షికాదాయాన్ని, 2029–30 నాటికి ప్రీమియం లగేజీ సెగ్మెంట్లో 8–10% వాటాను లక్ష్యంగా పెట్టుకుంది. అటు అప్పర్‌కేస్ దాదాపు 2,000 రిటైలర్లు, మూడు ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా విక్రయాలు సాగిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ వాటా 2–3 శాతంగా ఉండగా, వచ్చే ఏడేళ్ల వ్యవధిలో 10 శాతానికి పెంచుకోవాలని భావిస్తోంది. అసెంబ్లీ అనే సంస్థ వచ్చే రెండేళ్లలో బ్యాక్‌ప్యాక్‌ల తయారీ సామర్థ్యాన్ని సుమారు 20% పెంచుకోవడంపై దృష్టి పెడుతోంది.

# ఎస్‌బీఐ ఓవర్ టేక్

- మార్కెట్ క్యాప్ రేసులో వెనకబడ్డ టీసీఎస్
- నాలుగో పెద్ద కంపెనీగా అవతరించిన బ్యాం'కింగ్'

**ముంబై:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) అరుదైన ఘనత సాధించింది. మార్కెట్ విలువ పరంగా ప్రైవేటు రంగ ఐటీ దిగ్గజం టీసీఎస్‌ను అధిగమించి, దేశంలో నాలుగో అతిపెద్ద కంపెనీగా అవతరించింది. ఈ ప్రభుత్వరంగ బ్యాంకు షేరు బీఎస్‌ఈలో 3.40% పెరిగి రూ.1,183 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 4% లాభపడి రూ.1,188 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. షేరు ర్యాలీతో మార్కెట్ ముగిసే సరికి బ్యాంకు మార్కెట్ విలువ రూ.10.92 లక్షల కోట్లకు చేరింది. మరోవైపు ఐటీ షేర్ల పతనంలో టీసీఎస్ షేరు 2.5% నష్టపోయి రూ.2,909 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ 10.52 లక్షల కోట్లు నమోదైంది. కాగా.. మార్కెట్ విలువ పరంగా చూస్తే రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్‌లు రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. తదుపరి వరుసగా ఎస్‌బీఐ, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌యూఎల్, ఎల్‌అండ్‌టీ కంపెనీలు ఉన్నాయి.

## సూచీలు అక్కడక్కడే..

**ముంబై:** ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు చివరికి ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ 40 పాయింట్లు నష్టపోయి 84,234 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19 పాయింట్లు పెరిగి 25,954 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆటో, రియల్టీ, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 84,081 – 84,487 శ్రేణిలో ట్రేడైంది. నిఫ్టీ 25,890 వద్ద కనిష్టాన్ని, 26,009 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఐటీ, సర్వీసెస్, ప్రైవేటు బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ, ఇండస్ట్రియల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

# మార్కెట్ హైవేపై మహీంద్రా దూకుడు

- జెట్ స్పీడులో ప్రాఫిట్లు
- క్యూ3లో రూ. 5,021 కోట్లు

**న్యూఢిల్లీ:** ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్‌ఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 39 శాతం జంప్‌చేసి రూ. 5,021 కోట్లను అధిగమించింది. ఆటోమోటివ్, వ్యవసాయ రంగ ఎక్విప్‌మెంట్ సాధించిన పటిష్ట అమ్మకాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 3,624 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 41,465 కోట్ల నుంచి రూ. 51,580 కోట్లకు ఎగసింది. వెరసి కంపెనీ చరిత్రలో తొలిసారి ఒక క్వార్టర్‌లో రూ. 50,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 37,097 కోట్ల నుంచి రూ. 41,465 కోట్లకు పెరిగాయి. కాగా.. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 223 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించింది. తాజా సమీక్షా కాలంలో ఎంఅండ్‌ఎం ఆటో విభాగం 23 శాతం అధికంగా 3.02 లక్షల వాహనాలను విక్రయించింది. వ్యవసాయ విభాగం నుంచి సైతం 23 శాతం వృద్ధితో 1.5 లక్షల యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 3,675 వద్ద ముగిసింది.

# మెటల్స్ ర్యాలీ

**న్యూఢిల్లీ:** పసిడి, వెండి ధరలు బుధవారం కూడా లాభాల బాటలోనే నడిచాయి. ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి రూ.4,000 పెరిగి (1.5%) రూ.2.68 లక్షలకు చేరింది. పసిడి 10 గ్రాములకు రూ.600 లాభపడి (0.4%) రూ.1,61,300 స్థాయిని తాకింది. యూఎస్ ఫెడ్ మరింత దూకుడుగా వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు బంగారం, వెండి ధరలు బలపడడానికి దారితీసినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. యూఎస్ ఆర్థిక డేటా అంత ఆశాజనకంగా లేకపోవడం, వినియోగదారుల వ్యయం తగ్గడం వృద్ధి మోస్తరుగా మారొచ్చన్న అంచనాలకు కారణమైనట్టు చెప్పారు. ఈ డేటా అనంతరం ఫెడ్ ఈ ఏడాది మూడు వడ్డీ రేట్లను చేపట్టొచ్చన్న అంచనాలు ఏర్పడినట్టు.. వారం క్రితం 2 పర్యాయాలే రేట్ల కోత అంచనాలున్నట్టు గాంధీ తెలిపారు.

# ఖజానా హౌస్‌ఫుల్

- ప్రత్యక్ష పన్నుల వసూళ్లు భళా
- కార్పొరేట్ల నుంచి అధికంగా వసూలు

**న్యూఢిల్లీ:** ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జోరుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 10 వరకు (2025 ఏప్రిల్ 1 నుంచి) ప్రత్యక్ష పన్నుల నికర ఆదాయం.. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 9.4 శాతం పెరిగి రూ.19.44 లక్షల కోట్లకు చేరింది. ఆదాయపన్ను శాఖ డేటా ప్రకారం రిఫండ్‌లు తగ్గడం, కార్పొరేట్ పన్ను (కంపెనీలు చెల్లించే) వసూళ్లు బలంగా ఉండడం ఇందుకు అనుకూలించింది. ఈ కాలంలో కార్పొరేట్ పన్నుల వసూలు 14.51% పెరిగి రూ.8.90 లక్షల కోట్లుగా ఉంటే.. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాల (హెచ్‌యూఎఫ్‌లు) నుంచి ఆదాయం 5.91 శాతం పెరిగి రూ.10.03 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఆదాయపన్ను శాఖ డేటా తెలియజేస్తోంది. సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో ఖజానాకు రూ.50,279 కోట్లకు సమకూరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే ఎలాంటి వృద్ధి లేదు. పన్ను రిఫండ్‌లు (తిరిగి చెల్లింపులు) 18.82 శాతం తగ్గి రూ.3.34 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఇక ఫిబ్రవరి 10 నాటికి స్థూల పన్ను వసూళ్లు 4.09 శాతం పెరిగి రూ.22.78 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో కార్పొరేట్ పన్నుల స్థూల ఆదాయం రూ.10.88 లక్షల కోట్లుగా, నాన్ కార్పొరేట్ పన్నుల ఆదాయం రూ.11.39 లక్షల కోట్లుగా ఉంది.

| 'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో .. | |
|---|---|
| అదానీ గ్రీన్‌లో టోటల్ ఎనర్జీస్ వాటా విక్రయం | ఆటో విడిభాగాల రంగానికి ప్రభుత్వం అండ |

# ఎయిర్‌టెల్ ఫ్రాడ్ అలర్ట్

**న్యూఢిల్లీ:** బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించిన ఓటీపీ మోసాల నుంచి కస్టమర్లకు రక్షణ కల్పించే దిశగా ఫ్రాడ్ అలర్ట్ సాంకేతికతని ప్రవేశపెట్టినట్లు టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్ వెల్లడించింది. కృత్రిమ మేధ ఆధారితమైన ఈ టెక్నాలజీ, రియల్ టైమ్‌లో రక్షణ కల్పిస్తుందని తెలిపింది. మోసపూరితమైనదిగా అనిపించే ఇన్‌కమింగ్ కాల్‌లో కస్టమర్లు మాట్లాడుతున్నప్పుడు బ్యాంక్ ఓటీపీ గానీ వస్తే, దాన్ని తక్షణం గుర్తిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో బ్యాంకింగ్ లావాదేవీలకు ఆమోదం తెలపడం వల్ల తలెత్తబోయే ముప్పుల గురించి హెచ్చరిస్తుంది.

# సోలార్ ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు

- ఆర్డినెన్స్ స్థానే ముసాయిదా బిల్లుకు ఆమోదం
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

**సాక్షి, అమరావతి :** సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థలకు అసైన్డ్ భూముల బదలాయింపునకు సంబంధించి జారీచేసిన ఆర్డినెన్స్ స్థానే అసెంబ్లీలో బిల్లు పెట్టేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు..

- నీటిపారుదల శాఖలోని 7,189 నిర్వహణ పనులకు సంబంధించిన రూ.344.39 కోట్లకు పరిపాలన అనుమతి.
- ప్రభుత్వ భూముల్లోని ఇళ్లు, విశాఖ గాజువాక ప్రభుత్వ భూముల్లో వెయ్యి చదరపు గజాల వరకు క్రమబద్ధీకరణ గడువు ఈ ఏడాది జూన్ వరకు పొడిగింపు.
- గన్నవరంలో కస్టమ్స్ శాఖ భూమిపై గతంలో ఇచ్చిన జీఓలో మార్పుచేస్తూ నిర్ణయం.
- ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో 45.6ఎకరాలు బయోగ్యాస్ ప్లాంట్‌కు ఇచ్చేందుకు ఆమోదం.
- నంద్యాల జిల్లా సంజామలలో సౌర విద్యుత్ ప్రాజెక్టుకు 1,500 ఎకరాలు ఇచ్చేందుకు ఓకే.
- విశాఖ జిల్లా ఆనందపురంలో 18.57 ఎకరాలను రాష్ట్ర సేవా సమితికి బదిలీ.
- ఓటర్ల జాబితా ప్రచురణకు ఏటా నాలుగు అర్హత తేదీలు కల్పించే సవరణ బిల్లుకు ఆమోదం.
- గ్రామ, వార్డు సచివాలయాల చట్ట సవరణ ఆర్డినెన్స్ స్థానే ముసాయిదా బిల్లుకు ఆమోదం
- అమరావతిలో అమరావతి మెరీనా అభివృద్ధి ప్రాజెక్టు పీపీపీ విధానంలో 33 ఏళ్ల లీజు
- గ్రామీణప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-2 కింద ప్రతీ గృహ యూనిట్ విలువ రూ.2,39,000లుగా నిర్ణయం.

# శ్రీశైలంలో పోలీసుల అతి

## మంత్రుల వద్ద చంద్రబాబు అసహనం



**సాక్షి, అమరావతి :** శ్రీశైలంలో పోలీసులు అతి చేశారని, అంత అత్యుత్సాహం ఎందుకని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మంత్రులతో రాజకీయ అంశాలపై మాట్లాడారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుబాగోలేదని తప్పు పట్టారు. వృద్ధులను క్యూలైన్ల నుంచి బయటకు తీసుకువచ్చే సమయంలో అక్కడున్న భక్తులకు తప్పుడు సంకేతాలు వెళ్లకుండా మైకుద్వారా ముందే అనౌన్స్ చేస్తే సరిపోయే దన్నారు. పోలీసుల అతివల్ల గందరగోళం ఏర్పడిందని అప్పుడు కూడా సరిగా హ్యాండిల్ చేయలేకపోయారని వ్యాఖ్యానించారు. మంత్రుల ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలోనే ఉండి తమ శాఖలకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని సూచించారు.

# 'లులు' భూ కేటాయింపులపై కౌంటర్లు వెయ్యరేం?

- ఏడాది కావొస్తున్నా తాత్సారమేల?
- ఇంకా ఎంత కాలం తీసుకుంటారు?
- చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- తదుపరి విచారణ మార్చి 11కి వాయిదా

**సాక్షి, అమరావతి:** విశాఖపట్నం, విజయవాడలలో లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి భూకేటాయింపులపై కౌంటర్లు దాఖలు చేయాలని పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకపోవడంపై హైకోర్టు బుధవారం ప్రశ్నించింది. దాదాపు సంవత్సరం కావొస్తు న్నా ఈ వ్యవహారంలో ఎందుకు కౌంటర్లు వేయడం లేదని నిగ్గదీసింది. కౌంటర్ల దాఖలుకు ఇంకా ఎంత కాలం తీసుకుంటారని నిలదీసింది. తదుపరి విచారణ నాటికి కౌంటర్లు దాఖలు చేసి తీరాల్సిందేనని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయ మూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

**లులుకు భూ కేటాయింపులపై ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు**

విశాఖపట్నంలో 13.5 ఎకరాలను, విజయవాడలో 4.15 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకు లులు మాల్ యాజమాన్యానికి ప్రభుత్వం కేటాయించడాన్ని సవాలు చేస్తూ విశాఖకు చెందిన పాకా సత్యనారాయణ, విజయవాడకు చెందిన న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు గత ఏడాది హైకోర్టులో వేర్వేరుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై అప్పట్లో విచారణ జరిపిన సీజే ధర్మాసనం కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు వచ్చాయి.

**బిడ్డింగ్ ప్రక్రియ లేకుండానే కేటాయింపులు**

ఈ సందర్భంగా పాకా సత్యనారాయణ తరపు న్యాయవాది వి.అశోక్‌రామ్ వాదనలు వినిపించారు. ఎలాంటి బిడ్డింగ్ ప్రక్రియ చేపట్టకుండానే లులు మాల్‌కు భూ కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. ఈ కేటాయింపులు ఎంతమాత్రం పారదర్శకంగా లేవన్నారు. సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఈ కేటాయింపులు ఉన్నాయని స్పష్టం చేశారు. లులు మాల్‌కు వన్ ప్లస్ వన్ ఆఫర్ కింద విశాఖపట్నం, విజయవాడలలో భూములు కట్టబెట్టారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.గతంలో లులుకు విశాఖపట్నంలో చేసిన భూ కేటాయింపులను గత ప్రభుత్వం పలు కారణాలతో రద్దు చేసిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం రద్దు చేసిన కారణాలను పరిగణనలోకి తీసుకోకుండానే లులుకు తిరిగి భూములు కూటమి సర్కారు కేటాయింపులు చేసిందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. కౌంటర్లు దాదాపు సిద్ధమయ్యా యని ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పగా, తదుపరి విచారణ నాటికి వాటిని తమ ముందుంచాలని ధర్మాసనం ఆదేశించింది.

# ఒక్క జోన్‌లోనే రూ.167 కోట్ల మేర నాలా పన్ను బకాయిలా!

- మరి రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కోట్లు బకాయి ఉండాలి?
- హైకోర్టు ధర్మాసనం విస్మయం.. వసూలుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశం

**సాక్షి, అమరావతి:** వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకున్న సందర్భంగా చెల్లించాల్సిన నాలా పన్ను బకాయిలు కోట్ల రూపాయల మేర పేరుకుపోవడంపై హైకోర్టు తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఒక్క విజయవాడ నార్త్ జోన్ పరిధిలోనే రూ.167 కోట్ల మేర బకాయిలు ఉండటంపై విస్మయం వ్యక్తం చేసింది. ఒక జోన్‌లోనే ఇన్ని కోట్ల రూపాయల మేర బకాయిలు ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా ఎంత మొత్తంలో ఉంటాయంటూ ప్రశ్నించింది. బకాయిల వసూలు కోసం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ను ఆదేశించింది. వసూలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, మినహాయింపు విషయంలో కూడా చట్ట ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో తీసుకున్న వివరాలతో ఓ నివేదికను తమ ముందుంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ, కార్మెల్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 90 ప్లాట్లకు విజయవాడ మునిసిపల్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు సత్యనారాయణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

# జోగి రమేష్ విషయంలో చట్ట ప్రకారం నడుచుకోండి

- సెక్షన్ 35(3) కింద నోటీసిచ్చి వివరణ తీసుకోండి
- ఇబ్రహీంపట్నం పోలీసులకు హైకోర్టు ఆదేశం

**సాక్షి, అమరావతి:** మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జోగి రమేష్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదు చేసిన కేసులో చట్ట ప్రకారం నడుచుకోవాలని హైకోర్టు ఇబ్రహీంపట్నం పోలీసులను ఆదేశించింది. ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ నెల 6న తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ జోగి రమేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా, జోగి తరపున సీనియర్ న్యాయ వాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఫిర్యాదులో పిటిషనర్‌కు తనకు వ్యతిరేకంగా ఎటువంటి నిర్దిష్ట ఆధారాలు లేవని, నేరంలో పిటిషనర్ పాత్రను పేర్కొనలేదని కోర్టుకు నివేదించారు. అక్రమంగా గుమిగూడటం, పోలీసులపై నేర పూరిత బలప్రయోగం వంటి అంశాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవన్నారు. పోలీసులు రాజకీయ ప్రేరణతో తప్పుడు కేసు పెట్టారని, ఇవన్నీ ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడే వేనని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ విషయంలో చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను ఆదే శిస్తూ విచారణను వాయిదా వేశారు.

# మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ ఏర్పాటు చేయండి

**మార్చి 16 నాటికి నివేదిక ఇవ్వండి • రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం కేసులో హైకోర్టు బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేనిపక్షంలో ప్రస్తుతం ఉన్న సిట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆదేశించింది. ఈ సిట్‌కు అదనపు డీజీ స్థాయికి తక్కువ కాని అధికారి నేతృత్వం వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ సిట్‌లో ఎవరెవరు ఉంటారన్న వివరాలను మూడు రోజుల్లో హైకోర్టు రిజిస్ట్రార్‌కు అందచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా లేదా, వాటిని ఎవరైనా ట్యాంపరింగ్ చేశారా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిట్‌ను ఆదేశించింది. అసలు ఓఎంఆర్ షీట్లు, విజయవాడలో ఫిజికల్ వాల్యుయేషన్ సమయంలో ఉపయోగించిన ఓఎంఆర్ షీట్లు, సమాధాన పత్రాలపై ఉన్న బార్ కోడ్‌లు, వాటినుంచి సేకరించిన వివరాలన్నీ ఒకేలా ఉన్నాయో లేదో సరిపోల్చాలని కూడా స్పష్టం చేసింది. ఎంపికైన అభ్యర్థుల సమాధాన పత్రాలను ఏవిధంగా తనిఖీ చేస్తారో, అదే రీతిలో ఎంపిక కాని అభ్యర్థుల సమాధాన పత్రాలను కూడా పరిశీలించాలని ఆదేశించింది. అలాగే మెరిట్ లిస్ట్‌లో చివరిగా ఎంపికైన అభ్యర్థి కంటే కింద ఉన్న 100 మంది అభ్యర్థుల జవాబు పత్రాలను కూడా పరిశీలించాలని సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. పైన పేర్కొన్న నిర్దిష్ట అంశాలపైనే కాకుండా (బార్ కోడ్‌లు, ఓఎంఆర్ షీటు వంటివి), దర్యాప్తు సంస్థ ఇతర శాస్త్రీయ మార్గాల ద్వారా కూడా అక్రమాలను వెలికితీయవచ్చని కోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తులో ఎలాంటి స్థానిక ప్రభావం లేకుండా ఉండటానికి, రాష్ట్రం వెలుపల ఉన్న ఏదైనా సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నిపుణుల సహాయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న వారు తమ అధికార బలంతో విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఎంపిక కాని అభ్యర్థులు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తక్షణమే వారందరినీ తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు నాన్–ఫోకల్ (ప్రాధాన్యత లేని) పోస్టులకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఓ వారంలో ఆ అధికారుల బదిలీలకు సంబంధించిన వివరాలతో ఓ నివేదికను రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఎంపిక కాని అభ్యర్థుల జవాబు పత్రాలను కూడా ఎంపికైన అభ్యర్థుల మాదిరిగానే విచారించాలని సిట్‌కు తేల్చి చెప్పింది. మార్చి 16 లోపు నివేదిక సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. అన్ని అప్పీళ్లపై మార్చి 16న తిరిగి విచారణ జరుపుతామంది. ఈ ఆదేశాల కాపీని ప్రత్యేక మెసెంజర్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో సిట్‌ను ప్రతివాదిగా చేర్చాలని రిజిస్ట్రీకి స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీళ్ల నేపథ్యంలో**

గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మొత్తాన్ని రద్దు చేశారు. అలాగే గ్రూప్–1 మెయిన్స్‌లో అర్హత సాధించిన వారి జాబితాను కూడా రద్దు చేశారు. తిరిగి గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, మొత్తం ప్రక్రియను 6 నెలల్లో పూర్తి చేయాలని ఏపీపీఎస్సీ అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. మరోవైపు ఉద్యోగాలు పొంది ప్రస్తుతం వివిధ హోదాల్లో కొనసాగుతున్న వారు కూడా అప్పీళ్లు దాఖలు చేశారు. అలాగే వీరు పలు అభ్యర్థనలతో అనుబంధ పిటిషన్లు సైతం దాఖలు చేశారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్‌ను ప్రతివాదిగా చేయాలని, గ్రూప్–1 మూల్యాంకనంలో జరిగిన అక్రమాల మీద నమోదైన క్రిమినల్ కేసులో సిట్ దర్యాప్తు అధికారి ఫోరెన్సిక్ ఎగ్జామినేషన్ రిపోర్టును కోర్టు ముందు ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు నియమించిన కమిటీ పరిశీలించిన ఆన్సర్ షీట్స్, కంట్రోల్ బండిల్స్ ఫోరెన్సిక్ ఎగ్జామినేషన్‌కి ఇవ్వాలన్న అభ్యర్థనలతో మరికొన్ని అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై గతంలో వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తన నిర్ణయాన్ని వెలువరించింది.

# ఏడాది కావొస్తున్నా తాత్సారమేల?

- రాష్ట్ర ప్రభుత్వ అలక్ష్యంపై స్పందించిన హైకోర్టు
- ఇంకా ఎంత కాలం తీసుకుంటారు?
- చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- తదుపరి విచారణ మార్చి 11కి వాయిదా

**సాక్షి, అమరావతి:** గిరిజన ప్రాంతాల్లోని 878 రెవెన్యూ గ్రామాల జాబితా ప్రచురణ విషయంలో ప్రభుత్వ అలక్ష్యంపై హైకోర్టు స్పందించింది. ఈ గ్రామాల జాబితాను సరిహద్దులతో సహా వెంటనే గిరిజన సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కూడా ఆదేశించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**జాబితా సిద్ధం చేసినా వెబ్‌సైట్‌లో ఉంచడం లేదు**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఇప్పటికే ఈ 878 రెవెన్యూ గ్రామాల జాబితాను సిద్ధం చేసినప్పటికీ.. దానిని అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచడం లేదంటూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు టి.వెంకట శివరామ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది చల్లా శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 878 రెవెన్యూ గ్రామాల వివరాలు బహిరంగంగా అందుబాటులో లేకపోవడం వల్ల గిరిజన యువత, పేద కుటుంబాలు తమ రాజ్యాంగ హక్కులను పొందలేకపోతున్నారని తెలిపారు. గ్రామాల వివరాలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, గిరిజనేతరులు షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని సారవంతమైన భూములను ఆక్రమిస్తున్నారని, అక్రమ మైనింగ్, వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలపై స్పష్టమైన సమాచారం లేకపోవడం వల్ల గిరిజనులకు రావలసిన భూమి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు దూరమవుతున్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం ఆ 878 రెవెన్యూ గ్రామాల జాబితాను వెంటనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## క్లుప్తంగా...

### నాన్న నిర్దోషి అని దేవుడే తేల్చారు

- అంబటి రాంబాబు కుమార్తె మౌనిక
- ఆయనకు బెయిల్ రావడంతో ఇంటి వద్ద సంబరాలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** 'భగవంతుడిపై మేం ఉంచిన నమ్మకం వమ్ము కాలేదు. నాన్న నిర్దోషిత్వాన్ని దేవుడే నిరూపించారు' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కుమార్తె అంబటి మౌనిక అన్నారు. అంబటి రాంబాబుపై అక్రమంగా మోపిన కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో బుధవారం గుంటూరులోని ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, అంబటి మౌనికతో కలిసి స్వీట్లు పంచిపెట్టారు. మౌనిక మాట్లాడుతూ.. దేవుడు తమవైపు ఉన్నారని, అక్రమంగా కేసుల్లో ఇరికించాలనుకున్న వారికి గట్టి గుణపాఠం చెబుతారన్నారు. న్యాయవ్యవస్థపై తమకు నమ్మకముందన్నారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రేపే బార్ కౌన్సిల్ ఎన్నికలు

- బరిలో 143 మంది అభ్యర్థులు
- మహిళలకు తొలిసారిగా 30 శాతం రిజర్వేషన్లు అమలు

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సర్వంసిద్ధమైంది. ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 121 న్యాయవాద సంఘాల్లో జరగనున్న ఈ ఎన్నికలకు బార్ కౌన్సిల్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే బ్యాలెట్ పత్రాలను, బాక్సులను అన్ని న్యాయవాద సంఘాలకు పంపించారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్న డూ లేనివిధంగా 143 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 25 మంది సభ్యులు ఉండే రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీ, వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం, కమ్యూనిస్టు పార్టీల తరఫున అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బహిరంగంగా ఫలానా పార్టీ అని చెప్పకపోయినా.. అంతర్గతంగా మాత్రం పార్టీల పేరిట ప్రచారం చేసుకుంటున్నారు. ఈసారి డిజిటల్ మీడియాను వినియోగిస్తున్నారు. హైకోర్టు, జిల్లా కోర్టుల్లో వద్ద భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలు పెద్దసంఖ్యలో బరిలో ఉండగా వారికి తొలిసారి 30 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు.

### గవర్నర్ ప్రసంగం నిరాశపరిచింది

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

**సాక్షి, అమరావతి:** బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం నిరాశ పరిచిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు, విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితులను గవర్నర్ పట్టించుకోలేదన్నారు. 20 నెలల్లో ప్రజలపై మోపిన అదనపు భారాలు, బలవంత పు భూ సేకరణ, హామీల అమలులో వైఫల్యాలు, నిరుద్యోగం ప్రస్తావించలేదన్నారు. కౌలు రైతులు, అన్నదాత సుఖీభవ, ఉద్యోగులకు పీఆర్సీని విస్మరించారన్నారు. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేశారన్నారు. రెండేళ్ల పాలనలో 'చేసింది తక్కువ – చేస్తామని చెప్తున్నది ఎక్కువ'ని దుయ్యబట్టారు.

# మూగజీవాలపై 'పైసా'చికత్వం

**హోం మంత్రి అనిత పీఏ అండ.. అక్రమంగా పశువుల రవాణా**

- 'రక్షణ చారిటబుల్ ట్రస్ట్', అనుబంధంగా గోశాల ఏర్పాటు
- జాతీయ రహదారిపై పశువులను తరలించే వాహనాలను అడ్డుకుని వసూళ్లు
- డబ్బులిస్తే ఓకే... లేదంటే పోలీసులకు ఫిర్యాదు
- ఏజెన్సీ, ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు పశువుల కొనుగోళ్లు
- వాటని అర్ధరాత్రి వేళ హైదరాబాద్‌లోని పశువధ శాలలకు తరలింపు
- తాజాగా హోం మంత్రి పీఏ గణేష్ వసూళ్ల దందా సోషల్ మీడియాలో వైరల్
- తప్పనిసరి పరిస్థితుల్లో విచారణకు ఆదేశించిన మంత్రి అనిత
- గతంలో అవినీతి ఆరోపణలతో హోం మంత్రి పాత పీఏ జగదీష్ రచ్చ

హోంమంత్రి మాజీ పీఏ జగదీష్

హోంమంత్రి ప్రస్తుత పీఏ గణేష్

**సాక్షి, అనకాపల్లి:** హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం పశువుల అక్రమ రవాణాకు అడ్డాగా మారిపోయింది. ఆమె పీఏ సుంకర గణేష్ ఈ దందా వెనుక కీలకంగా ఉంటూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు వెలుగుచూసింది. ముఖ్యంగా అనకాపల్లి జిల్లాలో టీడీపీకి చెందిన ముఠా మూగజీవాలపై 'పైసా'చికత్వం ప్రదర్శిస్తోందని... ఈ ముఠా రోజు రోజుకూ వికృతరూపం దాలుస్తోందనే ఆరోపణలున్నా యి. జాతీయ రహదారిపై అర్ధరాత్రి వేళ సాగుతున్న ఈ దందాపై, గణేష్ అవినీతిపై సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరలవుతోంది. గణేష్‌పై 2022లో కాకినాడ జిల్లా ప్రతిపాడు పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో హోంమంత్రి అనిత స్పందిస్తూ పీఏ గణేష్‌పై విచారణ చేపట్టి, నివేదిక అందజేయాలని ఆదేశించారు. అయితే ఏ స్టేషన్ పోలీసులు విచారణ చేస్తున్నారో తెలియడం లేదు.

**గోశాల ముసుగులో భారీ దందా**

హోం మంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం మండలంలో పెనుగొల్లు, సోముదేవుపల్లి, గోకులపాడు, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాల్లోని తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వారంతా హోంమంత్రి అనిత పీఏ సుంకర గణేష్ అండదండలతో పెనుగొల్లు గ్రామంలో డోర్ నెం.2–8/2 అడ్రస్‌తో 'రక్షణ చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటు చేశారు. దానికి అనుబంధంగా విజయవాడలో గల ఏపీ యానిమల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అక్రమమార్గంలో రికగ్నైజేషన్ సర్టిఫికెట్ పొంది గోశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జాతీయ రహదారిలో గోవులను అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకుని వసూళ్లకు పాల్పడేవారు. డబ్బులివ్వకుంటే ఆ వాహనాలను పోలీసులకు అప్పగించేలా చేసి... అక్కడి నుంచి ఆ వాహనాల్లోని పశువులను తమ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న గోశాలకు తరలించుకునేవారు. అదే సమయంలో ఏజెన్సీలోని పాడేరు, అరకు ప్రాంతాల్లో తక్కువ ధరకే పశువులు కొనుగోలు చేసేవారు. అప్పటికే గోశాలలో ఉన్న గోవులతోపాటు తక్కువ ధరకే కొనుగోలు చేసిన పశువులను కలిపి రక్షణ చారిటబుల్ ట్రస్టు ముసుగులో హైదరాబాద్‌కు అక్రమంగా తరలించేవారు. ఎస్.రాయవ రం మండలం పెనుగొల్లులోని చారిటబుల్ ట్రస్ట్ నుంచి పశువులను హైదరాబాద్‌లోని వ్యాపారుల పశువధ శాలలకు తరలిస్తూ అక్రమాలకు పాల్పడ్డారని... ఈ ముఠాపై విచారణ జరిపి... వారికి జారీ చేసిన సర్టిఫికెట్ రద్దు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, లోకాయుక్తకు ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సోమిరెడ్డి వెంకట అప్పల సత్య సన్యాసి నూకరాజు ఫిర్యాదు చేశారు. ముఠా సభ్యులను, వారికి సహకరిస్తున్న వారి వివరాలు చేర్చి గతేడాది ఆగస్టులో చర్యలు తీసుకోమని కోరినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం విశేషం. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు 'రక్షణ చారిటబుల్ ట్రస్ట్'ను మాత్రం రద్దు చేశారు.

గతంలో ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులో 'రక్షణ చారిటబుల్ ట్రస్ట్' పేరిట పశువుల అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం (ఫైల్)

**హైవేపై రయ్‌రయ్‌మని..**

అనకాపల్లి జిల్లాలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి సమయంలో వాహనాల్లో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. స్థానికంగా కొందరు హైదరాబాద్‌కు చెందిన పశువధ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. వీరంతా కొద్ది రోజుల కిందట కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులతో సమావేశమయ్యేలా అని త పీఏ గణేష్ ఏర్పాట్లు చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అందరినీ ఓ ముఠాగా ఏర్పాటు చేసి అనకాపల్లి నుంచి హైదరాబాద్ వరకూ ఏ అడ్డంకీ లేకుండా పశువుల అక్రమ రవాణాకు గణేష్ రూట్‌మ్యాప్ సిద్ధం చేశాడని తెలుస్తోంది. ఇప్పటికే వ్యాపారులంతా డీసీఎంలు, బొలెరో వాహనాల్లో అత్యంత విచక్షణారహితంగా ఒక్కో వాహనంలో 20 నుంచి 40 వరకు పశువులను తాళ్లతో బంధించి అతి క్రూరంగా తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సర్కారు శాడిజానికి పరాకాష్ట

▶ మొదటి పేజీ తరువాయి

గుంటూరు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి బి.మేరీ సారధనమ్మ బుధవారం బెయిల్ మంజూరు చేశారు. గురువారం ఆయన విడుదల అవుతారని అనుకుంటున్న తరుణంలో వెంటనే మరో కేసులో పీటీ వారెంట్ జారీ అయ్యింది. గతంలో అంబటి నిర్వహించిన సంక్రాంతి సంబరాలపై జనసేన నాయకుడు పెట్టిన ఓ పెట్టీ కేసులో ఇపుడు పీటీ వారెంట్ జారీచేశారు. ఇలా వరుస కేసులతో హింసించడం సర్కారు శాడిజానికి పరాకాష్ట అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. పొరపాటున మాట తూలినా క్షమాపణ కోరిన అంబటిని సెంట్రల్ జైలులో నిర్బంధించిన కూటమి ప్రభుత్వం అంబటి ఇంటిపై పెట్రోలు బాంబులు విసిరి, మారణాయుధాలతో భయానక దాడులు చేసిన వారికి మాత్రం స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపింది. రాష్ట్రంలో చంద్రబాబు ఓ విష సంస్కృతికి శ్రీకారం చుట్టారని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చని పరిశీలకులంటున్నారు. ఒక కాపు నేతపై ఇంతలా కక్ష సాధించడం విడ్డూరమని వారు పేర్కొంటున్నారు. ప్రశ్నిస్తున్నందునే అంబటిని ఇలా దుర్మార్గంగా హింసిస్తున్నారని అంటున్నారు.

**బెయిల్.. వెంటనే పాత కేసులో పీటీ వారెంట్..**

అంబటి రాంబాబుపైకి దాడికి తెగబడటమే కాకుండా, ఇంటిపైన , కార్యాలయంపైన దాడి చేసి కార్యాలయానికి, కార్లకు నిప్పు పెడితే ఆ కేసులో ఒక్కరిని కూడా ఇప్పటి వరకూ అరెస్టు చేయలేదు. పైగా దాడికి గురైన అంబటి రాంబాబుపైనే అక్రమ కేసు బనాయించి జైలుకు తరలించారు. ఈ కేసులో బెయిల్ వచ్చే సమయానికి కస్టడీ పిటీషన్‌తో పాటు మరో పాత కేసులో పీటీ వారెంట్ వేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సామాన్య ప్రజల ఆరోగ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలలో భాగంగా గుంటూరులో జరిగిన ధర్నాలో పాల్గొన్న అంబటిపై అధికారులను బెదిరించారంటూ పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసులో ఆయనకు ఈ నెల 22 వరకూ రిమాండ్ విధించారు. ఈ కేసులో బుధవారం వాదనల అనంతరం గుంటూరు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి బి. మేరీ సార ధనమ్మ బెయిల్ మంజూరు చేశారు. ఈ బెయిల్‌కు సంబంధించి షూరిటీలు అన్నీ సమర్పించిన తరుణంలో.. సత్తెనపల్లిలో అంబటి నిర్వహించిన సంక్రాంతి సంబరాలపై జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు వేసిన కేసును బయటకు తీసారు. ఈ కేసులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీంతో ఆయనను గురువారం గుంటూరు కోర్టులో మళ్లీ హాజరుపరుచనున్నారు. అంబటి రాంబాబుపై దాడి జరిగిన తర్వాత కొత్తగా 36 కేసులు నమోదు చేయగా ఆ కేసులన్నింటిలో 41 కింద నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో అంబటిపై మరో కేసును తెరపైకి తీసుకువచ్చారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, అన్యాయాలపై తన గళం వినిపిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు పట్ల రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో జరుగుతున్న వేధింపులపై అన్ని వర్గాలలో నిరసన వ్యక్తం అవుతోంది. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొంటున్నారు. సంబంధిత కేసులపై న్యాయపరమైన పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు వెల్లడించారు.

**సుప్రీం తీర్పులకు విరుద్ధంగా..**

అంబటి రాంబాబు మాట్లాడిన ఒక్క మాటకు 36 కేసులు పెట్టారు. ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు కూడా విరుద్ధమని, దీని వెనుక సర్కారు రాక్షసత్వం, ఒక వ్యక్తిపై కక్ష, పగ కనిపిస్తున్నాయని న్యాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్ 2022లో ఇచ్చిన తీర్పు ప్రకారం ఓ కాగ్నిజబుల్ అఫెన్స్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే.. ఇక ఎక్కడా అలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. ఈ ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయకుండా ఫిర్యాదుదారుల్ని సాక్షులుగా పేర్కొనవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. టీటీ ఆంథోనీ కేసులోనూ ఆర్టికల్ 141 ప్రకారం ఓ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత అదే కేసులో మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదని సుప్రీంకోర్టు చెప్పినా ఆ తీర్పును రాష్ట్రంలో అమలు చేయడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం ఆర్టికల్ 141, సుప్రీంకోర్టు తీర్పుల్ని లెక్కచేయడం లేదు.

**ఒకే కేసులో ఇన్ని ఎఫ్ఐఆర్‌లా..హైకోర్టు విస్మయం..**

అంబటి రాంబాబుపై అనేక కేసులు నమోదు చేస్తుండడంపై హైకోర్టు కూడా విస్మయం వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా తనపై నమోదైన కేసులను కొట్టేయాలని కోరుతూ అంబటి లంచ్‌మోషన్ రూపంలో దాఖలుచేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ జరిపారు. ఒకే అంశంపై ఎన్ని ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తారని న్యాయమూర్తి ఈ సందర్భంగా ప్రశ్నించారు. మొదటి ఫిర్యాదును ప్రధాన కేసుగా తీసుకుని మిగిలిన అన్ని ఫిర్యాదులను సీఆర్‌పీసీ సెక్షన్ 162 కింద వాంగ్మూలాలుగా ఎందుకు పరిగణించకూడదని ప్రశ్నించారు. అంబటి కేసులో చట్ట ప్రకారం వ్యవహరించాలని హైకోర్టు గుంటూరు జిల్లా, మంగళగిరి గ్రామీణ పోలీసులను ఆదేశించారు. ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేశారు. ఈ కేసులో తమ కుట్ర ఫలించకపోవడం వల్లనే ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతో అంబటిపై ఒక కేసు తర్వాత మరో కేసు పెడుతున్నారని విమర్శకులంటున్నారు.

### సచివాలయ ఉద్యోగుల వరుస మరణాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

**గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్**

**సాక్షి, అమరావతి:** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వరుస మరణాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరపాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడి, వరుసగా జరుగుతున్న మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ధర్మంగా భావించి కష్టకాలాల్లోనూ ముందుండి పనిచేసిన ఉద్యోగులు ఈరోజు ఒత్తిడికి గురవడం బాధాకరమన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రాణాలకు తెగించి క్షేత్రస్థాయిలో పనిచేసిన సచివాలయ వ్యవస్థ దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిందని, అలాంటి ఉద్యోగులను ఈరోజు చులకనగా చూసే పరిస్థితి రావడం అంగీకరించలేని విషయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, జరిగిన ప్రతి మరణంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు ధైర్యంగా ఉండాలని, ఉద్యోగుల హక్కులు, గౌరవం, భద్రత కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పేర్కొన్నారు.

### లడ్డూ వ్యవహారంతో రాజకీయం తగదు

**వామపక్ష పార్టీలు**

**సాక్షి, అమరావతి:** తిరుమల లడ్డూ వ్యవహారంతో ప్రజల మత మనోభావాలను రెచ్చగొట్టి రాజకీయంగా సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. సుప్రీంకోర్టు నియమించిన సిట్ నివేదిక బయట పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి మతపరంగా చిచ్చుపెట్టే చర్యలను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయని బుధవారం హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు పి.ప్రసాదు అధ్యక్షతన జరిగింది. అనంతరం బాలోత్సవ భవన్‌లో విలేకరులతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లడ్డూ విషయాన్ని వివాదంగా మార్చి ప్రజల మధ్య మతోన్మాద విషబీజాలు నాటుతున్నారని మండిపడ్డారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అదేపనిగా మాట్లాడడం సరికాదన్నారు. చంద్రబాబు జంతు కొవ్వు, పవన్ కళ్యాణ్ నెయ్యి కాని నెయ్యి అంటున్నారని...వీరు చెప్పేదానికి పొంతన లేదని విమర్శించారు. వామపక్ష పార్టీల నాయకులు ఈశ్వరయ్య, కిషోర్, వెంకటేశ్వరరావు, వనజ, పొలారి, ఉదయకిరణ్, జానకిరాములు, రామకృష్ణ, సుందరరామరాజు, ఖాదర్‌బాషా, చంద్రశేఖర్, సుధీర్ పాల్గొన్నారు.

### రేపటి వరకూ ఆప్షన్ నమోదుకు అవకాశం

**సాక్షి, అమరావతి:** మూడో విడత పీజీ మెడికల్ కన్వీనర్(నాన్–సర్వీస్), యాజమాన్య కోటా ప్రవేశాలకు ఆప్షన్ల నమోదు గడువును ఆరోగ్య విశ్వవిద్యాలయం పొడిగించింది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల్లోపు అభ్యర్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్ బుధవారం ప్రకటించారు.

### మార్చి 7 వరకూ అసెంబ్లీ సమావేశాలు

- 17 రోజులు సభా కార్యకలాపాలు
- 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి

**సాక్షి, అమరావతి:** ఏపీ బడ్జెట్ సమావేశాలను మార్చి 7వ తేదీ వరకూ నిర్వహించాలని అసెంబ్లీ సభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. బుధవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం తర్వాత గురువారానికి వాయిదా పడ్డాయి. అనంతరం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జనసేన తరఫున నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున విష్ణుకుమార్‌రాజు పాల్గొన్న ఈ సమావేశంలో మొత్తం 17 పని దినాల పాటు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. 12, 13 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ్యులు మాట్లాడి ఆమోదం తెలపనున్నారు. 14న ఆర్థిక మంత్రి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అదేరోజు వ్యవసాయ బడ్జెట్ కూడా ప్రవేశపెడతారు. 15, 16 తేదీల్లో సమావేశాలకు సెలవు ప్రకటించారు. ఆ తర్వాత మార్చి 6వ తేదీ వరకూ శని, ఆదివారాలు మినహా మిగిలిన అన్ని రోజులు సభ నిర్వహించాలని నిర్ణయించారు. 7వ తేదీన శనివారమైనా సభ నిర్వహించి ఆ రోజుతో సమావేశాలను ముగించనున్నారు. ఈ సమావేశాల్లో 6 బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే వాటిపై ఆర్డినెన్స్‌లు జారీ చేయగా.. ఇప్పుడు బిల్లులు పెట్టాలని నిర్ణయించారు. ఏపీ ఎలక్ట్రిసిటీ డ్యూటీ సవరణ, ఫైర్ సర్వీసెస్ సవరణ, అసైన్డ్ ల్యాండ్స్ సవరణ, పంచాయతీరాజ్ సవరణ, ఏపీ మోటార్ వెహికల్ టాక్సేషన్, గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లుల్ని ప్రవేశపెట్టనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుండి 11 గంటల వరకు ప్రశ్నోత్తరాలు తప్పనిసరిగా నిర్వహిస్తామని స్పీకర్ సమావేశంలో స్పష్టం చేసినట్టు తెలిసింది. అలాగే జీరో అవర్ కూడా నిర్వహించాలని నిర్ణయించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## క్లుప్తంగా...

### పర్యావరణ పరిరక్షణ సంస్థలకు గ్రీన్ రేటింగ్

**సాక్షి, అమరావతి:** సర్క్యులర్ ఎకానమీలో భాగంగా పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించి జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వాటిని సమర్థంగా అమలు చేస్తున్న సంస్థలను గుర్తించి, గ్రీన్ రేటింగ్, జీరో ఎమిషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతిపాదించింది. సీఐఐ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ, ఏపీపీసీబీతో కలిసి పర్యావరణ పరిరక్షణ, సుస్థిర పారిశ్రామికాభివృద్ధి దిశగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నట్టు తెలియజేసింది.

### ఏయూ స్మాల్ బ్యాంకులో ప్రభుత్వ నిధులకు అనుమతి

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ నిధులను ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో జమ చేసేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి డి.రొనాల్డ్ రాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిధులను నోటిఫైడ్ బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి ఎప్పటికప్పుడు జారీ చేసే షరతులను బ్యాంకులు, సంస్థలతో పాటు ఏయూ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

### దీర్ఘకాలిక సెలవులో భాస్కర్ కాటమనేని

**సాక్షి, అమరావతి:** ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని వైద్య చికిత్స కోసం దీర్ఘకాలిక సెలవు తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 12 నుంచి 28 వరకు సెలవులో ఉంటుండటంతో ఆయన నిర్వహించే పలు శాఖల విధులను ఇతర అధికారులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### దోమలు పట్టడం ఎలా?

**కీటకాల సేకరణ ఉద్యోగులకు శిక్షణ**

**సాక్షి, అమరావతి:** దోమలు పట్టడంలో వైద్య శాఖలోని కీటకాల సేకరణ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు వైద్య శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దోమలు పట్టడంలో మెళకువలు నేర్పడం కోసం శిక్షణ ఇస్తున్నట్టు వివరించింది. విజయవాడ శివారులోని జక్కంపూడి, ఇతర ప్రాంతాల్లో కీటకాల రకాలు, వాటి ఉనికి, కదలికలు, వృద్ధి, గుర్తింపు అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు పేర్కొంది.

### ఉపాధ్యాయుల సంక్షేమంపై చర్యలు తీసుకోవాలి

**నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్**

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమంపై ప్రభుత్వం సమగ్ర విధానాలు అమలు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎంకు వినతిపత్రం ఇచ్చినట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### 'నెలాఖరులోగా విశిష్ట సంఖ్య నమోదు చేసుకోండి'

**సాక్షి, అమరావతి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కాని రైతులు ఈ నెలాఖరులోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో ఫార్మర్ రిజిస్ట్రీ కీలకమన్నారు. పీఎం కిసాన్ వంటి పథకాల లబ్ధి పొందేందుకు ప్రతి రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలన్నారు.

# చుక్.. చుక్.. రైలు రాదాండీ!

"నీవు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు" అన్నారు ఒక సినీ కవి. రైలు ఏమో కానీ కోనసీమ రైల్వే ప్రాజెక్టు తీరు తెన్నులు చూస్తుంటే అది నిజమే అనిపిస్తోంది. ప్రాజెక్టుకు శంకుస్థాపన రాయిపడి 26 ఏళ్లు కావస్తోంది. కాని రైలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. 2016–17 నుంచి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. కాని రెండేళ్లుగా మాత్రం కేటాయింపులు అరకొరగా ఉండడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం మరింత ఆలస్యమవుతోందని కోనసీమ వాసులు ఆందోళన చెందుతున్నారు.

**గత ఏడాదీ ఇదే పరిస్థితి**



- నత్తనడకన కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం
- చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిన పనులు
- కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టి 10 రోజులు దాటినా నిధులపై రాని స్పష్టత
- గతంలో నాలుగు రోజులకే కేటాయింపుల ప్రకటన

**సాక్షి, అమలాపురం:** కాకినాడ– కోటిపల్లి– నర్సాపురం రైల్వే ప్రాజెక్టుకు 2000 సంవత్సరంలో శంకుస్థాపన జరిగింది. 2014 వరకు అరకొర కేటాయింపులు జరిగాయి. తరువాత నుంచి బడ్జెట్ కేటాయింపులు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. కానీ ఖర్చు మాత్రం కావడం లేదు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించింది కేవలం రూ.1,035 కోట్లు. కాని ఖర్చు మాత్రం అరకొరగా సాగింది. గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదుల మీద పిల్లర్ల నిర్మాణ తీరు నత్తను తలపించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 నుంచి 2024 వరకు రూ.1,496 కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించారు. పనులు వేగంగా సాగి మూడు నదీపాయల మీద పిల్లర్లు పూర్తయ్యాయి. గౌతమీ నదిపై కోటిపల్లి– శానపల్లి లంక మధ్య 3.50 కిమీల వంతెనకు సంబంధించి పిల్లర్లు మీద వేయాల్సిన గడ్డర్లు, ఐరన్ రైలింగ్ వంటి నిర్మాణాలకు రూ.296 కోట్లకు టెండర్లు ఖరారయ్యాయి. భూసేకరణకు నాటి జగన్ ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించడంతో సర్వే పనులు వేగంగా సాగాయి.

### ఏడాదిన్నరగా ప్రచారానికే పరిమితం

రాష్ట్రంలో తిరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో రావడం.. కోనసీమ రైల్వే ప్రాజెక్టు పనులు పడకేయడం జరిగిపోయింది. గత ఏడాదిన్నరగా వశిష్ట నదీ పాయపై ఒకటి రెండు పిల్లర్లు, వైనతేయ వద్ద మరికొన్ని పిల్లర్ల పనులు మాత్రమే జరిగాయి. గౌతమీ నదిపై గెడ్డర్ల నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. అసలు జరుగుతాయో లేదో కూడా తెలియని దురవస్థలో ఉంది. దీనికితోడు రెండు బడ్జెట్‌లలో నిధులు కేటాయింపులపై స్పష్టత లేదు. 2016లో సవరించిన అంచనాల మేరకు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.2,120 కోట్లు గత బడ్జెట్‌లోనే చూపించేశారని కూటమి నాయకులు ప్రచారం చేశారు. తరువాత రూ.120 కోట్లని మరోసారి చెప్పారు. ఈ ఏడాది కూడా ఇదే ప్రచారం చేశారు. మరి కొంతమంది ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.2.60 కోట్లు మాత్రమే ఇచ్చారని సామాజిక మాధ్యమాలలో చేస్తున్న ప్రచారంతో తమ చిరకాల వాంఛ రైల్వే లైన్ ఇప్పుడప్పుడే పూర్తి కాదని కోనసీమ వాసుల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పింక్‌బుక్ లేదు

కాకినాడ– కోటిపల్లి– నర్సాపురం రైల్వే లైన్‌కు గత ఏడాది, ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులపై అనిశ్చితి కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టింది. కానీ ఇంతవరకు కోటిపల్లి– నర్సాపురం రైల్వే ప్రాజెక్టుకు నిధులు కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైల్వేకు సొంతంగా బడ్జెట్ ప్రవేశపెట్టేది. ఆ రోజుల్లో సాయంత్రాని కల్లా కోనసీమ రైల్వేలైన్‌కు కేటాయింపుల వివరాలు తెలిసేవి. 2016 నుంచి రైల్వే ప్రత్యేక బడ్జెట్ నిలిపివేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించే బడ్జెట్‌లోనే రైల్వేకు కేటాయింపులు చేస్తున్నారు. రైల్వేకు ఇచ్చిన నిధులను జోన్లు, ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసే పింక్ బుక్ (రైల్వే ఆస్తులు, ఖర్చులు, నిర్మాణాలు పొందు పరిచే పుస్తకం)లో నమోదు చేసేవారు. కేంద్ర బడ్జెట్ ప్రకటించిన నాలుగైదు రోజుల్లో ప్రాజెక్టులు వారీగా కేటాయింపులు పింక్ బుక్ ద్వారా విడుదలయ్యేవి. కానీ గత ఏడాది నుంచీ ఈ విధానం ఎత్తివేసి కేవలం జోన్ల వారీగా కేటాయింపులు చేస్తున్నారని సమాచారం. ఆయా ప్రాజెక్టులకు కేటాయింపులు చేయడం లేదు. రైల్వే ప్రాజెక్టు సంబంధించి అమలాపురం మండలం భట్నవిల్లి నుంచి మలికిపురం మండలం దిండి వరకు భూ సేకరణ చేయకపోవడంతోపాటు వంతెనలు పూర్తి చేసే పనులకు టెండర్లు ఖరారు కాకపోవడంతో పనులు జరగడం లేదు.

**కోనసీమ రైల్వేలైన్‌కు వైఎస్సార్ సీపీ, టీడీపీ పాలనలో బడ్జెట కేటాయింపులు ఇలా (రూ.కోట్లలో)**

| టీడీపీ హయాంలో.. | | వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో.. | | కూటమి హయాంలో... |
|---|---|---|---|---|
| 2015–16 | 5 | 2020–21 | 550 | 2025–26, 2026–27 : బడ్జెట్ కేటాయింపులపై ప్రకటన లేదు. |
| 2016–17 | 200 | 2021–22 | 187 | |
| 2017–18 | 430 | 2022–23 | 359 | |
| 2018–19 | 200 | 2023–24 | 100 | |
| 2019–20 | 200 | 2024–25 | 300 | |

కోటిపల్లి వరకు నిర్మాణం జరిగిన రైల్వే లైన్

### ఆ ప్రచారం ఊహాజనితం

రైల్వేలో పింక్ బుక్ అనేది ఎత్తివేశారు. దీనివల్ల ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయడం లేదు. కేవలం జోన్ల వారీగా కేటాయింపులు సాగుతున్నాయి. కాబట్టి రైల్వే ప్రాజెక్టుకు కేటాయింపులు అంత చేశారు, ఇంత చేశారు అనే ప్రచారం ఊహాజనితమే కానీ వాస్తవం కాదు.

– డాక్టర్ ఇ.ఆర్.సుబ్రహ్మణ్యం, కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్, అమలాపురం

టెండర్లు ఖరారైనా గౌతమీ నదిపై పూర్తి కాని గడ్డర్ల నిర్మాణం

వైనతేయ నదీపాయపై రైల్వే వంతెన పిల్లర్లు

# కబ్జాలకు కత్తెర

## కబ్జాదారులు యజమానులు కారని హైకోర్టు తీర్పు

- ఆక్రమణకు కాలం సరిపోదు.. యాజమాన్యానికి చట్టమే ఆధారం!
- విజయవాడ ఆర్వోబీ నిర్వాసితుల కేసులో కీలక వ్యాఖ్యలు
- గీతం భూముల క్రమబద్ధీకరణపై తాజా తీర్పు ప్రభావం
- వణికిపోతున్న రెవెన్యూ అధికారులు

**సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:** ప్రభుత్వ భూమిని దశాబ్దాలుగా స్వాధీనంలో ఉంచుకున్నా, దానిని ఆక్రమించిన వారు ఆక్రమణదారులే తప్ప యజమానులు కాదని హైకోర్టు తాజాగా స్పష్టం చేసింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్టవిరుద్ధమని, అలాంటి వారు యజమాని నిర్వచనంలోకి రారని విజయవాడ ఆర్వోబీ నిర్వాసితుల కేసులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల ఇచ్చిన తీర్పులో తేల్చి చెప్పారు. ఈ తీర్పు గీతం విద్యా సంస్థ ఆక్రమించిన భూముల క్రమబద్ధీకరణ ప్రయత్నాలకు పెద్ద ఎదురుదెబ్బగా మారుతుందని రెవెన్యూ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. "ఏళ్లుగా మా ఆధీనంలో ఉన్నాయి కాబట్టి భూములను క్రమబద్ధీకరించాలి'' అంటూ గీతం విద్యా సంస్థల అధినేత, విశాఖ ఎంపీ భరత్ చేస్తున్న వ్యాఖ్యలు చట్టబద్ధం కావని ఈ తీర్పు స్పష్టంగా తెలియజేస్తోందని పేర్కొంటున్నాయి. గజాల పరిమితిలో భూమిని ఆక్రమించి, అదీ నివాస గృహాలు నిర్మించిన సందర్భాల్లో మాత్రమే కొన్ని పరిస్థితుల్లో క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుందని, ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమిని ఆక్రమించి క్రమబద్ధీకరించాలనుకోవడం సాధ్యం కాదని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా తన బంధువుకు 'గిఫ్ట్'గా ఇచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఎంచుకున్న కబ్జా భూముల క్రమబద్ధీకరణ ప్రయత్నాలకు తాజా హైకోర్టు తీర్పుతో గట్టి అడ్డంకులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు (ఫైల్)

### ప్రభుత్వ ఆధీనంలోనే భూములు

గీతం అధినేత చేస్తున్న వాదనలకు భిన్నంగా, ఈ భూములు పూర్తిగా వారి ఆధీనంలో కూడా లేవు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సర్వేలో గీతం సంస్థ ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్టు స్పష్టంగా తేలింది. దీంతో ఆక్రమిత భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం, కంచె వేసి 'ప్రభుత్వ భూమి' అనే బోర్డును కూడా ఏర్పాటు చేసింది. ఈ విధంగా 47 ఎకరాల మేర భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 2014–19 మధ్య చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలోనే ఈ ఆక్రమిత భూములను గీతం సంస్థకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆక్రమిత భూములను క్రమబద్ధీకరించేలా ఎలాంటి రెవెన్యూ చట్టాలు లేవని అప్పటి అధికారులు స్పష్టంగా చెప్పడంతో ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశాఖ భూ కుంభకోణాలపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. ''కబ్జారాయుళ్ల చెరలో ఒక్క సెంటు ప్రభుత్వ భూమి కూడా ఉండకూడదు'' అనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గీతం భూ ఆక్రమణలపై నివేదిక సిద్ధం చేసి, 40.51 ఎకరాలకు పైగా ఆక్రమిత భూములను దశలవారీగా స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమిపై అక్రమంగా నిర్మించిన రక్షణ గోడలు, గార్డెన్లు, గ్రావెల్ బండ్లను తొలగించారు. మిగిలిన భూముల వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. గీతం సంస్థ ఆక్రమించిన భూములేనని చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్' కూడా అప్పట్లోనే స్పష్టం చేసింది.

### రూ.5 వేల కోట్ల విలువైన భూములపై దుమారం

దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా, తన సొంత బంధువులు ఆక్రమించిన రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అధికారికంగా కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇందుకోసం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో గుండారాజ్ నడపడం, ప్రతిపక్ష కార్పొరేటర్లపై దాడులకు దిగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎండాడ ప్రాంతంలో ఉన్న ఈ భూముల విలువ ఎకరాకు రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. అంటే మొత్తం 54.79 ఎకరాల భూమి విలువ రూ.5 వేల కోట్లను మించుతుందన్నమాట. ఇంతటి విలువైన ప్రభుత్వ భూములను గీతం సంస్థలకు ధారాదత్తం చేయాలనే నిర్ణయం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కబ్జాల నుంచి విడిపించి ప్రభుత్వ భూములను కాపాడితే, వాటిని మళ్లీ ఆక్రమణల బందీలోకి నెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేల కోట్ల ఆస్తులకు వారసుడైన భరత్ ప్రభుత్వ భూములను కొట్టేసేందుకే విశాఖ ఎంపీగా అవతారమెత్తారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తాజా హైకోర్టు తీర్పుతో ఈ ఫైలును కదిలించేందుకే రెవెన్యూ అధికారులు వణికిపోతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పెద్దల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మధ్య అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారన్నది కొద్ది రోజుల్లో తేలనుంది.

# ఇవేం పాపాలు

సీఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పం పా'పాల' పుట్టకు ప్రతిరూపంగా మారింది. ఇక్కడి కూటమి నేతలు కెమికల్ డాన్లుగా మారిపోయారు. అధికార మదంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తున్నారు. పిల్లలు, పెద్దలు, గర్భిణులు తాగే పాలలో రసాయనాలు కలిపి ఇష్టారాజ్యంగా తయారు చేస్తున్నారు. పాలకూట విషాన్ని అధికార పలుకుబడితో పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల అక్కడి ఫుడ్ సేఫ్టీ అధికారుల విచారణలో అసలు విషయం బయటపడింది. కల్తీ రాయుళ్ల ఆటకట్టించడంలో ఇక్కడి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## కుప్పం నుంచి పొరుగు రాష్ట్రాలకు కల్తీ పాలు

- 20 లీటర్ల నీళ్లతో 25 లీటర్ల పాలు తయారీ
- కర్ణాటక పోలీసుల విచారణలో వెలుగులోకి..
- పాల తయారీ.. రసాయనాల రవాణా ఇక్కడి నుంచే
- కూటమి నేతలే కెమికల్ డాన్లు
- చేష్టలుడిగిన ఏపీ యంత్రాంగం
- కర్ణాటక పోలీసులను కట్టడి చేసేందుకు అధికార పార్టీ నాయకుల యత్నం

**సాక్షి, టాస్క్‌ఫోర్స్ :** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గాన్ని దేశంలోనే అత్యున్నతంగా తీర్చిదిద్దుతామని పాలకులు ఊకదంపుడు ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. కానీ స్థానిక పరిస్థితులు మాత్రం నేతి బీరకాయను తలపిస్తున్నాయి. ఇప్పటికే ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు గంజాయి రవాణా చేస్తూ కుప్పం ప్రాంతానికి చెందిన కూటమి నాయకులు పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఇప్పుడు కల్తీ పాల దందా కర్ణాటక పోలీసుల విచారణలో వెలుగు చూసింది. అందరికీ అవసరమైన పాలను విషంగా మార్చి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు.

### పట్టని పాలకులు

కల్తీ పాల తయారీకి కుప్పం అడ్డాగా మారిందని పొరుగు రాష్ట్రాల పోలీసులు చర్యలకు ఉపక్రమించినా స్థానిక అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడడం లేదు. నెలవారీగా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నా పట్టించుకోవడం మానేశారు. పైపెచ్చు పొరుగు రాష్ట్ర విచారణ సంస్థలకు కూడా సహకరించడం లేదనే అప్రతిష్టను మూటగట్టుకుంటున్నారు. కల్తీ పాల ముడి సరుకులను అందిస్తున్న కీలకమైన వ్యక్తిని పట్టుకునేందుకు రెండు రోజుల క్రితం వచ్చిన కర్ణాటక పోలీసులను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అడ్డుకుని బలవంతంగా వెళ్లగొట్టినట్టు సమాచారం. కర్ణాటకలోని రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తెచ్చి అక్కడి పోలీసులను కట్టడి చేసేందుకు అధికార పార్టీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. కలెక్టర్, ఎస్పీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### డొంక కదులుతోంది

కర్ణాటక, తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి పాల తయారీకి కావాల్సిన రసాయనాలు, వస్తువులను సేకరించి తమకు అనుకూలంగా ఉన్న డెయిరీల ఏజెంట్లకు అందిస్తున్నారని తెలిసింది. ఓ మహిళా నాయకురాలి భర్త కనుసన్నల్లోనే కుప్పంతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు పాల తయారీ రసాయనాలు రవాణా అవుతున్నట్టు నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. కేజీఎఫ్‌లోని ఫుడ్ సేఫ్టీ అధికారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తీగలాగడంతో కుప్పంలో డొంక కదులుతోంది.

### ఆమె భర్తే కల్తీ డాన్

రసాయనాలతో తయారు చేస్తున్న కల్తీ పాలు పెద్ద ఎత్తున కర్ణాటక రాష్ట్రంలోకి వస్తున్నట్టు గుర్తించిన అక్కడి పోలీసులు గత నెలలో కోలారు జిల్లా కేజీఎఫ్ ఎస్పీ పరిధిలోని ఆండర్సన్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కుప్పానికి చెందిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కుప్పానికి చెందిన ఓ మహిళా నాయకురాలి భర్త కల్తీ పాల తయారీ రాకెట్‌కు సూత్రధారిగా ఉన్నాడని అక్కడి పోలీసులు గుర్తించినట్టు సమాచారం.

### కల్తీ పాల తయారీ ఇలా..

కాలం చెల్లిన పాల పౌడర్, పామాయిల్, చక్కెర, బెల్లం, ఇతర రసాయనాలను కలిపి మిక్సీ పడతారు. తద్వారా చిక్కటి క్రీం తయారవుతున్నట్టు కర్ణాటక పోలీసులు గుర్తించారు. ఇలా తయారైన లీటరు క్రీంలో నాలుగు లీటర్ల పాలు, 20 లీటర్ల నీటిని కలిపి మొత్తంగా 25 లీటర్ల పాలను తయారుచేస్తున్నారు. ఈ పాలను వివిధ డెయిరీలకు విక్రయించి వినియోగదారులపైకి వదులుతున్నారు. తమ బండారం బయట పడకుండా ప్రైవేటు డెయిరీల్లోని ఉద్యోగులను కల్తీపాల మాఫియా తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. తమ అక్రమార్జనలో వాటాలు ఇస్తూ, మాట వినని వారిని బెదిరింపులతో నెట్టుకొస్తున్నారు. కృత్రిమంగా తయారు చేస్తున్న పాలలో ఏయే రసాయనాలను ఏ మోతాదులో కలిపారో నిర్ధారించేందుకు పొరుగు రాష్ట్ర పోలీసులు పాల నమూనాలను పరీక్షలకు పంపారు.



ఎందుకు? ఏమిటి?

# స్వర్ణగిరికి బ్రహ్మోత్సవ సిరి

## అంగరంగ వైభవంగా ఆరంభమైన స్వర్ణగిరి బ్రహ్మోత్సవాలు

అపార కారుణ్యమూర్తి, భక్తవత్సలుడు, సర్వగుణ సంపన్నుడు, భూలోక వైకుంఠ క్షేత్ర నాథుడు అయిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామికి జరిగే నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ సేవలలో అత్యంత ప్రధానమైనది బ్రహ్మోత్సవం.

వైఖానస ఆగమోక్తంగా వైదిక ఉపచారాల ప్రకారం ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేయటం (ధ్వజారోహణం), బలి ఆచారాలు, మహారథోత్సవం, శ్రవణా నక్షత్రంలో చక్రస్నానం, ధ్వజావరోహణం వంటివి ఈ ఉత్సవాల్లోనే నిర్వహిస్తారు.

లోక కల్యాణార్థం సకల శుభప్రాప్తి కోసం అస్మద్ ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో అంగరంగ వైభవంగా... అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా జరిగే ఈ బ్రహ్మోత్సవాల వివరాలు..

**ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు**

సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధన, సేవా కాలం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, యాగశాలలో ద్వార తోరణం, ధ్వజ కుంభారాధన, చతుస్థానార్చనలు, వేదవిన్నపం, విశేష హోమాలు, పంచసూక్త పరివార, ప్రాయశ్చిత్త హోమాలు, నివేదనలు, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, శాత్తుమొఱై, ప్రసాద గోష్ఠి

**సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు**

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, యాగశాలలో ద్వారతోరణం, ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, విశేష హోమాలు, పంచసూక్త పరివార ప్రాయశ్చిత్త హోమాలు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, శాత్తుమొఱై, ప్రసాద గోష్ఠి

### విశేష కార్యక్రమాలు అంకురార్పణతో ఆరంభం

స్వర్ణగిరీశుని ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నాడు అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. 17 వ తేది వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఉన్న ఈ దివ్యక్షేత్రంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహకులు మానేపల్లి రామారావు తెలిపారు.

### విశేష కార్యక్రమం వివరాలు నేటినుంచి పల్లకిసేవ...

**12 వ తేది:** సింహవాహన సేవ, పరమేష్టివాహనం, నిశాచూర్ణోత్సవం, సాయంత్రం: ఎదుర్కోళ్ల ఉత్సవం, స్వామి వారికి గజవాహన సేవ, అమ్మ వారికి హంసవాహన సేవ(లోక కల్యాణం కోసం)

**13 వ తేది:** పల్లకీ సేవ, సుదర్శన ఇష్టిహవనం, సాయంత్రం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, గరుడవాహన సేవ, అశ్వవాహన సేవ,

**14 వ తేది:** పల్లకీసేవ, సకల కార్యసిద్ధి కొరకు విష్వక్సేన ఇష్టి, సాయంత్రం హనుమంతవాహన సేవ.

**15 వ తేది:** పల్లకి సేవ, సకల విద్యాప్రాప్తి కొరకు హయగ్రీవ ఇష్టి.సాయంత్రం అశ్వవాహన సేవ.

**16 వ తేది:** పల్లకి సేవ, ధన్వంతరి ఇష్టి, సాయంత్రం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం.

**17 వ తేది:** సర్వభూపాల వాహన సేవ, అష్టోత్తర శత కలశాభిషేకం, చక్రస్నానం. సాయంత్రం పల్లకి సేవ, పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాసన, బలిహరణ మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, సప్తవరణ, మహా కుంభ సంప్రోక్షణ, శాత్తు మొఱై, వేద విన్నపములు, రుత్విక్వరణం, వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాద గోష్ఠితో పూర్తికానున్నాయి.

**- యంబ నర్సింహులు,** సాక్షి, యాదాద్రి

### ● ప్రేమ సందేశాలు

మనిషిగా పుట్టినంత మాత్రాన మానవత్వం సిద్ధించదు. సాటి మనుషుల మీద, ప్రాణుల మీద జాలి, దయ, కరుణ, సహనం, ప్రేమ చూపుతూ సాయపడటమే అసలైన మానవత్వం. తనను తాను తెలుసుకుంటూ, విశ్వంతో తనకున్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. తద్వారా కంటికి కనిపించని సర్వాంతర్యామితో అనుసంధానం కావాలి. అంతరంగ శాంతిని పొందుతూ, సదా చైతన్య స్థితిలో ఉండటమే అసలైన ఆధ్యాత్మికత. దీనులను, రోగులను అక్కున చేర్చుకుని, వారి చివరి రోజుల్లో ప్రేమ, కరుణలను పంచి ఇచ్చి అసలైన ఆధ్యాత్మికతకు మానవతా రూపంగా నిలిచారు మదర్ థెరిసా.

#### ప్రేమ ఒక గులాబీ పువ్వు

'మీరు నిజంగా ప్రేమను తెలుసుకోవాలనుకుంటే, ప్రేమ గురించి మర్చిపోండి, ధ్యానం గురించి గుర్తుంచుకోండి. మీరు మీ తోటలోకి గులాబీలను తీసుకురావాలనుకుంటే, గులాబీల గురించి మర్చిపోయి, గులాబీ చెట్ల పొదలను జాగ్రత్తగా చూసుకోండి. దానికి పోషణ ఇవ్వండి,నీరు పెట్టండి, తగినంత సూర్యకాంతి, నీరు అందేలా చూసుకోండి. ప్రతిదీ జాగ్రత్తగా చూసుకుంటే, గులాబీలు సరైన సమయంలో వికసిస్తాయి. **- ఓషో**

## ఓర్పు: కన్నీటి గెలుపు

● ఇస్లాం వెలుగు



జీవితంలో కష్టాలు రావడం ఎంత నిజమో.. వాటిని ఓర్పుతో జయించడం అంతకంటే పెద్ద నిజం. మనం 'ఓర్పు' (సబర్) అంటే కేవలం భరించడం అనుకుంటాం. కానీ కాదు... ఓర్పు అంటే దైవం మీద నమ్మకంతో నిశ్శబ్దంగా పోరాడటం. మనలో ఉండే ప్రతి మంచి గుణానికి ఓర్పే ప్రాణం పోస్తుంది.

**ఓర్పు అంటే ఏమిటో తెలుసా?**

ఆకలి వేస్తున్నా ఆత్మగౌరవాన్ని వదులుకోకపోవడం.. అది ఓర్పు.

లోపల బాధతో గుండె పగిలిపోతున్నా, బయటకు చిరునవ్వుతో కనిపించడం.. అది ఓర్పు.

ఎవరో అన్న మాటలకు కోపం వచ్చినా, సమాధానం చెప్పే శక్తి ఉన్నా.. దైవం కోసం మౌనంగా ఉండటం.. అది ఓర్పు.

కష్టాల్లో ఉన్నప్పుడు 'ఎందుకు నాకు ఈ బాధ?' అని ఫిర్యాదు చేయకుండా, 'నా అల్లాహ్ నాకు తోడున్నాడు' అని ధైర్యంగా ఉండటం... అదే అసలైన ఓర్పు.

**అల్లాహ్ నీ పక్కనే ఉన్నాడు...**

మనం ఒంటరిగా కన్నీళ్లు పెట్టుకుంటున్నప్పుడు, ఎవరూ మనల్ని అర్థం చేసుకోవడం లేదని బాధ పడుతున్నప్పుడు ఒక్క విషయం గుర్తుంచుకోండి.. 'నిశ్చయంగా అల్లాహ్ ఓర్పు వహించే వారి తోడు ఉంటాడు.' నువ్వు ఓర్పుగా ఉన్న ప్రతి క్షణం, లోకనాథుడు నీ చెయ్యి పట్టుకుని నడిపిస్తున్నాడని అర్థం.

**ఓర్పు ఇచ్చే బహుమతి...**

మనం పడే ప్రతి కష్టానికి, వహించే ప్రతి ఓర్పుకు ప్రతిఫలం ఖచ్చితంగా దక్కుతుంది. రేపు స్వర్గపు వాకిట దేవతలు నిలబడి, 'మీరు లోకంలో ఎంతో ఓర్పుగా ఉన్నారు.. అందుకే ఈరోజు మీకు ఈ ప్రశాంతత' అని స్వాగతం పలుకుతుంటే, ఆ ఆనందం ముందు ఈ లోకంలోని కష్టాలన్నీ చిన్నవిగా అనిపిస్తాయి.

**ముగింపు...**

కష్టం రాగానే కుంగిపోవద్దు.. నిరాశ చెందవద్దు. ఓర్పును ఆయుధంగా చేసుకో. అది నిన్ను ఎంతటి ఉన్నత శిఖరాలకైనా తీసుకెళ్తుంది. ఓర్పు వహించే హృదయంలోనే దైవం నివసిస్తాడు. నీ ఓర్పు మధురంగా ఉంటే, నీ గమ్యం అంతకంటే అద్భుతంగా ఉంటుంది.

**- ముహమ్మద్ ముజాహిద్**

● సువార్త



## నాయందు నీకున్న ప్రేమ

ఈ భూమి మీది మొట్ట మొదటి మానవులైన ఆదాము హవ్వలకు తల్లి లేదు. వారు తల్లి గర్భం నుండి రాలేదు. ప్రత్యేకంగా ఒక వైవిధ్య విధానంలో దేవుని స్వహస్తముల చేత వారు నేరుగా సృజించబడ్డారు. ఆయన నోటి ఊపిరిచేత ప్రాణప్రతిష్ట చేయబడి వారు ఉనికిలోకి అరుదెంచడం విశేషం. తన సంకల్పం ప్రకారంగా తన సొంత కుమారుడైన క్రీస్తును దేవుడు అందరివలెనే పుట్టించాడు. పుట్టిన వెంటనే నవ యువకుడిగా ఆదాము వచ్చినట్టుగా క్రీస్తు ఈ లోకానికి పంపబడలేదు.

మరియ అను ఒక స్త్రీ గర్భము ద్వారా క్రీస్తు శరీరధారిగా వచ్చాడు.

ఆదాము హవ్వలు తప్ప అంతా అమ్మ ప్రేమను రుచి చూసిన వారే. దేవుని కుటుంబంలో రెండవ వ్యక్తిగా పిలువబడే దైవత్వం గల సృష్టికర్తయైన క్రీస్తు కూడా అమ్మ ప్రేమను రుచి చూసాడు. అమ్మ ప్రేమలో సర్వ ప్రపంచం దర్శనమిస్తుంది. అమ్మ ప్రేమ వర్ణనకు ఏనాడూ అందనిది.

స్త్రీ పాత్రలో తల్లే కాక స్నేహితురాలు, ప్రియురాలు, భార్య, అక్క, చెల్లి, వదిన, మరదలు, చిన్నమ్మ, పెద్దమ్మ, అత్తమ్మ, అమ్మమ్మ, నాన్నమ్మ, మామ్మ ఇలా అనేకం.

వీరంతా స్త్రీలై వీరి ప్రేమ అంతా స్త్రీ రూపంలో వెల్లడయ్యే విధానమే.

అయితే అసాధారణ సృజనకారుడు సృష్టికర్త దేవుని ప్రేమ దగ్గరకు వచ్చేసరికి స్త్రీ ప్రేమ చిన్నబోతోంది. ఎందుకంటే, స్త్రీని సృష్టించి ఆ స్త్రీని తల్లిని చేసి ఆ తల్లిలో అరుదైన త్యాగపూరిత ప్రేమను పెట్టినవాడు ఆ ప్రసిద్ధ పరమాత్ముడే అని చెప్పక తప్పదు. దేవుడు తన ప్రేమకు పోటీగా అమ్మను, అమ్మ ప్రేమను ఒక గొప్ప వైవిధ్య విధానంలో సృజనాత్మకంగా, కళాత్మకంగా రూపొందించి మానవాళిని బాంధవ్యం పేరిట అలరించడం విశేషం. అయినా కూడా యెషయా ప్రవక్త ద్వారా ఈ సత్యం వెల్లడైంది. ఇది సీయోను మీద దేవుని ఉన్నత ప్రేమ అన్నట్టుగా మనం చూడగలుగుతాము. 'స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను' (యెషయా 49:15).

ప్రేమా స్వరూపియైన అద్వితీయ సత్య దేవుడు ఇంత ఉన్నతంగా ప్రేమించగలవాడు కాబట్టే ఆయన్ను అంతే ఉన్నతంగా ప్రేమించమని యేసు క్రీస్తు ఈ భూమి మీద అంతటా యూదులకు ఆజ్ఞాపిస్తూ బోధించాడు (మార్కు 12:28–34). ప్రేమకు ప్రతిరూపం అయిన యేసు ప్రేమ కూడా ఎన్నదగ్గదే. ఒక్క సిలువప్రేమ మీదనే తన ఏకాగ్రతను అంతా దష్టి పెట్టినవాడైన పౌలు 'ఎవడైనను ప్రభువును ప్రేమింపకుంటే వాడు శపింపబడును గాక!' అంటూ హెచ్చరిస్తున్నాడనేది గమనార్హం (1 కొరింథీ 16:22 ). దేవుని హృదయానుసారుడుగా పేరొందిన దావీదు స్త్రీ ప్రేమను ఉన్నతం చేస్తూనే మరో పక్క స్త్రీ ప్రేమను మించి దాటింది నీ ప్రేమ అంటూ చెప్పడం విశేషం. తన సోదర సమానుడు, స్నేహితుడు, గొప్ప సహృదయుడైన యోనాతాను యుద్ధంలో వీర మరణం పొందుతాడు. అతని గూర్చి యెడతెగక విలపిస్తూ దావీదు ధనుర్గీతం ఒకటి విరచించాడు. అందు చరణం ఒకటి ఇలా ఉంటుంది.

'నా సహోదరుడా, యోనాతానా, నాయందు నీకున్న ప్రేమ బహు వింతైనది. స్త్రీలు చూపు ప్రేమ కంటెను అది అధికమైనది' (2 సమూయేలు 1:26).

తన తండ్రి మరియు రాజైన సౌలు విషపు చూపులు, ఆపదల నుండి యోనాతాను దావీదును అనేక మార్లు రక్షించాడు. ఈ ఇరువురి స్నేహం చాలా గొప్పది. తన తండ్రియైన సౌలు తరువాత రాజు యోనాతానే. అయితే దేవుని సంకల్పం వేరేగా ఉంది. ఇశ్రాయేలీయులకు రాజుగా దావీదు అభిషేకించబడ్డాడు. సౌలు అవిధేయ ప్రవర్తనను బట్టి అతని తప్పించి దావీదును సింహాసనం ఎక్కించుటకు ఇంకా వ్యవధి ఉంది. దేవున్ని, దేవుని మనసును బాగా అర్థం చేసుకొన్న యోనాతాను ఆయన చిత్తానికి తలవంచి దావీదును అమితంగా ప్రేమించి అతన్ని రాజుగా చూడాలనుకున్నాడు. అయితే అతడు యుద్ధంలో ఫిలిష్తీయుల చేతిలో హతమవడం తెలుసుకొని దావీదు ఏంతో శోకిస్తూ అతని గొప్ప ప్రేమను ఇలా కీర్తిస్తూ వర్ణిస్తాడు.



క్రీస్తు యేసు ప్రేమ యోనాతాను ప్రేమ కంటె అనేకనేకరెట్లు గొప్పది. మానవాళికి యోనాతాను వంటి అరుదైన గొప్ప స్నేహితుడే యేసు క్రీస్తు అనడంలో వాస్తవం ఉంది

ఈయన సిలువ యుద్ధంలో ఆత్మ సంబంధ పోరాటంలో తనదైన ప్రేమను బట్టి వీర మరణం పొందాడు. 'నాయందు నీకున్న ప్రేమ బహు వింతైనది. అది స్త్రీలు చూపు ప్రేమ కంటెను అది అధికమైనది' అంటూ యువత క్రీస్తును కీర్తించి కొనియాడవచ్చు. యువతులైతే మా అమ్మ ప్రేమ కన్నా మిన్నయైనది అంటూ ప్రభువును కీర్తించవచ్చును.

క్రీస్తు ద్వారా వెల్లడైన దేవుని శాశ్వత ప్రేమను ఎవరైతే గుర్తిస్తారో వారు ఈ మాయ లోకపు ప్రేమ వలలో ఏనాడూ పడరని అందు చిక్కి కూరుకుపోతూ అటూ ఇటూ కొట్టుకుపోరని పరిశుద్ధ గ్రంథ రాజపు పలుకులు తేటగా వివరిస్తున్నాయి. వాస్తవమైన జీవమును ప్రేమించేవారు సత్యవిషయమైన ప్రేమను అవలంభించి అంతటా రాణిస్తారు.

**- జేతమ్**

## శతగోపం ఆకారం ఎందుకలా?

శతగోపం ఆకారమే చాలా ప్రత్యేకం. ఆలయ గోపురాలు దాదాపు ఇదే ఆకారంలో ఉంటాయి. అలాగే చదరంగా ఉండే తలాలకన్నా వంపుగా అర్ధవృత్తాకారంలో (డోమ్ తరహా) నిర్మాణాలూ పిరమిడ్ తరహాలోనే పనిచేస్తాయి. రాజమందిరాల పై భాగాలు ఇలా ఉండటాన్ని మనం గమనించొచ్చు. అందువల్ల శతగోపం కూడా అచ్చంగా ఇదే విధంగా పనిచేస్తుంది. ఆత్మజ్ఞానానికి ప్రతీకైన సహస్రార చక్రం మన తలకు పై భాగంలో కాస్త ఎత్తులో ఉంటుంది. అదే జ్ఞానులూ, యోగులకు దాదాపు జానెడు ఎత్తులో ఉంటుంది. అలాంటి సహస్రార చక్రం పైన ఈ శతగోపాన్ని ఉంచడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది. మనం దేవాలయానికి వెళ్లినప్పుడు ఇన్ని రకాలుగా శక్తిని పొందుతాం కాబట్టి, దాన్ని స్థిరపరచుకోవడానికి కాసేపు అక్కడే కూర్చోమని చెబుతారు.

## మంత్రపుష్పం పరమార్థం ఏమిటి?

పూజలో పూలు వాడతాం. మరి మంత్రపుష్పం ప్రత్యేకత ఏమిటీ అంటే – భగవంతుడికి మనం చేయగలిగిన ఉపచారాలన్నీ చేశాక, పెట్టగలిగిన పదార్థాలన్నీ నైవేద్యం పెట్టాక... మనల్ని మనం ఆ దేవదేవుడికి సమర్పించుకోవడమే మంత్రపుష్పంలోని పరమార్థం. కిందివైపు ముడుచుకుని ఉన్న కమలంలా నాభికి పైనా, గొంతుకు కిందా 12 అంగుళాల పరిమాణంలో ఉన్న భాగం (హృదయం), మనం తిన్న అన్నాన్ని శరీరభాగాలన్నింటికీ సమానంగా పంచుతుందట. దానిపై భాగంలో విచ్చుకున్నట్టు ఉండే సూక్ష్మపద్మంలాంటి చోట నివ్వరిధాన్యపు ముల్లంత (వడ్లగింజ కొస) పరిమాణంలో పసుపురంగు కాంతితో మనలోని పరమాత్మ ఉంటాడంటూ సవివరంగా మన జ్యోతి స్థానాన్ని వివరిస్తుంది. ఈ శ్లోకాన్ని మంత్రపుష్పంతో జత చేసి చదువుతాం. అంటే నాలోని ప్రాణం నీవు, నన్ను నేను నీకు సమర్పించుకుంటున్నాను స్వామీ... అని చెప్పుకోవడం మంత్రపుష్పంలోని పరమార్థం.



## సాష్టాంగ నమస్కారం ఎలా చేయాలి?

స అష్ట అంగ నమస్కారం... దీనినే సాష్టాంగ నమస్కారం అంటారు. అంటే మన శరీరంలోని అన్ని అంగాలూ నేలకు తగిలేలా బోర్లా పడుకుని చేసే నమస్కారం అన్నమాట.. బాగా గౌరవించే వాళ్ల దగ్గర కాస్త ముందుకు వంగి నమస్కారం చేస్తాం. మరి సృష్టికి మూలమైన భగవంతుడికి నమస్కారం చేయాలంటే... ఎంత వంగినా ఇంకా వంగవచ్చునా అనిపిస్తుంది. అందుకే ఇక నన్ను నేను ఇంతకన్నా వంచలేను అనిపించే స్థితిలో నేలకు సాష్టాంగపడి నమస్కారం చేస్తాం. భగవంతుడికి పూర్తిస్థాయిలో మోకరిల్లడం ఇందులోని పరమార్థం. అయితే సాష్టాంగనమస్కారం పురుషులకు మాత్రమే. స్త్రీలకు వర్తించదు. మనిషి జననానికీ, జీవనానికీ కారణమైన పొట్ట, వక్షభాగాన్ని నేలకు తగిలించకూడదనీ, అందుకే వాళ్లు మోకాళ్ల మీద ముందుకు వంగి నమస్కారం చేస్తే సరిపోతుందనీ శాస్త్రం చెబుతోంది.

## ఆలయానికి ఎందుకు వెళ్లాలంటే..?

ఇంట్లో దేవతారాధన చేస్తాం. అలాంటప్పుడు 'గుడికి వెళ్లి పూజచేయడం ఎందుకు?'అనే సందేహం సహజం. దేవాలయంలో మూలవిరాట్టు ఉన్న చోట బీజాక్షర యంత్రాన్ని ప్రతిష్ఠిస్తారు. యంత్రాన్ని రాగితో చేస్తారు. దాని మీద బీజాక్షరాలు ఉంటాయి. చక్రాలు వేసి ఉంటాయి. చక్రం బోలెడు కోణాల కలయిక. ఒకసారి ఇందులోకి ప్రవేశించిన ఏ శక్తి అయినా ప్రతి కోణానికీ తాడనం చెందుతూ పెద్దదిగా మరింత బలమైనదిగా మారుతుంది. రాగి మంచి వాహకం. భూమిలోపల ఉండే విద్యుదయస్కాంత తరంగాల శక్తిని ఒక దగ్గరికి తీసుకురావడంలో యంత్రం గొప్పగా పనిచేస్తుంది. అందువల్ల అక్కడ శక్తిక్షేత్రం ఏర్పడుతుంది. నిజానికి స్వయంభూ దేవాలయాలన్నింటి దగ్గరా ఇలాంటి శక్తి తరంగాలు అత్యధికంగా ఉంటాయి. అలా దేవుడు వెలసిన చోటును రుషులు గుర్తించి దేవాలయాల్ని నిర్మించేవారు. ఇక, మంత్ర బలంతో ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. గుళ్లో నిరంతరం అర్చన జరుగుతూనే ఉంటుంది. దేవాలయంలో ఎన్ని పూజలు జరిగితే ఆ విగ్రహానికి అంత శక్తి వస్తుంది. ఆ విధంగా ఏళ్లతరబడి ఆ విగ్రహానికి శక్తి ఆపాదన జరుగుతుంది. అందుకే పురాతన ఆలయాలకు వెళ్లడం గొప్పవిషయంగా చెబుతారు.

## బిజినెస్ రీల్

### అదానీ గ్రీన్‌లో టోటల్ ఎనర్జీస్ వాటా విక్రయం

**రూ. 2,778 కోట్ల విలువ**

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్‌కి చెందిన ఇంధన దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ తాజాగా అదానీ గ్రీన్ ఎనర్జీలో 1.7 శాతం వాటాలను విక్రయించింది. స్టాక్ ఎక్స్ఛేంజీల డేటా ప్రకారం అనుబంధ సంస్థ టోటల్‌ఎనర్జీస్ రెన్యువబుల్స్ ఇండియన్ ఓషియన్ ద్వారా డిసెంబర్ 10న బ్లాక్ డీల్స్ ద్వారా 17 ఇన్వెస్టర్లకు విక్రయించింది. ఒక్కో షేరుకి రూ. 970 ధర చొప్పున దాదాపు 2.86 కోట్ల షేర్లను రూ. 2,778.09 కోట్లకు అమ్మింది. దీనితో అదానీ గ్రీన్ ఎనర్జీలో టోటల్ ఎనర్జీస్ వాటా 18.99 శాతం నుంచి 17.25 శాతానికి తగ్గింది. 2025 అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంలో వివిధ వెంచర్లలో వాటాల విక్రయం ద్వారా 2.08 బిలియన్ డాలర్లు సమీకరించినట్లు కంపెనీ వివరించింది. నైజీరియా, మలేషియా, అమెరికా, గ్రీస్‌లలోని ప్రాజెక్టులతో పాటు అదానీ గ్రీన్ ఎనర్జీలో వాటాలు కూడా వీటిలో ఉన్నాయి. టోటల్‌ఎనర్జీస్ సోలార్ వింద్ ఇండియన్ ఓషియన్, టోటల్‌ఎనర్జీస్ రెన్యువబుల్స్ ఇండియన్ ఓషియన్ అనే రెండు అనుబంధ సంస్థల ద్వారా కంపెనీకి అదానీ గ్రీన్ ఎనర్జీలో వాటాలు ఉన్నాయి.

### బీహెచ్‌ఈఎల్‌లో వాటాల విక్రయానికి భారీ స్పందన

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బీహెచ్‌ఈఎల్‌లో కేంద్ర ప్రభుత్వ వాటాల విక్రయానికి భారీ స్పందన లభించింది. తొలిరోజైన బుధవారం నాడు ఓఎఫ్ఎస్ (ఆఫర్ ఫర్ సేల్)కి 2.3 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 5,650 కోట్ల విలువ చేసే బిడ్లను దాఖలు చేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లకు 9.40 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా రూ. 256.07 రేటుపై 22.07 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్లు గురువారం బిడ్ చేయొచ్చు. ఓఎఫ్ఎస్‌కి మంచి స్పందన లభిస్తున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి అరుణీష్ చావ్లా తెలిపారు. బీహెచ్‌ఈఎల్‌లో వాటాల విక్రయానికి సంబంధించి బేస్ ఇష్యూ పరిమాణం 10.44 కోట్లు (3 శాతం) కాగా, గ్రీన్‌షూ ఆప్షన్ కింద మరో 6.96 కోట్ల షేర్లను (2 శాతం) కేంద్రం విక్రయిస్తోంది. ఒక్కో షేరుకి రూ. 254 ధర చొప్పున బీహెచ్‌ఈఎల్‌లో 17.41 కోట్ల షేర్లను (5 శాతం వాటా) విక్రయించడం ద్వారా రూ. 4,422 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. కంపెనీలో ప్రభుత్వానికి 63.17 శాతం వాటా ఉంది.

బుధవారం బీఎస్ఈలో బీహెచ్‌ఈఎల్ షేరు సుమారు 6 శాతం క్షీణించి రూ. 260.65 వద్ద క్లోజయ్యింది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-2-2026

| | |
|---|---|
| విశాఖ | 490-00 |
| చిత్తూరు | 573-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 485-00 |
| విజయవాడ | 490-00 |
| రిటైల్ ధర (డజను) | 75.00 |
| హైదరాబాద్ | 495-00 |
| వరంగల్ | 497-00 |
| రిటైల్ ధర | 5.55 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| EICHERMOT | 7,766.50 | 6.45 |
| APOLLOHOSP | 7,506.00 | 3.98 |
| MAXHEALTH | 1,055.50 | 3.33 |
| SBIN | 1,181.10 | 3.23 |
| MARUTI | 15,432.00 | 1.89 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TCS | 2,909.00 | -2.53 |
| INFY | 1,471.00 | -1.79 |
| COALINDIA | 423.75 | -1.67 |
| HCLTECH | 1,549.00 | -1.53 |
| TECHM | 1,625.10 | -1.19 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 9,539 |
| ఎన్ఎస్ఈ | 1,12,626 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,49,937 |
| ఎఫ్ఐఐ | + 944 |
| డీఐఐ | - 125 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | రాత్రి 11.30కు | | క్రితం ముగింపు |
|---|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 64.96 | $ | 63.96 |
| బ్రెంట్ | 69.77 | $ | 68.08 |

# స్వచ్ఛ విద్యుత్‌కి పెట్టుబడుల పవర్

- 2070 నాటికి 14.23 లక్షల కోట్ల డాలర్లు కావాలి
- నీతి ఆయోగ్ నివేదిక

**న్యూఢిల్లీ:** భారత్ సమ్మిళిత, సుస్థిర వృద్ధి సాధించడంలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషించనుంది. జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు, ఉత్పాదకత పెరిగేందుకు దోహదపడనుంది. ఈ నేపథ్యంలో శిలాజ ఇంధనాలను వినియోగించని, పర్యావరణహితమైన స్వచ్ఛ విద్యుత్, తటస్థ స్థాయి ఉద్గార (నెట్ జీరో) లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు అవసరం కానున్నాయి. 2070 నాటికి రెన్యువబుల్స్, స్టోరేజ్, పంపిణీ మొదలైన విభాగాలకు సంబంధించి విద్యుత్ రంగానికి 14.23 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కావాల్సి ఉంటుంది. నీతి ఆయోగ్ ఒక నివేదికలో ఈ విషయాలు వివరించింది. దేశాభివృద్ధి, వాతావరణ లక్ష్యాలన్నీ కూడా విద్యుత్‌పైనే ఆధారపడి ఉన్నాయని పేర్కొంది. 2047 నాటికి నిర్దేశించుకున్న వికసిత భారత్ లక్ష్యాలకు సంబంధించి ప్రస్తుత విధానాలను కొనసాగిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది, 2070 నాటికి నిర్దేశించుకున్న నెట్ జీరో లక్ష్యాల సాధనకు తోడ్పడే విధానాలను అమలు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే కోణాల్లో నివేదిక రూపొందింది. దీని ప్రకారం ..

- 2025 డిసెంబర్ నాటికి 258 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంతో ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద రెన్యువబుల్ ఎనర్జీ మార్కెట్‌గా భారత్ నిల్చింది.
- తదుపరి దశ మాత్రం చాలా సంక్లిష్టంగా ఉంటుంది. పట్టణీకరణ, కూలింగ్, డిజిటలీకరణ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, హరిత హైడ్రోజన్ మొదలైన వాటితో విద్యుత్‌కి డిమాండ్ భారీగా పెరగనుంది. వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్ విభాగాల నుంచి పెరిగే డిమాండ్‌ని తట్టుకునే విధంగా వ్యవస్థ పటిష్టం కావాలి.
- ఇందుకోసం నిల్వ సామర్థ్యాలను, పంపిణీ సామర్థ్యాలను పెంచుకోవాలి. గ్రిడ్ కార్యకలాపాలను ఆధునీకరించాలి. విశ్వసనీయమైన విధంగా, చౌకగా స్వచ్ఛ విద్యుత్ లభించేలా చూసేందుకు పంపిణీ అనేది ఆర్థికంగా లాభదాయకంగా ఉండేలా చూడాలి.
- దేశవ్యాప్తంగా విద్యుదీకరణ వేగవంతం కావడాన్ని బట్టి భారతదేశ విద్యుత్ పరివర్తన ప్రస్థానం ఆధారపడి ఉంటుంది.
- తలసరి విద్యుత్ వినియోగం 2025లో 1,400 కిలోవాట్‌అవర్ స్థాయి నుంచి 2070 నాటికి 7,000–10,000 కిలోవాట్‌అవర్‌కి పెరగనుంది. ఫ్రాన్స్, కొరియాలాంటి సంపన్న దేశాల స్థాయికి చేరనుంది.
- ప్రస్తుత పాలసీలు ఇలాగే కొనసాగితే 2070 నాటికి మొత్తం స్థాపిత సామర్థ్యం తొమ్మిది రెట్లు పెరుగుతుంది. అదే తటస్థ ఉద్గారాల లక్ష్యాలకు అనుగుణమైన నెట్–జీరో విధానాలను అమలు చేస్తే 14 రెట్లు పెరుగుతుంది.
- సోలార్ పీవీ సామర్థ్యం 5,500 గిగావాట్లకు చేరుతుంది. ప్రస్తుత పాలసీలను కొనసాగిస్తే ఇప్పుడు నామమాత్రంగా ఉన్న బ్యాటరీ స్టోరేజీ 1,400 గిగావాట్లకు చేరుతుంది. నెట్ జీరో విధానాలతో 3,000 గిగావాట్లకు చేరుతుంది.
- దీర్ఘకాలికంగా విద్యుత్ పరివర్తనలో అణు విద్యుత్ వ్యూహాత్మక పాత్ర పోషించనుంది. 2025లో 8.8 గిగావాట్లుగా ఉన్న సామర్థ్యం 2070 నాటికి 300 గిగావాట్లకు పెరుగుతుంది.
- ప్రస్తుత పాలసీల ప్రకారం 2070 నాటికి మొత్తం పెట్టుబడులు దాదాపు 8.79 లక్షల కోట్ల డాలర్లకు చేరనుండగా, నెట్ జీరో విధానాలతో 14.23 లక్షల కోట్ల డాలర్లకు చేరతాయి.

## జనవరిలోనూ ఎగుమతులు సానుకూలమే

**వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్**

**న్యూరెమ్‌బర్గ్:** భారత వస్తు, సేవల ఎగుమతులు ఈ ఏడాది ఇప్పటి వరకు సానుకూల వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ ప్రకటించారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ జనవరిలోనూ సానుకూలంగానే ఉన్నట్టు తెలిపారు. జనవరి నెలకు సంబంధించి అధికారిక డేటా ఈ నెలలో విడుదల అవుతుందన్నారు. బయోఫాచ్ 2026 కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన జర్మనీలోని న్యూరెమ్‌బర్గ్‌కు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. భారత్‌లోని 20 రాష్ట్రాలకు చెందిన 100 మంది ఎగ్జిబిటర్లు ఆర్గానిక్ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనగా ఉంచారు. ఐరోపా సమాఖ్య వీటికి పెద్ద మార్కెట్‌గా ఉంది. దేశ వస్తు ఎగుమతులు గత డిసెంబర్‌లో 2 శాతం పెరిగి 38.5 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. అదే నెలలో దిగుమతులు 8.7 శాతం పెరిగి 63.55 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు (9 నెలల్లో) వస్తు ఎగుమతులు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే 2.44 శాతం పెరిగి 330.29 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద వస్తు, సేవల ఎగుమతులు 850 బిలియన్ డాలర్లకు మించి నమోదవుతాయని వాణిజ్య శాఖ అంచనాగా ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో మరో మూడు హబ్స్: కార్స్24

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఆటో–టెక్ సేవల సంస్థ కార్స్24 తెలుగు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ప్రస్తుతం 4 హబ్‌లు ఉండగా వచ్చే ఆరు నెలల్లో వైజాగ్, వరంగల్‌లాంటి ప్రాంతాల్లో మరో మూడు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ఇండియా సీఎఫ్‌వో శివాంశు మక్కర్ తెలిపారు.

ఏడాది వ్యవధిలో పబ్లిక్ ఇష్యూకి రానున్నట్లు చెప్పారు. ఐపీవో ద్వారా సమీకరించే నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లు, కార్యకలాపాల విస్తరణ మొదలైన అవసరాల కోసం ఉపయోగించుకోనున్నట్లు శివాంశు పేర్కొన్నారు. ప్రస్తుతం అమ్మకాల్లో తెలుగు రాష్ట్రాల వాటా దాదాపు 12–13 శాతంగా ఉంటోందని, తెలుగు రాష్ట్రాల్లో నెలకు సుమారు 13,000 వాహనాలను విక్రయిస్తున్నామని వివరించారు. ఇక్కడ పెట్రోల్ కార్లు, కాంపాక్ట్ ఎస్‌యూవీలు, హ్యాచ్‌బ్యాక్‌లకు ఆదరణ ఉంటోందని, నెక్సాన్ మోడల్‌కి డిమాండ్ బాగా ఉందని వివరించారు.

## ఆటో విడిభాగాల రంగానికి ప్రభుత్వం అండ

- విధానపరమైన స్థిరత్వం ఉంటుంది
- కేంద్ర మంత్రి కుమారస్వామి

**న్యూఢిల్లీ:** దేశీ ఆటో విడిభాగాల పరిశ్రమ అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో కీలక పాత్ర పోషించేందుకు వీలుగా స్థిరమైన విధానాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి తెలిపారు. ఆటో విడిభాగాల తయారీదారుల సంఘం (ఏసీఎంఏ) నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే క్రమంలో తదుపరి తరం సరఫరా వ్యవస్థలో ఆటో విడిభాగాల పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. "ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, తేలిక రకం మెటీరియల్స్ అన్నవి అంతర్జాతీయ పోటీతత్వానికి కీలకం. స్థిరమైన విధానపర వాతావరణం ఉండేలా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. టెక్నాలజీ స్వీకరణను ప్రోత్సహించడం, ఎగుమతుల విస్తరణ, నాణ్యత పెంపు దిశగా పరిశ్రమ భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని మంత్రి తెలిపారు. భారత ఆటో విడిభాగాల పరిశ్రమ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్నట్టు చెప్పారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల తయారీ నుంచి కారిడార్ల ఏర్పాటు వరకు ప్రభుత్వం ఆటో పరిశ్రమకు ఎన్నో రకాలుగా చేయూతనిస్తున్నట్టు పేర్కొన్నారు.

## మార్కెట్లోకి మైసూర్ శాండిల్ నూతన ఉత్పత్తులు

**హైదరాబాద్:** ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైసూర్ శాండల్ సోప్‌లను తయారు చేసే 'కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్' కొత్త ఉత్పత్తులను ఘనంగా ఆవిష్కరించింది. మైసూర్ శాండల్ సోప్ బ్రాండ్ అంబాసిడర్ ప్రచారకర్త సినీ నటి తమన్నా భాటియా ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేశారు. ఇందులో సోప్‌లు, అగరబత్తులు, వ్యక్తిగత సంరక్షణ, షాంపులు, హోటల్ ప్రొడక్ట్స్, ఫేస్‌వాష్, హ్యాండ్‌వాష్, గృహ సంరక్షణ ఉత్పత్తులు ఉన్నాయి. ఈ వ్యూహాత్మక వ్యాపార విధానంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్లను మరింత పెంచుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్ర భారీ, మధ్య తరహా వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్, ముద్దేబిహాల్ ఎమ్మెల్యే, కేఎస్‌డీఎల్ చైర్మన్ అప్పాజీ సీఎస్ నడగౌడలు పాల్గొన్నారు.

## దేశీ తయారీ మరింత పెరగాలి

**హ్యుందాయ్ మోటర్ ఇండియా ఎండీ గర్గ్**

**న్యూఢిల్లీ:** దేశీ ఆటోమొబైల్ పరిశ్రమ తదుపరి దశ వృద్ధి ప్రస్థానంలో ముందుకెళ్లాలంటే స్థానికంగా తయారీ, కొత్త నైపుణ్యాల్లో శిక్షణ, అంతర్జాతీయ విస్తరణపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్ ఇండియా ఎండీ తరుణ్ గర్గ్ చెప్పారు. 'భారత్‌లో గెలవాలంటే, తప్పనిసరిగా భారత్‌లో ఉండాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తమ పుణె తయారీ ప్లాంటుకు అవసరమైన విడిభాగాల సరఫరా వ్యవస్థపై రూ. 4,500 కోట్లు పైగా ఇన్వెస్ట్ చేశామన్నారు. ఆటోమోటివ్ విడిభాగాల తయారీ సంస్థల సమాఖ్య (ఏసీఎంఏ) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈ విషయాలు చెప్పారు. కీలక లోహాలు, విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ కోసం ఏ ఒక్క దేశంపైనో ఆధారపడితే సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉండబోదని గర్గ్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు మొదలైన వాటిని సమగ్రపర్చుకోకపోతే పెను సవాళ్లు తప్పవని, మనల్ని దాటి పరిశ్రమ ముందుకెళ్లిపోతుందని ఆయన హెచ్చరించారు. భారతీయ ఇంజినీర్లు, డిజైనర్ల పరిజ్ఞానం ప్రశంసనీయమన్నారు. అయితే, పరిజ్ఞానానికి, సంసిద్ధతకి మధ్య గణనీయంగా అంతరం ఉంటోందని, దీన్ని సత్వరం భర్తీ చేయాల్సిన అవసరం ఉందని గర్గ్ వివరించారు.

# లిస్టింగ్‌తో ఎస్ఎంఈల్లో గవర్నెన్స్ పటిష్టం

**సెబీ చైర్మన్ పాండే వెల్లడి**

**న్యూఢిల్లీ:** చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) అభివృద్ధి కోసం గతంలో పలు చర్యలు తీసుకున్నప్పటికీ క్యాపిటల్ మార్కెట్స్ కోణంలో అవి ఇంకా భారీగా విస్తరించడం లేదని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. మార్కెట్స్‌లో లిస్ట్ కావడం వల్ల చిన్న కంపెనీల్లో గవర్నెన్స్ మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. కానీ క్యాపిటల్ మార్కెట్స్ గురించి అంతగా తెలియకపోవడం వల్ల, మర్చంట్ బ్యాంకర్లు అంత తేలిగ్గా దొరక్కపోవడం వల్ల చిన్న సంస్థలు లిస్టింగ్‌పై సందేహిస్తుంటాయని పేర్కొన్నారు. ఐపీవోల ద్వారా నిధులను సమీకరించేందుకు వ్యయాల భారం కూడా ఇందుకు ఒక కారణం కావచ్చని ఇండియా ఎస్ఎంఈ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన తెలిపారు. మార్కెట్ల నుంచి నిధులను సమీకరించడం వల్ల గవర్నెన్స్ మెరుగుపడుతుందని, విశ్వసనీయత పెరగడం వల్ల పెట్టుబడి వ్యయాలు కూడా తగ్గుతాయని పాండే చెప్పారు. చిన్న సంస్థలకి వర్తించే మినహాయింపులను కొన్ని సంస్థలు దుర్వినియోగం చేయడం వల్ల ఎస్ఎంఈ ఐపీవోలపై ఇన్వెస్టర్లలో ప్రతికూల సెంటిమెంటుకి దారి తీసిందని ఆయన తెలిపారు. అలాంటి ఉదంతాలు చోటు చేసుకోకుండా నిబంధనలను సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీలు మెరుగుపర్చాయన్నారు. ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీల్లో 1,400 కంపెనీలు లిస్టయ్యాయని, వాటి మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 4.1 లక్షల కోట్లని పాండే చెప్పారు. ఇందులో 350 సంస్థలు మెయిన్ బోర్డుకి మైగ్రేట్ అయ్యాయని గర్గ్ వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఐపీవోల ద్వారా 98 సంస్థలు రూ. 9,800 కోట్లు సమీకరించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు 232 లిస్టింగ్స్ ద్వారా రూ. 10,500 కోట్లకు సమీకరించినట్లు చెప్పారు.

## క్యూ3 ఫలితాలు

### అపోలో హాస్పిటల్స్ డివిడెండ్ రూ. 10

**నికర లాభం రూ. 502 కోట్లు**

**న్యూఢిల్లీ:** ఆరోగ్య పరిరక్షణా రంగ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 35 శాతం జంప్‌చేసి రూ. 502 కోట్లను తాకింది. మూడు ప్రధాన విభాగాలు పటిష్ట పనితీరు చూపడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 372 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 10 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 5,527 కోట్ల నుంచి రూ. 6,477 కోట్లకు ఎగసింది. దీనిలో హెల్త్‌కేర్ సర్వీసెస్ బిజినెస్ నుంచి 14 శాతం అధికంగా రూ. 3,183 కోట్లు సమకూరగా.. అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ 20 శాతం వృద్ధితో రూ. 467 కోట్లు అందుకుంది. ఈ బాటలో అపోలో హెల్త్‌కో ఆదాయం 20 శాతం పుంజుకుని రూ. 2,827 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 7,504 వద్ద ముగిసింది.

### ఎస్‌జేవీఎన్ లాభం 50 శాతం అప్

**రూ. 224 కోట్లు**

**న్యూఢిల్లీ:** జల విద్యుత్ రంగ పీఎస్‌యూ ఎస్‌జేవీఎన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 51 శాతం జంప్‌చేసి రూ. 224 కోట్లను అధిగమించింది. ఆదాయంలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 149 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 761 కోట్ల నుంచి రూ. 1,124 కోట్లకు ఎగసింది. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా మార్పిడికి వీలుకాని డిబెంచర్ల జారీ ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. అంతేకాకుండా వాటాదారులకు షేరుకి రూ. 1.15 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు సైతం అనుమతించినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌జేవీఎన్ షేరు బీఎస్ఈలో 6 శాతంపైగా జంప్‌చేసి రూ. 77 వద్ద ముగిసింది.

### శరత్ ఇండస్ట్రీస్ లాభం హైజంప్

**రూ. 4.74 కోట్లు**

**న్యూఢిల్లీ:** ఆక్వాకల్చర్ కంపెనీ శరత్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం దాదాపు 80 శాతం జంప్‌చేసి రూ. 4.74 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2.64 కోట్లు మాత్రమే ఆర్జించింది. నిర్వహణ ఆదాయం సైతం రూ. 96.44 కోట్ల నుంచి రూ. 142.55 కోట్లకు ఎగసింది. ఇది 48 శాతం వృద్ధికాగా.. నిర్వహణ లాభం(ఇబిటా) 22 శాతం పుంజుకుని రూ. 9.5 కోట్లను అధిగమించింది. గత క్యూ3లో రూ. 7.8 కోట్ల ఇబిటా సాధించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1% నీరసించి రూ. 172 వద్ద ముగిసింది. ఈ నెల 3న రూ. 179 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది.

### బ్రిటానియా లాభం అప్

**రూ. 682 కోట్లు**

**న్యూఢిల్లీ:** బేకరీ ఫుడ్ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 682 కోట్లను అధిగమించింది. బిస్కట్లు తదితర అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 582 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతం పుంజుకుని రూ. 4,970 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 4,593 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు 6 శాతం పెరిగి రూ. 4,108 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 5,874 వద్ద ముగిసింది.

### దిలీప్ బిల్డ్‌కాన్‌కు రూ.789 కోట్ల లాభం

**న్యూఢిల్లీ:** ఇన్‌ఫ్రా కంపెనీ దిలీప్ బిల్డ్‌కాన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.789 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.158 కోట్లతో పోల్చితే ఐదు రెట్లు పెరిగింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) రోడ్ ఆస్తులను ఇన్విట్‌కు బదిలీ చేయడం రూపంలో రూ.589 కోట్లు అసాధారణ ఆదాయం రావడం లాభం భారీగా పెరిగేందుకు దారితీసినట్టు కంపెనీ తెలిపింది. ఆదాయం ఇదే కాలంలో రూ.2,590 కోట్ల నుంచి రూ.2,138 కోట్లకు తగ్గింది. ఆర్డర్ల విలువ రూ.29,372 కోట్లకు పెరిగింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికం.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో దిలీప్ బిల్డ్‌కాన్ షేరు ధర ఎలాంటి మార్పు లేకుండా రూ.468 వద్ద ముగిసింది.

### జీఎస్‌కే ఫార్మా లాభం జూమ్

**రూ. 296 కోట్లు**

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం గ్లాక్సోస్మిత్‌క్లెయిన్(జీఎస్‌కే) ఫార్మా ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 296 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 230 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 949 కోట్ల నుంచి రూ. 1,041 కోట్లకు బలపడింది. కొత్త కార్మిక చట్టాల అమలు నేపథ్యంలోనూ కంపెనీ పనితీరు ప్రభావితంకాలేదని జీఎస్‌కే ఫార్మా వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం లాభంతో రూ. 2,511 వద్ద ముగిసింది.

### ఐషర్ మోటార్స్ లాభం జూమ్

- క్యూ3లో రూ. 1,421 కోట్లు
- రూ. 958 కోట్లతో విస్తరణ



**న్యూఢిల్లీ:** ఆటో రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతంపైగా జంప్‌చేసి రూ. 1,421 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,170 కోట్లు మాత్రమే ఆర్జించింది. ద్విచక్ర వాహన అనుబంధ కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఉత్పత్తి సామర్థ్య పెంపునకు రూ. 958 కోట్ల పెట్టుబడులను వెచ్చించేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 4,973 కోట్ల నుంచి రూ. 6,114 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,965 కోట్ల నుంచి రూ. 4,786 కోట్లకు పెరిగాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 21 శాతం ఎగసి 3,25,773 యూనిట్లను తాకాయి. గత క్యూ3లో ఇవి 2,69,039 మాత్రమే. వీఈ వాణిజ్య వాహన విక్రయాలు సైతం 21,010 యూనిట్ల నుంచి 26,086కు పుంజుకున్నాయి. తమిళనాడులోని చెయ్యార్ ప్లాంటు(మోటార్ సైకిళ్లు) విస్తరణకు వెచ్చించనున్న రూ. 958 కోట్లను అంతర్గత వనరుల నుంచి సమకూర్చుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం 14.6 లక్షల మోటార్ సైకిళ్లుకాగా.. వార్షికంగా 5.4 లక్షల యూనిట్లను జత చేసుకునే ప్రణాళికల్లో ఉంది. విస్తరణ కార్యకలాపాల తొలి దశ వచ్చే ఏడాది(2026–27) తొలి క్వార్టర్(ఏప్రిల్–జూన్)లో ప్రారంభమై 2027–28కల్లా పూర్తికానున్నట్లు కంపెనీ తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం బలపడి రూ. 7,296 వద్ద ముగిసింది.

చైనాలో నూతన చాంద్రమాన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం బీజింగ్ వీధుల్లో రాశులు, విభిన్న ఆకృతుల్లో సిద్ధంచేసిన, వేలాడదీసిన రంగురంగుల లాంతర్లను ఆసక్తిగా చూస్తున్న స్థానికులు

## నేను జోక్యం చేసుకోకపోతే అది అణు యుద్ధంగా మారేది

**భారత్, పాక్‌లపై టారిఫ్‌ల హెచ్చరిక బాగా పనిచేసింది**

- రెండు దేశాల ఘర్షణలో 10 యుద్ధ విమానాలు నేలకూలాయి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్:** గత ఏడాది భారత్, పాకిస్తాన్ల మధ్య యుద్ధాన్ని తానే చొరవ తీసుకొని ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఒకవేళ తాను స్పందించకపోతే అది కచ్చితంగా అణుయుద్ధంగా మారేదని, టారిఫ్ యుద్ధం జరిగేదని అన్నారు. ట్రంప్ మంగళవారం ఓ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. తాను రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలకు ముగింపు పలికానని చెప్పారు. ఇందులో ఆరు యుద్ధాలు టారిఫ్ బెదిరింపు వల్ల ఆగిపోయాయని తెలిపారు. మాట వినకపోతే మీ ఉత్పత్తులపై భారీగా టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో ఆయా దేశాలు దారికొచ్చాయని పేర్కొన్నారు. యుద్ధాల కారణంగా సామాన్య ప్రజలు మరణించడం తనకు ఏమాత్రం ఇష్టం లేదన్నారు. టారిఫ్‌ల భయంతో భారత్, పాకిస్తాన్ యుద్ధం నిలిపివేశాయని వెల్లడించారు. ఇరుదేశాల ఘర్షణలో కనీసం 10 యుద్ధ విమానాలు నేలకూలాయని తెలియజేశారు. అయితే, అవి ఏ దేశానికి చెందినవన్న సంగతి ట్రంప్ బయటపెట్టలేదు. యుద్ధాన్ని ఆపడం ద్వారా కనీసం కోటి మంది ప్రజల ప్రాణాలను ట్రంప్ రక్షించారని అప్పట్లో పాకిస్తాన్ ప్రధానమంత్రి చెప్పినట్లు గుర్తుచేశారు. తాను గనుక కలుగజేసుకోకపోతే భారత్, పాక్ మధ్య అణుయుద్ధం జరిగేదని ట్రంప్ తేల్చిచెప్పారు. టారిఫ్ హెచ్చరిక బాగా పనిచేసిందని వ్యాఖ్యానించారు. భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపేశానంటూ ట్రంప్ చెప్పుకోవడం ఇది 80వ సారి కావడం గమనార్హం. అయితే, పాకిస్తాన్‌పై దాడులు నిలిపివేయడం వెనుక ట్రంప్ ప్రమేయం ఏమాత్రం లేదని భారత ప్రభుత్వం కొట్టిపారేస్తోంది. కాల్పుల విరమణ పాటించాలని పాకిస్తాన్ ప్రభుత్వం పదేపదే వేడుకోవడం వల్లనే మానవతా దృక్పథంతో తాము వెనక్కి తగ్గామని పలుమార్లు ప్రకటించింది. ఇందులో మూడో వ్యక్తి జోక్యం లేదని తెలియజేసింది. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం గత ఏడాది మే నెలలో పాకిస్తాన్‌పై, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే.

# యూఎస్ 'అవాంఛిత' జాబితాలో మనోళ్లు

**'అత్యంత దారుణ నేరగాళ్ల' జాబితాలో 89 మంది భారతీయులు**

**25 వేల మందితో ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించిన డీహెచ్ఎస్**

**అందరూ వలసదారులే • దురుద్దేశపూరితమంటూ విమర్శలు**

అమెరికాలో వలసదారులను లక్ష్యం చేసుకుని ట్రంప్ సర్కారు తాజాగా మరో చర్యకు దిగింది. 'పలు తీవ్ర నేరాలకు పాల్పడి, అభియోగాలను ఎదుర్కొంటున్న వారు' అని పేర్కొంటూ పాతిక వేల మంది వలసదారులతో కూడిన జాబితాను హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) తాజాగా విడుదల చేసింది. 'అత్యంత దారుణాలకు పాల్పడి అరెస్టైన వారు' అనే పేరిట ఈ మేరకు ఏకంగా సరికొత్త డేటాబేస్‌నే రూపొందించారు! 2025 నుంచి అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు అదుపులోకి తీసుకున్న వారితో కూడిన ఈ జాబితాలో 89 మంది భారతీయులున్నారు. వీరిలో అత్యాచారాల అభియోగాలు, మోసాల కేసుల్లో పోలీసులకు చిక్కినవారే ఎక్కువగా ఉన్నారు. ఇక లైంగిక దాడులు, డ్రగ్ ట్రాఫికింగ్, ఇతర హింసాత్మక నేరాల్లో అరెస్టయ్యారు. అమెరికాలో ఉన్న వలసదారుల్లో నేరగాళ్లు, అసాంఘిక శక్తులను దేశ పౌరులు ప్రతి ఒక్కరూ సులువుగా గుర్తించేందుకు తాము రూపొందించిన ఈ కొత్త వెబ్‌సైట్ తోడ్పడుతుందని డీహెచ్ఎస్ అసిస్టెంట్ సెక్రెటరీ ట్రీసియా మెక్‌లాలిన్ చెప్పారు. అలాగే వారు పాల్పడ్డ నేరాలు, వాటి తీవ్రత కూడా అందరికీ తెలిసొస్తుందన్నారు. పారదర్శకతను పెంచే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పేర్కొన్నారు. ఈ నిందితులను వారి పేరు, జాతీయత, అరెస్టయిన రాష్ట్రం... ఇలా పలు రకాలుగా సెర్చ్ చేసి చూసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించారు. ఈ జాబితాలోని 89 మంది భారతీయుల్లో 22 మందిపై దొంగతనాలు, పన్ను ఎగవేత, ఆన్‌లైన్ మోసాల వంటి ఆర్థిక నేరాల అభియోగాలున్నాయి. 21 మంది దోపిడీలు, ఇతర హింసాత్మక ఘటనల అభియోగాలు ఎదుర్కొంటున్నారు. 17 మంది లైంగిక నేరాల్లో పోలీసులకు చిక్కారు.

**అనైతికను సమర్థించుకునేందుకే...!**

డీహెచ్ఎస్ రూపొందించిన ఈ 'అత్యంత దారుణ నేరగాళ్ల' జాబితా పలు విమర్శలకు కూడా తావిస్తోంది. దానిపై స్థానిక సామాజిక కార్యకర్తలు, హక్కుల నేతలే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు! "నిందితులు, వారు పాల్పడ్డారంటున్న నేరాలను కేవలం పోలీసులు అదుపులో ఉండగా తీసిన వాళ్ల మగ్‌షాట్స్ (ఫొటోలు), సైట్‌లో ఉంచడం, విచారణ దశలోనే ఏకపక్షంగా నేరగాళ్లనే ముద్ర వేయడం దారుణం. ఇది ఏ మాత్రమూ సరికాదు. కేవలం వలసదారులపై తీసుకుంటున్న అత్యంత కఠినమైన అణచివేత చర్యలను సమర్థించుకోవడమే దీని లక్ష్యంగా కనిపిస్తోంది" అని వారు ఆరోపిస్తున్నారు. "ఈ జాబితా పూర్తిగా శ్వేతజాతీయులతో నిండిపోయి ఉంది. దీన్ని చూసే అమెరికన్లకు వలసదారులు నేరగాళ్లు, దొంగలు అన్న అభిప్రాయం ఏర్పడే ఆస్కారముంది" అంటూ మైన్ వలసదారుల హక్కుల సంఘం నేత రూబెన్ టోరెస్ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. అసలు పరిగెట్టుకుని మరీ ఇలాంటి వెబ్‌సైట్ రూపొందించి హడావుడిగా దాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని యూనివర్సిటీ ఆఫ్ మైన్ స్కూల్ ఆఫ్ లాకు చెందిన రెఫ్యూజీ అండ్ హ్యూమన్‌రైట్స్ క్లినిక్ డైరెక్టర్ అన్నా వెల్చ్ ప్రశ్నించారు. ఇది కేవలం అమెరికావ్యాప్తంగా వలసదారులపై ట్రంప్ సర్కారు ఏడాది పైగా పాల్పడుతున్న అత్యంత అమానవీయ చర్యలను సమర్థించుకునే ఎత్తుగడగా కనిపిస్తోందంటూ ఆక్షేపించారు. డీహెచ్ఎస్ వర్గాలు మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

## 'పెంగ్విన్ ర్యాండమ్'కు ఢిల్లీ పోలీసుల నోటీసు

**న్యూఢిల్లీ:** భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదంలో దాని ప్రచురణసంస్థ పెంగ్విన్ ర్యాండమ్ ఇండియా సంస్థకు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీచేశారు. ఈ పుస్తకం ప్రచురితమైందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఒక ప్రతితో సవాల్ చేస్తుండగా, అది అధికార కాపీ కాదని పెంగ్విన్ ర్యాండమ్ స్పష్టం చేయడం తెల్సిందే. దీంతో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు దర్యాప్తు చేపట్టామని, ఈ మేరకు తమకు సహకరించాలని, తాము అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పెంగ్విన్ ర్యాండమ్‌ను ఆదేశించామని ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు బుధవారం చెప్పారు.

## దుబాయ్ ఎయిర్‌పోర్ట్ 'రద్దీ' రికార్డ్

**దుబాయ్:** ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయంగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం మరోసారి తన ఘనతను చాటింది. 2025 ఏడాదిలో మొత్తంగా 9.52 కోట్ల మంది ప్రయాణికులు తమ ఎయిర్‌పోర్ట్‌గుండా రాకపోకలు సాగించారని దుబాయ్ ఎయిర్‌పోర్ట్ బుధవారం ప్రకటించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 5% అధికంగా అంటే 1.96 కోట్ల మంది ఇక్కడి నుంచి ప్రయాణించారు.

## 120 మందికిపైగా విద్యార్థులకు అస్వస్థత

**ఫరుక్కాబాద్/మెయిన్‌పురి(యూపీ):** కడుపులో నులిపురుగులను చంపేసే ఆల్‌బెండజోల్ టాబ్లెట్లు ఇచ్చేందుకు చేపట్టిన 'డీవార్మింగ్ డ్రైవ్' కార్యక్రమం చివరకు 120 మందికిపైగా చిన్నారులను అస్పత్రిపాలుచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫరుక్కాబాద్, మెయిన్‌పురి జిల్లాల్లో పాఠశాల విద్యార్థులకు ఈ టాబ్లెట్లు పంపిణీచేయగా పలువురు తలనొప్పి, వాంతులతో ఇబ్బందిపడ్డారు. అస్వస్థులైన వాళ్లందర్నీ సమీప ఆస్పత్రులకు తరలించారు. టాబ్లెట్లతో ఎలాంటి ప్రమాదం లేదని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్‌సీ గుప్తా చెప్పారు. అయితే నకిలీ టాబ్లెట్లు పంపిణీచేశారని విపక్షాలు దుమ్మెత్తిపోశాయి. కాలంచెల్లిన టాబ్లెట్లు పంపిణీచేసి ఉంటారని, యోగి సర్కార్ ఈ విషయంలో జోక్యంచేసుకోవాలని అఖిలభారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) సైతం డిమాండ్‌చేయడం గమనార్హం.

## బాబ్రీ తరహా మసీదు పనులు షురూ

**రేజీనగర్:** అయోధ్యలో దశాబ్దాల క్రితం ధ్వంసమైన బాబ్రీ మసీదు ఆకృతిలో పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో మరో మసీదు నిర్మాణపనులు బుధవారం ప్రారంభమయ్యాయి. బహిష్కృత తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, నూతన జనతా ఉన్నయాన్ పార్టీ(జేయూపీ) చీఫ్ హుమయూన్ కబీర్ ఈ పనులు ఆరంభించారు. బెల్దంగాలోని రేజీనగర్‌లో నిర్మిస్తున్న ఈ మసీదు పనులు వచ్చే రెండేళ్లలో పూర్తవుతాయని, దాదాపు 55 కోట్లరూపాయల ఖర్చుతో కడుతున్నామని ఆయన వెల్లడించారు. ఒకేసారి 12వేల మంది నమాజు చేసుకునేలా 11 ఎకరాల్లో దీనిని నిర్మించనున్నారు.

## మూసేవాలా తల్లిదండ్రుల ధర్నా

**చండీగఢ్:** దివంగత తమ కుమారుడు, పంజాబీ పాప్ గాయకుడు సిద్దూ మూసేవాలకు రాయల్టీగా దక్కాల్సిన సొమ్మును చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న ఒక మ్యూజిక్ ప్రొడ్యూసర్, మరో ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదుచేయనందుకు నిరసనగా మూసేవాలా తల్లిదండ్రులు బుధవారం మన్సా పట్టణంలో ధర్నాకు దిగారు. ''2025 జూన్‌లోనే వీళ్లపై డీజీపీకి ఫిర్యాదుచేశాం. అయినా ఎలాంటి స్పందన లేదు. ఎఫ్ఐఆర్ నమోదుచేసేదాకా పోరాడతాం'' అని సీనియర్ ఎస్పీ ఆఫీస్ బయట బాల్‌కౌర్ సింగ్, చరణ్ కౌర్ ధర్నాకు దిగారు. వీళ్లకు పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ మద్దతు పలికారు. పోలీసులు తగు చర్యలు తీసుకోకపోతే యావత్ పంజాబ్ కాంగ్రెస్ మీ వెంట నడుస్తుంది అమరీందర్ హామీఇచ్చారు.

## సీఆర్‌పీఎఫ్ కేసులో వాదనలు వింటాం

**యూపీ సర్కార్‌కు సూచించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి కేసులో నలుగురికి ఉరిశిక్ష, ఒకరికి జీవితఖైదు విధిస్తూ కింది కోర్టు విధించిన శిక్షను అలహాబాద్ హైకోర్టు పక్కనబెట్టడాన్ని సవాల్‌చేస్తూ యోగి సర్కార్ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. పాత కేసులో శిక్షపడిన నిందితులకు ఈ మేరకు నోటీస్‌లిస్తూ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదావేస్తున్నట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ప్రకటించింది. అయితే పాత కేసులో కొందరికి విముక్తి కల్పించిన అలహాబాద్ హైకోర్టు.. జంగ్ బహదూర్ ఖాన్‌సహా ఐదుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించిన విషయంతెల్సిందే.

## ఆరోగ్యంగా ఉన్న వాంగ్‌చుక్‌ను విడుదలచేయబోం: కేంద్రప్రభుత్వం

**న్యూఢిల్లీ:** అదుపులోకి తీసుకున్న తర్వాత పర్యావరణ కార్యకర్త, సామాజికవేత్త సోనమ్‌ను ఇప్పటిదాకా 24 సార్లు వైద్యపరంగా పరిశీలించామని, ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఇంతటి ఆరోగ్యంగా ఉన్న వాంగ్‌చుక్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ అనారోగ్య కారణాలతో విడుదలచేయబోమని కేంద్రం తరఫున కోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. '' లద్దాఖ్‌లో హింసాత్మక ఆందోళనలను వాంగ్‌చుక్ ఎగదోస్తున్నారు. నేపాల్‌లో, ఇరాన్‌లో ఉద్యమాల మాదిరి నిరసనలను మీరూ ప్రోత్సహించాలని స్థానిక యువతను ఆయన రెచ్చగొడుతున్నారని అదనపు సొలిసిట్ జనరల్ కేఎం నటరాజ్ వాదించారు.

## నష్టపరిహారంగా గొంతెమ్మ కోర్కెలు కూడదు

**న్యూఢిల్లీ:** నష్టం జరిగిందన్న ఒకే ఒక్క కారణంతో గొంతెమ్మ కోర్కెలు కోరకూడదని ఒక అందవిహీన హెయిర్‌కట్ బాధితురాలినుద్దేశిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 2018లో ఢిల్లీలోని అత్యంత విలాసవంత ఐటీసీ మౌర్య హోటల్‌లో ఖరీదైన హెయిర్‌కట్ చేయించుకున్న ఆష్నారాయ్ అనే మోడల్‌కు అధ్వాన్నంగా కటింగ్ చేయడంతో ఆమె జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ)ని ఆశ్రయించింది. జుట్టు అందవిహీనంగా మారడంతో మోడలింగ్ కెరీర్ నాశనమైందని వాదించింది. దీంతో ఆమెకు రూ.2 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని హోటల్‌ను కమిషన్ 2023 ఏప్రిల్‌లో ఆదేశించింది. ఇంత భారీ పరిహారం అసంబద్ధంగా ఉందన్న సుప్రీంకోర్టు పరిహారాన్ని రూ.25 లక్షలకు కుదిస్తూ జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం ఈనెల ఆరోతేదీన తీర్పు చెప్పింది.

# 'గగన్‌యాన్'పై ముమ్మందుకే..

**అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గొద్దు**

- చిరకాల ఆకాంక్ష నెరవేర్చుకోవాలి
- అవరోధాలు, ఆలస్యాలు సహజమే
- వ్యోమగామి శుభాంశు శుక్లా

**బెంగళూరు:** మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'లో ఎన్ని అవరోధాలు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే భారత్ ముమ్మందుకే దూసుకెళ్లాలని గ్రూప్ కెప్టెన్, భారత వ్యోమగామి, అశోక చక్ర అవార్డు గ్రహీత శుభాంశు శుక్లా అన్నారు. చిరకాల ఆకాంక్ష నెరవేర్చుకోవాలని చెప్పారు. సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ ఉత్సాహంతో పనిచేస్తే అనుకున్నది సాధించడం తథ్యమని పేర్కొన్నారు. ఆయన బుధవారం బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. మిషన్ గగన్‌యాన్ విజయవంతం అయితే ఇలాంటి ఘనత సాధించిన దేశాల జాబితాలో భారత్ చేరుతుందని తెలిపారు. మనదేశ కీర్తిప్రతిష్టలు మరింత పెరుగుతాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో కేవలం మూడు దేశాలు మాత్రమే మానవసహిత అంతరిక్ష యాత్రల్లో విజయవంతం అయ్యాయని గుర్తుచేశారు. గగనయాన్ యాత్ర ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. ఇదే మనదేశంలో తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర. ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లి, మూడు రోజుల్లో క్షేమంగా వెనక్కి తీసుకురావాలన్నది గగన్‌యాన్ లక్ష్యం. 2027లో ఈ యాత్రను చేపట్టాలని నిర్ణయించినట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వెల్లడించింది.

**ఇప్పటికీ అదే ఉత్సాహం**

శుభాంశు శుక్లా ఇప్పటికే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లొచ్చారు. గగన్‌యాన్ కోసం శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములను ఇస్రో ఎంపిక చేసింది. గగన్‌యాన్ సాధారణమైన మిషన్ కాదని శుక్లా పేర్కొన్నారు. ఇది అత్యంత సంక్లిష్టమైన, సవాళ్లతో కూడుకున్న కార్యక్రమమని వివరించారు. అయినప్పటికీ అధైర్యపడే ప్రసక్తే లేదన్నారు. మొదటి రోజు ఎంత ఉత్సాహంతో ఉన్నామో ఇప్పటికీ అదే ఉత్సాహంతో పని చేస్తున్నామని స్పష్టంచేశారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లి, మళ్లీ భూమిపైకి తీసుకురావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని తెలిపారు. పెద్ద కార్యక్రమంలో కొన్ని అవరోధాలు, ఆలస్యాలు సహజమేనని వ్యాఖ్యానించారు. వాటిని ప్రతికూలతలుగా చూడొద్దని పేర్కొన్నారు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. అంతరిక్ష ప్రయోగాల్లో వేర్వేరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని శుక్లా తెలిపారు. ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం కలిసి పనిచేయడంలో తప్పులేదన్నారు. తాను ఐఎస్ఎస్‌కు వెళ్లిరావడానికి అమెరికా కూడా సహకరించిందని గుర్తుచేశారు. మన దేశంలో అంతరిక్ష కేంద్ర ప్రభుత్వం చక్కటి సహకారం అందిస్తోందని వివరించారు. సైన్స్, అంతరిక్ష ప్రయోగాల్లో పెట్టుబడులు నానాటికీ పెరుగుతుండడం శుభ పరిణామం అని చెప్పారు. గగన్‌యాన్ కోసం అందరూ ఓపిగ్గా ఎదురు చూడాలని యాత్రకు ఎంపికైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్ పేర్కొన్నారు. ఏది జరగాలో అది కచ్చితంగా జరుగుతుందన్నారు. గగన్‌యాన్ యాత్ర విజయవంతమైతే ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ రికార్డు కెక్కుతుందని స్పష్టంచేశారు.

బెంగళూరులో మాట్లాడుతున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్

## రష్యా డ్రోన్ దాడిలో కుటుంబం బలి

- ఉక్రెయిన్‌లో తండ్రి సహా ముగ్గురు చిన్నారులు మృతి
- తీవ్రంగా గాయపడిన తల్లి

**కీవ్:** ఉక్రెయిన్ ఈశాన్య ప్రాంతంలోని ఖర్కీవ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రష్యా డ్రోన్ దాడిలో తండ్రి సహా ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. 35 వారాల గర్భిణి అయిన వారి తల్లి తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రాత్రి డ్రోన్ దాడిలో వారి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. అనంతరం మంటలు అంటుకున్నాయి. తల్లి తండ్రి, ముగ్గురు పిల్లలతో కూడిన కుటుంబం మంటల్లో చిక్కుకుంది. 34 ఏళ్ల వయసున్న తండ్రి, రెండేళ్ల వయసున్న ఇద్దరు కవలలు, ఏడాది వయసున్న మరో బాలిక అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన తల్లిని సహాయక సిబ్బంది శిథిలాల నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ఆమె తలకు బలమైన దెబ్బలు తగిలాయని, వినికిడి శక్తి కోల్పోయారని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్‌పై దాదాపు నాలుగేళ్ల క్రితం రష్యా సైన్యం దండయాత్ర ఆరంభించింది. క్షిపణి, వైమానిక ఇప్పటికే వేలాది మంది మరణించారు. ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతి కోసం ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు ఉక్రెయిన్‌లో మృత్యుఘోష కొనసాగుతూనే ఉన్నారు.

## ఆ కేసులను మీరే విచారించండి

**పలు హైకోర్టులకు సుప్రీంకోర్టు నిర్దేశం**

**న్యూఢిల్లీ:** వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ల ఎదుట పెండింగ్ ఫిర్యాదులు, అపీళ్లు చాలా తక్కువ సంఖ్యలో ఉన్న రాష్ట్రాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వాటిపై త్వరిత గతిన విచారణ జరిపి పరిష్కరించాల్సిందిగా సంబంధిత హైకోర్టులను నిర్దేశించింది. ఈ విషయమై పలు రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుకున్న పిటిషన్లను ధర్మాసనం బుధవారం విచారించింది. ఆయా కేసుల విచారణ కోసం ఒక న్యాయమూర్తిని ఇందుకోసం ప్రత్యేకంగా కేటాయించాలని ఆదేశించింది. ఆయన సదరు కేసులను మూడు నెలల్లోగా పరిష్కరించాలని పేర్కొంది. రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద తనకు దఖలు పడిన విశేషాధికారాలను ఉపయోగించుకుంటూ ఈ మేరకు అసాధారణ తీర్పు ఇచ్చింది.

## స్కూల్‌లో చొరబడి విద్యార్థులు, టీచర్ల నిర్బంధం

**థాయిలాండ్‌లో ఓ ఆగంతకుని దుశ్చర్య**

**హాట్ యాయ్:** పట్టరాని ఆగ్రహంతో ఊగిపోతున్న ఓ ఆగంతకుడు సమీప స్కూల్‌లోకి చొరబడి గన్‌తో అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులను బెదిరించి అందర్నీ బంధించిన ఉదంతం థాయిలాండ్‌లో జరిగింది. విషయం తెల్సి రంగంలోకి దిగిన పోలీసులు దాదాపు రెండు గంటలపాటు శ్రమించి ఎలాగోలా అందర్నీ క్షేమంగా విడుదలచేశారు. అయితే ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఒక విద్యార్థి గాయపడ్డాడు. రెండు గంటలపాటు తీవ్ర ఉత్కంఠకు గురిచేసిన ఈ ఘటన ఎట్టకేలకు సుఖాంతంకావడంతో పోలీసులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. దక్షిణ థాయిలాండ్‌లోని హాట్ యాయ్ జిల్లాలోని సోంగ్‌ఖ్లా పట్టణంలోని ఫటోంగ్ ప్రథాన్ ఖిరివాట్ స్కూల్‌లో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. రెండు గంటలపాటు అందర్నీ తన బందీలుగా మార్చుకున్న 19 ఏళ్ల ఆగంతకుడిని ఖేమ్నన్‌గా పోలీసులు గుర్తించారు. స్కూల్‌లో తన సోదరికి పాఠాలు చెప్పిన ఒక టీచర్‌ను లక్ష్యంగా చేసుకుని పాఠశాలలోకి ఖేమ్నన్ చొరబడ్డాడని స్థానికులు ఆరోపించారు. ఖేమ్నన్‌కు పాఠశాలకు మధ్య నెలకొన్న వివాదం ఏమిటన్నది తెలియరాలేదు. స్కూల్లో పలుమార్లు కాల్పుల శబ్దాలు విన్పించాయని, పలువురు గాయపడ్డారని తొలుత వచ్చిన వార్తలను థాయిలాండ్ ప్రభుత్వం ఖండించింది. థాయిలాండ్‌లో తుపాకీల సంస్కృతి ఎప్పట్నుంచో ఉంది. ఇక్కడి జనాభాలో చాలా మందికి గన్‌లను కొనుగోలుచేసే అలవాటు ఉంది. వ్యక్తిగత మనస్పర్థలతో తుపాకీల మోతలు మోగుతాయిగానీ గుమిగూడిన జనాలపై సామూహికంగా కాల్పుల ఘటనలు అత్యంత అరుదు.

## బెయిల్ కావాలంటే నేరచరిత్రను అఫిడవిట్‌గా ఇవ్వాలి

**సుప్రీంకోర్టు వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** బెయిల్ కోరే నిందితులు తమ నేరచరిత్ర తాలూకు వివరాలతో స్వీయ ప్రమాణపత్రాన్ని జతచేయాల్సి ఉంటుందని ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. నేరచరిత్రను వివరించే అఫిడవిట్‌ను జోడిస్తే బెయిల్ ఇవ్వడంలో న్యాయస్థానాలు ఏకరూపత, పారదర్శకత, సమగ్రతతో నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం చిక్కుతుందని జస్టిస్ అహ్‌సనుద్దీన్ అమానుల్లాహ్, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. ''నేర చరిత, గత నాన్‌బెయిలబుల్ వారెంట్లు, నేరస్తుడిగా ముద్రపడిన ఉదంతాలు, ఇతర అఫిడవిట్లను సమర్పించాలి'' అని కోర్టు పేర్కొంది.

## క్షమాపణ కోరిన ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

**దుబాయ్:** ఇరాన్‌లో నిరసనలు, ప్రభుత్వ అణచివేత చర్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులను అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బుధవారం క్షమాపణ కోరారు. తమ దేశంలో నిరసనలపై పశ్చిమ దేశాలు దురుద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న నిరసన కార్యక్రమాల వల్ల సామాన్య ప్రజలు కష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారంతా తనను క్షమించాలని కోరారు. ప్రజలను వేధించాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని వివరణ ఇచ్చారు. 1979 నాటి ఇస్లామిక్ విప్లవాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన కార్యక్రమంలో పెజెష్కియాన్ ప్రసంగించారు. ఇరాన్‌లో అణ్వాయుధాలు లేవని, కావాలంటే తనిఖీ చేసుకోవచ్చని పెజెష్కియాన్ తేల్చిచెప్పారు. ఎలాంటి తనిఖీలకైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

## మడగాస్కర్‌లో 'గెజాని' తుపాను బీభత్సం

**20 మంది మృతి.. భారీగా ఆస్తి నష్టం**

**అంటానానారివో:** ద్వీప దేశం మడగాస్కర్‌ను గెజాని తుపాను వణికిస్తోంది. భారీ వర్షాలు, వరదలు, ఈదురు గాలుల ధాటికి భారీగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. కనీసం 20 మంది మరణించారని అధికారులు బుధవారం వెల్లడించారు. గంటకు 195 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. తీర ప్రాంతాల్లో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. వాతావరణ విభాగం రెడ్ అలర్ట్ జారీ చేసింది. వరదలు ఉధృతరూపం దాల్చడంతోపాటు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. చాలామంది వరదల్లో చిక్కుకున్నారు. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తౌమాసినాలో మడగాస్కర్ అధ్యక్షుడు మైఖేల్ రండ్రియానిరీనా పర్యటించారు.

# భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

### మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ , ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

### మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు.1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

### విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా,నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం,అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ,ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

### ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

### జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు.

### జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.



### జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

### జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

### ఆర్థిక వనరులు

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రి బ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీరాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్‌సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

### ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ

### మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
   ఎ) ప్రజలు స్వార్థపరులు
   బి) ప్రజలే సార్వభౌములు
   సి) ప్రజలు చేతకాని వారు
   డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
   ఎ) గోలక్‌నాథ్ కేసు
   బి) మినర్వా మిల్స్ కేసు
   సి) ఇందిరా సహానీ కేసు
   డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
   ఎ) అయిదు బి) ఏడు
   సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంభించింది?
   ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
   బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
   సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
   డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
   ఎ) 14 బి) 15
   సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
   ఎ) 17 బి) 16 (4)
   సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
   ఎ) అయిదు బి) ఏడు
   సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300-ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
   ఎ) రాజకీయ హక్కు
   బి) ఆర్థిక హక్కు సి) పౌర హక్కు
   డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
   ఎ) 80 బి) 81 సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
   ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
   సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
   ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
   ఎ) 20 బి) 21 సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
   ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
   బి) సైమన్ కమిటీ
   సి) సర్కారియా కమిటీ
   డి) వెంకటాచలయ్య కమిటీ
14. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం?
   ఎ) సిక్కిం బి) తమిళనాడు
   సి) గోవా డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
   ఎ) రాజీవ్‌గాంధీ బి) ఇందిరాగాంధీ
   సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
   ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
   సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
   ఎ) 49 బి) 50 సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
   ఎ) ఎం.ఎన్.రాయ్ బి) రాజేంద్రప్రసాద్
   సి) బి.ఆర్.అంబేద్కర్
   డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
   ఎ) 4 బి) 5 సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
   ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
   సి) అమెరికా డి) చైనా

**సమాధానాలు**

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి;
6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి;
11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి;
16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

# సముద్ర జలాల ముఖ్య భౌతిక లక్షణం ఏది?

భూఉపరితలంపై సుమారు 71 శాతం సముద్రాలు ఆక్రమించి ఉన్నాయి. దక్షిణార్ధ గోళంలో సముద్ర భూభాగం వాటా 80.9 శాతం కాగా, ఉత్తరార్ధగోళంలో ఇది 60.7 శాతం. అందువల్ల దక్షిణార్ధగోళాన్ని సముద్ర అర్ధగోళంగా వ్యవహరిస్తారు.

### సముద్ర భూతలం నాలుగు రకాలు..

సముద్ర భూతల నైసర్గిక స్వరూపం ఖండ నిమ్నోన్నతాల కంటే వైవిధ్యంగా ఉంది. నైసర్గిక స్వరూపాన్ని అనుసరించి సముద్ర భూతలాన్ని.. ఖండ తీరపు అంచు, ఖండ తీరపు వాలు, ఖండతీరపు ఉన్నతి, అబిసల్ మైదానంగా విభజించవచ్చు. తీరరేఖను ఆనుకుని ఉన్న సముద్ర భూతల భాగాన్ని ఖండ తీర అంచుగా వ్యవహరిస్తారు. ఇది తిన్నని వాలు (<1°) కలిగి ఉంటుంది. ఇది చాలా తక్కువ లోతు (<200 మీ.) ఉండే సముద్ర ప్రాంతం. ఈ ప్రాంతం స్వభావ రీత్యా ఖండ భాగాలకు చెందింది. అంటే సముద్ర ముంపునకు గురైన ఖండ భాగం. అందువల్ల ఇది ఖండ భాగాలకు చెందిన సియాలిక్ భూపటలాన్ని కలిగి ఉంది. ఖండతీర అంచు తర్వాత అకస్మాత్తుగా సముద్ర భూతలం వాలు నిటారుగా (3°-5°) మారుతుంది. ఈ ప్రాంతాన్ని ఖండతలపు వాలుగా పిలుస్తారు. ఈ భాగంలో సముద్ర లోతు 200 మీ. నుంచి 2500 మీ.కు వేగంగా పెరుగుతుంది. మొత్తం సముద్ర భూతలంలో ఖండతీరపు వాలు ప్రాంతం సుమారు 8.5 శాతం. సముద్ర తీరపువాలులో అనేక సముద్ర అంతర్గత అగాధ దరులు (Submarine Canyons) ఏర్పడ్డాయి. ఖండతీరపు వాలు, అబిసల్ మైదానం మధ్య ఉన్న సంధి మండలమే ఖండతీరపు ఉన్నతి. ఈ ప్రాంతంలో వాలు మధ్యస్తంగా (1°-3°) ఉంటుంది. అబిసల్ మైదానం విశాలమైన సమతల మైదానం. ఈ ప్రాంతంలో లోతు 2500-6000 మీటర్లు. ఈ లోతైన సముద్ర భాగంలో అనేక సముద్ర కొండలు, గయోట్లు విస్తరించి ఉన్నాయి. సముద్ర కొండలు అగ్నిపర్వత తరగతికి చెందినవి. వీటి ఎత్తు 1000 మీ. -2000 మీ. ఉంటుంది. పసిఫిక్ మహాసముద్రంలో సుమారు పది వేల అగ్నిపర్వతాలు ఉన్నాయి. అబిసల్ మైదానంపై సమతల శిఖరాలు ఉన్న కొండలే గయోట్లు. ఈ సముద్ర కొండలను వేరు చేస్తూ విశాలమైన లోతట్టు హరివాణాలు ఉన్నాయి. మొత్తం సముద్ర భూతల వైశాల్యంలో అబిసల్ మైదానం వాటా సుమారు 80 శాతం. అట్లాంటిక్ మహాసముద్రంలో అబిసల్ మైదానం వాటా 60 శాతం మాత్రమే. లోతైన సముద్ర భాగాల్లో అఖాతాలు ఉంటాయి. పసిఫిక్ మహాసముద్రంలో అఖాతాలు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి సాధారణంగా ద్వీపకల్ప వక్రతల సమీపంలో ఏర్పడతాయి. పోర్టారికో, బార్లెటెకైమాన్, శాండ్‌విచ్‌లు అట్లాంటిక్ మహాసముద్రంలో ముఖ్య అఖాతాలు. హిందూ మహాసముద్రంలోని ముఖ్య అఖాతం జావా లేదా గ్రేటర్ సుండా .

**పసిఫిక్ మహాసముద్రంలోని ముఖ్య అఖాతాలు**

| | |
|---|---|
| 1) మెరియానా | (11,176 మీ.) |
| 2) కుర్లీ-కామాచాట్క | (10,542 మీ.) |
| 3) ఫిలిప్పైన్ | (10,539 మీ.) |
| 4) కెర్మాడక్ | (10,822 మీ.) |
| 5) టాంగా | (10,850 మీ.) |
| 6) న్యూహెబ్రైడ్స్ | |

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

సముద్రాల మధ్యభాగాల్లో అగ్నిపర్వత ప్రక్రియ వల్ల పొడవైన రేఖీయ పర్వత శ్రేణులు ఏర్పడ్డాయి. వీటిని మిడ్ ఓషియానిక్ రిడ్జ్‌లుగా పిలుస్తారు. అట్లాంటిక్ మహాసముద్రంలో మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ విశిష్టమైంది. ఇది ఉత్తర-దక్షిణంగా ఏర్పడి అట్లాంటిక్ మహాసముద్రాన్ని పశ్చిమ, తూర్పు భాగాలుగా వేరుచేస్తోంది. భూమధ్యరేఖ సమీపంలోని రొమాంచ్ లోతు ప్రాంతం మిడ్ అట్లాంటిక్ రిడ్జ్‌ను రెండుగా విభజిస్తోంది. ఉత్తర మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ భాగం ఐస్‌లాండ్ సమీపంలో విశాలమైన పీఠభూమిలా ఏర్పడింది. దీన్ని టెలిగ్రాఫ్ పీఠభూమి అని పిలుస్తారు. ఐరోపా-ఉత్తర అమెరికాలను కలుపుతూ సముద్రం ద్వారా నిర్మించిన టెలిగ్రాఫ్ కేబుళ్లు ఈ పీఠభూమి నుంచే వెళ్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో మిడ్ ఓషియానిక్ రిడ్జ్‌లు కేవలం ఆగ్నేయ ప్రాంతంలో మాత్రమే విశిష్టంగా ఏర్పడ్డాయి. హిందూ మహాసముద్రంలో లక్షదీవులు-చాగోస్ దీవుల మధ్య ఈ రిడ్జ్ ఏర్పడింది.

### లవణీయత

ఇది సముద్ర జలాల ముఖ్య భౌతిక ధర్మం. సముద్ర జలాల్లో నిక్షిప్తమైన వివిధ లవణాల గాఢతనే లవణీయతగా పేర్కొనవచ్చు. సోడియం, పొటాషియం, కాల్షియంల క్లోరైడులు, సల్ఫేటులు, కార్బొనేటులు ముఖ్య లవణాలు. సోడియం క్లోరైడ్ అతిముఖ్య లవణం. అందువల్లే సముద్ర నీటి నుంచి ఉప్పును తయారు చేస్తారు. ఖండాల మీది శిలలు క్రమక్షయం చెందడంతో ఏర్పడిన శిథిల శిలా పదార్థం.. సముద్రాలను చేరడమే సముద్ర జలాల లవణీయతకు ప్రధాన కారణం. సముద్ర భూతలం మీది అగ్నిపర్వత ప్రక్రియ, రోదసి నుంచి భూమికి చేరే ఉల్కాపాతాలు సముద్ర జలాల లవణీయతకు కారణాలు.

లవణీయతను గ్రా/కి.గ్రా.లలో కొలుస్తారు. సముద్రాల సగటు లవణీయత సుమారు 34.75 గ్రా./కి.గ్రా. అయితే లవణీయత విస్త రణలో ప్రాంతీయ వ్యత్యాసాలున్నాయి. గ్రీన్ లాండ్, ఐస్‌లాండ్‌ల సమీపంలోని ఆర్కిటిక్ సముద్రంలో లవణీయత కనిష్టంగా 5 గ్రా./కి.గ్రా. కంటే తక్కువ. మృత సముద్రంలో లవణీయత గరిష్టంగా 350 గ్రా./కి.గ్రా. కంటే ఎక్కువ. అధిక ఉష్ణోగ్రతల వల్ల భాష్పీభవన రేటు అధికంగా ఉండటంతో 'ఆయన రేఖ, ఉప ఆయనరేఖ' ప్రాంతాల్లో సముద్రాల లవణీయత గరిష్టం. ధృవాల వైపు వెళ్లే కొద్దీ లవణీయత క్రమంగా క్షీణిస్తుంది. భూమధ్యరేఖా ప్రాంతం లో ఉష్ణోగ్రత అధికమైనప్పటికీ, అధిక వర్షపాతం వల్ల లవణీయత తక్కువగా ఉంటుంది.

హిమనీ నదాలు కరగడం వల్ల గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్ సమీపంలోని ఆర్కిటిక్ మహాసముద్రం, అంటార్కిటికా ఖండం సమీపంలోని సముద్రం, బాల్టిక్ సముద్రాల్లో లవణీయత తక్కువ. సాధారణంగా ఖండాంతర్భాగాల్లోని సముద్రాల్లో లవణీయత అధికంగా ఉంటుంది. ఉదాహరణకు మధ్యధరా, కాస్పియన్ సముద్రాలు. అయితే డాన్, నీపర్, నీస్టర్ లాంటి పెద్ద నదులు భారీ మొత్తాల్లో మంచి నీటిని తీసుకురావడంతో నల్లసముద్రంలో లవణీయత స్థాయి తక్కువగా ఉంది. నదీ ముఖద్వారాల వద్ద పెద్ద మొత్తాల్లో మంచినీరు చేరడంతో లవణీయత తక్కువగా ఉంటుంది.

## అగ్ని పర్వతాలు మూడు రకాలు

భూపటలంలో లోతుకు వెళ్లేకొద్దీ ప్రతి 32 మీటర్లకు 1°C చొప్పున ఉష్ణోగ్రత పెరుగుతుంది. పటల అంతర్భాగాల్లోని కొన్ని ప్రాంతాల్లో పీడనం స్థానికంగా తగ్గడంతో శిలల ద్రవీభవన స్థానం క్షీణిస్తుంది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో శిలలు ద్రవ లేదా పాక్షిక ద్రవ స్థితిలో ఉంటాయి. ఈ శిలాద్రవాన్నే 'మాగ్మా' అంటారు. ఉపరితలం మీదకు ఉద్భేదనం చెందిన మాగ్మాను 'లావా'గా పిలుస్తారు. లావా ఉద్భేదనాన్నే 'అగ్నిపర్వత ప్రక్రియ' అంటారు. ఉద్భేదనా మార్గాన్ని అనుసరించి ఇవి రెండు రకాలు..

1) కేంద్ర ఉద్భేదనం, 2) భ్రంశ ఉద్భేదనం.

కేంద్ర ఉద్భేదనంలో మాగ్మా గొట్టం లాంటి ఏక వాహిక ద్వారా ఉపరితలాన్ని చేరుతుంది. ఈ గొట్టం చుట్టూ లావా ఘనీభవించి 'శంఖు ఆకార అగ్నిపర్వతాలు' ఏర్పడతాయి. అగ్నిపర్వత శంఖువుల శిఖరంపై ఉన్న గరాటు ఆకార ప్రవేశ ద్వారాన్ని 'అగ్నిపర్వత బిలాలు' (Craters) అంటారు. కొన్ని సందర్భాల్లో ఈ బిలాల్లో నీరు చేరి అగ్నిపర్వత బిల సరస్సులు (Crater Lakes) ఏర్పడతాయి. ఉదాహరణకు దక్కన్ పీఠభూమిలోని 'లోనార్' సరస్సు (మహారాష్ట్ర).

### భ్రంశ ఉద్భేదనం

భూపటలంలో ఉన్న అనేక పగుళ్లు, సంధులు, భ్రంశ తలాల ద్వారా అధిక పీడనానికి గురైన లావా ఉద్భేదనం చెందడాన్ని 'భ్రంశ ఉద్భేదనం' అంటారు. పలుచని, అల్ప స్నిగ్ధత ఉన్న లావా భ్రంశ ఉద్భేదనం చెంది విస్తారంగా ప్రవహి చినప్పుడు.. లావా డోమ్‌లు, లావా పీఠభూములు ఏర్పడతాయి. లావా పీఠభూమికి దక్కన్ పీఠభూమి మంచి ఉదాహరణ. సుమారు 65-130 మిలియన్ ఏళ్ల క్రితం(క్రెటేషియస్-ఇయోసిన్) భౌమ్య యుగంలో బసాల్ట్ రకానికి చెందిన లావా భ్రంశ ఉద్భేదనం చెంది.. లావా పీఠభూమి రూపాంతరం చెందింది. ఈ ప్రాంతంలోని బసాల్ట్ శిలలు క్రమక్షయం చెంది, సారవంతమైన నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి.

### ఉద్భేదనం నాలుగు రకాలు

తీవ్రత, పదార్థాల స్వభావాన్ని బట్టి ఉద్భేదనాలు నాలుగు రకాలు. అవి.. 1) వెసూవియన్ రకం , 2) స్ట్రాంబోలియన్ రకం, 3) ఐస్‌లాండిక్ రకం, 4) ప్లీనియన్ రకం. వెసూవియన్ ఉద్భేదనం అతి తీవ్రమైంది. ఇది లావాతో పాటు దట్టమైన పొగ, బూడిద వెదజల్లుతుంది. ఐస్‌లాండిక్ రకం ఉద్భేదనంలో లావా విస్ఫోటన రహితంగా నెమ్మదిగా ఉబికి వస్తుంది. పలుచని లావా విస్తారంగా ప్రవహించి లావాడోమ్‌లు లేదా లావా పీఠభూములు ఆవిర్భవిస్తాయి. ఐస్‌లాండ్, హవాయి దీవుల్లోని అగ్నిపర్వత ప్రక్రియ ఈ కోవకు చెందింది.

మధ్యధరా సముద్రంలోని ఇటలీకి చెందిన సిసిలీ దీవిలో ఉన్న స్ట్రాంబోలియన్ అగ్నిపర్వతం లావాతోపాటు అత్యధిక ఉష్ణోగ్రతతో నీటి ఆవిరి, దుమ్ము, ధూళి కణాలను అధికంగా వెదజల్లుతుంది. దీనివల్ల స్ట్రాంబోలియన్ అగ్నిపర్వత శిఖర బిలం వద్ద పొడవాటి జ్వాల ఏర్పడుతుంది. ప్రాచీన, మధ్య యుగాల్లో మధ్యధరా సముద్రంలో ప్రయాణించే నావికులకు జ్వాలతో కూడిన స్ట్రాంబోలియన్ అగ్నిపర్వతం లైట్ హౌస్‌గా ఉపయోగపడేది. ప్లీనియన్ రకమైన అగ్నిపర్వత ఉద్భేదనంలో లావాతో పాటు దట్టమైన పొగ, దుమ్ము, ధూళి ఉద్భేదనం చెందుతాయి. ప్లీనియన్, స్ట్రాంబోలియన్ ఉద్భేదనాలు ఓ మోస్తరు విస్ఫోటన తీవ్రతతో ఉంటాయి. ఉద్భేదన తరచుదనం ప్రాతిపదికగా అగ్నిపర్వతాలను క్రియాశీలక, నిద్రాణ, విలుప్త అగ్నిపర్వతాలుగా విభజించవచ్చు.

### నిద్రాణ అగ్నిపర్వతాలు

తరచుగా విస్ఫోటనం చెందేవి క్రియాశీలక అగ్నిపర్వతాలు. ఇటీవల కాలంలో ఉద్భేదనా చరిత్ర(దాఖలాలు) లేనప్పటికీ.. సమీప భవిష్యత్‌లో ఉద్భేదనం చెంది, క్రియాశీలకమయ్యే అవకాశాలున్నవి 'నిద్రాణ అగ్నిపర్వతాలు'.

### విలుప్త అగ్నిపర్వతాలు

విలుప్త అగ్నిపర్వతాల బిలాల్లో సరస్సులు ఏర్పడి ఉంటాయి. లావా ఉద్భేదనా మార్గం పూర్తిగా ధ్వంసమై ఉంటుంది. ఇవి ఉద్భేదనం చెందే అవకాశం లేదు. వీటిని మృత అగ్నిపర్వతాలుగా పేర్కొనవచ్చు. దక్కన్ పీఠభూమి, అండమాన్ దీవులు, హిమాలయాల్లోని అగ్నిపర్వతాలు, తూర్పు ఆఫ్రికాలోని కిలిమంజారో విలుప్త అగ్నిపర్వతాల కోవకు చెందినవి.

### క్రియాశీలక అగ్నిపర్వతాలు

ప్రపంచంలోని క్రియాశీలక అగ్నిపర్వతాల్లో 90 శాతానికి పైగా పసిఫిక్ మహాసముద్రంలోనే కేంద్రీకృతమయ్యాయి. ఇవి ప్రధానంగా పలకలు అభిసరణం చెందే సబ్‌డక్షన్ మండలాల్లో ఏర్పడ్డాయి. పసిఫిక్ మహాసముద్ర ప్రధాన పలక ఈ ప్రాంతంలో జపాన్, ఫిలిప్పైన్, బిస్మార్క్, నాజ్కా, కాకస్ లాంటి ఉప సముద్ర పలకలతో అభిసరణం చెందడం వల్ల సబ్‌డక్షన్ మండలంలో క్రియాశీలక అగ్నిపర్వతాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు ఫ్యూజియామా (జపాన్), పినటూబో (ఫిలిప్పైన్), క్రాకటావో (ఇండోనేషియా) , రాంగిటాటో (న్యూజిలాండ్), సెయింట్ హెలెనెన్ (అలస్కా), మవునాలోవా (హవాయి) మొదలైనవి. అండమాన్‌లోని 'బారెన్' దీవుల్లో క్రియాశీలక అగ్నిపర్వత ప్రక్రియను గమనించవచ్చు. మధ్యధరా సముద్ర ప్రాంతంలోనూ క్రియాశీలక అగ్నిపర్వత ప్రక్రియ సంభవిస్తుంది. ఉదాహరణకు ఎత్నా, వెసూవియన్, స్ట్రాంబోలి అగ్నిపర్వతాలు.

భూపటలంలోని మాగ్మా కొన్ని సందర్భాల్లో భూ ఉపరితలాన్ని చేరకముందే మార్గ మధ్యంలోనే ఘనీభవిస్తుంది. ఫలితంగా పటల అంతర్భాగంలో వివిధ రకాల అగ్నిపర్వత సంబంధ భూ స్వరూపాలు ఏర్పడతాయి. ప్రత్యేక ఆకృతి లేని విశాల భూ స్వరూపాలను 'బాథొలిథ్' అంటారు. పటలంలోని శిలా పొరలకు సమాంతరంగా మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే భూస్వరూపాలు 'సిల్స్'. శిలా పొరలకు అడ్డంగా క్షితిజ లంబదిశలో మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే భూస్వరూపాలు 'డైక్స్'. సాసర్ ఆకారంలో ఉండే భూ స్వరూపాలు 'లాకోలిథ్'. అలల మాదిరి ఆకృతి ఉన్న భూ స్వరూపాలు 'ఫాకోలిథ్'.

## విద్య, ఉద్యోగ సమాచారం

### మేనేజ్ హైదరాబాద్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గ్రూప్-ఎ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.57,700 నుంచి రూ.1,82,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.02.2026.
» **వెబ్‌సైట్:** www.manage.gov.in

### సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2026

యూపీఎస్సీ(యూనియన్ పబ్లిక్ సర్వీస్ ఎగ్జామినేషన్) సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2026 నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **అర్హత:** అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్ రాతపరీక్ష), మెయిన్స్ పరీక్ష (రాతపరీక్ష, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ప్రిలిమినరీ పరీక్ష:** ఆబ్జెక్టివ్ రూపంలో ప్రశ్నలు ఉంటాయి. ప్రతీ సమాధానానికి నెగిటివ్ మార్కులు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను మెయిన్స్ రాసేందుకు అనుమతిస్తారు.
» **మెయిన్స్ పరీక్ష:** డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ఇందులో క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:**
» **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, హైదరాబాద్, హన్మకొండ.
» **మెయిన్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.02.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.02.2026.
» **ప్రిలిమినరీ పరీక్ష తేది:** 24.05.2026.
» **వెబ్‌సైట్:** https://upsconline.nic.in

# కాకతీయుల మొదటి రాజధాని ఏది?

1. శ్రీముఖ శాతవాహనుడి కాలంనాటి నాణేలు ఎక్కడ లభించాయి?
ఎ) వరంగల్ బి) ఉట్నూరు
సి) కరీంనగర్ డి) చెన్నూరు
2. 'వాత్స్యాయనుడు' ఏ పాలకుల ఆస్థానంలో ఉండేవారు?
ఎ) కాకతీయులు బి) విజయనగర రాజులు
సి) తూర్పు చాళుక్యులు డి) శాతవాహనులు
3. శాతవాహన వంశ స్థాపకుడెవరు?
ఎ) గౌతమీపుత్ర శాతకర్ణి బి) శ్రీముఖుడు
సి) యజ్ఞశ్రీ శాతకర్ణి డి) హాలుడు
4. కాకతీయులు మొదటగా ఏ రాజులకు సేనానులుగా పనిచేశారు?
ఎ) తూర్పు చాళుక్యులు బి) కళ్యాణి చాళుక్యులు
సి) రాష్ట్రకూటులు డి) పాండ్యులు
5. మొదటిసారిగా ఏ శాసనంలో కాకతీయుల ప్రస్తావన కనిపించింది?
ఎ) హాతిగుంఫా శాసనం
బి) మాగల్లు శాసనం
సి) బయ్యారం చెరువు శాసనం
డి) పాకాల శాసనం
6. కాకతీయులు మొదట ఏ ప్రాంతాన్ని పాలించారు?
ఎ) కొరివి బి) ఓరుగల్లు
సి) ముదిగొండ డి) హన్మకొండ
7. తూర్పు చాళుక్య రాజైన దానర్ణవుడికి సహాయం చేసిన కాకతీయ సేనాని?
ఎ) బేతరాజు బి) ప్రోలరాజు
సి) కాకర్త్యగుండన డి) రుద్రదేవుడు
8. పల్నాటి యుద్ధంలో జోక్యం చేసుకున్న కాకతీయ పాలకుడెవరు?
ఎ) రుద్రదేవుడు బి) గణపతిదేవుడు
సి) మహాదేవుడు డి) ప్రతాపరుద్రుడు
9. 'చలమర్తి గండ' అనే బిరుదు ఎవరిది?
ఎ) కాకర్త్యగుండన బి) దుర్గరాజు
సి) మొదటి బేతరాజు
డి) మొదటి ప్రోలరాజు
10. కాకతీయుల మొదటి రాజధాని ఏది?
ఎ) హన్మకొండ బి) ఓరుగల్లు
సి) కొరివి డి) కోటిలింగాల
11. ఓరుగల్లు పట్టణ నిర్మాత?
ఎ) గణపతి దేవుడు బి) రుద్రదేవుడు
సి) కాకర్త్యగుండన డి) మహాదేవుడు
12. కాకతీయుల పాలనా కాలం?
ఎ) క్రీ.శ. 950 నుంచి 1300 వరకు
బి) క్రీ.శ. 1000 నుంచి 1368 వరకు
సి) క్రీ.శ. 1000 నుంచి 1323 వరకు
డి) క్రీ.శ. 950 నుంచి 1342 వరకు
13. 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదు పొందిన పాలకులెవరు?
ఎ) కాకతీయులు బి) శాతవాహనులు
సి) ఇక్ష్వాకులు డి) విజయనగర రాజులు

14. రామప్ప ఏ జిల్లాలో ఉంది?
ఎ) నల్గొండ బి) ఖమ్మం
సి) వరంగల్ డి) కరీంనగర్
15. ఎవరి పాలనా కాలంలో 'మార్కోపోలో' మోటుపల్లి రేవును సందర్శించాడు?
ఎ) ప్రతాపరుద్రుడు బి) రుద్రమదేవి
సి) గణపతి దేవుడు డి) మహాదేవుడు
16. కాకతీయుల కాలంలో ఏ మతం ఆధిపత్యంలో ఉండేది?
ఎ) శైవం బి) వైష్ణవం
సి) బౌద్ధం డి) జైనం
17. హనుమకొండ ప్రాంతంపై పూర్తి వంశపారంపర్య హక్కులను మొదటి ప్రోలరాజు ఎవరి ద్వారా పొందాడు?
ఎ) చాళుక్య దానర్ణవుడు
బి) కాలచూరి బిజ్జలుడు
సి) చాళుక్య రెండో తైలపుడు
డి) చాళుక్య మొదటి సోమేశ్వరుడు
18. 'బయ్యారం చెరువు శాసనాన్ని' వేయించిన వారు?
ఎ) రుద్రమదేవి బి) మైలమదేవి
సి) గణపాంబ డి) అనితల్లి
19. కిందివారిలో కాకతీయ రాజ్య పునఃస్థాపనకు సహాయపడినవారెవరు?
ఎ) రుద్రమదేవి బి) మైలాంబ
సి) కామసాని డి) అనితల్లి
20. కాకతీయ వంశ మూలపురుషుడు?
ఎ) వెన్ననృపుడు బి) కాకర్త్యగుండన
సి) మొదటి బేతరాజు డి) కాకతీరాజు
21. ఏకవీర దేవి ఆలయం ఎక్కడ ఉంది?
ఎ) ఘణపురం బి) కొలనుపాక
సి) మొగిలిచర్ల డి) ఇనుగుర్తి
22. కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) వల్లభా చార్యుడు – నీతిసార యోగం
బి) రుద్రదేవుడు – నీతిసారం
సి) విద్యానాథుడు – ప్రతాపరుద్ర యశోభూషణం
డి) జాయపసేనాని – నృత్త రత్నావళి
23. మొదటగా చెరువులను తవ్వించిన కాకతీయ రాజు?

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**

**జనరల్ స్టడీస్**

**చరిత్ర**

ఎ) మొదటి బేతరాజు
బి) మొదటి ప్రోలరాజు
సి) రుద్రదేవుడు డి) రుద్రమదేవి
24. వేయి స్తంభాల గుడి నిర్మాత ఎవరు?
ఎ) గణపతి దేవుడు బి) ప్రతాపరుద్రుడు
సి) రుద్రదేవుడు డి) మహాదేవుడు
25. దేవాలయాలను నిర్మించిన మొదటి కాకతీయ పాలకుడెవరు?
ఎ) రుద్రదేవుడు బి) మహాదేవుడు
సి) మొదటి ప్రోలరాజు డి) మొదటి బేతరాజు
26. స్వతంత్రంగా కాకతీయ రాజ్య పాలనను ప్రారంభించినవారెవరు?
ఎ) కాకర్త్యగుండన బి) వెన్ననృపుడు
సి) మొదటి ప్రోలరాజు డి) రెండో ప్రోలరాజు
27. హనుమకొండలో కాకతీయ వంశ పాలనను ప్రారంభించినవారు?
ఎ) మొదటి ప్రోలరాజు బి) మొదటి బేతరాజు
సి) రుద్రదేవుడు డి) కాకర్త్యగుండన
28. కరీంనగర్ ప్రాంతాన్ని కాకతీయుల కాలంలో ఏ పేరుతో పిలిచేవారు?
ఎ) ముల్కినాడు బి) సబ్బినాడు
సి) రేనాడు డి) పాకనాడు
29. కాకతీయుల కాలంలో గ్రామపాలనను పర్యవేక్షించేవారిని ఏమని పిలిచేవారు?
ఎ) ఆయగారు బి) ఇనామ్‌దార్
సి) గ్రామణీ డి) గోమేయక
30. కాకతీయుల శిల్పకళకు సంబంధించి ప్రత్యేకమైన నిర్మాణాలేవి?
ఎ) కోటగుళ్లు
బి) తోరణ స్తంభాలు
సి) త్రికూటాలయాలు
డి) ఆలయాల ప్రాకారాలు
31. పాకాల సరస్సును తవ్వించిన వారెవరు?
ఎ) బయ్యన నాయకుడు బి) రేచర్ల రుద్రుడు
సి) మల్యాల గౌండప్ప
డి) జగదల ముమ్మడి నాయకుడు
32. 'భట్టారకులు' అంటే ఎవరు?
ఎ) సైనికులు బి) వ్యాపారులు
సి) ప్రభుత్వ ఉద్యోగులు డి) రాయబారులు
33. తెలుగు ప్రాంత విమోచన ఉద్యమ నాయకుడెవరు?
ఎ) ముసునూరి ప్రోలయ నాయకుడు
బి) ముసునూరి కాపయ నాయకుడు
సి) అద్దంకి వేమారెడ్డి
డి) రాచకొండ పద్మనాయకుడు
34. కాకతీయుల చివరి రాజు?
ఎ) రుద్రదేవుడు బి) రుద్రమదేవి
సి) ప్రతాపరుద్రుడు డి) గణపతిదేవుడు
35. 'ఆంధ్ర సుల్తాన్‌లు'గా పేరు పొందిన పాలకులు ఎవరు?
ఎ) బహమనీ సుల్తాన్‌లు
బి) నిజాం షాహీలు
సి) అసఫ్ జాహీలు
డి) కుతుబ్ షాహీలు
36. హుస్సేన్‌సాగర్ (హైదరాబాద్) చెరువును తవ్వించినవారు?
ఎ) నిజాం అలీఖాన్ బి) సాలార్‌జంగ్
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) అబుల్ హసన్ తానీషా
37. హైదరాబాద్ నగర నిర్మాత ఎవరు?
ఎ) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
బి) అసఫ్ జా మీర్ ఉస్మాన్ ఖాన్
సి) ఇబ్రహీం కుతుబ్‌షా
డి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
38. చార్మినార్‌ను నిర్మించినవారు?
ఎ) అబుల్ హసన్ తానీషా
బి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
39. హైదరాబాద్‌లోని పురాతనమైన కట్టడాలు ఎక్కువగా ఏ రకమైన సంస్కృతికి సంబంధించినవి?
ఎ) ఇండో – ఆర్యన్ బి) ఇండో–గ్రీకు
సి) ఇండో – యూరోపియన్
డి) ఇండో – పర్షియన్
40. తెలంగాణలో అసఫ్ జాహీల పాలన ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
ఎ) 1723 బి) 1724
సి) 1725 డి) 1726
41. 'మహత్‌సిబ్' అనే అధికారి ప్రధాన విధి?
ఎ) రాజు ముఖ్య సలహాదారుడు
బి) గూఢచర్యం సి) ముఖ్య లేఖకుడు
డి) నైతిక విలువల ప్రచారం
42. దాశరథీ శతకాన్ని ఎవరు రచించారు?
ఎ) అద్దంకి గంగాధర కవి
బి) కందుకూరి రుద్రకవి
సి) పొన్నెగంటి తెలగనార్యుడు
డి) కంచెర్ల గోపన్న
43. గోల్కొండపై మొట్టమొదటి కోటను నిర్మించినవారు?
ఎ) కాకతీయులు బి) కుతుబ్ షాహీలు
సి) నిజాం షాహీలు డి) అసఫ్ జాహీలు
44. తెలుగు కవులు 'మల్కిభరాముడు'గా ఎవరిని కీర్తించారు?
ఎ) భక్త రామదాసు
బి) అబుల్ హసన్ తానీషా
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) సుల్తాన్ కులీ కుతుబ్ షా
45. గోల్కొండ రాజ్యాన్ని సందర్శించిన ఫ్రెంచి యాత్రికుడు?
ఎ) నికోలో కాంటె బి) న్యూనిజ్
సి) టావెర్నియర్ డి) మార్కోపోలో
46. కాకతీయుల కాలంలో గోల్కొండను ఏమని పిలిచేవారు?
ఎ) మంగళపురం బి) రుద్రారం
సి) చాపల బండ డి) గోవుల కొండ
47. కోహినూర్ వజ్రం ఎక్కడ లభించింది?
ఎ) వజ్రకూరు బి) నేలకొండపల్లి
సి) కొల్లూరు డి) చెన్నారం
48. గోల్కొండ నుంచి రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన కుతుబ్ షా పాలకుడు?
ఎ) ఇబ్రహీం బి) మహమ్మద్ కులీ
సి) సుల్తాన్ కులీ డి) అబుల్ హసన్ తానీషా
49. అసఫ్ జాహీల మొదటి రాజధాని ఏది?
ఎ) హైదరాబాద్ బి) ఔరంగాబాద్
సి) రాయచూర్ డి) పర్బనీ
50. ఔరంగాబాద్ నుంచి తన రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన అసఫ్ జాహీ రాజు?
ఎ) నాసర్‌జంగ్
బి) నిజాం అలీఖాన్
సి) మీర్ ఉస్మాన్ అలీఖాన్
డి) నిజాం ఉల్ ముల్క్
51. సికింద్రాబాద్ నగరాన్ని ఎవరి పేరు మీద నిర్మించారు?
ఎ) మొదటి అసఫ్ జా
బి) రెండో అసఫ్ జా
సి) మూడో అసఫ్ జా
డి) నాలుగో అసఫ్ జా
52. ఉస్మానియా విశ్వ విద్యాలయ స్థాపకుడు?
ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్
బి) నిజాం అలీఖాన్
సి) మీర్ మహబూబ్ అలీఖాన్
డి) నిజాం అలీఖాన్
53. 'కాశీయాత్ర చరిత్ర'ను రాసిందెవరు?
ఎ) దాశరథి
బి) కొనగంటి సత్యనారాయణ
సి) ఏనుగుల వీరస్వామి
డి) కోలా శేషాచలం
54. 'హైదరాబాద్ అంబేద్కర్'గా పేరు పొందిన వారెవరు?
ఎ) భాగ్యరెడ్డి వర్మ
బి) అరిగే రామస్వామి
సి) బొజ్జం నర్సింహులు
డి) బి.ఎస్. వెంకటరావు
55. చార్మినార్ ఎత్తు ఎంత?
ఎ) 52 మీ. బి) 50.2 మీ.
సి) 49.8 మీ. డి) 48.7 మీ.
56. మహాత్మాగాంధీ 'వరంగల్'ను సందర్శించిన రోజు?
ఎ) 1947 జనవరి 2 బి) 1947 ఫిబ్రవరి 20
సి) 1946 ఫిబ్రవరి 5 డి) 1946 జనవరి 8
57. 'హైదరాబాద్' వారపత్రిక సంపాదకుడు?
ఎ) మందుముల నర్సింగరావు
బి) భాగ్యరెడ్డి వర్మ సి) వామన్ నాయక్
డి) మాడపాటి హనుమంతరావు
58. 'తెలంగాణా సర్దార్' బిరుదు ఎవరిది?
ఎ) జమలాపురం కేశవరావు
బి) రావి నారాయణరెడ్డి
సి) బూర్గుల రామకృష్ణారావు
డి) సురవరం ప్రతాపరెడ్డి

### సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1) సి; | 2) డి; | 3) బి; | 4) సి; |
| 5) బి; | 6) ఎ; | 7) సి; | 8) ఎ; |
| 9) బి; | 10) ఎ; | 11) బి; | 12) సి; |
| 13) ఎ; | 14) సి; | 15) బి; | 16) ఎ; |
| 17) డి; | 18) బి; | 19) సి; | 20) ఎ; |
| 21) సి; | 22) ఎ; | 23) బి; | 24) సి; |
| 25) డి; | 26) డి; | 27) బి; | 28) బి; |
| 29) ఎ; | 30) బి; | 31) డి; | 32) సి; |
| 33) ఎ; | 34) సి; | 35) డి; | 36) సి; |
| 37) ఎ; | 38) డి; | 39) డి; | 40) బి; |
| 41) డి; | 42) డి; | 43) ఎ; | 44) సి; |
| 45) సి; | 46) డి; | 47) సి; | 48) బి; |
| 49) బి; | 50) బి; | 51) సి; | 52) ఎ; |
| 53) సి; | 54) డి; | 55) డి; | 56) సి; |
| 57) బి; | 58) ఎ. | | |

# What is the code for "earn"

**BANK EXAMS**

**REASONING**

## Model Questions

***Directions (Q. No. 1-7):*** Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining date in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
1) April 2) June 3) July
4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
1) The person whose joining date is in May
2) The person whose joining date is in January
3) D 4) A
5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
1) Only two people sit to the left of D
2) D is sitting second to the right of the person whose joining date is in July
3) E and B are immediate neighbours of D
4) D's joining date is in May
5) None is true
5. Who among the following has joining date in June?
1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
1) None 2) One 3) Two
4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
1) A and the person whose joining date is in August
2) The person whose joining date is in May and E
3) C and G
4) The persons whose joining dates are in March and June
5) None of these

***Directions (Q. No. 8-12):*** Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
1) D sits at one of the extreme ends of the line
2) A sits on the immediate left of D
3) Q faces D
4) C is an immediate neighbour of D
5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
1) A 2) B 3) C 4) D
5) Cannot be determined

***Directions (Q. No. 13-18):*** Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
1) si 2) ru 3) ha 4) ma
5) Cannot be determined
14. Which of the following represents "more time"?
1) pa jo 2) zi ki 3) ma ki
4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
1) ru 2) pa 3) jo
4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
1) ki to 2) ma pa 3) fi ma
4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
1) well 2) manage
3) time 4) enough
5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
1) ru si 2) da ha 3) si pa
4) si da 5) ki ru

***Directions (Q. No. 19-23):*** Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

**Input:** gone over 35 69 test 72 park 27
**Step I:** 27 gone over 35 69 test 72 park
**Step II:** 27 test gone over 35 69 72 park
**Step III:** 27 test 35 gone over 69 72 park
**Step IV:** 27 test 35 park gone over 69 72
**Step V:** 27 test 35 park 69 gone over 72
**Step VI:** 27 test 35 park 69 over gone 72
**Step VII:** 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
How many steps will be required to complete the rearrangement?
1) Five 2) Six 3) Seven
4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
Which of the following is definitely the input?
1) enemy 25 joy defeat yes 52 37 46
2) 37 enemy 25 joy yes defeat 52 46
3) enemy joy defeat 25 52 yes 46 37
4) Cannot be determined
5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
How many more steps will be required to complete the rearrangement?
1) Three 2) Four 3) Five
4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
Which of the following steps will be the last but one?
1) VII 2) IV 3) V
4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
Which of the following will be step VI?
1) 33 store 52 of 75 81 full goods
2) 33 store 52 of 75 full 81 goods
3) 33 store 52 of 75 goods 81 full
4) There will be no such step
5) None of these

## Explanations

**(1-7):**

March June May Jan July April Feb Aug
A E C B F G H D

**1.** 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
**6.** 3 **7.** 1

**(8-12):**

Q P S R — Row 2
B C D A — Row 1

**8.** 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

**(13-18):**

time and money ® ma jo ki... (i)
manage time well ® pa ru jo...(ii)
earn more money® zi ha ma..(iii)
earn well enough ® si ru ha ...(iv)
From (i) and (ii), time ® jo
From (i) and (iii), money ® ma
From (i), and ® ki
From (ii) and (iv) well ® ru
From (ii), manage ® pa
From (iii) and (iv), earn ® ha
From (iii), more ® zi
From (iv), enough ® si

**13.** 3 **14.** 5 **15.** 2

**16.** Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

**17.** 1

**18.** Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

**(19-23):**

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

**19. Input:** 86 open shut door 31 49 always 45
**Step I:** 31 86 open shut door 49 always 45
**Step II:** 31 shut 86 open door 49 always 45
**Step III:** 31 shut 45 86 open door 49 always
**Step IV:** 31 shut 45 open 86 door 49 always
**Step V:** 31 shut 45 open 49 86 door always
**Step VI:** 31 shut 45 open 49 door 86 aways **Ans: 2**

**20.** Can't proceed backward. **Ans: 4**

**21. Step II:** 18 win 71 34 now if victory 61
**Step III:** 18 win 34 71 now if victory 61
**Step IV:** 18 win 34 victory 71 now if 61
**Step V:** 18 win 34 victory 61 71 now if
**Step VI:** 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

**22. Input:** where 47 59 12 are they going 39
**Step I:** 12 where 47 59 are they going 39
**Step II:** 12 where 39 47 59 are they going
**Step III:** 12 where 39 they 47 59 are going
**Step IV:** 12 where 39 they 47 going 59 are **Ans: 5**

**23. Step II:** 33 store 81 75 full of goods 52
**Step III:** 33 store 52 81 75 full of goods
**Step IV:** 33 store 52 of 81 75 full goods
**Step V:** 33 store 52 of 75 81 full goods
**Step VI:** 33 store 52 of 75 goods 81 full **Ans: 3**